ఆంధ్ర సచిత్ర వారపత్రిక

విడిప్రతి వెల నాలుగు రూపాయలు!

సంపుటం-82 | స్థాపితం 1908 బొంబాయి : 1914 మద్రాసు | సంచిక 24

వ్యవస్థాపకులు : దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు

(1938-1972 సంపాదకులు : శివలెంక శంభుప్రసాద్)

ఆంధ్రపత్రిక ప్రెస్, గాంధీనగరం, విజయవాడ-3, ఫోన్‌లు : 75667, 61247, 61248

మనలో మాట

"టానా" నవలికల పోటీల విషయంలో దూర ప్రాంతాల రచయితలు టెలిఫోన్‌లలో, టెలిగ్రాముల ద్వారా తమకు టైము చాలలేదని ఒకటే దండయాత్ర మొదలెట్టారు. అంచేత ఫిబ్రవరి 5 వరకు "నవలికల" పోటీకి మాత్రం గడువు పెంచుతున్నాం! నిబంధనలన్నీ మామూలే! బహుమతి రు.5 వేలు అని మరిచిపోకండి!– మిగతా అంశాలకి గడువు మరి లేదని మనవి!

* * * * * * * *

ఆంధ్ర సచిత్ర వారపత్రిక 26-1-'90 సంచికలో అత్యధిక ధనవంతుడు "మైక్" జాగాలో (పుట: 17) అత్యధిక బలవంతుడు "మైక్" ప్రచురణ అయిపోయాడు– మైఖేల్ జాక్సన్– మైక్ టైసన్‌ల మధ్య యీ గందరగోళ స్థితి యేర్పడటం ఒక తప్పుల తమాషా! కోట్ల కొలది అభిమానులు గల మైఖేల్ జాక్సన్ మీద తయారైన విశేషాంశం



చాల కాలంగా "నిల్వ"లో వుండి పోయింది "క్రింద"– మా పరి భాషలో యింగ్లీష్‌లో "ప్రెస్"ను "బ్యాక్ షాప్" అన్నట్లు ప్రాసెస్- ప్రింటింగ్ వగైరా శాఖలున్న క్రింది అంతస్తును యిలా అంటాం! 26 జనవరి సంచికలో ఒక పేజీలో యీ విశేషాంశాన్ని పెట్టిన "రూపకర్త" "బొమ్మా– మేటర్" క్రిందే వున్నాయి అని పేజీ మీద గుర్తించాడు కాని చివరి క్షణంలో యీ మేటర్ ఫిలిమ్ దొరికింది కాని 'మైక్' బొమ్మ గల్లంతై పోయింది అంటూ "క్రింద" నుంచి ఒక "ఆర్తనాదం"– "ఇంటర్ కామ్"లో వినిపించగా– అప్పటికే 2, ఫిబ్రవరి సంచికతో తలమున్కలై పోయిన "రూపకర్త" ఒకరు వెంటనే "మైక్" బొమ్మ నొకదానిని వెతికి 'క్రింది'కి హుటాహుటి పంపించాడు. కాని, ఆ మైక్ యీ మైక్ కాదు అన్న సంగతి– అచ్చయిన వారపత్రిక చూసినప్పుడుకాని తెలియ లేదు. నాలిక్కరుచుకున్నప్పటికీ ప్రయోజనం లేదు– "మైక్" లిద్దరూ యీ విధంగా ఒకే చోట పడ్డారు. దీన్ని తప్పుల తమాషాగా స్వీకరించమని వీరి అభిమాను లందరికి విజ్ఞప్తి. ○

పదండి లోపలికి!



ముఖచిత్రం
"హలో! తెలుగుతెరమీదికొస్తున్నా"
శ్రీదేవిలో శ్రీదేవి

పై వారం :
ఉషారెక్కించే పాటల
'ఉషా'కి ఎవరంటే యిష్టం?
(ప్రత్యేక వ్యాసం)

ఈవారం ప్రత్యేకం:

కథలు:

సీరియల్ నవలలు:

వ్యాసాలు, శీర్షికలు:

ఒరులేయవి యొనరించిన నరవర్య యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమ ధర్మపథములకెల్లన్!

ఆంధ్రసచిత్రవారపత్రిక


ఎడిటోరియల్ అడ్వయిజర్: శివలెంక రాధాకృష్ణ ఎడిటర్: వీరాజీ ముద్రాపకుడు: ప్రచురణకర్త: శివలెంక నాగేశ్వరరావు

విజయవాడ 2-2-1990 శక సం. 1911 మాఘమాసం 13వ తేదీ

వి.పి.సింగ్ గారి మంత్రివర్గ విస్తరణ తీరు!

మరొక మహాశాస్త్రవేత్త, సాంకేతిక నిపుణుడు, కేంద్ర మంత్రివర్గంలో సభ్యుడైనారు. సుప్రసిద్ధ అణు శాస్త్రవేత్త 'డా. రాజారామన్న' దేశ రక్షణ శాఖలో సహాయ మంత్రిగా జనవరి 20వ తేదీనాడు ప్రమాణస్వీకారం చేసినప్పుడు ఆ ఉత్సవానికి ప్రధాన మంత్రిగాక హాజరయిన మరొక ప్రముఖ వ్యక్తి విదేశాంగ మంత్రి శ్రీ ఐ.కె. గుజ్రాల్ మాత్రమే. అందరినీ పిలిచి, అందరినీ సమావేశపరచి యీసంబరం యేర్పాటు చేయడానికి వ్యవధి లేకపోవడమే కారణం కావచ్చును. తనకి కూడా అంతకుముందు గంట క్రితందాకా యీ సంగతి తెలియదని డా.రాజారామన్న ప్రమాణస్వీకార మహోత్సవానంతరం విలేఖర్లతో అన్నారు. ఇదే విధంగా పోయిన నెల 'డిసెంబరు 18వ' తేదీనాడు శ్రీ వి.పి.సింగ్ మరొక సాంకేతిక నిపుణుడు శాస్త్రవేత్త అయిన ప్రొఫెసర్ ఎం.జి.కె.మీనన్‌ని సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖలో సహాయమంత్రిగా తీసుకొన్నారు. అప్పటి ప్రమాణస్వీకారోత్సవం కూడా హడావుడి, కోలాహలం లేకుండానే జరిగింది. శ్రీ వి.పి.సింగ్ మంత్రివర్గంలో యీ రెండు చేర్పులు జరిగిన తర్వాత కూడా మంత్రుల సంఖ్య కేవలం 22 మాత్రమే వుంది. సువిశాల భారత దేశాన్ని యింత చిన్న మంత్రి మండలితో పరిపాలించడం అసాధ్యం. అందుచేత శ్రీ వి.పి.సింగ్ తమ మంత్రివర్గాన్ని యిలాగే ఆచితూచి అంచెలంచెలాగా పెంచుకుంటూ పోతారనటంలో సందేహం లేదు. అయితే 'డా. రాజారామన్న' గానీ 'ప్రొఫెసర్ మీనన్'గానీ లోక్‌సభలో గానీ, రాజ్యసభలో గానీ సభ్యులుకారు. ఎం.జి.కె.మీనన్ దరిమిలా 'జనతాదళ్'లో చేరినప్పటికి రాజకీయవాది కాదు. ఒక రకంగా చూస్తే మరే రకంగాను వంకపెట్ట వీలులేని యీ మహానుభావులిద్దరూ కూడా "బ్యూరాక్రాట్సే!"

రక్షణ శాఖ ప్రధాన మంత్రి శ్రీ వి.పి.సింగ్ చేతిలోనే వుంది. ఆయనకు బానటగా వుండటానికి తన అనుచరులలోకాని, రాజకీయ అనుయాయుల్లోగాని అంత నమ్మకం, అంత సామర్థ్యం వున్నవారెవరూ లేకనే డా. రాజారామన్న గారి లాంటి మహాశాస్త్రవేత్తను శ్రీ వి.పి.సింగ్ ఎంచుకున్నారనుకోవలసి వస్తోంది. అయితే యిదే మాదిరి సాంప్రదాయాన్ని శ్రీ వి.పి. సింగ్ యీసారి మంత్రివర్గ విస్తరణలో కొనసాగించలేకపోవచ్చు. ఆరుమాసాల్లో కనీసం 'పెద్దల సభ'లోనైనా యీ పెద్దలిద్దరికీ చోటు చేయవలసి వుంటుంది. మహాశాస్త్రవేత్తలు, అడ్మినిస్ట్రేటివ్ క్యాడర్‌లో వున్న అనుభవజ్ఞులు మంత్రివర్గంలో చేరినపుడు వారినంటిపెట్టుకొని రాజకీయ వారసత్వాలు, సంచితార్థపు మూటలు రావు గనుక పరిపాలనా సౌలభ్యం పెరిగే అవకాశాలున్నప్పటికీ అనూహ్యమైన చిక్కులు కూడా వచ్చే అవకాశాలుంటాయి. అయితే కొన్ని సాంకేతిక కీలక మంత్రి పదవుల్లో నిష్ణాతులు, నిపుణులైన వారు వుండకపోతే



పరిపాలన గుమాస్తాల రాజ్యంగా మారిపోయే అవకాశం వుంటుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ముఖ్యంగా మనదేశంలో మెజారిటీ ఓట్లు వద్ద వ్యక్తి ఎటువంటి వాడైనా ఒక 'రాజముద్రిక' సంపాదించినంతటే బలవంతుడైపోతాడు. అతన్ని వరించిన పదవి పోతే అతను పదిలో ఒకటి చెరిగిపోయిన 'సున్నా' అయిపోతాడు. అంచేత అతని దృష్టి అంతా కూడా పదవిని కాపాడుకోవడం మీదనే కేంద్రీకరించి వుంచుతాడు. అయితే ఎన్నుకోబడిన వ్యక్తికే మన రాజ్యాంగం ఎక్కువ 'శక్తిని', "విలువను" యిచ్చింది. అయినప్పటికే 'డా. రాజారామన్న' గారి మాటలలోనే చెప్పాలంటే ఆయనకు ఢిల్లీకానీ రక్షణ శాఖ వ్యవహారాలు కానీ క్రొత్తకాదు.

1978లో జనతా గవర్నమెంట్‌లో డా. రాజారామన్న రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారుగా పని చేశారు. 1953 నుంచీ వారు అణు శక్తి పరిశోధనా రంగంలో తలమునకలై వుండి అద్భుతమైన సేవలు చేశారు. చిత్రమైన యీ 'రాజకీయ చదరంగం'లో నిలద్రొక్కుకొని సమయానికి అవసరమైన సలహా సదుపాయాలని భారత దేశ ప్రధాన మంత్రికి సమకూర్చగల అనుభవం, వయస్సు (64) 'రాజారామన్న' గారికి వున్నాయి. ఆయన "డా. హోమీ భాభా" తర్వాత అంతటివాడు. 'మైసూర్'లో పుట్టిపెరిగి లండన్‌లో 'ఎటామిక్ ఫిజిక్స్' చదువుకొని దేశ పరిశోధనా రంగంలో ప్రవేశించి దేశంలో ఏర్పాటయిన 'అణు రియాక్టర్' వ్యవస్థలో కీలకమైన పాత్ర వహిస్తూ వచ్చారు. ఆధ్యాత్మిక చింతన గల అద్వైత సిద్ధాంత ప్రియుడు అయిన డా. రాజారామన్న రాజకీయ జీవితం కూడా దేశ అవసరాలకి అనుగుణంగా రాణిస్తుందని ఆశించాలి. 'అణు శక్తిని శాంతి ప్రయోజనాలకే ప్రయోగించాలి' అన్న మన విధానం డా. రాజారామన్నగారిచేతసురక్షితంగా వుండగలదని విశ్వసించాలి.

మరొక మంత్రివర్గ విస్తరణ మార్చి మొదటి వారంలో అసెంబ్లీల ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాతగానీ జరిగే అవకాశాలు లేవు కనుక శ్రీ వి.పి. సింగ్‌ని ఆయన సహచరులు యీసారికి బజారున పడి తిట్టకుండా సంయమనం పాటిస్తారని కూడా అనుకోవచ్చు! అవసరం అన్నింటి కన్నా గొప్పది!

డా. రాజారామన్న గారికి పదవి చేపట్టిన శుభ సమయంలో అభినందనలు! ○

తాజా కాలమ్

వీరాజీ

రోగీసాలే కోరాడు వైద్యుడూ పాలే యివ్వమన్నాడు అన్నట్లుగా- రెండోసారి గవర్నర్ పదవిని చేబడుతూనే శ్రీ జగ్‌మోహన్, కాశ్మీర్‌కు ఏకైక ఏలిక అయినాడు. ఆయనను అక్కడ గవర్నర్‌గా వేయడంలో గల చిదంబర రహస్యం- ఫరూక్ అబ్దుల్లాను గద్దె దింపటమేనని అందరికీ తెలుసు. కాశ్మీర్ పరిస్థితి మరీ అధ్వాన్నంగా వుంది. టెర్రరిస్టులతో ససేమిరా నేను చర్చలు చెయ్యను- కాశ్మీర్‌లోని ప్రతీ అంగుళం భారత దేశంలో అంతర్భాగాలే అంటున్న అసెంబ్లీలో 75 సీట్లలో 60 స్థానాల బలంవున్న కాశ్మీర్ సింహం కుమారుడు ఫారూక్ అబ్దుల్లా జగ్‌మోహన్ పేరు వినంగానే సింహస్వప్నం చూసిన ఏనుగులాగా తన పదవికి రాజీనామా ఇచ్చే



జగ్‌మోహన్

కాశ్మీర్‌లో జగ్ మోహన్ పాలన!

శాడు. ఆయనకు మంగళారతి పాడిన సంతకం మాత్రం పోతూపోతూ జెనరల్ కృష్ణారావుగారే చేశాడు. ఫారూఖ్ అబ్దుల్లా పాలనలో కాశ్మీర్ రాష్ట్రం (దేశం అనాలికాబోలు)లో ఒక్కరోజు కూడా ప్రశాంతంగా గడవలేదు అది వేరే సంగతి కాని అక్కడ రాష్ట్రపతి పాలన విధించబోమంటూ- గడుసుదనంగా కేంద్రం ఈ పనిచేసింది. వెనుకటికి గవర్నర్ నియామకం విషయంలో రాష్ట్రంలో వున్న ముఖ్యమంత్రిని సంప్రదించాలి అంటూ కాంగ్రెసు

ఫరూక్ అబ్దుల్లా



పార్టీని దుయ్యబట్టిన పెద్ద మనుషులు సారథ్యం వహిస్తూ వున్న ఫ్రంట్ నాయకులే యిప్పుడు తాముకూడా అవే మాదిరి పన్నాగాలు పన్నుతున్నారు. కేంద్రంలో గవర్నమెంటు పార్టీ మారంగానే రాష్ట్రాలలోని గవర్నర్లు తమంతటతామే రాజీనామా చేస్తే బాగుంటుందని ఫ్రంటు నాయకులు అనడం మరీ విడ్డూరంగా వుంది! రాష్ట్రపతి కోరినంత కాలం లేదా ఐదు సంవత్సరాల పాటు పదవీకాలం ముగిసేదాకా గవర్నర్లు వారు నియమింపబడ్డ రాష్ట్రాల్లో వుండాలి అని రాజ్యాంగం నిర్దేశిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ తమ హయాంలో చేసినటువంటి తప్పుడు పని యివాళ ఫ్రంటు చేయకూడదు అనుకొని కాబోలు గవర్నర్ల మూకుమ్మడి మార్పిడి వ్యవహారంలో అనుసరించిన తీరును కాంగ్రెస్ (ఐ) పార్టీ విమర్శిస్తోంది. వెనకటి గవర్నమెంటు చేసినా, యిప్పటి ప్రభుత్వం చేసినా... మొత్తం మీద గవర్నర్లు రాష్ట్ర ప్రభుత్వాల మీద కేంద్రం పంపించిన 'నిఘాదారులు' అనుకోవడానికే అవకాశం ఎక్కువకనిపిస్తున్నది. రాష్ట్రాలన్నిట కొత్త కొత్త గవర్నర్లు ప్రమాణ స్వీకారాలు చేసిన వెంటనే యింకా ఏమి చిత్రాలు జరుగుతాయో... వేచి చూడవల్సిందే!

పేరిశాస్త్రిగారి ప్రకటన

ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో వున్న ఎనిమిది రాష్ట్రాలకు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి కూడా ఎన్నికల రణరంగం సిద్ధమైపోయింది. ఎన్నికల ప్రధాన కమీషనర్ ఆర్.వి.ఎస్. పేరిశాస్త్రిగారు తాంబూలాలు యిచ్చేశారు. ఫిబ్రవరి 27 నాటికి మళ్లీ దేశంలోని రాజకీయ పార్టీలన్నీ ఎక్కడెక్కడో దాచిన నల్లధనం మూటల్ని విప్పటానికి అప్పుడే పథకాలు వేసుకుంటున్నాయి. అరుణాచలప్రదేశ్, బీహార్, గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒరిస్సా, రాజస్థాన్ రాష్ట్రాలలో యిప్పుడు రాజీవ్‌గాంధీ పూర్వంలాగా విమానాల్లో ఎగిరి, హెలికాప్టర్లమీద మజిలీలు చేసి పర్యటిస్తారో, లేక తన ప్రత్యర్థి నాయకుడు శ్రీ వి.పి. సింగ్ మాదిరి రైలు బండిమీద, మోటారు కారు మీద ఎన్నికల ప్రచారం కొనసాగిస్తారో వేచి చూడాలి! గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలం ఎలా వుందో ఒకసారి చూద్దాం! అరుణాచల్‌ప్రదేశ్‌లో మొత్తం స్థానాలు 30. కాంగ్రెస్ (ఐ) బలం 21. బీహార్‌లో 324 స్థానాల్లో పోయినసారి కాంగ్రెస్ (ఐ) 196 స్థానాలు "హస్త" గతం చేసుకొంది. గుజరాత్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 149/182, కాగా హిమాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీలోగల మొత్తం 68 స్థానాల్లో ఒక్క పదిసీట్లు తప్ప అన్ని కాంగ్రెస్ తన జేబులో వేసుకొంది. మధ్యప్రదేశ్‌లో కూడా కాంగ్రెస్ తన మంది మీద ఆధిక్యతను నిలబెట్టుకొంటూ 320 స్థానాల్లో 250 సీట్లు సొంతం చేసుకొంది. మహారాష్ట్రలో 162/288, ఒరిస్సాలో 147 సీట్లకు 117 స్థానాలు ఇందిరమ్మ పార్టీ ఢంకా భజాయించి మరీ గెలుచుకొంది. రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెస్ బలం 113. మొత్తం సీట్లు 200. అయితే ఈ వాస్తవాలు మొన్న జరిగిన ఎన్నికల ఫలితాలు చూసినవారెవ్వరూ నమ్మలేనంత విడ్డూరంగా కనిపిస్తాయి యివాళ. ప్రజలు ఘోరంగా పార్టీ ఫిరాయించారు. గవర్నర్లను మార్చినట్లుగా సర్కారియా కమీషన్ చేసిన సూచనని మన్నించకుండా కాశ్మీరులో జగ్‌మోహన్ అనే బాంబును పేల్చి ఫారూక్ అబ్దుల్లాను ఢాం అనిపించినట్లుగా రేపటి ఎన్నికల్లో ఫ్రంటు పార్టీలు, తదితర కాంగ్రెసేతర పక్షాలు అసెంబ్లీలని కైవసం చేసుకోవడం అనుకున్నంత సులువుకాదు. అయితే పనిలో పనిగా గత ఎన్నికలలో వాయిదా పడ్డ పార్లమెంటు నియోజకవర్గం ఎన్నికలను కూడా కేంద్రప్రభుత్వం జరిపించాలని నిర్ణయించుకోవడం అభినందించాల్సిన సంగతే!

వి.పి.సింగ్ గారు యిప్పుడు ప్రజల్ని పట్టుమని వందరోజులు కూడా సాగని తన పరిపాలనా వ్యవహారాలమీద తీర్పు యివ్వమని అడగలేరు. తాము ఎన్నికల సందర్భంగా చేసిన



పేరిశాస్త్రి

వాగ్దానాలు నెరవేర్చగలగొవ్వారమని చెప్పుకోవాలి! అయితే మండల కమీషన్ మీద ఒక విచిత్రమైన పరిశీలక సంఘాన్ని నియమించిన వి.పి.సింగ్ గారు వెళ్లిన చోటల్లా రిజర్వేషన్లకు సంబంధించి- కులప్రాతిపదికమీద ఉద్యోగాలు యివ్వడానికి సంబంధించి ఆయన వైఖరి ఏమిటో స్పష్టంగా తెల్పమని ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు తప్పకనిలదీస్తారు!

అస్సాంలో, పంజాబులో, కాశ్మీరులో, హిందీ కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికలు నిర్వహించలేకపోవడానికి కారణాలు వేరువేరు. అయినప్పటికీ కూడా పేరిశాస్త్రిగారన్నట్లు పంజాబులో యిలా గవర్నర్ పరిపాలన ఎత్తివేస్తే అలా ఎన్నికలు ప్రకటిస్తాను అన్న వ్యాఖ్యమీద మీరేమంటారో అన్న ప్రశ్నకు వి.పి.సింగ్ గారు ఎటువంటి ఎదురు బాణం వేస్తారో వేచిచూడాలి. ఇప్పుడు ఎర్ర తివాసీ పరిపించుకొని జనతాదళ్ చేత మర్యాదలు, మన్ననలు పొందుతున్న సిమ్రాంజిత్ సింగ్ మాన్ పంజాబ్ లో అసెంబ్లీ ఎన్నికలు పెట్టమని అరుస్తున్నాడు. మొన్న మొన్న పార్లమెంటు ఎన్నికలు నిర్వహించినప్పుడు పంజాబులో దేశంలోని యితర ప్రాంతాలతో తులవేసి చూస్తే అనుకున్నంత రక్తపాతం, భీభత్సం జరుగలేదనే ఒప్పుకోవాలి. అంచేత పంజాబులో ఎందుకు ఎన్నికలు పెట్టకూడదు! అనే ఒక ప్రశ్నకి "తావుశ్రీ" దేవీలాల్ గారు ఏం సమాధానం చెప్తారో వినాలి.

మార్చి 3వ తారీఖునాటికి ఉత్తర భారత దేశపు రాష్ట్రాలలో ఏ పార్టీ జెండా ఎగురవేస్తుంది అన్న ప్రశ్న యివాళ ఎవర్నీ వేధించటంలేదు. పార్టీలొస్తాయ్..... పార్టీలు పోతాయ్..... ప్రజాస్వామ్యం మాత్రం పదిలంగా వుంటుంది అన్నది మొన్నటి రక్తసిక్త ఎన్నికలు కూడా నిర్వ్యంద్వంగా రుజువు చేసాయి కనుక... మనమంతా కోరుకునేదొకటే యిప్పుడు..... రిగ్గింగ్, బెగ్గింగ్, స్టీలింగ్. ఇవి ఎంత భారీయెత్తున జరిగినా ప్రజల ప్రాణాలకి ఆస్తిపాస్తులకి ముప్పు రాని రీతిలో జరగాలి. అలా జరిపించటమే యివాళ ప్రభుత్వం ఎదుర్కొంటున్న అగ్నిపరీక్ష!

సంక్షోభంలో సోవియట్ అధ్యక్షుడు

పోయిన దశాబ్దం చూపించిన చిత్రవిచిత్రాలలో దైన్యమైన సంఘటనలన్నీ కూడ బలుక్కున్నట్లు సోవియట్ యూనియన్ లోను, యిరుగుపొరుగు దేశాల్లోను జరుగుతున్నాయి. దశాబ్దంలోనే అతి విశిష్ట వ్యక్తిగా కొనియాడబడ్డ మిహాయిల్ గార్బచేవ్ కి కూడా వీటి అంతు చిక్కటంలేదు. ప్రజాస్వామ్యం కావాలని ఒక చోట పెనుగాలి రేగితే, పార్టీ పెత్తనానికి గుడ్ బై కొట్టేస్తున్నామని మరొక చోట తెగతెంపులు. అజర్ బైజాన్ దేశంలో చమురు దిట్టంగా దొరుకుతుంది. పారిశ్రామికంగా అక్కడి కామ్రేడ్ లు, దిట్టంగా వున్నారు. కాని అరుకోట్లమంది జనాభాలో చాలా ఎక్కువ మందికి నమాజు చెయ్యాలంటే ప్రీతిఎక్కువ. ఆర్మేనియా దేశంలో జనాభా మూడుకోట్లు. వీళ్ళు రాళ్ళూ-రప్పలూ ఎక్కువగా వున్న రాష్ట్రాన్ని తమ కండలు కరిగించి సుభిక్షం చేసుకోవటానికి ప్రయత్నిస్తున్న కాథలిక్ మతప్రియులు. ఇప్పుడు ఈ రెండు జాతుల మధ్య ఎప్పట్నించో రగులుకుంటూన్న ఆగర్భ శత్రుత్వం ఇరాన్ కడుపు చల్లగా ఒకపెను భూకంపంలాగా చెలరేగింది. ఇరవై వేలమంది సైనికుల్ని అక్కడ హుటాహుటిగా దించినా కూడా అజర్ బైజాన్ తిరుగుబాటుదారులు లెక్కపెట్టటంలేదు. అజర్ బైజాన్ రాజధాని 'బాకూ'లో సైనికులకి, తిరుగుబాటుదార్లకి (లేదా మొహమాటం లేకుండా చెప్పుకుంటే అక్కడ ప్రజలకి) మధ్య సంకులసమరమే సాగిపోతోంది. యుద్ధ గిడ్డంగులు పగులగొట్టి సైనిక సామాగ్రి యావత్తును కొన్ని వేలమంది సాహసించి దోచుకుపోయారంటే జాతి వైషమ్యం ఎంతదూరం పోయిందో మనం ఆలోచించుకోవచ్చు! కాశ్మీరులోను, పంజాబులోను టెర్రరిస్టులకు అన్నేసి ఆయుధాలు ఎక్కడ్నించి వస్తాయని మనం ముక్కున వేలేసుకుంటాం. అటువంటిది క్రమశిక్షణకి, పార్టీ పెత్తనానికి లొంగి మన్ను తిన్న పాముల్లాగా కుక్కిన పేనుల్లాగా పడివుంటున్నారు అక్కడి జాతులు అని యింత కాలం అనుకుంటున్నాం కదా.... కాని వాస్తవానికి అక్కడ వున్న ప్రశాంతత అంతా కూడా యింతకాలం అదిమిపట్టి వుంచిన స్ప్రింగు లాంటిదని యివాళ అనిపిస్తోంది. గాలివాటంగా తెరచాపను తిప్పి ప్రయాణం సాగిద్దామనుకున్న "మిహాయిల్ గార్బచెవ్ దూరదృష్టి" కూడా సోవియట్ యూనియన్ లోని లిథునియా, లాత్వియా, ఇస్తోనియాలలో ఒక రకంగా, యిటు చివర అజర్ బైజాన్, ఉజ్బకిస్తాన్ లలో వగైరా ప్రాంతాల్లో మరోరకంగా వెచ్చరిల్లుతున్న, వేగేగిపోతున్న "అసంతృప్తి జ్వాల"లను తట్టుకోలేక పోతోంది . అయితే శ్రీ గార్బచెవ్ గొప్పతనం వేరు? ఆయన సమస్యలను ఏమార్చడు. రంగంలోకి దిగి ఎదుర్కొంటాడు! సోవియట్ యూనియన్ లాంటి సుసంపన్నమైన, పటిష్టమైన వివిధ దేశాల, వివిధ రాజ్యాల సమాఖ్యలో కూడా పడిపోతున్న గండ్లు పవిత్ర భారతదేశంలాంటి దేశంలోని పాలకులకు కూడా అన్యాపదేశంగా హెచ్చరికలు! జాగ్రత్త! జాగ్రత్త!

(20-1-'90)



నాల్గవ శతాబ్దపు అతిప్రాచీన చర్చి భవనం నుంచి బయటికి వస్తున్న ఆర్మేనియన్ కాథలిక్కుల మత గురువులు; క్రైస్తవ మతానికి యీ 'దేశం'లో మంచి పలుకుబడి వుంది. అజర్ బైజాన్ లో ముస్లిముల సంఖ్య ఎక్కువ.

త్వరలో

"న్యూమరాలజీ"

మీద

ప్రత్యేక శీర్షిక!

సీరియల్

ద్రౌపది

ప్రయాగ రామకృష్ణ



(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ - **25** : ద్రౌపదితో ఖాండవ ప్రస్థం చేరిన పాండవులు నారదుని సలహాపై రాజసూయయాగం నిర్వహిస్తారు. మయసభలో తనకు జరిగిన పరాభవానికి ప్రతీకారంగా దుర్యోధనుడు జూదంలో పాండవుల సంపదను హరించి, ద్రౌపదిని నిండు కొలువులో అవమానిస్తాడు. తిరిగి అనుద్యూతంలో ఓడిపోయిన పాండవులు అడవుల పాలై, పన్నెండేళ్ల అరణ్యవాసము, ఒక యేడు అజ్ఞాతవాసము పూర్తిచేసి తమకు అర్ధరాజ్యం యివ్వవలసిందిగా కృష్ణుడిని ధృతరాష్ట్రుడి వద్దకు రాయబారం పంపిస్తారు.

శ్రీకృష్ణుడు కుంతి కంఠంలో కనిపించిన విషాదానికి విచలితుడై 'అందుకు ఫలితం ఆ కౌరవులు త్వరలోనే అనుభవిస్తారులే' అన్నాడు.

ఆమె అదోలా నవ్వి తడబడే కంఠంతో 'ఏమో నాయనా! జరిగినదంతా ఒక యెత్తూ ఈ పదమూడేళ్ళూ బావ కొడుకు చేతి కటిక కూడు తినడం ఒక యెత్తూ అయింది నాకు. అర్జునుడు లోకాలన్నీ జయిస్తాడని వాడు నా కడుపు చించుకుని భూమ్మీద పడగానే అశరీరవాణి చెప్పింది. ఆ మాట లేవీ ఇప్పుడు నిజం కాదనిపిస్తోంది' అంది కళ్ల నీళ్లు తుడుచుకుంటూ.

కృష్ణుడు నవ్వి 'ధర్మమంటూ వుంటే అది నిజమే అవుతుంది' అన్నాడు.

కుంతి నమ్మలేనట్టు చూసి 'నేనో విషయం చెప్పనా' అంది.

'ఏమిటి'

'ఒకళ్ళను యాచించే దౌర్భాగ్యం నా బిడ్డల కెందుకసలు? అంతలేసి అవమానాలనుభవించారే అవన్నీ తీర్చుకోవద్దా? భుజబలంతో జీవించడం ధర్మమని నా పెద్ద కొడుక్కి తెలీదా? తనను పరాభవించిన వాళ్ళకు మెత్తబడమని పాండవులకు నా కోడలే చెప్పిందా?' అని కుంతి కసిగా, రోషంగా అంది.

కృష్ణుడు కన్నార్పకుండా చూస్తూ నిలబడ్డాడు.

రాచకూతురు ఏ కోరికతో కొడుకులను కంటుందో ఆ కోరిక నెరవేర్చుకునేందుకు ఎంత తెలివిగా కొడుకుల్లో పౌరుషం రెచ్చగొడ్తోంది-అనుకున్నాడు.

'నీ కొడుకులేం అల్పబుద్ధులు కారు అందామనుకున్నాడు. అంతలోనే కుంతి 'వాళ్ళను నడిపించే వాడవు నువ్వున్నావు. నాకు దిగులెందుకు చెప్పు. పాండవులకు తండ్రీ, గురువూ, దైవం అన్నీ నువ్వే. నీ మాట వేదం వాళ్ళకు. నాబిడ్డల బాగోగులు నాకంటె నీకే బాగా తెలుసు' అంది.

'నువ్వు అనుకున్నంత దారుణంగా నీ బిడ్డలేమీ పౌరుషం చంపుకుని బ్రతకాలనుకోవడం లేదు. యుద్ధమే వాళ్ళకు ఇష్టం. శత్రు సంహారం చేసి సామ్రాజ్యోత్సవం చేసుకుందామనుకుంటున్నారు- చూద్దాం' అంటూ అక్కడ నుంచి బయలుదేరాడు కృష్ణుడు.

కర్ణ, శకుని, దుశ్శాసనులను వెంట పెట్టుకుని దుర్యోధనుడు విదురుడి ఇంటికి వెళ్ళాడు. సరిగ్గా అదే సమయానికి కృష్ణుడు సాత్యకి, కృతవర్మలతో ముచ్చట్లాడుతున్నాడు. దుర్యోధనుడు కృష్ణుడ్ని చూసి పలకరింపుగా నవ్వి, 'వాసుదేవా! ధృతరాష్ట్ర మహారాజు నీ కోసం ఎదురుచూస్తున్నాడు' అన్నాడు. కృష్ణుడు గబ గబ రాజమందిరానికి బయలుదేరాడు. కురురాజు ఎదురువచ్చి ఆయనకు స్వాగతం చెప్పాడు. కృష్ణుడు ఆయనను అభినందించి తనకోసం అమర్చిన కనకపీఠం మీద ఆసీనుడయ్యాడు. కృతవర్మా, సాత్యకి ఆయనకు రెండు వైపులా కూర్చున్నారు. కర్ణ దుర్యోధనులు ఆ ప్రక్కనే నిలబడ్డారు.

సభా భవనమంతా బంధు మిత్రులతోనూ, ముని శ్రేష్ఠులతోనూ నిండిపోయింది. అందరూ కృష్ణుడేం చెపుతాడా అని ఎదురు చూస్తున్నారు. అక్కడ సూది పడితే వినబడేటంత నిశ్శబ్దం వ్యాపించింది.

కృష్ణుడు ఎంతసేపటికి మాట్లాడక పోయేసరికి.....'కౌరవులనీ, పాండవులనీ ఏకం చేసేందుకు వసుదేవ సుతుడేం ప్రతిపాదన చేస్తాడో!' అన్నాడు భీష్ముడు.

కృష్ణుడు మనోహరంగా నవ్వాడు.

మల్లెమొగ్గలు పరిచినట్టయింది.

'ధర్మం పాపం వల్లా, సత్యం అబద్ధం వల్లా చెడిపోతుంటే చూస్తూ వూరుకోలేక వచ్చాను నేను. సత్య ధర్మాలను చాటించి గెలిపించడానికి పైన భగవంతుడెలాగో వున్నాడు. పాండవులు ధృతరాష్ట్ర మహారాజు ఆజ్ఞతో అరణ్యవాసం, అజ్ఞాతవాసం పూర్తి చేశారు. వాళ్ళ అర్ధరాజ్యం

వాళ్ళకిస్తారన్న నమ్మకంతోనే వాళ్ళు ఇన్ని కష్టాలూ పడ్డారు. పెద్దవాళ్ళు ఇంతమంది వున్నారిక్కడ, పాండవులకు రాజ్యభాగం ఇవ్వడం కంటె ధర్మమైనదీ, చెయ్యతగినదీ, చెయ్యగలిగిందీ ఏమైనా వుందేమో చెప్పండి' అన్నాడు.

ఎవరి దగ్గరనుంచీ సమాధానం లేదు.

ధృతరాష్ట్రమహారాజు మాత్రం తల దించుకున్నాడు.

అయన తన మనసులో ఇబ్బంది పడుతున్నట్టు స్పష్టంగా తెలుస్తునే వుంది. కాని తమ్ముడి కొడుకులకు ఆస్తి ఇస్తానని చెప్పడానికి మాత్రం ప్రాణం ఒప్పడం లేదు.

కృష్ణుడికి అర్థమయిందది. దగ్గరకు వెళ్లి 'ఎందుకు మహారాజా పాండవుల మీద నీకింత కక్ష....నీ కొడుకులకీ నీ తమ్ముడి కొడుకులకీ మధ్య ఎందుకింత అగాధాన్ని సృష్టిస్తున్నావు? కురు పాండవులిద్దరూ శాంతించడం నీకూ, మాకూ, ఈ రాజులందరికీ కూడా మంచిదని తెలీదా నీకు.

యుద్ధమంటూ జరిగితే ఇంత మందికీ ఆపద తప్పదు.

నీ చుట్టూ ఇంత మోసాన్నీ, కుట్రనీ చూసేక కూడా ఎందుకు కొరగాని కొడుకుల్ని పట్టుకుని వేలడతావు?

నీకో నిజాన్ని చెబుతాను విను. ధర్మరాజెటువంటి వాడో నిన్నెలా సేవించాడో. అవసరమైతే ఎంత తెగువ చూపగలడో తెలుసు నీకు. ఇంద్రప్రస్థంలో వుండి నీకు పేరూ పెంపూ తేవాలని పాండవులు దిగ్విజయం చేస్తే అది చూసి ఓర్వలేక నీ కొడుకులు మాయ జూదమాడి వాళ్ళ ఆస్తంతా కాజేశారు. అది చాలక ద్రౌపదిని అవమానించారు. అదంతా హర్షించావు నువ్వు.

కాలానికి కట్టుబడి వాళ్ళు అడవుల్లో పడరాని పాట్లుపడ్డారు. అయినా ఇప్పుడవన్నీ మర్చిపోయి మీతో కలిసి బ్రతకాలనుకుంటున్నారు. మీకది ఇష్టం కాకపోతే చెప్పండి యుద్ధమే చేస్తారు' అన్నాడు.

ఆ మాటలు వినేసరికి ధృతరాష్ట్రుడికి కొద్దిగా భయం వేసింది.

మహారాజు మర్యాద, నెమ్మది తనం నిండిన కంఠంతో 'నాయనా! కన్న కొడుకుని కాదనలేని బలహీనత నాది వాడికెలాగైనా నువ్వే చెప్పాలి' అన్నాడు కృష్ణుడితో.





పీటర్ బ్రూక్ 'మహాభారత్'.

'మహాభారత్'ను ప్రథమంగా స్టేజిమీద ప్రదర్శింప చేసి ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు పొందిన పీటర్ బ్రూక్ దాన్ని సెల్యులాయిడ్ పైకి ఎక్కించారు. తన దర్శకత్వంలో తయారైన ఈ మహాభారత్ చిత్రాన్ని ఫిల్మోత్సవంలో ప్రదర్శింప చేయటానికి పీటర్ యిటీవల తమ బృందంతో ఢిల్లీ వచ్చారట.

ఈ పురాణకథలో ద్రౌపది పాత్ర వేసిన మల్లికా సారాభాయ్‌తో సహా ఆ చిత్రంలోని అనేక మంది నటీ నటులు ఈ ఉత్సవానికి హాజరయ్యారు.

ఈ చిత్రం కోసం ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న అనేక మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారట. ఆ సందర్భంగానే మల్లికా సారాభాయ్‌ను భారతీయ పాప్ సింగర్ ఉషా ఊతప్ కలుసుకున్నారట.

పై ఫొటో ఆసమయంలో తీసినదే!

దుర్యోధనుడికి ఒళ్ళుమండి సభ నుంచి విసురుగా బయటకు వెళ్ళబోతే జమదగ్న్య మహాముని అడ్డుపడి 'దంబోద్భవుడనే రాజు గర్వంతో గంధమాదన పర్వతం మీద తపస్సు చేసుకుంటున్న నరనారాయణులను యుద్ధానికి పిలిచి వాళ్ళ చేతుల్లో అవమానం పొందాడు. ఆ నరనారాయణులే కృష్ణార్జునులయ్యారు. వాళ్ళతో విరోధం పెట్టుకోకు. పాండవులతో సంధి చేసుకో' అని చెప్పాడు.

ఆ మాటలు దుర్యోధనుడికి రుచించలేదు.

'నరనారాయణులైనా నారశింహుడైనా ఎవరికి లెక్క-' అనబోయాడు. ఈ లోపునే కణ్వముని దగ్గరకొచ్చి 'నాయనా! ఎదుటివాడి బలం, తన బలం చూసుకోకుండా ప్రవర్తిస్తే గరుత్మంతుడికి జరిగినట్టే పౌరుష హాని జరుగుతుంది. మాతలికి గుణకేశి అనే కూతురుండేది. ఆర్యకుడనే సర్పరాజు మనుమడు సుముఖుణ్ణి గుణకేశికిచ్చి పెళ్ళి చెయ్యాలనుకున్నాడాయన. సుముఖుణ్ణి చంపాలని గరుడుడు ఎన్నో ఏళ్ళుగా ప్రయత్నం చేస్తున్నాడు. అందుకని మాతలి సుముఖుణ్ణి ఇంద్రసభకు తీసుకువెళ్ళాడు. సరిగ్గా అదే సమయానికి శ్రీ మహావిష్ణువు కూడా అక్కడే వున్నాడు. ఇంద్రుడు విష్ణుదేవుని అండ చూసుకుని సుముఖుడికి దీర్ఘాయువు ఇచ్చాడు. వెంటనే మాతలి తన కూతుర్నిచ్చి సుముఖుడికి పెళ్ళి చేశాడు. ఆ సంగతి తెలిసి ఇంద్రుణ్ణి ఆక్షేపించబోయి గరుత్మంతుడు వాసుదేవుని చేతిలో గర్వభంగం పొందాడు. ఆ విష్ణువే ఈ కృష్ణుడు. ఈయన సహాయం పాండవులకు వున్నంతకాలం నువ్వు వాళ్ళను గెలవలేవు. నువ్వే వాళ్ళను మంచి చేసుకో' అన్నాడు.

దుర్యోధనుడు నవ్వేసి 'కథ బాగుంది' అన్నాడు. అప్పటి వరకూ మౌనంగా వున్న కృష్ణుడు 'భయంకరమైన వ్యాధులన్నింటిలోకి అతి భయంకరమైనది స్వాతిశయం, దురభిమానం, మొండిపట్టుదల మంచివి కావు. రాజన్నవాడు న్యాయంగా రాజ్యాన్ని పెంపు చేసుకోవాలిగాని మాయలూ మోసాలతో కాదు. అసత్యం వల్లా లోభం



ప్రత్యక్షదైవం "సూర్యభగవానుడు"

నఖచిత్రం: కాలిపట్నపు కృష్ణారావు

వల్లా సంపదలు కలగవు. దురాత్ముల మాటలు నమ్మావంటే చివరికి మిగిలేది కీడొక్కటే' దేవదానవులంతా ఏకమై వచ్చినా పాండవుల్ని జయించలేరు. నా మాట విని సంధి చేసుకో. కాదన్నావంటే నువ్వూ, నీ మూలాన నీ తమ్ములు, బంధువులు, మిత్రులు అందరూ నాశనమైపోతారు. మహారాజైనవాడు కులనాశకుడనే పేరు తెచ్చుకోవడం మంచిది కాదు. పాండవులు వాళ్ళంతట వాళ్ళే నీతో కలిసి వుంటామంటే నువ్వు వద్దనడం, సిరి వస్తుంటే మోకాలు అడ్డు పెట్టినట్టుగా వుంటుంది. ఆ పైన నీ ఇష్టం' అని అనునయంగా చెప్పాడు.

దుర్యోధనుడు మాట్లాడలేదు.

'నాయనా! కృష్ణుడి మాట కాదనకు మీ తండ్రి బ్రతికుండగానే బంధువుల్నీ, సంపదనూ, కీర్తినీ కూడా ఎందుకు నాశనం చేస్తావు! కృష్ణార్జునులతో విరోధం ఎవరికీ శుభం కాదు. నిష్కారణంగా ఇహపరలోకాలు రెండింటికీ చెడిపోకు' అని భీష్ముడు మందలించాడు.

దుర్యోధనుడి మొహం ఉక్రోషంతో ఎర్రబడింది. ఆవేశాన్ని సాధ్యమైనంత వరకూ అణచుకుని 'మాటి మాటికీ మోసం చేశారు, ద్రౌపదిని అవమానించారు, అరణ్యాల్లో కష్టపడ్డామంటారే-ధర్మరాజు రాజ్యం మేము ఏమీ మీదబడి లాక్కోలేదే! అతని ఇష్టం మీదనే ఆట ఆడాం. ఆట అన్నాక గెలుపు, ఓటములుంటాయి! శకుని వాళ్ళందర్నీ గెలుచుకున్నాడు. ఇందులో తప్పేమిటి? అభిమానం విడిచి దేవేంద్రుడికి కూడా తల వంచేదిలేదు. రాజధర్మం అవలంబించి యుద్ధంలో చచ్చినా పేరుంటుంది మాకు. వాళ్ళూ మేమూ పంచుకుని రాజ్యమేలడం జరగదు. సూది మొన మోపినంత నేల కూడా వాళ్ళకు నేనివ్వను. యుద్ధంలో ఎవరు జయిస్తే రాజ్యం వాళ్ళది. అంతే' అన్నాడు మొండిగా.

ఆ మాటలకు సభలో వున్న వాళ్ళందరూ నిశ్చేష్టులయ్యారు.

'అంటే, రాజ్యం మీది దురాశకొద్దీ అన్న తమ్ముల సంబంధాలు కూడా లక్ష్యపెట్టవన్నమాట' అన్నాడు కృష్ణుడు. అప్పటికే కోపంతో ఆయన కళ్ళు ఎర్రబడ్డాయి.

'నాది కాదు దురాశ-నీదీ, నువ్వు వెనకేసుకొస్తున్న పాండవులదీ. ఒకసారి వాళ్ళ

జూదంలో ఓడాక కూడా మావాళ్ళు రాజ్యం ఇచ్చారు. పోన్లేపాపం అని వూరుకున్నాను. కానిరెండోసారి ఓడాక కూడా రాజ్యం పంచిమ్మంటే ఇచ్చేటంత ఔదార్యం నాకు లేదు' అన్నాడు దుర్యోధనుడు.

'అవును-నీది చాలా విశాల హృదయం నువ్వు అయాచితంగా వచ్చే సొమ్ముకోసం ఆశపడవు. కాంతా కనకాల మీద నీకసలు వ్యామోహమే లేదు. నీవల్ల ఏ తప్పూ లేకుండానే పాండవులకు విషం పెట్టావు! నీళ్ళల్లో తోశావు! పాముల చేత కరిపించావు! లక్క యింట్లో పెట్టి కాల్పించావు ఛీ ఛీ చెప్పకోవడానికి సిగ్గులేదూ!

అన్నదమ్ములతో జూదమాడి, తల్లి లాంటి వదిన తలపట్టి ఈడ్చి, కొలువులో బట్టలు విప్పిన ప్రబుద్ధుడు నువ్వు తప్ప లోకంలో ఇంకెవరైనా వున్నారేమో చూపించు. హీన చరితుడివి నువ్వు. నీ మూలంగా నీ వాళ్ళందరూ చరిత్రహీనులయ్యారు' అన్నాడు కృష్ణుడు.

దుర్యోధనుడు ఉగ్రుడైపోయాడు.

విసురుగా కొలువులోంచి లేచి పోయాడు.

అతని వెనకాలే కర్ణుడూ, శకునీ, దుశ్శాసనుడూ మిగిలిన కురుకుమారులూ

ద్రౌపది

వెళ్ళిపోయారు.

కృష్ణుడు లేచి 'ధృతరాష్ట్రమహారాజా! నీకూ, మహారాణి గాంధారికీ నా సానుభూతి' అన్నాడు.

మహారాజు అదిరిపడ్డాడు.

గాజుకళ్ళు నీళ్ళు వర్షించాయి. చేతులు జోడించి కృష్ణుణ్ణి ఏదో అర్థించబోయాడు గాని, దుఃఖంతో గొంతు పూడుకుపోయింది. మాట పెగల్లేదు.

కృష్ణుడే అన్నాడు 'మానవులలోనే దానవులున్నారు. దానవ బుద్ధి కల వారందరినీ సంహరించాలి. అందుకే భూమికి తరలి వచ్చాను. కంసుడై పుట్టిన కాలనేమితో సంహారకాండ ఆరంభమైంది. కురుక్షేత్రంలో మహాభారత యుద్ధం ద్వారా పరిసమాప్తమవుతుంది. దుర్యోధనుడి మరణం రేపే ఆరంభం.....'

ధృతరాష్ట్రుడుకి కళ్ళనీళ్ళు చెంపల మీదగా జారాయి. 'విదురా! గాంధారిని పిలుచుకురా! ఆవిడైనా కొడుకుని ఒప్పిస్తుందేమో.....' అన్నాడు.

విదురుడు వెళ్ళి గాంధారిని పిలుచుకొచ్చాడు. ఆవిడ వచ్చి ధృతరాష్ట్రుడి పక్కనే కాంచనపీఠం మీద కూర్చుంది.

'చూశావా! పెద్ద వాళ్ళు ఎంతమంది ఎన్నిరకాలుగా హితవు చెప్పినా వినకుండా వెళ్ళిపోయాడు నీ కొడుకు! నువ్వైనా చెప్పి వాడ్ని కృష్ణుడి మాట వినేటట్టు చేస్తే కౌరవకులం బ్రతుకుతుంది' అన్నాడు ధృతరాష్ట్రుడు.

'వాడు ధూర్తుడని తెలిసి కూడా మీరు వాడి మాటెందుకు వినాలి? మీరిప్పుడు పాండవులకు ఏమిస్తే మాత్రం కాదనే వాళ్ళెవరు? మీ తమ్ముడి బిడ్డలకు మీరు రాజ్యం ఇచ్చేందుకు అసలు వాడి అనుమతెందుకు మీకు?' అంది గాంధారి.

ధృతరాష్ట్రుడు మాట్లాడలేదు.

'ఒక్కమాట చెప్పనా పరాయివాళ్ళ సొమ్మంటే మీ కొడుక్కే కాదు, మీకూ మహాప్రీతే. ఎవరి ఆస్తి వాళ్ళు అనుభవిస్తూ హాయిగా వున్నప్పుడే మీ సుపుత్రుడి బుద్ధి పెడదారిన పడకుండా చూసుకోవల్సింది. ఇప్పుడేమనుకుని ఏం ప్రయోజనం.....' అంది.

ధృతరాష్ట్రుడు మౌనంగా వుండిపోయాడు.

'దుర్యోధనుణ్ణి పిలువ్...నించున్నపళంగా రమ్మను' అని దగ్గరలో వున్న పరిచారకుణ్ణి పిలిచి ఆజ్ఞ జారీ చేసింది గాంధారి.

పరిచారకుడు పరుగు పరుగున వెళ్లాడు.

క్షణాల మీద దుర్యోధనుణ్ణి వెంటపెట్టుకొని వచ్చాడు.

గాంధారి కోపాన్ని నిగ్రహించుకుని, పాండవులతో సఖ్యంగా వుండమని కొడుకుని బ్రతిమాలింది ! నచ్చచెప్పింది ! భయపెట్టింది ! కోప్పడింది ! ఏంచేసినా అతను విన్నాడుకాదు.

గాంధారి మనసు కీడు శంకించింది.

** ** **

'దుశ్శాసనా' అని కేకవేసి విసురుగా రాజమందిరంలోకి వెళ్లాడు దుర్యోధనుడు.

లోపల ఒక గదిలో దుశ్శాసనుడు మధువు సేవిస్తున్నాడు.

కళ్లు పెద్దవి చేసి చూశాడు. ఎదురుగా అన్న-సుయోధన చక్రవర్తి. తడబడుతూ లేచి నిలబడ్డాడు.

'ఆ కృష్ణుడి సంగతేమిటో తేలుద్దాం పద. అతన్ని ముందు బంధిస్తేగాని పాండవులు దోవకు రారు. కృష్ణుణ్ణి చూసుకునే వాళ్లు విర్రవీగుతున్నారు' అన్నాడు దుర్యోధనుడు.

దుశ్శాసనుడు అన్నను అభినందించాడు. ఇంత తెలివైన ఆలోచన వచ్చినందుకు దుర్యోధనుణ్ణి కౌగలించుకున్నాడు.

ఈ సంగతి ఎలాగో విదురుడికి తెలియనే తెలిసింది 'నీ కొడుకులు శ్రీకృష్ణుడికే అపకారం తలపెట్టారు. దైత్యాంతకుడైన గోపాలదేవుని బంధించాలనుకుంటున్నారు. నిప్పును చీరలో మూటకడ్తే ఏమవుతుందో నీ కుమార రత్నాలకు తెలిసినట్టులేదు. వినాశకాలే విపరీత బుద్ధి :' అన్నాడు.

ధృతరాష్ట్ర మహారాజు నివ్వెరపోయాడు.

భీకరంగా గర్జించాడు.

'ఆ దౌర్భాగ్యుణ్ణి వాడి పరివారంతో సహా ఇక్కడకు లాక్కురా' అన్నాడు.

రాజాజ్ఞ అందుకుని అంతఃపురం లోంచి ఇవతలకొచ్చిన విదురుడు బయట హాలులో గడ్డం కింద చేయి ఆన్చుకుని కూర్చున్న కృష్ణుణ్ణి చూసి నిర్విణ్ణుడైపోయాడు.

ఇదేమిటి గోపాలకృష్ణుడు ఒక్కడే ఇక్కడ కూర్చున్నాడు.... ఆ దుర్యోధనుడి దుశ్చర్యలేవీ ఇతనికి తెలీలేదు కదా !

చేతులు జోడించి దండం పెట్టాడు.

ఒక్కసారిగా కన్నీరు కట్టలు తెంచుకుంది.

దేవదేవుడు మందహాసం చేశాడు. అంతా అర్థమైనట్టు తల పంకించాడు.

అంతలో దుర్యోధనుడొచ్చాడక్కడికి, వాళ్లను చూడనట్టు మొహం తిప్పుకుని లోపలికి వెళ్లాడు.

'...ఎంత దుర్మార్గుడివిరా నువ్వు ! ప్రత్యక్ష నారాయణుడైన కృష్ణుడికే కీడు తల పెడ్తావుట్రా ? గాలిని పట్టడం, కొండను కదపడం, దావానలాన్ని అరచేత్తో పట్టుకోడం సాధ్యమనే అనుకున్నా



వురా? నువ్వు నాశనమయ్యే రోజులొచ్చాయి. నేనేం చెయ్యలేను' అని ధృతరాష్ట్రుడు నిస్సహాయంగా నిట్టూర్చాడు.

తండ్రీ కొడుకుల మధ్య చాలాసేపు వాదోపవాదాలు జరిగాయి.

కృష్ణుడు లోపలికి వెళ్లాడు.

అంతకంటే ముందు విదురుడు వెళ్లి కృష్ణుడొచ్చాడని మహారాజుకు విన్నవించాడు.

ధృతరాష్ట్రుడు తేరుకుని దేవకీ సుతుడికి వందనం చేశాడు.

'నాయనా ! మహారాజు బిడ్డలు చెడిపోయారు. అపమార్గాన పడ్డారు. నీ లీలలు, నీ గొప్పతనం, నీ దైవత్వం ఏవీ వాళ్లకు తెలీవు. వాళ్ల అజ్ఞానాన్ని మన్నించు. వాళ్లను ఆవహించిన రాక్షసత్వాన్నీ, అహంకారాన్నీ పోగొట్టు' అని కృష్ణుణ్ణి వేడుకున్నాడు విదురుడు.

కృష్ణుడు నవ్వి 'దుర్యోధనా' నేనొక్కణ్ణే అనుకుని నన్ను బంధించాలనుకున్నట్టున్నావు. అవునా ?' అన్నాడు.

దుర్యోధనుడు మాట్లాడలేదు.

ఒక్కసారి దుర్నిరీక్ష్యమైన కాంతి అతని ముఖాన పడింది. కళ్లు కనబడనంత కాంతి. కళ్లు నులుముకుని చూస్తున్నాడు.



ప్రయాగ రామకృష్ణ సీరియల్

1. జూద మందిరంలో 'ద్రౌపది'కి జరిగిన అవమానానికి ముఖ్య కారకులు ఎవరు?- ఎందుచేత?
2. ద్రౌపది- కుంతి- ఈ సీరియల్ చదివి యీ "యిద్దర్ని" పోల్చి చూడండి!

నిబంధనలు:

* మీరు పంపే వ్యాసం అరఠావు నుంచి అర ఠావున్నరకి మించకూడదు. పంక్తులు దూరంగా అక్షరాలు విడి విడిగా వుండాలి-
* ఈ ప్రశ్నలు కూపన్‌సహా మీవద్ద వుంచుకోండి! త్వరలోనే మరో రెండు ప్రశ్నలు మరో కూపన్ ప్రకటిస్తాము-
* ఆ కూపన్ (2)తో పాటు మరి రెండు ప్రశ్నలు కూడా వుంటాయి. మొత్తం నాలుగు ప్రశ్నలలో ఏ రెండైనా మీరు తీసుకొని వ్యాసాలు రాయొచ్చును. కూపన్‌లు రెండూ పెట్టడం మరిచిపోకండి!
* వ్యాసాలలో ఉత్తమమయిన వాటికి 1) బ్రీఫ్‌కేసు, 2) చిన్న కామిరా, 3) గోడగడియారం, 4) ట్రాన్సిస్టర్ రేడియో- యింకా మరి

ద్రౌపది

శ్రీకృష్ణుని నుదుట బ్రహ్మదేవుడూ, వక్షంలో శివుడూ, ముఖంలో వహ్ని, పార్శ్వాలలో ఇంద్ర వరుణ యమ కుబేరులూ, ఆదిత్య, విశ్వదేవ, అశ్విన, మరుత్తులూ ఉద్భవించారు. నాగలి ధరించిన బలరాముడూ, గాండీవం ధరించిన అర్జునుడూ ఆయన రెండు భుజాలలోనూ తోచారు. ఆయుధ హస్తులైన ధర్మ, భీమ, నకుల సహదేవులు వీపునా, యదువృష్ణి భోజాంధక వీరులంతా తొడల్లోనూ కనిపించారు. గోపాలకృష్ణమూర్తికున్న అనేక హస్తాలతో శంఖ చక్రాది ఆయుధాలు ప్రకాశిస్తున్నాయి. కళ్లలోంచీ, ముక్కులోంచీ, చెవులలోంచీ అగ్ని జ్వాలలు ప్రజ్వరిల్లుతున్నాయి. రోమ కూపాల నుండి సూర్యకిరణ ప్రభలు బయలుదేరాయి. ఆ తేజోమూర్తిని చూడలేక ఆశ్చర్య భయాలతో అందరూ కళ్లు మూసుకున్నారు. నారదాది మునులనూ, భీష్మ, ద్రోణ, విదుర సంజయులనూ కరుణించి వాళ్లకు దివ్యదృష్టి ఇచ్చాడు కృష్ణుడు. వాళ్లు ఆయన పూర్ణ స్వరూపాన్ని కళ్లారా చూసి బ్రహ్మానందం పొందారు.

దేవ దుందుభులు మ్రోగాయి. కల్పవృక్షాలు ధారాపాతంగా పూలవాన కురిపించాయి. సిద్ధ సాధ్య విద్యాధర శ్రేణులు చేసే జయ జయ ధ్వనులతో ఆకాశమంతా మారు మ్రోగింది. ఆ సంరంభమంతా విష్ణుదేవుడి విజృంభణమని ఊహించుకున్న గుడ్డిరాజు -

'ఆశ్రిత వత్సలా ! తండ్రీ ! నన్ను కరుణించు. నీ చరణాలను చూడాలని వుంది. నాకు దృష్టి ప్రసాదించు' అని వేడుకున్నాడు.

దయగల తండ్రి ఆయన కోరిక మన్నించాడు. 'ప్రభూ ! అద్భుతానందాలు కలిగించే నీ స్వరూపం చూశాను. ధన్యుడనయ్యాను. ఈ కళ్లతో మళ్లీ మామూలు మనుష్యుల్ని చూడాలనిపించడంలేదు. నువ్విచ్చిన దృష్టిని నువ్వే తీసేసుకో' అన్నాడు ధృతరాష్ట్రుడు.

కలువరేకుల్లా విచ్చిన ఆయన కళ్లు చూసి అక్కడున్న వాళ్లంతా ఆశ్చర్యంతో నోటమాటరాక నిలబడిపోయారు.

తరువాత శ్రీకృష్ణుడు తన విశ్వరూపం ఉపసంహరించి ధృతరాష్ట్రుణ్ణి ఎప్పటిలాగే చేసి కృతవర్మనూ, సాత్యకినీ, విదురుణ్ణీ వెంటపెట్టుకుని వెళ్లిపోయాడు.

** ** **

కృష్ణుణ్ణి చూస్తూనే 'నీ కోసమే ఎదురు చూస్తున్నాను. ఏం చేసుకొచ్చావ్' అని అడిగింది కుంతి.

'ఏమో, ఎవరెన్ని విధాల చెప్పినా వాళ్లు వినేటట్టులేరు. నా కొడుకులు నా మాట వినడంలేదు, నా తప్పేమీలేదని ధృతరాష్ట్ర మహారాజు అంటాడు. కాస్త సబవుగా మాట్లాడుతోందల్లా ఒక్క గాంధారే' అన్నాడు కృష్ణుడు.

అంతా విని ఓ నిట్టూర్పు విడిచింది కుంతి. ఆమె కళ్లముందు ఒక దృశ్యం మెదులుతోంది, దుశ్శాసనుడు తన కోడలు జుట్టు పట్టుకుని సభా మధ్యంలో వలవల వూడదియ్యటం.

'దుర్యోధన దుశ్శాసనుల్ని మట్టి కరిపించాలి కృష్ణా. సంధి జరగకపోవడమే మంచిదయింది.'

రాజులకు పరాక్రమ జీవనం తప్ప మరొకరకం బ్రతుకు పనికిరాదని నా పెద్ద కొడుక్కి చెప్పు. బుద్ధిహీనులైతే అల్పవు కూటికి ఆశపడి దైన్యం పొందుతారు. నా కొడుకులకేం ఖర్మ ! బ్రతికిన నాలుగురోజులూ పరాక్రమంతో బ్రతకమన్నానని చెప్పు. కొలువులో తమ భార్యకు జరిగిన అవమానం మరచిపోవద్దను' అని కళ్లు తుడుచుకుంది.

కుంతిని ఓదార్చి కృష్ణుడు రథమెక్కాడు.

కృష్ణుణ్ణి సాగనంపడానికి కౌరవులు బయటకు వచ్చారు. కర్ణుడు కూడా వున్నాడు వాళ్లలో.

కృష్ణుడు అతన్ని దగ్గరకు పిలిచి 'కొంత దూరం నాతో వద్దువుగాని రా' అని రథమెక్కించుకున్నాడు.

రథం బయలుదేరింది.

కొంతదూరం వెళ్లాక 'నీకో రహస్యం చెప్పనా ?' అన్నాడు కృష్ణుడు.

"ఏమిటది ? "

(ఇంకావుంది)

"ద్రౌపది"-వ్యాసరచనపోటీ(1)



కొన్ని చిన్న బహుమతులు వుంటాయి!

* వీటి వివరాలు కూడా మీకు "సీరియల్" పేజీల్లోనే త్వరలో దొరుకుతాయి!
ఈలోగా మీరు కూపన్ (1) కత్తిరించి దాచుకొని ప్రశ్నలు కూడా తీసుకొని సీరియల్ చదువుతూ సంసిద్ధులు కండి!
* బహుమతుల పోటీ! కూపన్ 2 పడ్డ దాకా- మీ వ్యాసాలు పంపకండి! కూపన్! కత్తిరించి దాచండి!
బహుమతుల సమర్పణ: నాగేశ్వరీ పబ్లికేషన్స్, విజయవాడ-2, కూపన్ 2కై ఎదురుచూడండి.

-ఎడిటర్

ద్రౌపది కూపన్ నెం. 1

మీ పేరు . . . .

చిరునామా . . . .

. . . .

ప్రశ్నావళి
— కె. రామలక్ష్మి

కె. శ్యామల, కలకత్తా.

13-8-89 పత్రికలో మీ సమాధానం నన్ను ఆలోచింపచేసింది....ఎన్ని వేషాలు వేసినా ఎన్ని ఎత్తుగడలు చేసినా మన ప్రజలకు ఏదిసరైన మార్గము అనేది తమకు తాము తెలుసుకునే జ్ఞానం-మనవాళ్లకు ఎంత మందికి వుందంటారు?

* అదేవుంటే రాజకీయాలింత జుగుప్సాకరంగా తయారవవు శ్యామలగారూ. మంది మంచికోసం ఆలోచించేవాళ్ళు రాజకీయాల్లో రాణించరు!

కాజ హనిత, ఏలూరు.

ద్రౌపదీ వస్త్రాపహరణం తరువాత శపించి వుంటే-ఏమయ్యేది?

* కథే వుండేదికాదు చిట్టితల్లీ. అప్పటిదాకా ఊరుకున్న మహారాణికి తనవాళ్ల నాశనం దగ్గరికి వచ్చేసరికి-అడ్డుపడక తప్ప లేదు!

వి.నిర్మలా ప్రియదర్శిని, పోరుమామిళ్ల.

నేడు స్త్రీలని ఎయిడ్స్‌లా పట్టి పీడిస్తున్న వరకట్నం పరిష్కారం ఎవరు అమలు పరచాలి? ఎలా సాధించాలి?

* రోగేకద వైద్యానికి తల ఒగ్గాలి? ఆడవాళ్ళే వరకట్న నిషేధాన్ని మట్టుపెట్టగలరు-అమ్మాయిలు చదివి-స్వంత కాళ్లపై నిలబడగానే సరికాదు- పౌరుషంగా బ్రతకడం-డబ్బిచ్చుకొని బానిసత్వానికి తల ఒగ్గకుండా వుండాలనుకోవడంకూడా నేర్చుకోవాలి.

ప్రస్తుత సమాజంలో కులం తక్కువ వాళ్లని హింసించడం ఎక్కువగా జరుగుతోంది. కారణం?

* ఎదురు తిరగరని ధైర్యం. ఎదురు చెప్పరని ధైర్యం అందుకే కదా- ఆడవాళ్లూ, వెనకబడిన జాతులూ అంటూ ప్రవర వల్లె వేస్తారు!

శ్రీ కొండ నవీన్, గూడూరు.

రాజ్యాంగరీత్యా రాష్ట్రపతి సర్వాధికారి. ప్రజాపాలన రీత్యా సర్వమానవుడు సార్వభౌముడు-ఎప్పుడు ఎలా?

* బిట్ క్వొశ్చెనా? ఎస్సె కొశ్చెనా?! రాష్ట్రపతికూడా ప్రజా ప్రతినిధులు ఎన్నిక చేసిన పెద్ద మనిషే....ఆయన సర్వాధిపత్యం-సైన్యానికే-అదేనా లాంఛనప్రాయం. ఇక మానవుడు సార్వభౌముడే-

ప్రజాస్వామ్యంలో-ఓటువేసి గెలిపించేదాకా?! తరవాత అతనిపాట్లు అతనివే. గమనించడం లేదా? ప్రభూ భారతదేశ పరిపాలన మరిచిపోయారా అని ప్రజలు కోరినప్పుడు రాష్ట్రపతి కర్తవ్యం ఏమిటి?

* ప్రధానమంత్రి, మంత్రివర్గంవున్న దేశాలలో రాష్ట్రపతి పదవి-గౌరవచిహ్నమే- ఎందుకంటే ఆయనగారూ పి. ఎమ్.నే సంప్రదిస్తారు-నిర్ణయాలు చేయడానికి-సాధారణంగా ఒక పార్టీ సపోర్టువల్ల నిలబడిన వ్యక్తి అవుతాడు ప్రెసిడెంటు కనుక వీలైనంత వరకు-నీటివాటంతో పోడానికే ప్రయత్నించడం అనవాయితీ. అలాకాకుండా ఏటి కెదురీదితే-చూశాంగా?!

పెద్దల సహకారం పెళ్ళి, ప్రభుత్వ అనుమతి పెళ్ళి ఏది మంచిది?

* ప్రభుత్వం అనుమతి కాదు-చట్ట సమ్మతమైన పెళ్లి చేసుకుందుకు-అవకాశం కల్గిస్తుంది-సాధారణంగా నేటి యువకులు-పెద్దల అంగీకారం కావాలి- కట్నకానుకలకోసం-స్వేచ్ఛ కావాలి స్వార్థంకోసం అనుకుంటారు. కాదంటారా?



జి. వి. ఆర్. విజయవాడ.

అత్యాశకు పోతారెందుకు చాలామంది?

* తెలియక! చేతులో యిముడ్చుకోలేనంత అధికంగా లాక్కుంటే-ఏం ప్రయోజనం? అసలు తీసుకోకుండా వుండడంమేలు కదా!

మర్రి భాస్కర్, మెట్‌పల్లి.

ప్రతిమగాడి విజయం వెనుకా ఒక స్త్రీ వుంటుంది కదండీ. మరి ప్రతి స్త్రీ విజయం వెనకా ఎవరుంటారు?

* అదేమిటి? తెలియనట్లు అడుగుతున్నారు-ఓ తండ్రి ఓ అన్న, ఓ తమ్ముడు - ఓ భర్త - తరవాత ఓ కొడుకు వుంటే తరవాత ఓ మనవడు....ఎవరూ లేకుండా స్త్రీ విజయం సాధిస్తుందా?! అంత ధైర్యమే!

జి. రమేష్‌బాబు, పత్తిపాడు.

మీరు ఎప్పటికీ మరిచి పోలేని సంఘటన ఒకటి చెపుతారా?

* ఇంకా అంత గొప్ప సంఘటన లేం నా జీవితంలో జరగలేదే!

మిమ్మల్ని మీరు ఎప్పుడేనా విమర్శించుకొంటారా?

* ప్రతి క్షణం!

నేటి మనిషి-సాటి మనిషి విలువ ఎప్పుడు తెలుసు కుంటాడు?

* ఆ మనిషి అవసరం వచ్చినప్పుడు!

జి. త్రినాధ, పార్వతీపురం.

ఆడవారికి కేశ సంపద అందాన్నిస్తుంది. మరి మగవారికి?

* అదే. ఈ మధ్య నో కేరళీయుడు బట్టతలకి నూనె కనిపెట్టినప్పుడేనా తోచలేదా త్రినాధా?!

ఎ. విజయ్, అనంతపురం.

ఆడదానికి ముఖ్యంగా కావలసినదేమిటి చదువా? పెళ్లా?

* చదువు. సంపాదన. గౌరవించగల వాడు దొరికితేనే పెళ్లి.

స్త్రీ స్వేచ్ఛా స్వాతంత్ర్యముపై మీ అభిప్రాయం?

* పురుషులు ప్రసాదించినవి-స్త్రీలు అనుభవించనివి-కదా ఇవి?!

శీలం నరసింగరావు, అలమండసంత.

కోర్టుల్లో, శాసనసభల్లో ప్రమాణాలు చేయిస్తారు కదా? ప్రభుత్వ దృష్టిలో దేవుడున్నాడంటారా?

* అసెంబ్లీలో పార్టీ దేవుడు.

కోర్టుల్లో సాక్షి దేవుడు - ఆ నమ్మకంతోనేకదా ప్రమాణం చేసే ది?! ○

మంచి పోషణ కావాలంటే చెల్లించాలి కొంత ఎక్కువే

చౌకరకం గ్లూకోజ్ బిస్కెట్లు కొంటే డబ్బు నష్టమే!

మీరు 1 రూ. వెల చేసే చౌకరకం బిస్కెట్లను కొని, డబ్బును ఆదా చేస్తున్నారని భ్రమ పడకండి. వాటి నాణ్యత ఎంత తక్కువంటే, మీరు నిజంగా డబ్బు దండుగ చేస్తున్నట్లు లెక్క. అలాంటి వాటితో సరిపుచ్చుకోకండి. ఆంప్రో గ్లూకోజ్ బిస్కెట్లు మాత్రమే కావాలని అడిగి మరీ కొనండి. వీటి నాణ్యత మీకు ఎన్నో సంవత్సరాలుగా మంచి పోషణను అందించింది. ఈ నాణ్యత తోటేగా పెరిగింది మనం!



ఆంప్రో ® గ్లూకోజ్

గ్లూకోజ్ బిస్కెట్లలో షహన్‌షాను కొనండి

Sista's-EIL-253/89 TEL-A

యంత్రసవారి సరిహద్దుల్లో!

అఫ్సర్

అదిగదిగో మా వూరు.

- లోలోపల నేను ఎక్కడో అణిచిపెట్టిన పసితనం ఆనందం పట్టలేక గంతులేసింది. మా వూరిని చూడగానే ఆ కంపార్టుమెంట్‌లో మిగతా ప్రయాణీకుల నుంచి నా ప్రపంచం వేరయింది. అయిదు నిమిషాల్లో మా వూరి ప్లాట్‌ఫారం వస్తుంది. అంత దూరాన కనిపిస్తున్నాయే, అవి కోట గోడలు. ఆ గోడమీద రెండు మూడు పాతకాలపు వీరఖడ్గాలున్నాయని బగ్గీతాత చెబ్తూండేవాడు.

ఊరు దగ్గిరవుతోంది.

నా గుండెల్లో మువ్వలు మ్రోగుతున్నాయి. నిరంతరం నగరారణ్యపు హోరులో, వ్యాపార ప్రపంచ ఇంద్ర మహేంద్ర జాలాల్లో క్షణంసేపు కూడా వూపిరాడని, నాకు, ఇప్పటికీ మావూరు గుర్తొస్తేచాలు, నామీంచి ఒక పచ్చపచ్చని గాలి అల అలా దూసుకుపోతుంది. ఆ కోట, ఆ పేర్ల చావిడి, ఆ చెరువుగట్టు వీటన్నిటికి మించి మా బగ్గీ తాతయ్య.

కంపార్టుమెంట్‌లో ప్రయాణీకుల గజిబిజి కబుర్లూ, పేకాట గుంపు నవ్వులూ, పిల్లల ఏడ్పులు... ఇవేవీ నాకు వినిపించడం లేదు. నాకు తెలీకుండానే నేను కలలాంటి నా పసితనపు వూహల్లోకి వూయలూగుతూ వెళ్లిపోయాను.

"బాబూ, మీరిక్కడే దిగాలనుకుంటాను" అని పక్కనున్న వ్యక్తి గుర్తు చేసేదాకా మా ప్లాట్‌ఫారం వచ్చేసిందనీ, నేను దిగాలనీ నాకు స్పృహలేదు.

* * * * * * * *

స్టేషన్‌లోంచి బయటపడ్డాను. అక్కణ్నించి మా వూరికి వెళ్లాలంటే అయిదారు కిలోమీటర్లు నడవాలి. నా లెక్కప్రకారం ఇక్కడే ఎక్కడో ఒక చెట్టు కింద బగ్గీ తాతయ్య వుండాలి. ఎవరో ఓ ప్రయాణీకుడు వెళ్లి నిద్రలేపితే లేచి దర్జాగా బండి కడుతూ వుండాలి. బగ్గీ తాతకోసం అటూ ఇటూ చూస్తున్న నన్ను ఇందాక నా పక్కనే వున్న ప్రయాణీకుడు మళ్లీ పలకరించాడు.

"సిరిపురానికి ఇప్పుడు బస్సు పడిందయ్యా బాబుగారూ, ఒక పావుగంట ఆగారంటే బసొస్తుంది" అనేసి వెళ్లిపోయాడు, నేను 'బగ్గీ తాత' కోసం చూస్తున్నానని చెప్పేలోగానే.

రెండడుగులు ముందుకు వేశానో లేదో వెనక నుంచి

"బండి కావాలా బాబూ" అని దీనంగా ఓ కంఠం అడిగింది.

నేను పెదవి విప్పి మాట్లాడేలోగానే అతను నాముందు వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. అతని తల బాగా నెరిసిపోయి వుంది, శరీరం ముడతలు తేరింది. తలపాగా మాసిపోయివుంది. అతని కళ్లల్లో చిన్నపాటి కాంతి కూడా లేదు. అతన్ని ఎప్పుడో చూసిన జ్ఞాపకం! కాని గుర్తుకు రావడం లేదు.


"రూపాయిస్తే చాలు బాబూ" ఆ కంఠం అప్పుడప్పుడే గుర్తొస్తోంది, కాని గుర్తొచ్చి రాకుండా.

కొద్ది దూరంలో వున్న చెట్టువైపు చూశాను. అక్కడ బగ్గీతాత బండి వుంది. ఒకడుగు ముందుకు వేశాను, అతను నా వెనకే వచ్చాడు. ఇలా అడుగుతూన్న ఈ వ్యక్తి బగ్గీతాత కాదు కదా!

"బాబూ..." అని వెనకనుంచి మళ్లీ.

నేను వెనక్కి తిరిగి, అతని కళ్లల్లోకి తీక్షణంగా చూశాను. అలా చూసేసరికి అతని పేదకళ్లు బెదిరిపోయాయి. ఒకడుగు వెనక్కి వేశాడు.

"తాతా..." అని నేను అప్రయత్నంగా అనేశాను. ముడుతలుపడిన అతని చేతుల్ని నా చేతుల్లోకి తీసుకుని- "నేను తాతా, నన్ను గుర్తుపట్టలేదా" అన్నాను.



అతను ముసలికళ్లు చికిలించి- లేదన్నట్టు తలూపాడు.

"పద..." అని నేను బండివైపు అడుగువేశాను.

అప్పుడతని సంతోషానికి అంతులేదు. మెరుస్తూన్న కళ్లతో అడుగు కదిపేడు. బండి ఎక్కేముందు- ఒక్కసారి ఆ గుర్రంవైపూ, బగ్గీవైపూ, తాతవైపూ చూశాను. నా కళ్లకి ఆ మూడూ ఒక్కలాగే కనిపించాయి. వృద్ధాప్యం ఆవహించిన సన్నజీవాలు, రంగు మాసిన బగ్గీ.

బగ్గీ ముందుకు సాగింది. అప్పుడు అడిగేడు బగ్గీతాత

"బాబూ మీ పేరేంటన్నారు..."

"ఇంకేమీ అనలేదు, అయినా ఈ వూరొచ్చి పదేళ్లపైనయింది. ఇప్పుడు నా పేరు చెప్పినా గుర్తుకు తెచ్చుకోలేవేమో!"

బగ్గీతాత వెనక్కి తిరిగి నా కళ్లల్లోకి చాలాసేపు చూశాడు. అతని కళ్లల్లో మెరుపు మెరిసినట్టయింది.

"మీరు ప్రసాదు బాబూ దోస్తులా" అన్నాడు.

"బ్రహ్మాండంగా గుర్తుపట్టావే..." అన్నాన్నేను ఆశ్చర్యంతో తలమునకలవుతూ.

"ఇదేమిటి తాతా, నువ్వు నా దగ్గిరకొచ్చి 'భిక్షాందేహీ' అన్నట్టు బండి కట్టాలా అని అడగడం...."

"ప్చ్... రోజులు మారిపోయాయి బాబూ, మోటరొచ్చింది, నాకు మెతుకు ల్లేకుండా చేసింది. ఒకోరోజు...." అని ఆగిపోయాడు. "అ... ఇవన్నీ ఎందుకులే బాబూ, అసలు నాకు తెలీకడుగుతామా, పదేళ్లబట్టి ఈ వూరూ ఈ ధ్యాసా పట్టకుండా ఎట్లావున్నావూ," అడిగేడు.

అలాంటి ప్రశ్న పుట్టేంత తీరిక కూడా ఏనాడూ దొరకని నేను ఒక్కసారిగా బగ్గీతాత అడిగిన ప్రశ్నకు ఏ సమాధానం చెప్పాలి? బగ్గీతాత 'మోటర్'తో పోరాడుతున్నట్టే నేనూ

యాంత్రికమైన జీవితంతో వుక్కిరిబిక్కిరవుతున్న వాణ్నే.

"అవును, తాతా, నాకే ఆశ్చర్యంగా వుంది. పదేళ్లు ఎలా గడిచిపోయాయా అని, కాని ఆ రోజులే వేరు, తలుచుకుంటే బాధ తప్ప ఆనందం మిగలదు. ఇన్ని బస్సులూ, మోటార్లులేని మా చిన్నప్పుడు ఎంత ప్రశాంతంగా వుండేది. ఇప్పుడు బాధ్యతలనీ, హోదాలనీ ఏవో బరువుల్ని భుజమ్మీద మోపుకొని అదే జీవితమన్న భ్రమలో గడిపేస్తున్నాం. కానీ ఆ చిన్నప్పుడు ఏమీ తెలియని వయసులో బగ్గీ తాత చెప్పిన కథలేవీ, చెరువుగట్టున బగ్గీ తాత పాడిన పాటలేవీ, ఆడించిన ఆటలేవీ?" అన్నాను గతస్మృతిని నెమరేసుకుంటూ.

ఉన్నట్టుండి బండి ఆగిపోయింది. తలెత్తి చూశాను. తాత కళ్లల్లోంచి రెండు కన్నీటిబొట్లు తళుక్కున మెరిసి నేలరాలాయి.

* * * * * * * * *


పిడికెడు మెతుకుల కోసం 'మోటర్'తో యుద్ధం చేస్తున్నాడు బగ్గీతాత. బహుశా మోటర్ చెడిపోయి మూలనపడాలని అతను రోజూ దేవుడికి పూజలు చేస్తుండొచ్చు. మోటర్ ఏ చెరువులోనో బోల్తాపడిపోవాలని కోరుకున్నా ఆశ్చర్యంలేదు. కాని నేను- నా చుట్టూ అడ్డూ అదుపూ లేకుండా పెరిగిపోతున్న ఆ నగరం... ఒక్కొక్క మనిషి ఒక యంత్రంగా మారుతున్న ఆ నాగరికత....!

ఒక్కసారి నా వర్తమానంలోకి అడుగుపెడితే, నాకు కనిపించేదీ వినిపించేదీ ఏముంది? ఆ బండిచప్పుడు ఎక్కడో దూరంగా, సుదూరంగా లీలా మాత్రంగా వినిపిస్తూ వుంటుంది, కనుచూపు మేరా ఎక్కడా పిసరంత పచ్చదనం కనిపించదు. పాముల్లా మెలితిరిగే రహదారులమీద బారులు తీరిన కార్లు, బస్సులు, ప్రవాహంలా బిరబిరా సాగిపోతున్న జనసముద్రం....!

ఇన్ని యంత్రాల్లో నేనూ ఒక యంత్రాన్నే పొద్దున్నేలేచి అద్దం ముందు నిలబడి గడ్డం గీసుకుంటాను, బ్రష్ చేసుకుంటాను, షవర్ కింద నిలబడి స్నానంచేస్తాను, ఒంటిమీద నలగని మల్లెపూవులాంటి తెల్ల చొక్కా వేసుకుంటాను, గొంతును నొక్కీ నొక్కకుండా వేలాడే 'టై' కట్టుకుంటాను, ఎడం చేత్తో నా హోదాకి గుర్తుగా కోటు వేలాడతీసుకుంటాను. మా ఆవిడ ప్రేమగా అందిచ్చిన టిఫినూ, కాఫీ హడావుడిగా పూర్తి చేస్తానో లేదో-

"సాబ్..." అంటూ గేటుదగ్గిర కారు డ్రైవర్.

రెండు చేతులా ఫైళ్లు పెట్టుకుని నా వెనక అటెండర్ నడిచి వస్తాడు. అప్పటి నుంచి రాత్రి ఏ ఎనిమిదింటికో ఇంటికి చేరే దాకా ఫైళ్ల సమాధిలో వుక్కిరిబిక్కిరవుతాను.



శ్యామ్ బెనెగల్ కు నెహ్రూ అవార్డు!

ప్రముఖ సినీదర్శకుడు శ్రీ శ్యామ్ బెనెగల్ కు ఈ ఏడాది ప్రతిష్ఠాకరమైన 'సోవియట్ ల్యాండ్ నెహ్రూ అవార్డు' లభించింది.

1964లో ఏర్పాటైన ఈ అవార్డు క్రింద 20 వేల రూపాయల నగదును బహూకరిస్తారు.

ఈ అవార్డు పొందినవారు రెండు వారాలపాటు సోవియట్ యూనియన్ లో పర్యటించేందుకు అవకాశముంటుంది.

ప్రముఖనటి దేవికారాణి, చరిత్రకారుడు శ్రీ ఎస్. గోపాల్ లకు కూడా ఈ అవార్డు లభించింది.

ప్రతి ఏడాది ఈ అవార్డును నాలుగు తరగతులుగా బహూకరిస్తూ వుంటారు.

క్యాటగిరి 'బి'లో ఈ అవార్డును పొందిన వారిలో ప్రముఖ జర్నలిస్టు శ్రీ వి.కె. మహదేవన్ కుట్టి, ఉర్దూ కవి శ్రీ జగన్నాథ్ అజాద్, జాతీయ మ్యూజియం డైరెక్టర్ జనరల్ శ్రీ ఎల్.పి. సిహోగేలు వున్నారు. ఈ అవార్డుక్రింద వీరికి 10 వేల రూపాయలు బహూకరిస్తారు.

హిందీకవి శ్రీ అరుణ్ కమల్ కు 8 వేల రూపాయల నగదు బహుమతి అందించ బడుతుంది.

ప్రఖ్యాత నృత్య కళాకారులు శ్రీ నరేంద్రశర్మ, డాక్టర్ డి.వై. సంపత్ కుమార్, ప్రముఖ కవులు ఎస్.డి. సంతాని (సింధీ), నిరంజన్ ఉజ్ గారే (మరాఠీ), రతన్ చక్రవర్తి, మలె కాంతి బసు (బెంగాలీ), యం. కామరాజులు (తమిళ), శివ ప్రసాద్ కోస్తా (హిందీ), హరికిషన్ కౌల్ (కాశ్మీర్), డా. కబీర్, అహ్మద్ జైసీ (ఉర్దూ)లకు అయిదువేల రూపాయలు, ప్రశంసాపత్రం ఈ అవార్డుక్రింద లభిస్తాయి.

ఫైళ్లు, సంతకాలు, బిజినెస్ లెటర్స్ డిక్టేట్ చేయడం- ఇంతే జీవితం! రాత్రి ఇంటికి రాగానే పిల్లలు- 'హలో డాడీ' అని రెండు బుగ్గలమీదా రెండు ముద్దులిచ్చి, వాళ్లవాళ్ల గదుల్లోకి వెళ్లిపోతారు. ఆ తర్వాత మా ఆవిడ వచ్చి నాకోసం కొత్త నిఘంటువు తెరుస్తుంది. ఆమె వొంటిమీదకూడా అప్పుడప్పుడూ నాకు ఫైళ్లవాసనే తాకుతుంది....!

* * * * * *

"బాబూ... ఇక దిగండి" అని బండి ఆపేడు తాత. గత జ్ఞాపకాల హోరులోనే వూరొచ్చేసింది.

"ఇదే చావిడి" అని ఒకవైపు వేలు చూపించాడు.

"అదా చావిడి?" అన్నాన్నేను నమ్మలేకుండా- ఆ విశాలమైన పేర్ల చావిడిమీద ఇప్పుడు వరసగా అయిదారు కొట్లు వెలిశాయి. నా చిన్నప్పుడు మోటారు సైకిల్ని చూస్తేనే చుట్టూ మూగేజనం ఇప్పుడక్కడ కార్లు తిరుగుతున్నా పట్టించుకోవడంలేదు.

నేను బండిదిగానో లేదో ప్రసాద్ ఎదురయ్యాడు.

"ఒరే, నువ్వు బగ్గీలో వచ్చావా? నేను బస్సుకోసం చూస్తున్నా" అన్నాడు ఆశ్చర్యంగా.

"బగ్గీ తాత వుండగా మోటరెందుకు?" అంటూనే ఓ యాభైతీసి బగ్గీతాత చేతుల్లో పెట్టబోయాను.

"వద్దుబాబూ..." అంటూ చేతులు వెనక్కి ముడుచుకున్నాడు తాత.

"ఫర్లేదు తాతా" అంటూ యాభైనోటు అతని చిరిగిన జేబుల్లో కుక్కాను.

"నా దగ్గిర అంత చిల్లరలేదు బాబూ" అని ప్రసాద్ వైపు తిరిగేడు.

"చిల్లరొద్దు, నువ్వు సాయంత్రం ఒకసారి కలువు" అని మేమిద్దరం ముందుకు కదిలాం. మా వైపు అలాగే చూస్తూ నిలబడిపోయాడు తాత.

* * * * * * *

"ఇవ్వాళ బగ్గీతాత పండగ చేసుకుంటాడు" అన్నాడు ప్రసాద్ ఇంటిగేటు వెనక్కి నెడుతూ.

"ఎందుకలా? బగ్గీతాతకి ఈ యాభై ఓలెక్కా?" అన్నాను.

"చూస్తాండు- వాడికి రూపాయి నోటు కళ్లబడని రోజులు కూడా వున్నాయి."

"అదేం? తాత కూడా ఇందాక ఏదో చెప్పబోయాడు, కాని చెప్పలా"

"బగ్గీతాత పరిస్థితి ఇదివరకటిలా లేదు. ఇప్పుడు మనిషి బాగా కటకటలో పడిపోయేడు. మన వూరు కూడా బస్తీకి ఏం తీసిపోదు, బస్సులొచ్చాయి, మిల్లులొచ్చాయి, జనాలకు పనులు పెరిగాయి, బస్తీకి వెళ్లాలంటే ఇదివరకు బగ్గీయే దిక్కు. ఇప్పుడు గంటకూ, అరగంటకూ బస్సుంది."

"సరే, తాతకెలా గడుస్తుంది?"

"ఎలాగేముంది? ఏదో ఓ రెండుమూడు రూపాయలు దక్కుతాయి. ఎవరూ అతన్ని పట్టించుకోరు. వారాని కోసారి నేనే ఇంటికి తీసుకొచ్చి కడుపుకింత పెడ్తాను."

"దరిద్రంగా వుండే- ఎంత దర్జాగా బతికేడు బగ్గీతాత" అన్నాను.

"అవును, ఆ రోజుల్లో బగ్గీ తాతంటే జనాలకు పెద్దమోజు. ప్రతి ఇంట్లో వాడు ఆపద్బాంధవుడిలా ప్రత్యక్షమయ్యేవాడు. ఎర్ర ఏగానీ అడక్కుండా వాడు బండి తోలేవాడు, అదీగాక ఎంత నమ్మకంగా వుండేవాడు!" అన్నాడు ప్రసాద్.

నా చిన్నప్పటి రోజులు గుర్తొచ్చాయి నాకు- పెద్దవాళ్లకు బగ్గీతాత పెద్ద సలహాదారు, చిన్న పిల్లల్లో అతనే అందరికన్నా చిన్నవాడు. ఎవరికి ఏఆపద వచ్చినా తాతని కలవరించే వాళ్లు. అలాంటి బగ్గీతాత....!

* * * * * *

ఆ సాయంత్రం శుభ్రంగా స్నానాలు చేసి, చెరువుగట్టుకు వెళ్లాం మేమిద్దరం. ప్రసాద్ ఏమిటో మాట్లాడుతున్నాడు. కాని ఆ పరిసరాల్ని చూస్తూంటే నాకు బగ్గీతాత తప్ప మరేమీ కనిపించడంలేదు. నేనేమీ మాట్లాడలేకపోతున్నాను.

"ఏం, మాట్లాడవేం?" అన్నాడు ప్రసాద్ మాటల మధ్యలో.

"ఆ... చెప్పు, వింటున్నా" అన్నాను. నిజానికి నేను వినడంలేదు కాని అతనేం చెబ్తున్నాడో తెలుస్తూనే వుంది. ట్రాక్టర్ కొనడం, పెంకుటిల్లు డాబాగా రిపేర్ చేయించడం, పెద్దమ్మాయికి కూడబెడ్తున్న కట్నం డబ్బు, నడిమి అబ్బాయి కాలేజీ చదువు... నాకు అవేవీ వినిపించడం లేదు, నా చిన్నప్పటి రంగు రంగుల గుర్రబ్బగ్గీ, తాత పాడిన పాటలు, ఆడించిన ఆటలు... ఈ చెరువు గట్టునే కదా, ఆ చల్లని వెన్నెల రాత్రులు... కథలు కథలుగా బగ్గీతాత చెప్పిన అనుభవాలు....!

ఆ సాయంత్రం, ఆ రాత్రి నాకు భారంగా గడిచింది. బగ్గీతాత గురించి తప్ప మరో విషయం ఆలోచించలేకపోతున్నాను. రాత్రి నిద్రపోయేటప్పుడు పోస్ట్ మాస్టర్ ఇంటినుంచి కబురొచ్చింది, ఫోన్ వచ్చిందట.

నేనూ, ప్రసాద్ వెళ్లాం. నా పి.ఎ. ఫోన్ చేశాడు. అర్జెంటుగా సంతకాలు పెట్టాల్సిన ఫైల్సు వున్నాయట. రేపొద్దుట తను బయలుదేరి వస్తున్నానని-

"వద్దు వద్దు, నేనే వస్తాను" అని ఫోన్ పెట్టేశాను.

* * * * * *

తెల్లారే లేచి నేను ప్రయాణానికి సిద్ధమయ్యాను.

"ఇవ్వాళ వుండరాదా అంకుల్" అని ప్రసాద్ పిల్లలు బతిమాలారు. ప్రసాదూ, అతని భార్య కూడా చాలాసేపు చెప్పి చూశారు.

"వీలుపడదు ప్రసాద్, నా పి.ఎ. సాధారణంగా ఫోన్ చేయడు" అన్నాను. ప్రసాద్ బయటికి వెళ్లి, ఎవరిదో స్కూటర్ తీసుకు వచ్చాడు.

అయిదు నిమిషాల్లో మేం రోడ్డుమీదికి చేరుకున్నాం.

పి.ఎ. ఎందుకు ఫోన్‌చేశాడో అన్న ఆలోచన ఏ మూలనో వేధిస్తున్నా, నన్ను బగ్గీతాత స్మృతులే వెంటాడుతున్నాయి.

రోడ్డుమీద అల్లంత దూరాన బస్సు నిలబడివుంది.

"బస్సు ఇక్కడెందుకు ఆపాడో!" అన్నాను నా వెనక కూర్చున్న ప్రసాద్‌తో.

"ఏముంది, అడుగడుగునా జనం ఆపుతూనే వుంటారు" అన్నాడు ప్రసాద్.

బస్సు దగ్గిర బాగా రద్దీగా వుంది. కానీ అది తొక్కిసలాట లాటిదేమీకాదు.

మేం కొద్దిదూరం వెళ్లేసరికి- అటుగా వెళ్తున్న ఎవరో ప్రసాద్‌కి కేకేసి చెప్పారు.

"యాక్సిడెంట్ అయింది"- స్కూటర్ కొంచెం స్లో చేశాను నేను. బస్సు దగ్గిరయింది. ప్రసాద్ ఆపమన్నాడు. నాకు రెండోసారికి గానీ ప్రసాద్ మాట వినిపించలేదు.

"ఆపరా, ఒకసారి, చూద్దాం," అన్నాడు ప్రసాద్ మళ్లీ.

"ఏముంటుంది, యాక్సిడెంట్ అంటే.." గొణుగుతూ ఆపాన్నేను.

"ఏముంది. వెధవ, తాగి బండి తోలి వుంటాడు" ఎవరో ఓ వ్యక్తి ప్రసాద్ వైపు నడిచివస్తూ అన్నాడు.

మేం స్కూటర్ దిగి జనాన్ని నెట్టుకుంటూ ముందుకు వెళ్లాం.

నెత్తుటిమడుగులో బగ్గీతాత!

నేను క్షణంసేపు స్థాణువైపోయాను. కళ్లముందు మసకతెరలు కమ్మాయి, మెదడంతా ఖాళీ అయిపోయింది.

ఒక గుంపు పొలాల వైపు చూస్తోంది, ఆ పొలాల్లో ముక్కలుముక్కలైన బగ్గీ. రంగురంగుల నా చిన్నప్పటి బగ్గీ నెత్తుటిరంగు పులుముకొని ముక్కలుముక్కలై కనిపిస్తోంది.

అంత గందరగోళంలోనూ నా గడియారం కీచుమన్న చప్పుడు నాకు వినిపించింది. ప్రసాద్‌వైపు చూశాను. ప్రసాద్ ఆ నెత్తుటి మడుగు చూడలేక, మరోవైపు చూపు మరల్చుకుని నిలబడ్డాడు.

మేమిద్దరం గుంపులోంచి బయటపడ్డాం. నాకు ఇంకా పది నిమిషాల వ్యవధి మాత్రమే వుంది. తొరగా వెళ్లాలి. ప్రసాద్ నా వైపు ప్రశ్నార్థకంగా చూశాడు. నా కళ్లల్లో గజిబిజిని ప్రసాద్ గుర్తుపట్టాడు.

గడియారం నన్ను వెంటాడుతోంది. ఒక్కక్షణం కూడా అక్కడ నిలబడే అవకాశం లేదు.

"సరే, నువ్వెళ్లు. నేను సాయంత్రం వచ్చి స్కూటర్ తీసుకుంటా" అన్నాడు ప్రసాద్.

నేను స్కూటర్ స్టార్ట్‌చేసి, వెనక్కి చూశాను.

ప్రసాద్ నావైపే చూస్తున్నాడు. నేను ఇంకోసారి అతని వైపు చూడలేక, స్కూటర్ ముందుకు పోనిచ్చాను.

- ముక్కలైన ఆ బగ్గీ... నా ఆలోచనల్లో ఒక మహానిశ్శబ్దం!

- ఒక క్షణం బగ్గీతాత స్థానంలో జీవచ్ఛవంలా పడివున్న నేను- యంత్రంలా- నిశ్చలనంగా. ●

ఊపిరి వుంటేనేకదా బ్రతుకు.... 'లంగ్స్'కివచ్చేవ్యాధులువాటివైనం!

డా.ఆషిష్ బి.బోఘాని చెప్పిన వివరాలు ఊపిరితిత్తుల వ్యాధులు, కారణాలు

మనం కార్బోహైడ్రేట్ల వంటి ఆహారపదార్థాల్నితీసుకొన్నప్పుడు, అవి శరీరంలో దహించబడతాయి. ఈ దహన ప్రక్రియను 'ఆక్సిడేషన్' అంటారు.

అంటే ఆక్సిజన్ ఆహారపదార్థాలతో కలిసి కొంత శక్తిని విడుదల చేస్తూ, కార్బన్‌డయాక్సైడ్ నీరుగా విడిపోతుంది. ఆ శక్తి దేహ ప్రక్రియలకు తోడ్పడుతుంది. విడుదలైన కార్బన్‌డయాక్సైడ్ రక్తం ద్వారా గుండె ద్వారా ఊపిరితిత్తులకు చేరుతుంది. ఊపిరితిత్తులు ఈ కార్బన్ డయాక్సైడ్‌ని స్వీకరించి 'నిశ్వాసము'లో ముక్కు ద్వారా బయటికి పంపేస్తుంది. అలాగే ముక్కు ద్వారానే ఆక్సిడేషన్‌కి అవసరమయ్యే ఆక్సిజన్ కూడా లోపలికి వెళ్తుంది. దీనిని, 'ఉచ్ఛ్వాసము' అంటారు. అంటే ఉచ్ఛ్వాసం ద్వారా ఆక్సిజన్ లోపలికి, నిశ్వాసము ద్వారా కార్బన్‌డయాక్సైడ్ బయటికి వెళ్తుందన్న మాట.

ముక్కు లోపల ప్రారంభంలో కొంత భాగం మాత్రమే చర్మపు లైనింగ్‌లో వుంటుంది. మిగిలిన భాగమంతా 'మ్యూకస్ మెంబ్రేన్' వుంటుంది. చర్మపు అంచులోనే వెంట్రుకలు. మెదడుకి సంబంధించిన రక్తనాళాలు వుంటాయి. ఈ వెంట్రుకలు మనం పీల్చేగాలిలో దుమ్ము ధూళి కణాలుంటే అడ్డుకుని ఆపేస్తాయి. శుభ్రమైన గాలినే లోపలికి పోనిస్తాయి. ముక్కులోపల వుండే మ్యూకస్ మెంబ్రేన్‌లో సీలియా అనే వెంట్రుకలుంటాయి. ఇవి కూడా దుమ్ము ధూళి గాలితో లోపలికి పోకుండా అడ్డుకొంటూ వుంటాయి. మ్యూకస్‌గ్లాండ్లు మనం పీల్చేగాలిని చెమ్మగా వుంచడానికి తోడ్పడతాయి. ముక్కుకి రెండు వైపులా సైనస్‌లలో వేడిగాలి వుంటుంది. అంటే మనం పీల్చేగాలిని పరిశుభ్రం చేసి లోపలికి పంపడమే కాకుండా అలా లోపలికి వెళ్లే గాలి వెచ్చగానూ, తేమగాను కూడా అవసరాన్ని బట్టి తగు విధంగా వుండేలా చూసే బాధ్యత కూడా ముక్కుదే! అందుకే ఈ గాలి ఫేరింగ్స్ ద్వారా శ్వాసపేటికకు,అక్కడ నుంచి ట్రేకియా అనే శ్వాసనాళంలోకి వెళ్తుంది. నోటితో పీల్చే గాలి కూడా ఫేరింగ్స్ ద్వారా శ్వాసపేటిక, శ్వాసనాళంలోకి వెళ్లే ఏర్పాటుంది. అందుకే ముక్కుతోనే కాదు నోటితో గాలి పీల్చినా లోపలికి వెళ్తుంది. కాకపోతే గాలిని పరిశుభ్రం చేసే నిర్మాణం ముక్కులోనే వుంది. అందుకని నోటితో గాలి పీల్చడం మంచి అలవాటు కాదు. ఈ విషయాన్ని గట్టిగా గుర్తుంచుకోవాలి అంటారు ఆషిష్ బి. బోఘాని. ఈయన చెస్ట్ స్పెషలిస్టు.

డాక్టర్ ఆషిష్ బి.బోఘాని



శ్వాసనాళము చెస్ట్‌లోకి వెళ్లిన తర్వాత రెండు భాగాలుగా చీలి శ్వాసనాళికలు రెండు వేపులకు రెండు ఊపిరితిత్తులలోకి వెళ్తాయి. ఒక్కో శ్వాసనాళిక ఊపిరి తిత్తుల లోపల ఎన్నో శాఖలుగా చీలి, లోపలంతా విస్తరిస్తుంది. ఒక్కో శాఖ ఆల్వియోలస్ అనే చిన్న చిన్న బుడగలలో అంతమవుతుంది. ఇవి గాలి సంచులు. ఆల్వియోలస్ గోడలు చాలా పల్చగా వుంటాయి. అన్ని ఆల్వియోలైల చుట్టూ అంతకన్నా సన్నని గోడలుకల కేపిలరీలు అనే సూక్ష్మరక్తనాళాలతో ఏర్పడిన వల వుంటుంది. అస్మోసిస్ ద్వారా కార్బన్‌డయాక్సైడ్ సూక్ష్మరక్తనాళాలలో నుంచి ఆల్వియోలైలోకి, ఆక్సిజన్ ఆల్వియోలై నుంచి సూక్ష్మ రక్తనాళాలలోకి మారతాయి. ఆక్సిజన్‌తో కూడిన ఆ రక్తము అక్కడి నుంచి గుండెద్వారా శరీరంలోని అన్ని భాగాలకి వెళ్తుంది. కార్బన్ డయాక్సైడ్ ఊపిరితిత్తులలో నుంచి శ్వాసనాళము ద్వారా ముక్కుకి అక్కడ నుంచి బయటికి నిశ్వాసము ద్వారా వెళ్లిపోతుంది.

ఊపిరితిత్తుల నిర్మాణం

ఆల్వియోలై వ్యాపించబడి వుండే శ్వాసాంగములు అంటే ఊపిరితిత్తులు వక్ష కుహరంలో రెండు వైపులా, నావరాయి రంగులో వుంటాయి. వీటి మధ్య గుండె వుంటుంది. శ్వాసాంగాలు జములు మడత గల నునుపైన రెండు పొరలతో కమ్మబడి వుంటాయి. వీటిని ప్లూరాలు అంటారు.

ఈ రెండు పొరల మధ్య వున్న ఖాళీ శ్వాసాంగాలు పెద్దవి చిన్నవీ అవుతున్నప్పుడు పరిసర భాగాలతో ఊపిరితిత్తులకు రాపిడి ఏర్పడకుండా కాపాడతాయి. ప్లూరాలు ఇన్‌ఫ్లేమ్ కావడమే 'ప్లూరసీ'! ఊపిరితిత్తులు రెండు మూడు లోబులుగా వుంటాయి. ప్రతీలోబులోను బ్రాంకస్ శాఖలు వ్యాపించి ఆల్వియోలైతో అంతమై వుంటాయి. వీటి చుట్టూ సూక్ష్మరక్త నాళాలు కమ్మి వుంటాయి. శ్వాసక్రియ ఇక్కడ జరుగుతుందన్నమాట.

"వక్షాన్ని, పొట్టనుంచి వేరు చేస్తూ డయాఫ్రమ్ అనే కండరం వుంది. ఇది అర్ధగోళాకృతిలో వుంటుంది. దీని కండరాలు సంకోచించగానే డయాఫ్రమ్ ఫలాకారములోకి వస్తుంది. అప్పుడు వక్షగహ్వర ఘనపరిమాణము పెరుగుతుంది. ప్రక్కటెముకల మధ్యవుండే కండరాలు సంకోచించి అవి పైకి లేవడంతో వక్షము పెద్దదవుతుంది. అందువల్ల ఏర్పడిన ఖాళీని ఊపిరితిత్తులు గాలితో పూరిస్తాయి. ఇది ఉచ్ఛ్వాసము. డయాఫ్రమ్, ప్రక్కటెముకల కండరాలు వ్యాకోచించడంవల్ల వక్షగహ్వరము చిన్నదవుతుంది. అప్పుడు ఊపిరితిత్తులలోని గాలి బయటికి పోతుంది. ఇది నిశ్వాసము అంటే ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు జరగడానికి ప్రధాన కారణం డయాఫ్రమ్ (ఉదర వితానము) అన్నమాట! నిశ్వాసములో కార్బన్ డయాక్సైడ్‌తో పాటు నీరు వెలుపలికి వస్తుంది. ఉచ్ఛ్వాస, నిశ్వాసాల్ని కలిపి శ్వాసక్రియ అంటారు. నిమిషానికి 17, 18 సార్లు శ్వాసక్రియ జరుగుతుంది.

ఈ వివరాలతో పాటు ఊపిరితిత్తుల గురించి మరెన్నో విషయాలు చెప్పారు డా. ఆషిష్. "మామూలుగా నిశ్వాసము జరిగిన తర్వాత శ్వాసాంగములో (- ఊపిరితిత్తులలో)" 3000 ఘ.సెం.మీ. గాలి మిగిలిపోతుంది. మనిషి ఉచ్ఛ్వాసములో 500 ఘ. సెం.మీ. గాలిని లోపలికి పీలుస్తాడు. అందులో 150 ఘ. సెం.మీ. ముక్కు, గొంతు, శ్వాసనాళములలో మిగిలిపోయి 350 ఘ.సెం.మీ. మాత్రమే ఊపిరితిత్తులలోకి ప్రవేశిస్తుంది.

దీర్ఘ ఉచ్ఛ్వాస, నిశ్వాసాల అభ్యాసం మంచిది !

దీర్ఘనిశ్వాసలో 1500 ఘ.సెం.మీ. గాలి మాత్రమే ఊపిరితిత్తులలో వుండిపోతుంది. వెంటనే దీర్ఘ ఉచ్ఛ్వాసము తీసుకుంటే 3500 ఘ.సెం.మీ. గాలి ఊపిరితిత్తులలోకి చేరుతుంది. ఇలా దీర్ఘంగా ఊపిరిపీల్చి విడవడం వల్ల సాధారణ శ్వాసాంగంలో వాయువ్యాపన 8,10రెట్లు అధికం చేయవచ్చు. ఆరోగ్య రీత్యా అందరూ దీర్ఘ ఉచ్ఛ్వాస నిశ్వాసాలను నిత్యము అభ్యసించడం మంచిది.



బ్రాంకోస్కోపి సాయంతో శ్వాసకోశ వ్యాధుల్ని పసికట్టవచ్చు.

ముందుశ్వాసకిసంబంధించిన బాధ్యత, భాగాల్నిబట్టి మామూలుగా కలిగే లక్షణాల గురించి తెలుసుకుందాం!

దగ్గు: దగ్గు క్రిమిదోషం వల్ల, యాంత్రికమైన ఇరిటేషన్ వల్ల వచ్చే రిఫ్లెక్స్. ఇది తీవ్రంగాను, దీర్ఘంగాను, కూడా రావచ్చు. లేరింజైటిస్, బ్రాంకైటిస్, న్యూమోనియా, బ్రాంకోన్యుమోనియా మొదలైన వ్యాధులొచ్చినప్పుడు దగ్గు తీవ్రంగా వుంటుంది. దీర్ఘమైన లేరింజైటిస్‌లోను, దీర్ఘమైన బ్రాంకైటిస్‌లోనూ, బ్రాంకయెక్టసిస్‌లోనూ, శ్వాసాంగ క్షయలోనూ దగ్గు దీర్ఘంగా వస్తుంది. దగ్గు కళ్ళె లేకుండా పొడిదగ్గుగాను, కళ్లెతో తడిదగ్గుగాను వస్తుంటుంది.

నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో పని చేస్తున్న ఆషిష్ పాఠకులకు ఊపిరితిత్తుల గురించి బాగా తెలియడానికి మరికొన్ని విషయాలు చెప్పారు. అవి-

కళ్లె: ఇది తెల్లగానో, పచ్చగానో, చీముతో కూడినదిగానో వుంటుంది. క్షయ వ్యాధి వస్తే కళ్లెలో రక్తపు జీరలు కనిపిస్తాయి.

రక్తవాంతి: రక్తం దగ్గులో పడితే ముందు అది శ్వాసాంగాలనుంచి వస్తోందో, కడుపులో నుంచి వాంతిగా వస్తోందో గమనించాలి. శ్వాసకోశం నుంచి వచ్చే రక్తం ఎర్రగా వుంటుంది. అందులో నురుగు కూడా వుండవచ్చు. రక్తం వాంతి ఎక్కువగా వుండవచ్చు, తక్కువగా వుండవచ్చు. రక్తవాంతి క్షయ, బ్రాంకయెక్టసిస్, శ్వాసాంగాల కేన్సర్ మొదలయిన అనారోగ్యాలు కలిగినప్పుడు ఎక్కువగా వుంటుంది. మైట్రల్ స్టినోసిస్ అనే గుండెజబ్బు వచ్చినా కూడా రక్తం వాంతి అవుతుంటుంది.

పొగని త్రాగడ మంటే మన ఆరోగ్యాన్ని మనం త్రాగేయడమే



ఊపిరితిత్తుల ప్రాంత బాధ: వక్షం ప్రాంతంలో ఏ మాత్రం వత్తిడి తగిలినా ఒక్కోసారి బాధ ఎక్కువగా వుంటుంది. ప్లూరసీ వచ్చినప్పుడు ఆ బాధ ఎక్కువగా వుంటుంది. ఊపిరి పీల్చినప్పుడల్లా కూడా ఆ బాధ చాలా ఎక్కువగా వుంటుంది. కొరనరీ ఆర్టరీ వల్లకూడా వక్షంలో బాధ రావచ్చు. ఇది హార్ట్ అటాక్‌కి దారితీస్తుంది.

అయాసము: ఊపిరి పీల్చడం కష్టమవుతుంటే దానిని అయాసము అంటారు. పరాయి వస్తువులు శ్వాసనాళంలో అడ్డం పడినప్పుడు, డిఫ్తీరియాలో మెంబ్రేన్ ఏర్పడడం వల్ల గొంతు పిసికినప్పుడు, శ్వాసనాళంలో నంజు ఏర్పడినప్పుడు ఊపిరి పీల్చడం ఇబ్బందై అయాసం వస్తుంది. న్యుమోనియా, బ్రాంకోన్యుమోనియా మొదలయిన అనారోగ్యాలొచ్చినా ఆయాసము ఎక్కువగా వుంటుంది. శ్వాసకోశ అనారోగ్యాలొస్తేనే కాక హృద్రోగాలలోను, మూత్రాంగ రోగాలలో కూడా అయాసం రావచ్చు.

అందుకని వక్ష ఎక్స్‌రేతో పాటు కళ్లె పరీక్షతోను, శరీర పరీక్షతోనూ, ఏ శ్వాసకోస వ్యాధితో బాధపడుతున్నది తెలుసుకోవచ్చు- అంటూ ఆషిష్ జలుబు, శ్వాసకోశ వ్యాధులన్నింటి గురించి వివరించారు.

జలుబు: మొదటి దశలోనే దీనికి సరయిన జాగ్రత్తలు తీసుకోకపోతే గొంతు నొప్పి, బ్రాంకైటిస్ మొదలైన శ్వాసనాళ వ్యాధులకీ దారితీయవచ్చు. జలుబు వల్ల ముక్కులోను, శ్వాసనాళంలోను ఇన్‌ఫ్లమేషన్ ఏర్పడుతుంది. వైరస్ కారణాన, అలర్జీ వల్ల జలుబు రావచ్చు. వైరస్ వల్ల కలిగే జలుబు ముక్కు, గొంతు, నోరు నుండి బయటికి వెలువడే వాయువులు, తుంపర్లు మొదలయిన వాటివల్ల ఒకళ్ల నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. అందుకని ఎక్కడపడితే అక్కడ చీదడం, ఉమ్మేయడం మంచిదికాదు. దగ్గు వచ్చినప్పుడు నోటికి అడ్డంగా. ఏ కర్చీఫో పెట్టుకోవడం మంచిది. ఇది కనీస సభ్యత, అందరూ గుర్తుంచుకోవలసిన ముఖ్యమైన విషయం.

ఒక్కోసారి దుమ్ము, పొగ, కొన్ని వాసనలు మొదలయినవి పడక అలర్జీవల్ల జలుబురావచ్చు. ఈ పరిస్థితులకు, పదార్థాలకు దూరంగా వుండడం మంచిది.

ముక్కువెంట వట్టి నీరే వస్తే పెద్ద భయపడాల్సింది ఏమీ లేదు. ఆ జలుబు ఏ వైరస్ కారణానో వచ్చినట్లు! అలర్జీ

ఊపిరితిత్తుల వ్యాధులు

కలిగినప్పుడు తుమ్ములు, నీళ్ళు కారడం కూడా ఆ పరిస్థితులకు దూరమైనప్పుడు తగ్గిపోతాయి. అలా కాకుండా ముక్కు నుంచి చీము వస్తూ గొంతు బొంగురు పోతే వెంటనే డాక్టర్‌కి చూపించాలి. కొద్దిపాటి జ్వరము కూడా రావచ్చు. హృద్రోగము, శ్వాసకోశ వ్యాధులు వున్నప్పుడు జలుబు ప్రమాదకరంగా పరిణమించవచ్చు. జలుబు రాగానే బాగా గాలివచ్చే ప్రదేశంలో వుంటూ పిల్లలకు, వృద్ధులకు దూరంగా వుండాలి. వైరస్ వల్ల కలిగే జలుబుకి మందులు వాడడం దండగ. దానంతటదే తగ్గుతుందిగాని, మందులవల్ల తగ్గదు. "అంటూ వీటితోపాటు మరికొన్ని శ్వాసనాళ, శ్వాసకోశ అనారోగ్యాల్ని వివరించారు డా. ఆషిష్."


బ్రాంకైటిస్

తీవ్రమైన బ్రాంకైటిస్‌లో తలనొప్పి, గుండెనొప్పి, కళ్ళె, దగ్గు లేక పొడిదగ్గు వుంటాయి. దీర్ఘమైన బ్రాంకైటిస్‌లో బాధాకరమైన దగ్గు, కళ్ళె కూడా పడుతుండవచ్చు. ఈ జబ్బు బ్రాంకో న్యుమోనియా వంటి వ్యాధులకూ దారి తీయవచ్చు. అందుకని ఈ పరిస్థితుల్లో డాక్టర్‌కి చూపించడం ఎంతో అవసరం. సల్ఫా మందులు, యాంటిబయాటిక్కులు డాక్టర్ సలహామీదే వాడాలి.

బ్రాంక ఎక్టసిస్:

శ్వాసనాళాల విస్తరణని బ్రాంక ఎక్టసిస్ అంటారు. క్రిమిదోషాల వల్ల, శ్వాసనాళాంతర పీడన శక్త్యాధిక్యత వల్ల ఈ జబ్బు రావచ్చు. దగ్గు, దుర్గంధముతో కూడిన కళ్ళె పడడం, ఆయాసము, రక్తం వాంతి ఈ వ్యాధి లక్షణాలు. ఊపిరితిత్తుళలో పేరిన కళ్ళె బయటకు పంపడం అవసరం.

ఎక్స్‌రే సాయంతో ఊపిరితిత్తుల అనారోగ్యాల్ని తెలుసుకోవచ్చు



ఫెరింజైటిస్

గొంతు ఇన్‌ఫ్లేమ్ కావడం ఫెరింజైటిస్. జలుబుకి కారణాలే ఇందుకూ కారణం. మింగడం కష్టమై గొంతు పొడి అరిపోవడం, గొంతులో దురదలక్షణాలు బాగా ఎక్కువైతే గొంతు బాధతో మింగడం కూడా కష్టమైపోతుంది. నిస్త్రాణము, జ్వరము వస్తాయి. తడిలో నానడము, చలిగాలి, శ్వాసకోశమును ఇరిటేట్ చేసే పొగలు పీల్చడం, అతిగా మాట్లాడడం తగ్గించాలి. వెంటనే చికిత్స తీసుకోకపోతే ఈ ఇన్‌ఫెక్షన్ క్రమంగా శ్వాసకోసానికి వ్యాపించవచ్చు. ఇలాగే శబ్దపేటికకి ఇన్‌ఫ్లమేషన్ వస్తే లేరింజైటిస్ అంటారు. ట్రేకియా అంటే శ్వాసనాళానికి ఇన్‌ఫ్లమేషన్ వస్తే 'ట్రాకియైటిస్' అంటారు. వీటన్నింటిలో ధూమపానము నిషిద్ధము. గొంతు నెప్పికి డిఫ్తీరియా కారణం కావచ్చు. అందుకని పిల్లలలో గొంతునెప్పి వస్తే వెంటనే డాక్టరికి చూపడం మంచిది.

ఇన్‌ఫెక్షన్స్ వల్లే ట్యూబర్క్యులోసిస్, న్యూమోనియా వస్తాయి.

ట్యూబర్క్యులోసిస్

నెమ్మదిగా ఇది శ్వాసకోశాన్ని దెబ్బతీస్తుంది. మైకోబాక్టీరియమ్ ట్యుబర్క్యులోసిస్ అనే సూక్ష్మజీవులు గాలిలో ఊపిరితిత్తులలోకి ప్రవేశించడం వల్ల ఈ అనారోగ్యము కల్గుతుంది. లోపలికి వెళ్ళి ఈ సూక్ష్మజీవులు అల్వియోలైలని నాశనం చేస్తాయి. కణాలని చంపేస్తాయి. ముందు ఊపిరితిత్తులు పైభాగంలో ఈ వినాశనం ప్రారంభమవుతుంది. చనిపోయిన కణాల భాగాన్ని ట్యూబర్కిల్ అంటారు. ఈ ట్యూబర్కిల్స్ క్రమంగా పెరగడం వల్ల ఊపిరితిత్తులలోపల ఖాళీలు ఏర్పడతాయి. శ్వాస కష్టమవుతుంది. మొదట్లో పొడి దగ్గు వస్తుంది. తర్వాత కళ్ళె, చివరికి రక్తం పడుతుంది. కొద్దిపాటి జ్వరం

వుంటుంది ఆకలి వుండదు. బరువు తగ్గుతుంటుంది. ట్యూబర్క్యులోసిస్ వ్యాధిని ఎక్స్‌రే, కళ్ళె పరీక్షలు, బరువు తగ్గడంతో కనుక్కోవచ్చు. స్ట్రెప్టోమైసిన్, రిఫామ్పిసిన్, ఎంత్రాంబుటాల్ మొదలైన 13 రకాల మందుల్ని టి.బి.కి వాడతారు. ఏడాదిన్నర లేక రెండేళ్ళు వాడితేగాని వ్యాధినయంకాదు. అనుమానం రాగానే ప్రారంభ దశలోనే డాక్టర్‌కి చూపించి, సరయిన చికిత్సని పొందడం ముఖ్యం. మెడలో బయటికి వాపు కనిపిస్తే టి.బి. లింఫాడెంటిస్ రావచ్చు. మెదడుకి క్షయ మెనాజైటిస్ రావచ్చు. ఎముకలకి, ఆహారనాళానికి (ట్యూబర్క్యులోసిస్) క్షయ రావచ్చు.

ప్లూరసి

ఊపిరితిత్తుల్ని, కమ్మి వుండే రెండు రకాల పొరల మధ్య ఇన్‌ఫెక్షన్‌తో 'ప్లూరల్ ఫ్లూయిడ్' అనే ద్రావకం ఏర్పడడాన్ని 'ప్లూరసి' అంటారు. ఇదీ బాక్టీరియా వల్లే వస్తుంది. ఈ ద్రావకం వల్ల ఊపిరితిత్తులు నొక్కివేయబడతాయి. శస్త్ర చికిత్స చేసి ఈ ద్రావకాన్ని తీసివేయడమే చికిత్స. జ్వరం బాగా వస్తుంది. పొడిదగ్గు వస్తుంటుంది. చెస్ట్ నొప్పి, బరువు తగ్గడం, ఆకలిలేకపోవడం మిగతా లక్షణాలు. ఈ అనారోగ్యం వస్తే ఊపిరిపీల్చడం కష్టమైపోతుంటుంది. ఎక్స్‌రే సాయంతో ఈ అనారోగ్యాన్ని పసిగట్టవచ్చు.

న్యుమోనియా: డిప్లోకోకస్ న్యూమోనియా, స్టాఫిలోకోకస్ మొదలయిన బాక్టీరియాల కారణాన న్యుమోనియావస్తుంది. న్యుమోనియా ఇన్‌ఫెక్షన్ వల్ల అల్వియోలై దెబ్బతిని ఊపిరితిత్తులలోపల 'కేవిటీస్'(ఖాళీలు) ఏర్పడతాయి. ఇవి సాధారణంగా ఊపిరితిత్తుల మధ్య, లేక క్రింద ఏర్పడతాయి. వీటిలో చీము కూడా ఏర్పడుతుంది. ఎక్కువ జ్వరం, కళ్ళెతో దగ్గు, చెస్ట్ పెయిన్ న్యుమోనియా లక్షణాలు. ఎక్స్‌రే, కళ్ళెపరీక్షలతో ఈ అనారోగ్యాన్ని పసిగట్టవచ్చు. యాంటిబయాటిక్స్, పెన్సిలిన్, యాంపిసిలిన్ మొదలయినవి వాడడం వల్ల ఈ అనారోగ్యాన్ని అరికట్టవచ్చు. ప్రక్కకి వంచి ట్రేకియా ద్వారా ఈ చీమును బయటికి వంచేయవచ్చు.

ఆస్థ్మా: శ్వాసనాళములో వుండే కండరాలు దుస్సంకోచం పొంది, వాటి ద్వారము సన్నగిల్లి, శ్వాసనాళములోపల పొరగా వుండే మ్యూకస్‌మెంబ్రేన్ ఉబ్బడం వల్ల ఆయాసం వస్తుంది. దీన్ని బ్రాంకైల్ ఆస్థ్మా అంటారు. దగ్గుతో పాటు పిల్లి కూతలులా వస్తాయి. శ్వాసనాళం బాగా సన్నబడిపోతుంది కాబట్టి దాంట్లోంచి గాలి వెళ్తున్నప్పుడు పిల్లి కూతలు లాంటి శబ్దాలు వస్తుంటాయి. ఊపిరి పీల్చడం కష్టమవుతుంది. శ్వాసనాళము హైపర్ సెన్సిటివ్‌గా వుండడం వల్ల ఇలా ముడుచుకుపోతుంటుంది. పల్మోనరి ఫంక్షన్ పరీక్ష సాయంతో ఈ అనారోగ్యాన్ని పసిగట్టవచ్చు. ఆస్థ్మాని అందరికీ పూర్తిగా తగ్గించేయడానికి వీలుపడకపోవచ్చు కానీ తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రం వెంటనే కలిగించవచ్చు.


కాన్సర్: బాగా పొగ త్రాగడం వల్ల, కలుషితమైన గాలి పీల్చడం వల్ల ఊపిరితిత్తుల కాన్సర్ వస్తుంది. కళ్లెతోగాని, రక్తంతోగాని దగ్గు, ఆకలి దానితోపాటు బరువు తగ్గిపోవడం, చెస్ట్ పెయిన్ కాన్సర్ లక్షణాలు. ఫైబర్ ఆప్టిక్ బ్రాంకోస్కోపి సాయంతో లోపల చూసి కాన్సర్‌ని పసిగట్టవచ్చు. శస్త్రచికిత్స, రేడియోథెరపి, కీమోథెరపిలతో చికిత్స చేయవచ్చు.

వృత్తిద్వారా కలిగే అనారోగ్యాలు

ఆస్బెస్టాస్ కంపెనీ, బొగ్గుగనులు, వస్త్ర పరిశ్రమ, పంచదార పరిశ్రమ, వ్యవసాయం చేసే వాళ్ళకు రకరకాల దుమ్ము కణాలు గాలిలో కలసి ముక్కు ద్వారా ఊపిరితిత్తులలోకి ప్రవేశించి అనారోగ్యాన్ని కలిగించవచ్చు. అందుకని ఈ పరిశ్రమలలో పనిచేసే వారు దుమ్ముకణాల్ని లోపలికి పీల్చకుండా ముక్కుకి అడ్డంగా మాస్క్‌లు లాంటివి కట్టుకుని జాగ్రత్తపడాలి. తరచూ డాక్టర్‌కు చూపించుకుని పరీక్షల ద్వారా ఊపిరితిత్తులకు ఏవైనా హాని కలుగుతోందేమో తెలుసుకుని, తగు జాగ్రత్తలు తీసుకుంటూ వుండాలి.

ఈ విషయాలన్నీ చెప్పిన తర్వాత డాక్టర్ ఆషిష్ పొగత్రాగేవారిని మరీ మరీ హెచ్చరించారు.

"పొగత్రాగడం చాలా హానికరం. దీనివల్ల శ్వాసనాళానికి, ఊపిరితిత్తులకు కూడా ఎంతో హాని జరుగుతుంది. నోటి ద్వారా పీల్చే పొగలోని విషపదార్థాలు సరాసరి ఊపిరితిత్తులలోకి చేరతాయి. అపరిశుభ్రమైన గాలి కూడా ఫిల్టర్ కాకుండా నోటిద్వారా ఊపిరితిత్తులలోకి వెళ్తుంది.




ఊపిరితిత్తుల పనితీరుని క్షుణ్ణంగా తెలిపే ఆధునిక పరికరం

శ్వాసనాళం, స్వరపేటికలకు కూడా ఈ పొగవల్ల ఇరిటేషన్ కలుగుతుంటుంది. కేవలం ఊపిరితిత్తులకు, శ్వాసనాళానికే కాదు గుండెకు కూడా పొగత్రాగడం హానికరం. పొగత్రాగే వాళ్ళు సిగిరెట్టు లేక బీడీలతో పాటు తమ ఆరోగ్యాన్ని తగులబెట్టుకుంటున్నామనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. తెలిసి తెలిసి ఈ అలవాటుకి బానిసకావడం చాలా తెలివితక్కువపని" అంటున్నారు డాక్టర్ ఆషిష్ బి. బోఘాని.

కాబట్టి పొగత్రాగేవాళ్ళూ! ఈ విషయాలన్నింటినీ మరోసారి మననం చేసుకుని మీ అలవాటుకి స్వస్తి పలకడం మంచిది.

-వేదగిరి రాంబాబు

ఫొటోలు: వై. భీమారావు.



లవ్ గేమ్

సీరియల్

చల్లా సుబ్రహ్మణ్యం

(గత సంచిక తరువాయి)

జరిగిన కథ: 1 పెళ్లయిన భార్యా భర్తలు ఆనంద లోకాల్లో విహరించే మధురాతి మధురమైన తొలిరోజు అనుభవాలను ఊహించుకుంటూ తన నవ్యతో పాటిని చవిచూడాలని లండన్ నుంచి వస్తాడు స్వాగత్. జీవితంలో కొత్త రహస్యాలు తెలుసుకునే ఆ తొలి రోజున భార్య నవ్య నుంచి ఊహించలేని వ్యతిరేకత ఎదురైన స్వాగత్ ఖిన్నుడవుతాడు.

ఒక్క క్షణం అతని కేమయిందో అతనికే అర్థం కాలేదు.

మనసు మొద్దుబారి–

తన ఉనికిని మర్చిపోయి–

శిలా ప్రతిమలా నిలబడిపోయాడు

కొన్ని క్షణాలు నిశబ్దంగా– బరువుగా గడిచిపోయాక– ఆశ్చర్యంతో– "నవ్యా!" అన్నాడు స్వాగత్.

"షటప్! యూ చీట్! నా పేరు ఉచ్చరించే అర్హత కూడా నీలాంటి దుర్మార్గుడికి లేదు. ఎంత అందంగా నాటకమాడి నన్ను నీదాన్ని చేసుకున్నావ్?"

ఆవేశంతో రొప్పుతూ అంది నవ్య.

ఆమె మాట్లాడేదేమిటో అతని కర్థం కాలేదు చిన్నగా నవ్వి–

'నువ్వేం మాట్లాడుతున్నావో నీకు తెలుసా?' అన్నాడు

అతని నవ్వును చూసి మరింత ఆవేశంతో వణికిపోయింది నవ్య

అమాయకంగా నటించకు నీ నాటకాలన్నీ నాకు తెలుసు చీ! పవిత్రమైన మాంగల్యాన్ని అపవిత్రం చేసి– అపహాస్యం చేసిన నిన్ను మనిషిగా గుర్తించడానికే నా మనసు అంగీకరించడం లేదు

"నవ్యా! ఏమిటి నువ్వంటున్నది? నిన్ను పెళ్ళి చేసుకోవడం నాటకమెలా అవుతుంది?" ఆశ్చర్యంగా అన్నాడు

"అందర్నీ– నువ్వేదో మంచివాడినని నమ్మించగలవేమో గానీ– నీ నిజస్వరూపం తెలిసిన నన్ను మాత్రం నమ్మించలేవు–"

"అంటే నీ ఉద్దేశం?" అతనికి పరిస్థితి కొంత అర్థమైంది.

"నా ఉద్దేశం కాదు మిస్టర్! మేక్ లవ్ టు ఎవ్రీ గర్ల్ యు మీట్ ఈవెన్ ఇఫ్ ద రిటర్న్ ఈజ్ ఒన్ పర్సెంట్ ఇట్స్ గుడ్ ఇన్వెస్ట్‌మెంట్ అన్నది నీ జీవన సూత్రం– మర్చిపోయావా?" కళ్ళు నిప్పులు కక్కుతుండగా అంది

అతను నిశ్చేష్టుడయ్యాడు.

గతాన్ని వర్తమానానికి అన్వయించుకోడానికి కొన్ని క్షణాలు పట్టిందతనికి

ఆ తర్వాత నెమ్మదిగా అన్నాడు స్వాగత్

"అదెప్పటి మాట నవ్యా? ఎప్పుడో సరదాగా అన్నదాన్ని ఈ సమయంలో గుర్తు చేస్తున్నావా?"

"సరదాగా కాదు మనసా వాచా కర్మణః ఆచరించి చూపావ్ ఎందరో అమ్మాయిల జీవితాలతో ఆడుకుని – వాళ్ళలో నన్ను ఒకదాన్ని చేయాలనుకుని– వల వేశావ్ గెలిచానని మురిసిపోతున్నావేమో– పదిమంది ముందు నా మెడలో తాళి కట్టినా– నీకు నేను ఎప్పటికీ – ఏనాటికీ భార్యను కాను– గుర్తుంచుకో!"

"భార్యగా మారిపోయి– అన్నిటికీ సిద్ధపడే ఈ గదిలోకి వచ్చానని నువ్వూ మర్చిపోకు!" అన్నాడతను

"ఛీ! నీలాంటి ఫెల్తీ ఫెలోతో నేను కాపరం చేయడమా! థూ" అసహ్యంతో నిలువునా వణికిపోయింది

"నవ్యా!" విసురుగా అన్నాడతను

"ఆవేశంతో నువ్వేం మాట్లాడుతున్నావో నీకర్థం కావడంలేదు నేను చేసిన తప్పు నిన్ను పెళ్ళిచేసుకోవడమే అయితే- అది తప్పు కాదని నా అంతరాత్మకు తెలుసు" అంటూ విసురుగా ఆమె దగ్గరకొచ్చాడు

"ఆగు! నీలాంటి వంచకుడికి అంతరాత్మ కూడా ఉంటుందా మిస్టర్ స్వాగత్ ఆ అంతరాత్మే నీలో ఉంటే నా బ్రతుకు ఇలా తగలడేదే కాదు-"

అంటున్న ఆమె కంఠం రుద్ధమైంది

అతని మనసు ఆర్ద్రమైంది నెమ్మదిగా ఆమె దగ్గరకొచ్చి- "ప్లీజ్! ఆవేశపడకుండా ఒక్కసారి ఆలోచించు నవ్యా! జీవితాంతం కలిసి ఉండాల్సిన వాళ్ళం జీవితంలో ఎన్నో మజిలీలు చెయ్యాల్సిన వాళ్ళం మొదటి మజిలీనే ఇంత భయంకరంగా చేసుకుంటే భవిష్యత్తెలా ఉంటుందో ఆలోచించు" అనునయంగా అన్నాడు.

వెర్రి ఆవేశంతో కలలు కనకు నీతో నా జీవితాన్ని పంచుకోవలసిన ఖర్మ- దుర్గతి నాకు పట్టలేదు అంతగా ఆ అవసరమే నాకొస్తే ఇంత విషం మింగి చావనైనా చస్తాను గానీ- నీ నీడన బ్రతికే దౌర్భాగ్యాన్ని

మాత్రం కోరుకోను-'' అతన్నుంచి దూరంగా జరుగుతూ అందామె

అతను విసురుగా వెళ్ళి ఆమె చేతిని పట్టుకుని అడిగాడు-

''అదే నీ నిర్ణయమైనప్పుడు- అసలు పెళ్ళెందుకు చేసుకున్నావ్?''

అప్పుడు చూసిందామె అతని కళ్ళలోకి.

ఆ కళ్ళలో రగులుతున్న ద్వేషాన్నీ- కసినీ- అసహ్యాన్నీ గమనించిన స్వాగత్ అప్రతిభుడయ్యాడు.

ఓ స్త్రీ తన కళ్ళతో అంతటి ద్వేషాన్ని కురిపించగలదని అతను ఊహామాత్రంగానైనా అనుకోలేదు

విసురుగా అతని చేతిని విదిలించేసి-

''ఈ పెళ్ళెందుకు చేసుకున్నానో చెప్పనా? నువ్వు కోటీశ్వరుడివని కాదు నీ దివ్య మంగళ రూపాన్ని చూసి కాదు ఫారిన్ రిటర్న్ వ్యక్తికి పెళ్ళాన్నని గర్వంగా చెప్పుకోవాలనీ కాదు లేక మహత్తర ఆశయాలతో ఆదర్శమైన మనిషిగా వెలిగిపోతున్నావని కాదు- బట్-'' ఆవేశంతో ఓ క్షణం ఆగి అందామె-

''మా మధ్యతరగతి జీవితంలోకి ప్రవేశించి- సగటు మనిషైన మా నాన్నను కట్నం తీసుకోనని ప్రలోభపెట్టి- నీ పంతం నెరవేర్చుకోవడానికి- మా నాన్న బలహీనతను పెట్టుబడిగా నీ మేనమామ భాగ్యరాజ్‌ను అడ్డంపెట్టుకుని మమ్మల్ని మాయ చేశావ్

నిన్ను చేసుకోకపోతే- మా అమ్మ నూతిలో పడి చస్తాననందుకూ- మా నాన్న గొంతు కోసుకుని ఆత్మహత్య చేసుకుంటా నన్నందుకూ- అయినవాళ్ళంతా పట్టుపట్టి- కుటుంబ గౌరవం కోసం- వంశ ప్రతిష్ఠ కోసం- నిన్ను చేసుకొమ్మని బలవంతం చేసినందుకూ అందుకు చేసుకున్నాను మిస్టర్ స్వాగత్?' అండర్‌స్టాండ్?''

''కానీ కానీ నేనే దురుద్దేశ్యంతో నిన్ను చేసుకోలేదు నవ్యా మనస్ఫూర్తిగా ప్రేమించి-ఆరాధించి- నిన్ను చేసుకున్నాను'' బాధగా అన్నాడు స్వాగత్

''ప్రేమా?'' ఆమె నవ్వింది

నీకు ప్రేమ?

ఆమె విరగబడి నవ్వింది

తెరలు తెరలుగా నవ్వింది నవ్వి నవ్వి క్రమంగా ఆ నవ్వు దుఃఖంగా మారి- దుఃఖం ఆవేశంగా పరిణామం చెంది- కోపంగా వెళ్ళి అతని షర్టు పట్టుకుని- ''ప్రేమ అనే పదాన్ని నీ నోటితో ఉచ్ఛరించి దాన్ని అపవిత్రం చేయకురా రాస్కెల్' దయ్యాలు వేదాలు వల్లించడం నీ దగ్గరే చూస్తున్నాను నీకు తెలిసిందీ- నీ జీవితంలో నువ్వు అనుభవించిందంతా ప్రేమకాదు- వ్యామోహం ఆకర్షణ- కామం- ఇట్స్ నథింగ్ బట్ లస్ట్



దట్సాల్!"

అతను మాట్లాడలేదు.

ఆమెనే చూస్తున్నాడు.

రెండు చేతుల్తో ముఖం కప్పుకుని- మంచం మీద కూర్చుని కుమిలి కుమిలి ఏడుస్తున్న ఆమెను చిత్తరువులా నిలబడి చూస్తున్నాడతను.

★ ★ ★

సిగరెట్ వెలిగించుకోవాలన్న కోరికను అగ్గిపుల్ల వెలుగులో తన ఉనికిని ఎవరైనా గమనిస్తారన్న భయంతో- బలవంతంగా అణుచుకుని- నెమ్మదిగా వెళ్ళి ఇంటి వెనుక వసారాలో చీకటిగా ఉన్న చిన్న గది తలుపు తట్టాడు మన్మథరావ్- లోపల గాజుల చప్పుడు- ఆ తర్వాత-

"ఎవరూ?" అని వినిపించింది.

"నేనే తలుపు తీయ్..." మెల్లగా పరిసరాలు గమనిస్తూ అన్నాడతను.

"నేనే అంటే?"

"దొంగను కాను. తొరగా తలుపు తీయ్!" అసహనంగా అన్నాడతను.

తలుపులు తెరుచుకున్నాయి.

గభాల్న లోపలికెళ్ళాడు మన్మథరావు.

ఆమె లైట్ వేసింది.

"కంగారుపడకు- నేను మన్మథరావుని!" అన్నాడతను మెల్లగా-

"మీరా?" అన్న ఆమె కంఠంలో ఆశ్చర్యాన్ని గమనించి చిన్నగా నవ్వి అన్నాడతను.

"అవున్నేనే! నిద్ర పట్టకపోతేనూ- పాపం... పగలంతా కష్టపడి వంట చేశావు గదా- మాట్లాడితే కాస్త రిలీఫ్‌గా ఉంటుందని ఇలా వచ్చాను-"

"అర్ధరాత్రి మాటలేంటి బాబూ.... వెళ్ళి పడుకోక?" ఆవలిస్తూ అందామె.

ఆ రోజు వంట చేయడానికి వచ్చిన ఆమెను క్షణం కూడా వృధా చేయకుండా గమనించాడు మన్మథరావు.

ముప్ఫై అయిదేళ్ళ వయసులో చామన ఛాయలో- కొంచెం లావుగా- పొంకంగా బింకంగా ఉన్న ఆమెను చూసి అతని గుండె లయ తప్పసాగింది. అవకాశం దొరికినప్పుడల్లా ఆమెతో మాట్లాడాలని ప్రయత్నించాడు. ఆమెని లైన్లో పెట్టడానికి పెద్దగా కష్టపడనక్కర్లేదని కూడా గ్రహించాడు.

అప్పట్నుంచీ- చీకటిపడి- అంతా సద్దుమణిగే సమయం కోసం నిరీక్షిస్తున్న అతనికి- ఇప్పటికా అవకాశం లభించింది.

"చెప్పాగా- నిద్రపట్టడం లేదని "సిగరెట్ వెలిగించి అన్నాడతను.

"నాకు నిద్దరొస్తుంది మరి...."

"వెధవ నిద్ర ఎప్పుడూ ఉండేదే. కానీ ఈ అవకాశం మళ్ళీ రాదు." అన్నాడతను ఆమె భుజం మీద చేయివేసి-

"మీకు రాదేమో- నాకు రోజూ వస్తుంది-" అందామె అతని చేయి తీసేస్తూ.

గతుక్కుమన్నాడు మన్మథరావు.

నిద్రపోయి లేచినందువల్ల ఆమె కళ్ళు ఎర్రగా ఉన్నాయ్. పైట స్థానభ్రంశం చెంది- అతని మతి పోగొడుతోంది-

"అంటే ప్రతి రోజూ ఇలాంటి అవకాశాలు నీకు వస్తూనే ఉంటాయా?" నవ్వుతూ మళ్ళీ ఆమె భుజం మీద చెయ్యేశాడు-

"నీలాంటి మగాళ్ళుంటే అవకాశాలకేం తక్కువ- మన ఓపిక అంతే!" బద్ధకంగా రెండు చేతులూ పైకెత్తి ఒళ్ళు విరుచుకుంది.

"మరిప్పుడు ఓపిక లేదా?" సిగరెట్ పారేసి రెండు చేతులూ ఆమె రెండు భుజాల మీద వేసి అన్నాడతను.

"ఓపికుంది గానీ- తీరికలేదు-" అంది నవ్వుతూ.

పైట పూర్తిగా జారిపోయింది.

మన్మథరావు గుటకలు మింగి ఆశగా చూస్తూ-

"తీరిక చేసుకుందాం డియర్-" అన్నాడు.

ఆమె భుజాల మీద అతని చేతులు బిగుస్తున్నాయ్.

పకాల్న నవ్విందామె.

అదిరిపోయాడు మన్మథరావు.

"ష్... అలా నవ్వకు. ఎవరైనా వింటారు-" అన్నాడు.

"నిన్ను చూస్తుంటే- 'నామాల గుండు'లో వంట చేయడానికెళ్ళినప్పుడు- అక్కడా నీలాంటి వాడే తగిలాడు. వాడు గుర్తొస్తున్నాడు."

"నాలాంటివాడా? అంటే?" అనుమానంగా అడిగాడు.

ఆమె బెట్టు చేస్తుంది. తాను బుజ్జగించి లాలించి దార్లోకి తెచ్చుకోవాలని ఊహించి వచ్చిన మన్మథరావుకి ఆమె ప్రవర్తన మింగుడు పడటంలేదు. అదుతల టైం వేస్టయిపోతోందన్న భయం- ఎవరైనా వస్తారేమోనన్న అనుమానాలతో సతమతమయిపోతున్నాడతను.

"నీలాంటివాడంటే- కక్కుర్తిగాడన్న మాట..."

కోపం వచ్చింది మన్మథరావుకి.

కానీ- ఇలాంటి సమయాల్లో కోపం- విసుగు పనికిరావని అనుభవం మీద తెలుసుకున్నాడు.

"పొద్దుట్నుంచి- నన్ను వంట చేయనీయకుండా- చెయ్యా కాలూ పట్టుకుని- నానా తంటాలు పడ్డాడు. చివరకు నీలాగే రాత్రయేసరికి తయారయాడు-"

"ఫ్లాష్‌బాక్‌లెందుకు. విషయానికి రా!" అసహనంగా అన్నాడతను.

'ఫ్లాష్‌బాక్ లేకపోతే సీన్లో మజా ఏముంటుంది?" అంది అతని చేతులు తీసేస్తూ.

"నీకు ఇంగ్లీషు కూడా వచ్చా?" ఆశ్చర్యంగా అన్నాడతను.

"నాకు పద్నాలుగు భాషలొచ్చు. పద్నాలుగు రకాలుగా ప్రేమించగలను"-

"పద్నాలుగొద్దులే- తెలుగులో ప్రేమించు చాలు" విసుగ్గా అన్నాడతను.

"చెప్పేది వినండి మరి".

"ఏమిటి నువ్వు చెప్పేది?"


"నామాలగుండు విషయం-"

"ముందీ విషయం తేల్చు- ఆ తర్వాత ఏ గుండు కథైనా వింటాను" ఆమెను దగ్గరకు తీసుకుంటూ అన్నాడు.

"అట్టే కుదరదు బాబూ...." అతన్ని విడిపించుకుంటూ అంది.

"ఏం రోగం?" ఉబికి వస్తున్న కోపాన్ని నిగ్రహించుకుంటూ అన్నాడు.

యోగం కలిసొచ్చిన మిస్టర్ యోగి



టి.వి.లో ఈ మధ్య అందర్నీ ఆకట్టుకున్న సీరియల్ 'మిస్టర్ యోగి' అందరూ చూసే వుంటారు. అందులో మిస్టర్ యోగిగా నటించిన మోహన్ వసంత్ గోఖలే, ఆ సీరియల్‌లో చివరకు ఎవరినైతే పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకుంటాడో ఆ అమ్మాయి శుభాంగినే నిజజీవితంలో నిజంగా వివాహ మాడాడు.

ఈ నిజాన్ని చాలా మంది నమ్మలేకపోతున్నారు. సరిగ్గా ఆ సీరియల్ 13వ భాగం అయిన వారం రోజులకు డిసెంబరు 10 వ తేదీ ఉదయం 9 గం.లకు వారి వివాహం పూనాలోని వారి సరికొత్త ఫ్లాట్‌లో అయింది. వివాహానికి అతిముఖ్యులు మాత్రం హాజరయ్యారు.

లోనావాలాలో ఇచ్చిన రిసెప్షన్‌కు మాత్రం చాలా మంది వచ్చారు. రిసెప్షన్‌కు 'మిస్టర్ యోగి (మోహన్) సూత్రధారుడైన ఓం పురితో వచ్చాడు. శుభాంగి తండ్రి కొల్హాపూర్‌లో జిల్లా జడ్జిగా పని చేస్తున్నారు. ఆమెకు ఇద్దరు పెళ్ళికాని సోదరులున్నారు. మోహన్ తండ్రి 40 సంవత్సరాలుగా జర్నలిస్టుగా పని చేశారు.

ఇది అతనికి రెండవ వివాహం. కొన్నేళ్ళ క్రిందట అయిన వివాహం విఫలం కాగా, సరియైన జోడీ కోసం ఎదురు చూసి శుభాంగిని వరించాడు మిస్టర్ యోగి.

"మాటలు తిన్నగా రానీ.... ఎన్ని ఫ్లాష్‌బాక్‌లున్నా-రో గాలున్న మనిషిని కాదు-" విసురుగా అందామె.

"సర్లెరే- చెప్పేడువ్-" అన్నాడు మరో సిగరెట్ వెలిగిస్తూ-

"ఏడవడానికొచ్చింది నువ్వు. నాకేం ఖర్మ?" అందామె.

"చెబుతావా లేదా?" అసహనంగా అన్నాడు.

"చెప్పడానికేముంది? అంతా మామూలే. కాకపోతే గదిలోంచి వెళ్ళేటప్పుడు వాడి చెయ్యిలేదు"-

"అదేమిటి?" ఆశ్చర్యంగా అన్నాడు మన్మథరావ్.

"అదంతే. నాతో గడిపిన ప్రతి ఒక్కడి గుర్తుగా వాడి- చెయ్యో కాలో బలి తీసుకుంటున్నాను".

అతన్ని పెనవేసుకుంటూ, అందామె.

నెత్తి మీద బాంబుపడినట్టు అదిరిపడి ఆమెను విడిపించుకుని భయంగా చూస్తున్నాడతను.

"ఏంటి? అంత భయపడేవాడివి నువ్వేం మగాడివయ్యా బాబు... రా" అంది అతని దగ్గరకొస్తూ.

"అంటే- కాలో చెయ్యో విరిచేస్తావా?" భయంగా అడిగాడు మన్మథరావ్-

"నేనిరిచేయను. మా ఆయన విరిచేస్తాడు. అది ఆయన డూటీ!"

"మీ ఆయనా? అంటే ఎవరు?"

"ఏం చూస్తారా? ఇంకో పది నిముషాల్లో వచ్చేస్తాడిక్కడికి-" అందామె.

"మైగాడ్!"

"మైగాడూ లేదు యువర్ గాడూ లేదు. ఏది? ఫ్లాష్‌బాక్కెళ్దామా?" అంది అతన్ని బలంగా కౌగలించుకుంటూ.

విలవిల్లాడుతూ ఆమెను వదిలించుకుని-

"నీకూ- నీ ఫ్లాష్‌బ్యాకులకో నమస్కారం. నన్ను వదిలెయ్!" అన్నాడు.

పకాల్న నవ్విందామె.

"వదలక నిన్నేమయినా పట్టుకున్నానా మగడా? ఆ మాత్రం ధైర్యం లేనివాడికి ఆడది కావలిసి వచ్చిందా?" నవ్వుతూ అంది-

"నిజంగా మీ ఆయన వస్తాడా?" అనుమానంగా అడిగాడు మన్మథరావు. అతనికామెను చూస్తుంటే వదల బుద్ధి కావడంలేదు.

ఆమె మాటలు వింటుంటే అక్కడో క్షణం కూడా ఉండబుద్ధి కావట్లేదు.

"మా ఆయన్ని గురించి ఆలోచిస్తూ- అవకాశాన్ని వదిలేసుకుంటున్నావ్ గురూ"- అంది.

"అదికాదు-" నసిగాడు మన్మథరావ్.

"సరే- అంతగా భయపడుతున్నావ్ గనుక నీ కుడిచేతి బొటన వేలు విరిచేస్తాలే... రా..." అంది ముందుకడుగేస్తూ.

మరుక్షణం-

మన్మథరావు మాయమయ్యాడు.

★ ★ ★

"నవ్యా"

తలెత్తి చూసిందామె.

విశాలమైన ఆమె నేత్రాలు ఎర్రగా ఉన్నాయ్. ముఖమంతా కందిపోయి ఉంది.

"ప్లీజ్ అలా బాధపడకు-" అన్నాడు స్వాగత్.

"నీ సానుభూతి నాకక్కర్లేదు. జీవితంలో నమ్మరాని వ్యక్తి ఎవరో తెలుసా? విడిపించి ఓదార్చేవాడు...." కసిగా అందామె.

"తెలిసి నేనే పాపమూ చేయలేదు. నాకు తెలీకుండా- నా ప్రమేయం లేకుండా నావల్ల నీకు బాధ కలిగితే- నా మూలంగా నువ్వు హర్ట్ అయితే- ప్లీజ్... నన్ను క్షమించు...." అన్నాడు.

"ఇప్పటివరకెంతమంది స్త్రీలతో ఆ మాట అన్నావ్ మిస్టర్ స్వాగత్?" బుల్లెట్‌లా తగిలిందామె మాట. దెబ్బతిన్నట్టు చూశాడు.

"కల్లబొల్లి కబుర్లతో- అమ్మాయిల్ని మాయం చేసి వలలో వేసుకుని వాళ్ళ జీవితాలతో ఆడుకుని- ఆడదంటే ఆటబొమ్మనుకునే నీలాంటి రోగ్- నా భర్తగా దాపురించటం- మైగాడ్! నేను ఊహించలేకపోతున్నాను-"

ఆవేశంతో మంచానికి తల కొట్టుకుంది.

ఆమె చేతిగాజులు పగిలి ముక్కలయి బెడ్ మీద పడ్డాయ్. తెల్లటి ఆమె మణికట్టు మీద ఓ గాజు పెంకు గుచ్చుకుని రక్తం కారసాగింది– కంగారుగా ఆమె దగ్గరకొచ్చి-

"నవ్యా" అంటూ ఆమె చేయి పట్టుకోబోయాడు.

"స్టాప్ దేర్ ఐసే! ఇలాంటి చీప్ ట్రిక్స్‌తో నాకు దగ్గరవాలని ప్రయత్నించకు. నీ హిప్నటిజానికి లొంగిపోయే అందరిలాంటి ఆడపిల్లను కాదు. నా పేరు నవ్య! మైండిట్!" విసురుగా లేచి అంది.

"అసలు కారణం చెప్పకుండా ఎందుకిలా చిత్రహింస చేస్తావ్ నన్ను?"

పెద్దగా నవ్విందామె.

"కారణం నీకు తెలుసు మిస్టర్ స్వాగత్ రాయ్ వర్మా!"

అతని పేరును వత్తి పలికిందామె.

అతను ఉలిక్కిపడ్డాడు.

ఆ రోజు- ఆ రోజు కూడా తనను ఇలాగే పిలిచింది నవ్య.

అంటే-

ఆ నాటి ఆ సంఘటనకు తనే బాధ్యుడ్ని అని ఆమె ఇంకా నమ్ముతోందా? భగవంతుడా!

అతని హృదయం పిండేసినట్లయింది.

"నవ్యా-" అన్నాడు బాధగా.

"యస్ మిస్టర్ స్వాగత్. నీలాంటి మోసగాడ్ని- హంతకుడ్ని.... గోముఖవ్యాఘ్రాన్ని నా జీవితంలోకి ఆహ్వానించి నీ చేత మూడు ముళ్ళు వేయించుకోడానికి గల కారణం నీకు చెప్పాను. కానీ- నీ పాత్ర అంతవరకేనని హెచ్చరిస్తున్నాను."

"నవ్యా నేను చెప్పేది కూడా విను. ప్లీజ్!" అనునయంగా అన్నాడు-

"తప్పు చేసిన ప్రతి ఒక్కడూ ఒప్పుగా నమ్మించడానికి ఏదో ఒకటి చెప్పాలని ప్రయత్నిస్తూనే ఉంటాడు మిస్టర్!"

"కానీ నవ్యా! అసలా రోజు జరిగిన దాంట్లో నా పాత్ర ఏమాత్రమూ లేదు. నిజానిజాలు తెలుసుకోకుండా నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నావ్-" బ్రతిమాలాడు.

"జీవితాల్ని నాశనం చేయడమే వృత్తిగా పెట్టుకున్న నీలాంటి ప్రొఫెషనల్ కిల్లర్ నా మీద జాలి పడుతున్నాడంటే- ఇట్స్ జోక్ మిస్టర్ స్వాగత్ రాయ్ వర్మా!" హేళనగా అంది.

"నవ్యా" విసురుగా అన్నాడతను-

ఛవాలున చూసిందతన్ని-

"అవతల వ్యక్తి చెప్పింది వినకుండా నీ ఇష్టమొచ్చినట్లు మాట్లాడ్డం సంస్కారం అనిపించుకోదు. దేనికయినా ఓ హద్దు ఉంటుంది-" అసహనంగా అన్నాడతను.

"అదే నేను చెప్పాలనుకుంటున్నాను. నీ హద్దులు మర్చిపోయి ప్రవర్తించాలని చూడకు-" విసురుగా అంది.

"నాకు హద్దులా...?" విసురుగా ఆమె వేపు తిరిగి-

లవ్ గేమ్

"ఏ హద్దులూ లేకుండా నిన్ను నా స్వంతం చేసుకుని నా ఇష్టం వచ్చినట్టు, ఆనందించమనే ఈ రాత్రి నిన్నీ గదిలోకి పంపారు "మిస్ నవ్యా!" 'మిస్' అనే పదాన్ని వత్తి పలికాడు.

"షెట్!" ఖంగున మోగిందామె కంఠం.

"అలాంటి వెర్రిమొర్రి ఆశల్తో- అధికారంతో- నన్ను ఏదో చేయాలని ప్రయత్నిస్తే- మిస్టర్ స్వాగత్- ఇప్పుడే-ఈ క్షణంలోనే బయటికెళ్ళి- నాకీ పెళ్ళి ఇష్టంలేదని చెప్పగలను- అండర్‌స్టాండ్?"

"అప్పుడు నష్టం ఎవరికో ఆలోచించు. నేను మగాడ్ని- నువ్వు నన్ను కాదన్న మరుసటి రోజే మరో పెళ్ళి చేసుకుని నీ ముందే కాపురం పెట్టగలను. ఒక్క విషయం మర్చిపోతున్నావ్ మేడం! నువ్వు ఆడదానివి- ఈ పెళ్ళి ఇష్టం లేదని ఏదీ వెళ్ళి చెప్పు చూద్దాం- అప్పుడేమవుతుందో తెలుసా? వృద్ధులైన మీ అమ్మనాన్నల గుండెలాగిపోతాయ్. మీ కుటుంబ గౌరవం- ప్రతిష్ఠ మంట గలుస్తాయ్. పెళ్ళి చేసుకుని శోభనం రోజే మొగుడ్ని వదిలేసిందని నిన్ను అంతా స్పెసిమన్‌ను చూసినట్లు చూస్తారు. నలుగురూ నానా విధాల మీ కుటుంబాన్ని...."

"స్టాపిట్!' ఆవేశంగా అరిచింది.

"చూశావుగా? వినడానికే అంత దారుణంగా ఉన్న ఆ కఠిన సత్యాలు అనుభవానికొస్తే ఎంత చేదుగా ఉంటాయో ఆలోచించు. అంచేత మిస్ నవ్యా-"

అతను నవ్వాడు- నవ్వి అన్నాడు.

"లేనిపోని పంతాలతో జీవితాన్ని నరకంగా మార్చుకోకు. ఏ తప్పు చేశానని నన్ను ద్వేషిస్తున్నావో ఆ తప్పు నేను చేయలేదని మనస్ఫూర్తిగా చెప్తున్నాను".

"నో- ఇంకేం చెప్పకు- తేనె పూసిన కత్తివి నువ్వు. తియ్యగా ఉండే నీ మాటలు నమ్మించి జీవితంలో మరోసారి గెలవాలని ప్రయత్నించకు-"

"ఇంతకీ ఏమిటి నువ్ చెప్పేది?" సిగరెట్ వెలిగించి అడిగాడు.

ఆమె భారంగా నిశ్వసించి- అంది.

"ఒక్క సంవత్సరం- ఒకే ఒక్క సంవత్సరం ప్రపంచం దృష్టిలో భార్యాభర్తలుగా మనం ఉండాలి. ఒకే ఇంట్లో ఉంటున్నా కేవలం పరిచయస్థుల మధ్య ఉండే మినిమమ్ ఇంటిమసీ కూడా మన మధ్య ఉండడానికి వీల్లేదు..."

ఎంతో ఆలోచించి ఎంతో కాలంగా మధనపడి తీసుకున్న స్థిర నిర్ణయంలో ప్రతి మాటా నెమ్మదిగా చెప్పసాగింది.

ఆశ్చర్యంగా వింటున్నాడు స్వాగత్-

"నువ్వేమాత్రం చొరవ తీసుకుని- చనువుగా నా దగ్గరకు రావాలని ప్రయత్నించినా...." ఆవేశంతో అని

"నో- నేను చెప్పను- చేసి చూపిస్తాను." అంది.

చిన్నగా నవ్వి- ఆమె వేపు రెండడుగులు వేసి అడిగాడు.

"సంవత్సరం తర్వాత ఏం చేస్తావ్?"

"విడాకులు తీసుకుంటాను. సంవత్సరం లోపు విడాకులు ఇవ్వరు గనుక- సంవత్సరంపాటు విధి లేక నటించాలి!"

"అంటే- సంవత్సరం వరకూ నాతో ఏ సంబంధాలూ లేకుండా కలిసి ఉండి- ఆ తర్వాత విడాకులు తీసుకోవడం నీ నిర్ణయమా?"

"నిర్ణయం కాదు- ఇట్స్ ఛాలెంజ్!" కసిగా అందామె.

అతని అహం దెబ్బతింది. ఆవేశం ఉవ్వెత్తున ఎగిసిపడింది.

"అదే నీ ఛాలెంజ్ అయితే మిస్ నవ్యా-"

గంభీరంగా ఉందతని కంఠం.

ఆమె అతన్నే చూస్తోంది.

"సంవత్సరంలోగా- నా బిడ్డకు నిన్ను తల్లిని చేయకపోతే నా పేరు స్వాగత్‌రాయ్ వర్మే కాదు... ఇట్స్ మై ఛాలెంజ్!"

"నా బొందిలో ప్రాణం ఉండగా ఆ దారుణం జరగదు-"

"అది నీ దృష్టిలో దారుణమే అయితే తప్పక జరిగితీరుతుంది".

"బెదిరిస్తున్నావా?"

"హెచ్చరిస్తున్నాను".

"ఆల్‌రైట్! సంవత్సరం దాటగానే విడాకులు తీసుకుంటానని నేనూ హెచ్చరిస్తున్నాను-"


"సంవత్సరంలోగానే నీ బిడ్డకు నేను తండ్రినవుతాను-" అతను విసురుగా వెళ్ళి దిండు తీసుకుని సోఫాలో పడుకున్నాడు. ఆమె కసితో పూలన్నీ తెంపి- మంచం మీద పడుకుంది- కొన్ని క్షణాల నిశబ్దం తర్వాత తలెత్తి అతన్ని చూస్తూ అందామె-

"చివరిగా ఒక్క మాట!"

"ఏమిటది?"

"ఐ హేట్ యూ ఫ్రం ది డెప్త్ ఆఫ్ మై హార్ట్"

(ఇంకా ఉంది)



మీ పాపాయికి అందించండి సెరిలాక్ లాభం



తొలిసారిగా ఘన పదార్థాలను ఇస్తూ

4 నెలల నుంచీ మీ పాపాయికి, పాలతో బాటు ఘన పదార్థాలు కావాలి. సెరిలాక్ లాభాన్ని అందించండి.

పోషకాహార లాభం : సెరిలాక్ ప్రతి మోతాదులోనూ మీ పాపాయికి కావలసిన పోషక పదార్థాలు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజాలూ అన్నీ వున్నాయి. అన్నీ సమ పాళల్లో వున్నాయి.

రుచి లాభం : పాపాయిలకు సెరిలాక్ రుచి ఇష్టం.

సమయం ఆదా లాభం : సెరిలాక్ ముందుగా వండినది. దానిలో పాలూ పంచదార వున్నాయి. దానిని వెచ్చటి నీటితో కలిపితే చాలు.

ఎంపిక లాభం : ఎంచుకునేందుకు మూడు రకాల సెరిలాక్ వుంది.

మీ పాపాయికి సమతూకంలో పోషకాహారాన్ని అందించేందుకూ తయారుచేయటంలో పరిశుభ్రతను పాటించేందుకూ డబ్బా మీది సూచనలను జాగ్రత్తగా పాటించండి.



6 మాసాలు నించి

4 మాసాలు నించి

6 మాసాలు నించి

ఉచితం
సెరిలాక్ బేబీ కేర్ బుక్
వ్రాయండి.సెరిలాక్
పోస్ట్ బాక్స్. నెం 3
న్యూ ఢిల్లీ 110008

Nestlé

సెరిలాక్ రక్షణ: పోషకాహారంతో పరిపూర్ణం-ఎంతో రుచికరం



"ఆమె కథ"

యన్వీ. శివాజీరావు

నా మనసంతా గజిబిజిగా వుంది. ఆలోచనలు ఒకదాని వెనుక ఒకటి అర్థాంతరంగా సాగుతూ నా సమస్యను మరీ జటిలం చేసేస్తున్నాయి.

పొద్దున మా ఆవిడ యిచ్చిన సలహా ఎంత సమంజసంగా వుంది! ఆడవాళ్ళు భవిష్యత్తు గురించి చాల కూలంకషంగా ఆలోచించగలరు. అందుకే మగవాడి జీవితరథానికి ఆడది సారథి వంటిది.

నిజమే. బాబు చాలా బాగా చదువుతాడు. ఒకరిద్దరు టీచర్లు కూడ వాడి గురించి తనతో గొప్పగా చెప్పారు. టెన్త్‌లో వాడికి స్కూల్లో మొదటి రాంకు వస్తుందని అందరి అంచనా. నాకు కూడ ఆ నమ్మకం వుంది.

తరువాత కాలేజీలో చేర్పించడానికి బోలెడంత ఖర్చవుతుంది. ఇంటి నుండి కాలేజీ చాల దూరం కాబట్టి సైకిలు కూడ తప్పనిసరిగా కొనివ్వాలి. మిగతా పిల్లల యూనిఫాంలకు, పుస్తకాలకు కూడ నడుం విరిగిపోతుంది.

ఒక్కసారిగా అంత డబ్బు కోసం యిబ్బంది పడే కంటే యిప్పటి నుంచే ప్రయత్నించడం మంచిదని శ్రీమతి చెప్పింది బాగానే వుంది. కానీ ఎలా? ఏ దారీ కనబడడం లేదు. స్నేహితులతో అప్పుల లావాదేవీలు పెట్టుకోకూడదన్న నా సిద్ధాంతాన్ని వదులుకోలేను.

ఎంత కష్టమయినా సరే బాబు భవిష్యత్తుకు నా

ఆర్థిక యిబ్బందులు ప్రతిబంధకం కాకూడదు. బహుశ వాడికి స్కాలర్‌షిప్ కూడ వస్తుందో ఏమో!

ఈ ఆలోచనలతో కాఫీ తాగుతూ, కాంటీనులోని వీక్లీని తిరగేస్తున్న నా చేతులు, కళ్ళు ఒక పేజీలో ఆగిపోయాయి.

"కథల పోటీ- మొదటి బహుమతి అయిదు వేలు- రెండవ బహుమతి మూడు వేలు- మూడవ బహుమతి వేయి రూపాయలు."

నాలుగు రోజుల నుంచీ నన్ను వేధిస్తున్న ప్రశ్నలకు పరిష్కారం చూపడానికి యిదొక మార్గం కాగలదా?

నాలుగయిదు కథలు రాశాను కానీ పోటీకి ఎపుడూ పంపలేదు. ఇపుడు ప్రయత్నిస్తే?

ప్రకటన పూర్తిగా చదివాను. కథలు పంపడానికి యింకా యిరవై రోజుల వ్యవధి వుంది.

సీటులో కూర్చుని పని చేస్తున్నా ఆలోచనలు నా మనసును కందిరీగల్లాగా తొలిచేస్తున్నాయి. ఏదైనా ఒక మంచి కథను రాసి పోటీకి పంపితే?

మూడవ బహుమతి వచ్చినా సరే పిల్లల స్కూలు ఖర్చులు గడచిపోతాయి- రెండో బహుమతి వస్తే అమ్మ అల్సరుకు ఆపరేషను కూడ చేయించవచ్చు- మొదటి బహుమతి గనక వస్తే, చెల్లెలి పెళ్ళి కోసం నగలన్నీ పెట్టి బాంకులో తీసుకున్న అప్పు కూడ కొంత వరకు తీర్చవచ్చు.

నా ఆశల ధోరణి నాకే నవ్వు తెప్పించింది. కానీ యింతకీ నేను అంతమంచి కథను రాయగలనా? మామూలుగా బహుమతి వచ్చే కథలు ట్రాజిక్‌గా వుంటాయి. నేను కూడ ఏదైనా ఒక గొప్ప ట్రాజిక్ ప్లాటు ఆలోచించాలి.

సాయంత్రం కాఫీ యిస్తూ "నేను చెప్పిన సంగతి ఏమయినా ఆలోచించారా?" అడిగింది మా ఆవిడ.

"ఆలోచిస్తున్నాను" అన్నాను. నేనేమాలోచిస్తున్నానో తెలిస్తే నవ్వుతుందేమో!

ఆ రాత్రంతా 'ప్లాటు' గురించిన ఆలోచనలతో నిద్ర పట్టలేదు నాకు. నాలుగయిదు అయిడియాలు వచ్చినా పోటీ 'స్టాండర్డు' లేదనిపించి వాటిని వద్దనుకున్నాను.

మరుసటి రోజంతా ఆఫీసులో కూడ సరిగా పని చెయ్యలేకపోయాను. సాయంత్రం యింటికెళ్ళి ముఖం కడుక్కుని పార్కుకు బయలు దేరాను ప్లాటు ఆలోచించుకోవడం కోసం. ఒక మూలగా ఎవరూలేని చోటు చూసుకుని కూచున్నాను.

ఒక గంట గడిచినా, అరడజను సిగరెట్లు వూది పారేసినా, ఆలోచనలతో తల వేడెక్కిపోయింది గాని 'అయిడియా' మాత్రం రాలేదు.

"వేరు శెనక్కాయలు కావాలా బాబుగారూ" పీలగా వినిపించిన ప్రశ్న నా ఏకాగ్రతకు భంగం కలిగించింది. తలతిప్పి చూశాను.

ఎవరో ముసల్ది. గంపలో శెనక్కాయలు అమ్ముకుంటోంది. ఆమెను నిరుత్సాహ పరచడం యిష్టంలేక జేబులోంచి పావలా తీసి యిచ్చాను. వణికే చేతులతో గంపలోంచి ఒక డబ్బాతో శెనక్కాయలు కొలుస్తోంది.

ఆమెను పరీక్షగా చూశాను. పండిపోయిన జుట్టు, ముడుతలు పడిన ముఖం, నిటారుగా నిలబడలేని శరీరం, వణుకుతున్న చేతులు. దైవ ధ్యానంతో కాలం గడపవలసిన యీ చరమ దశలో కూడ కష్టపడవలసి రావడం ఎంత దురదృష్టం!

ఈ వయసులో యీమెకు పూటకు పిడికెడు మెతుకులు పెట్టేవారు లేకపోయారా? లేక వుండీ చేరదీయలేదా?

ఈమె కంటే తక్కువ వయసు వాళ్ళు, ఆరోగ్యంగా వున్న వాళ్ళు ఎంతో మంది అడుక్కోవడం చూశాను నేను.

ఈమె మనసులో అడుక్కోవడానికి అడ్డు పడేంత ఆత్మాభిమానం వుందా? యింత వయసులో కూడ స్వతంత్రంగా బ్రతకాలన్న తపన వుందా? ఏ పరిస్థితులు యీమె జీవితాన్ని యీ స్థితికి చేర్చిందో?

నా మనసులో చటుక్కున ఒక ఆలోచన వుద్భవించింది..... అలా చేస్తే?

"యిలా కూర్చో అవ్వా" మృదువుగా అన్నాను ఆమెతో. నా వంక వింతగా ఒకసారి చూసి- తిరిగి తిరిగి కాళ్ళు కూడ లాగుతున్నాయేమో- నాకు ఎదురుగా, దూరంగా గంపను నడుము మీద నుండి కిందకు దించి, మెల్లగా కూచుంది.

"ఈ వయసులో నువ్విలా శెనక్కాయలు అమ్ముకుంటున్నావే- నీకెవరూ లేరా అవ్వా?" గొంతులో ఆప్యాయతను రంగరించి అడిగాను.

"ఇపుడెవరూ లేరు బాబుగారూ" నిస్తేజంగా అంది ఆమె.

శెనక్కాయలు వలిచి నోట్లో వేసుకుంటూ "అయితే ఎక్కడుంటావు?" అడిగాను.

శివాలయం పక్కన సత్రంలో బాబుగారూ!

"వీటి అమ్మకంతో నీకు గడచిపోతుందా అవ్వా?" ఆమె వద్ద నుండి నాకు కావలసిన విషయాలు ఎలా రాబట్టాలో అని ఆలోచిస్తూ అడిగాను.

"ఒక్క దానికి యీ వయసులో ఎంత గావాలి బాబూ - ఏదో అలా గడిచిపోతోంది లెండి."

"ఏది ఏమైనా యింత వయసు పైబడ్డాక కూడ ఎవరి అండా లేక, పూట గడవడం కోసం నువ్విలా కష్టపడడం చూస్తుంటే నాకు చాల బాధగా వుందవ్వా!"

ఎవరైనా వింటే నిజంగానే బాధ పడుతున్నాడు అనుకుంటారేమో.

"ఏం చేస్తాం బాబుగారూ! విధి, ఖర్మ అవి మన చేతుల్లో లేనివి వున్నాయి కదా. వాటి ప్రభావం అనుభవించక తప్పదు" ఆమె స్వరంలో ఎలాంటి ఫీలింగ్ లేదు.

"చదువుకున్న దానిలాగా కూడా వుంది" ఆశ్చర్యంగా అనుకున్నాను.

"ఎందుకో నీ జీవితం గురించి తెలుసుకోవాలని పిస్తోంది. వివరంగా చెబుతావా అవ్వా?" మార్దవంగా అడిగాను.

"మీ కెందుకు బాబూ నా సోదెంతా" నా ముఖాన్ని పరిశీలనగా చూస్తూ అడిగింది.

నా మనసులోని నిజమైన ఆలోచన తెలిస్తే ఆమె ఎలా రియాక్టు అవుతుందో?

"యిపుడే యింటికెళ్ళి చేసేదేంలేదు. కాస్త కాలక్షేపం అవుతుంది. అదీగాక యింకో మనిషితో కాసేపు గడపడం నీకు కూడ సంతోషంగా వుండదా అవ్వా" నా గాలానికి ఎర వేస్తూ అనునయంగా అన్నాను.

దానికి ఫలితం వెంటనే ఆమె ముఖంలో కనిపించింది.

"నిజమే బాబుగారూ. నాతో ఒక మనిషి యిలా

వినోద్ ఎప్పుడూ ఆలస్యమే!



షూటింగ్‌కు సక్రమంగా వచ్చే అలవాటు లేదట వినోద్‌ఖన్నాకు. కొన్నేళ్ల రజనీష్ ఆశ్రమంలో సన్యాసిగా వుండిపోయి తిరిగి చిత్రరంగంలోకి అడుగుపెట్టిన వినోద్‌ఖన్నా ప్రతి షూటింగ్‌కు నాలుగైదు గంటలు ఆలస్యంగా హాజరువుతాడట. రంజిత్‌ను ఈ విషయమై అడిగినప్పుడు అసలు షూటింగ్‌కు సక్రమంగా రావాలన్న ఇంగిత జ్ఞానం వుండేడిస్తే కదా అని విరుచుకుపడ్డాడట. వినోద్ పుణ్యమా అని చాలాసార్లు షూటింగ్ రద్దు కూడా చేసుకున్నాడట రంజిత్. ఆలస్యం అమృతం విషం అంటారు కాని వినోద్ విషయంలో అది 'అమృత'మేనేమో! మరి ఈ జబ్బు ఎలా మానుకుంటాడోనని జుట్టు పీక్కుంటున్నారట రంజిత్ లాంటి వాళ్లు!

అప్యాయంగా మాట్లాడి కొన్ని సంవత్సరాలే గడిచాయి" గద్గదంగా అంది ఆమె.

ఆమె కళ్ళలో నీరు తిరగడం స్పష్టంగా కనిపిస్తోంది నాకు. నా స్వార్థం కోసం ఆమెను అనవసరంగా బాధ పెడుతున్నానేమో అని ఒక క్షణం నా మనసు మూలిగింది.

"మీకు చెప్పుకోవడంవల్ల నా గుండెలోని మానని గాయాలవల్ల రగులుతున్న అశాంతి కొంతయినా అణగుతుందేమో - నా గురించి మీకు చెబుతాను బాబూ" అంటూ కళ్ళు మూసుకుంది ఆమె.

ఎంత చక్కగా మాట్లాడుతూంది! నా ఆశ్చర్యం యినుమడించింది.

రెండు నిముషాల తరువాత మెల్లగా కళ్ళు తెరిచి ఆమె తన కథను చెప్పడం మొదలుపెట్టింది.

* * * * *

"రాజమండ్రికి యిరవై మైళ్ళ దూరంలోని గోదావరీ తీరానవున్న ఒక చిన్న పల్లెలో పుట్టాను నేను. నా చిన్నతనం ఎంతో ఆనందంగా, అహ్లాదంగా గడచింది. ఎటుచూసినా గోదావరి నీరు తాగి పచ్చగా, ఏపుగా పెరిగిన పంట పొలాలు, విశాలమయిన తోటలు, ఎంతో గారాబంగా చూసుకునే తల్లితండ్రులు, ఆడుకోవడానికి, చుట్టుపక్కల ఎందరో పిల్లలు - మనిషికి తన చిన్నతనంనాటి తీపి గురుతులు నిజంగా ఒక పెన్నిధి లాంటిది.

"మా నాన్న ఆ ప్రాంతాలవారంతా గౌరవించే పెద్ద రైతు. ఆ రోజుల్లో ఆడపిల్లను బడికి పంపేవారు కాదు. మా నాన్న చదవడం, రాయడం బాగా వచ్చేంతవరకు యింట్లోనే నా చదువు చెప్పించాడు. తరువాత నేనే ఆసక్తితో ఎన్నో పుస్తకాలు, సాహిత్యంలో పేరు పొందిన నవలలు చదువుకునేదాన్ని.

"నాకు పదహారేళ్ళు వచ్చాక పెళ్ళి చేశారు. అప్పట్లో ఆడపిల్లకు అంత ఆలస్యంగా పెళ్ళి చేసినందుకు మా నాన్న ఎందరి విమర్శలకో గురి కావలసి వచ్చింది.

"ఆ రోజుల్లో మన దేశ ప్రజలు బ్రిటిషు వారి కర్కశ పాలనలో పడరానిపాట్లు పడుతుండేవారు. గాంధీగారు ఉప్పు సత్యాగ్రహం తలపెట్టడంతో స్వాతంత్ర్య పోరాట ప్రభావం మా నాన్న మీద పూర్తిగా పడింది. నేనొక్కతినే సంతానం కావడంతో ఆస్తిపాస్తులు, యింటి బాధ్యతలు అన్నీ మా ఆయనకు అప్పచెప్పి, అసంఖ్యాకమయిన ప్రజలతో పాటు మా నాన్న కూడ గాంధీగారి వెంట వెళ్ళిపోయారు. ఆయన్ని మేము మళ్ళీ చూడలేదు. ఆ బెంగతో నే మా అమ్మ కొన్నాళ్ళకు కళ్ళు మూసింది.

"నా భర్త కూడ స్వాతంత్ర్యోద్యమం పట్ల ఎంతో వుత్సాహం చూపేవారు. యింటి బాధ్యతలన్నీ చూసుకుంటూనే, చుట్టుపక్కల జరిగే సభలకు, సమావేశాలకు హాజరవడమే గాక, ఆర్థికంగా కూడ వుద్యమ నాయకులకు ఎంతో చేయూత నిచ్చేవారు. కానీ శాంతియుత విధానాల ద్వారా మనకు స్వాతంత్ర్యం సిద్ధించదేమోనన్న అభిప్రాయం ఆయనలో క్రమక్రమంగా బలపడ సాగింది. నేతాజీ సిద్ధాంతాల స్ఫూర్తితో, అల్లూరి సీతారామ రాజును ఆదర్శంగా చేసుకుని, ఆయనకు అనుకూలంగా వుండిన యువకులందరినీ ఒక దండుగా తీర్చిదిద్దారు. వారంతా పరాయి పాలకులను నానా యిబ్బందులూ పెట్టేవారు.

"ఒకసారి ఏవో పన్నుల వసూలుకు వచ్చిన బ్రిటిషు అధికారుల దర్పాన్నీ, వారు చూపిన జులుంని సహించలేక తిరగబడితే, వారు తమ తుపాకులతో నా భర్తతో పాటు యింకో ఆరుగురిని నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపేశారు.

"అప్పటి నుండి నా జీవితంలో అశాంతి మొదలయింది. అపుడు నాకు ముప్పయి ఏళ్ళు. నలుగురు పిల్లలు. చిన్నపాపకు నాలుగు నెలల వయసు. వాళ్ళను పెంచడానికి ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది. తండ్రి గుర్తుకు వచ్చినపుడల్లా ఏడ్చేవాళ్ళు. సముదాయించడం చాల కష్టమయ్యేది.

"నా ఒంటరితనాన్ని ఆసరాగా తీసుకుని నన్ను లోబరుచుకోవాలని • కొందరు ప్రయత్నించారు. కొంత మంది నా పొలాల్ని చవగ్గా కొట్టేయడానికి, అక్రమంగా ఆక్రమించుకోవడానికి కూడ ప్రయత్నించారు. వీటన్నిటి నుండి నన్ను, నా పిల్లలను ఎంతో ఆత్మబలంతో కాపాడుకోవలసి వచ్చింది.

"ఎంతో మంది ఎన్నో కష్టాలనుభవించి, ఎన్నో రకాల త్యాగాలు చేసి, ఎంత కాలంగానో కలలు కంటున్న "స్వాతంత్ర్యం" మన దేశానికి లభించింది. అయితే అంతవరకు అందరి మధ్య వున్న ఐకమత్యం సన్నగిల్లడం ప్రారంభ మయింది. మనుషులలో నిజాయితీ తగ్గి, స్వార్థం చోటు చేసుకోవడం మొదలయింది.

"పొలాలన్నీ ఒక్కదాన్ని చూసుకోలేక కౌలుకిచ్చేశాను. ఆదాయం రాను రాను తగ్గిపోయింది. పిల్లలతో పాటు పెరుగుతున్న వాళ్ళ అవసరాలు, కాలేజీలో చదివించడానికి వాళ్ళను హాస్టల్లో వుంచవలసి రావడం– వీటి కారణంగా ఆస్తి క్రమంగా హరించుకు పోసాగింది.

"నా పిల్లల్లో కూడ నా భర్త మనస్తత్వమే పెంపొందింది. ఆయన వున్నపుడు, మన దేశాన్ని ఆంగ్లేయులు అక్రమంగా అంచెలంచెలుగా స్వాధీన పరచుకున్న వైనాన్ని వివరించి– స్వాభిమానం వున్న మనిషి బానిసత్వాన్ని ఏమాత్రం భరించరాదని, తను పుట్టిన భూమిని స్వతంత్ర ంగా నిలపడం కోసం ప్రాణాలనైనా లెక్క చెయ్యరాదని– వారి నరనరాల్లో వీరత్వాన్ని, దేశభక్తిని నింపేవారు.

"ఆ ప్రభావంతోనే పెద్దబ్బాయి కాలేజీ చదువుకాగానే ఆర్మీలో చేరిపోయాడు. కాప్టను కూడ అయాడు. చైనా మన దేశం మీదికి దురాక్రమణ జరిపినపుడు జరిగిన యుద్ధంలో వీరమరణం పొందాడు.

"రెండోవాడు అప్పటికే ఎయిర్‌ఫోర్స్‌లో వున్నాడు. పెద్దవాడి మరణంతో కృంగిపోయిన నేను, వెనక్కి వచ్చేయమని ప్రాధేయపడుతూ ఎన్ని వుత్తరాలు రాసినా వాడు లెక్క చెయ్యలేదు. పాకిస్తాన్ మన మీద దండెత్తినపుడు జరిగిన యుద్ధంలో వాడ్ని కూడ పోగొట్టుకున్నాను.

"తన చదువయిపోగానే మూడవవాడు కూడ నేవిలో చేరతానన్నాడు. అప్పటికే మనోవేదనతో కుంగిపోతున్న నేను ఎంతగానో బ్రతిమాలి వాడి నా ప్రయత్నం నుండి విరమింపజేశాను.

"బి. యిడి. చేసిన మా అమ్మాయికి టీచరుగా

హేట్స్ ఆఫ్ టు డెమోక్రసీ!

గవర్నమెంట్ ఆఫ్ ది పీపుల్ బై ది పీపుల్
అండ్ ఫర్ దోజ్ హూ కెన్ పర్చేజ్ ది పీపుల్!
ప్రజాస్వామ్యానికి ముఖ్యం ప్రజల ఓట్లు
అంతకంటె ముఖ్యమైనాయ్ కరెన్సీ నోట్లు!
ప్రతి రాజకీయవేత్త వేస్తాడు స్వలాభపుపాట్లు
దాంతో ఓటర్లకి మొదలౌతున్నాయి అగచాట్లు!
ప్రతి పార్టీలోనూ సాధారణమైపోయాయి సిగపట్లు
వెలుస్తున్నాయి రోజూ కొత్తగా ఉదయిస్తున్న సూర్యుళ్ళ కటౌట్లు!
నిజంగా ఎంతో అదృష్టవంతులు ఇండిపెండెంట్లు
ఏ పార్టీలోనైనా యిట్టే కల్సిపోగల కేండిడేట్లు!
ఇతరుల కొరకే నీతులు పలికే మన నాయకుళ్ళు
ప్రజాస్వా(హా)మ్య గర్భగుడిలోని ప్రాణమున్న దేవుళ్ళు!
ఇంకా ఎన్నో (అవ)లక్షణాలున్న ది గ్రేట్ డెమోక్రసీ
చక్కగా వర్ధిల్లుతుంది మన దేశంలో .... యూ సీ!

– సిహెచ్. వి. బి. కె. రావ్

వుద్యోగం వస్తే ఒక వూరికి వెళ్ళింది. ఆమెకు పెళ్ళి సంబంధం కూడ ఖాయం చేశాము. కానీ అంతలోనే, తనపట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఆ వూరి ప్రెసిడెంటుగారి అబ్బాయిని పదిమందిలో చెంప దెబ్బ కొట్టిందన్న కక్షతో, ఒక రాత్రి అమ్మాయి వుంటున్న యింటిని మంటల కాహుతి చేసి దాన్ని సజీవ దహనం చేసేశారు. డబ్బుకు, రాజకీయ నాయకులకు దాసోహమనే అధికారులతో నిండి పోయి వున్న 'చట్టం' ఆ నరరూప రాక్షసుల నేమీ చేయలేక పోయింది.

"అమ్మాయి మరణంతో నా మనసును పూర్తిగా నైరాశ్యం అలుముకుంది. నాకు మిగిలిన ఒకే అబ్బాయి కూడ జీవితం పట్ల ఎటువంటి ఆసక్తి లేకుండా, మౌనంగా ఏదో ఆలోచిస్తూ పెళ్ళి చేసుకోమన్నా వినకుండా ఎపుడూ ఎక్కడెక్కడో తిరుగుతుండేవాడు. ఒక రోజు చెప్పకుండా ఎటో వెళ్ళిపోయాడు. కొన్నాళ్ళకు ఒక వుత్తరం వచ్చింది. "స్వార్థంతో, ధన గర్వంతో, అధికార దర్పంతో ఎదుటి మనిషిని నిలువునా హింసించే వారి అధీనంలో వున్న యీ సమాజ వ్యవస్థపై అసహ్యంతో తనకు తిరుగుబాటు చెయ్యాలని పించిందని, దాని కవకాశం వున్న వ్యక్తులతో చేరిపోయానని" రాశాడు.

"ఆ తరువాత రెండేళ్ళకు ఒక వుత్తరం వచ్చింది. ఎవరు రాశారో తెలియదు. 'యీ సమాజంలోని అసమానతలను రూపుమాపటానికి తాము సాగిస్తున్న సమరంలో నా కుమారుడు అసువులు బాసాడని, అయితే నేలకొరిగే ముందు, తన చెల్లెలి మరణానికి కారకులైన వారి అంతం చూడాలన్న పంతాన్ని మాత్రం అతను సాధించుకో గలిగాడని వుంది అందులో.


"అప్పటినుండి దాదాపు జీవచ్ఛవంలా బ్రతుకుతున్నాను. అన్నీ గుర్తుకు వచ్చి గుండెలు పిండే దుఃఖాన్ని భరిస్తూ, మిగిలివున్న నా కొంత ఆస్తిని కూడ కాజేయాలనుకున్నవారు చేసే ఆగడాలు సహిస్తూ ఆ వూళ్ళో వుండలేక వచ్చేశాను. నాలుగయిదు వూళ్ళు తిరిగి యీ వూరు వచ్చి చేరాను. నా వారందరూ వారు కట్టుబడిన ఆశయాలకు తమ జీవితాల్ని బలి చేసినందుకు నేను గర్విస్తున్నా. నా తరువాత మా వంశం పేరు చెప్పేవారు, నాకు తల కొరివి పెట్టేవారు లేకపోయారన్న బాధ మాత్రం నాలో మిగిలి పోయింది.

"మరణం మాత్రమే నాకు పూర్తి ప్రశాంతత నిస్తుందని తెలిసినా ఆత్మహత్యకు పాల్పడే పిరికి దాన్ని కాకపోవడంచేత - దాని కోసం ఎదురు చూస్తూ వున్నాను. ఇదే బాబుగారూ నా కథ"

* * * * * *

నా మెదడు, మనసు, తనువు పూర్తిగా చైతన్యం కోల్పోయింది.

ఒక మనిషికి జీవితంలో యిన్ని విషాదాలా? తన



కుటుంబంలోని వారందరూ యీ దేశం కోసం, యీ ప్రజల రక్షణ కోసం తమ ప్రాణాల్నే ఫణంగా పెడితే, యీనాడు యీమె అనాథగా తన చివరి రోజులలో కూడ కూటి కోసం పాటుపడుతూ బతకవలసి వచ్చిందా?

తన వాళ్ళందరినీ తమ కోసం త్యాగం చేసినందుకు కృతజ్ఞతతో ఒక దేవతలాగా పూజించవలసిన యీమెను, నిలువ నీడ లేకుండా వీధులపాలు చేశారా?

నా కళ్ళలోంచి వుబికి వస్తున్న కన్నీటిని తుడుచుకుంటూ ఆమె వంక చూశాను.

చీర చెరగుతో కళ్ళు తుడుచుకుంటూ, పొంగుతున్న నా కన్నీటిని చూసి "క్షమించండి బాబుగారూ. అనవసరంగా మిమ్మల్ని బాధపెట్టాను" దిగులుగా అంది.

"లేదమ్మా. మీ జీవితం ఎలాంటి వారినయినా కదిలించి వేస్తుంది" గొంతు పెగుల్చుకొని అన్నాను.

మనం 'పనికిరాని వాళ్ళు'మనే మన చుట్టూ వున్న మనుషులలో యిలాంటి ఉదాత్త చరితులెందరున్నారో!

ఈమెకు అన్యాయం చేసిన వాళ్ళ నుండి రక్షించేందుకు ప్రభుత్వం తరఫున ఏ విధమైన సహాయమూ లభించే అవకాశం లేదా? యీమె అందుకు ప్రయత్నించలేదా?

ఆ మాటే అడిగాను.

"భూమి తగాదా విషయంలో సహాయం చేస్తారేమోనని ఒకసారి తాసీల్దారుని కలిసాను. నా అనుభవంలో గ్రహించింది- మనిషికి మనిషిగా ఎటువంటి విలువ, గుర్తింపు లేవని- మనిషి తన అవసరాల కోసం సృష్టించుకున్న డబ్బుకు తానే బానిసయిపోయి, ఆ డబ్బు సంపాదించుకోవడానికి వీలున్న ప్రతి అవకాశాన్ని వినియోగించుకోవడానికి ప్రయత్నిస్తాడని- మనుషులలో పెరిగిపోయిన అవినీతి పట్ల అసహ్యంతో నేను అలాంటి ప్రయత్నాలు మానుకున్నాను బాబుగారూ" విరక్తిగా అంది ఆమె.

ఇలాంటి సమాజం కోసమా యీమె తన కుటుంబాన్నంతా బలిపెట్టింది?

"చాల గ్రాత్రయిపోయింది బాబుగారూ. యింటి కెళదాం లేవండి" తాను లేస్తూ అందామె.

టైము చూసుకున్నాను. ఎనిమిదయింది.

"మీరు రోజూ యీ పార్కుకు వస్తారా?" ఆమెను మళ్ళీ కలుసునే అవకాశం కోసం అడిగాను.

"అవును బాబుగారూ. ప్రతి సాయంత్రం తప్పకుండా ఒక గంటసేపు యిక్కడ గడుపుతాను".

ఆ రాత్రంతా ఆమెను గురించిన ఆలోచనలతో నిద్ర పట్టలేదు నాకు. ఆమె కోసం నేనేం చేయగలను? ఆమెను మా యింట్లోనే వుంచుకుని పోషిస్తే? యింట్లో వాళ్ళు ఒప్పుకుంటారా? అసలు ఆమె ఒప్పుకుంటుందా?

అడిగి చూడాలి.

ఇంతకీ తన కథ సంగతేమిటి?

ఆమె కథను బేస్ చేసుకుని ఒక మంచి కథ రాయొచ్చు. చాలా 'యింప్రెసివ్'గా కూడా వుంటుంది. బహుమతి కూడ రావచ్చు. కానీ నా మనసందుకు ఒప్పుకోవటం లేదు. ఆమె మనుషుల స్వార్థానికి అన్నీ పోగొట్టుకొని యీ స్థితికి చేరుకుంది. నేను నా స్వార్థానికి ఆమె కథను వుపయోగించుకుని మానసికంగా ఆమెకు ద్రోహం చెయ్యలేను.

వేరే 'ప్లాటు' కోసం ప్రయత్నించాలి. పొద్దు పొడుస్తున్న వేళ, అపుడే నిద్రపడుతున్నపుడు, నా బుర్రలో ప్రవేశించింది ఆ ఆలోచన!

తరువాత నిశ్చింతగా నిద్రపోయాను. వారం రోజులు ఏకధాటిగా కూర్చుని ఆమె కథ ఆధారంగా

ఆమె కథ

ఒక హృద్యమయిన కథను అల్లాను. కథ చాలా బాగా వచ్చింది. ఫెయిర్ చేసి పోటీకి పంపేశాను.

అప్పటి నుండి ప్రతి రోజూ పార్కుకు వెళ్ళడం అలవాటు చేసుకున్నాను. ఆమెతో ఎన్నో విషయాలు చర్చించేవాడిని. అప్పటి సాంఘిక పరిస్థితులను, స్వాతంత్ర్యోద్యమంలో జరిగిన ఎన్నో ఆసక్తిదాయకమైన సంఘటనలను ఆమె నా కళ్ళకు కట్టినట్లు వివరించేది. చరిత్రలోను, సాహిత్యంలోను ఆమెకున్న పరిజ్ఞానం ఒక్కోసారి నాకెంతో ఆశ్చర్యం కలిగించేది.

మా యింటికి వచ్చి మాతో పాటు వుండిపోవడానికి ఆమె సుతరామూ ఒప్పుకోలేదు. యింట్లో ఏవయినా స్పెషల్స్ చేసినపుడు మాత్రం తప్పకుండా తీసికెళ్ళేవాడిని. అవి తీసుకోవడానికి కూడ ఆమె ఎంతో మొహమాటపడేది. నాతోపాటు మా పిల్లలు కూడ ఆమె కోసం అపుడపుడూ వచ్చేవాళ్ళు. వాళ్ళకి ఆమె లెక్కలేనన్ని కథలు ఎంతో వుత్సాహంగా చెప్పేది. రాను రాను ఆమెతో ఒక విడదీయలేని అనుబంధం ఏర్పడిపోయింది మాకు.

ఒక రోజు ఆఫీసులో వుండగా టెలిగ్రాం వచ్చింది నా కథకు మొదటి బహుమతి వచ్చిందని, బయోడేటా పంపమని సారాంశం.

ఉద్వేగంతో తబ్బిబ్బయి పోయాను నేను. అయిదువేల రూపాయలను పోస్టాఫీసులో ఆమె పేర డిపాజిట్ చేసేయాలి. ఇక మీదట ఆమెకు ఎటువంటి శ్రమ కలగకూడదు. నెల ఖర్చులకు అవసరమయినంత విత్‌డ్రా చేసుకుని, మంచి పుస్తకాలు చదువుకుంటూ ఆ డబ్బుతో ఆమె తన చివరి రోజుల్నయినా హాయిగా ప్రశాంతంగా గడపాలి.

బహుమతి వస్తే ఏం చేయాలని నేను యిది ముందుగా ఆలోచించి నిర్ణయించుకున్నదే!

నా మనసంతా సంతోషంగా తేలికగా వుంది. వెంటనే వెళ్ళి ఆమెతో చెప్పాలని ఆతృతగా వుంది. కానీ ఆడిట్ జరుగుతున్నందు వల్ల కదలలేను. సాయంత్రం పార్కులో చెప్పాలి.

ఆమె సంతోషిస్తుందా? తన జీవితాన్ని ఒక కథగా వాడుకున్నందుకు కోప్పడుతుందా? నా నిర్ణయాన్ని అంగీకరింప చేయడానికి ఆమెనెలాగైనా కన్విన్సు చెయ్యగలనన్న నమ్మకం నాకుంది.

మా మధ్య వున్న స్నేహం అంత గొప్పది మరి!

సాయంత్రం యింటికి కూడ వెళ్ళకుండా నేరుగా పార్కుకి వెళ్ళి కూచున్నాను. ఆత్రంగా అరగంట ఎదురు చూసినా ఆమె జాడ కనిపించలేదు. యిలా ఎపుడూ జరగలేదు.

ఆరోగ్యం గాని బాగాలేదా?

ఇక వుండలేక ఆమె చెప్పిన గుర్తుల ప్రకారం శివాలయం ప్రక్కన వున్న సత్రాన్ని చేరుకున్నాను.

బయట ఎవరో అయిదారుమంది నిలబడి మాట్లాడుకుంటున్నారు. వాళ్ళనడిగాను.

"ఇక్కడ వేరుశనక్కాయలమ్మే ఒక ముసలామె వుండాలి. తెలుసా?"

వాళ్ళు మౌనంగా చేతితో ఒక దిక్కు చూపించారు. అటు చూసిన నాకు, చిరిగిన చాప మీద పడుకోబెట్టబడిన అచేతనమయిన ఆమె శరీరం కనిపించింది.

కొంతసేపు వూపిరి ఆడలేదు నాకు. కళ్ళల్లోంచి కన్నీరు వుబుకుతోంది. గొంతులోంచి ఏడుపు తన్నుకొస్తోంది.

ఏడుస్తున్న నన్ను చూసి "ఆమె మీకు తెలుసా? బంధువులా?" అడిగాడు ఒకతను.

ఆమె నాకేమవుతుంది?

"అమ్మ.... ఆమె మా అమ్మ...." పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆమె పాదాలపై వాలిపోయాను.

"కొడుకట కొరివి పెట్టడానికి మంచి సమయానికి వచ్చాడు. లేకపోతే మునిసిపాలిటీ వాళ్ళ చేత లాగించేసేవాళ్ళం".

వెనుక వాళ్ళు మాట్లాడుకుంటున్నది నా దుఃఖాన్ని మరింత వుధృతం చేసింది.

●

యువతా! కవితా!

నేటి ప్రగతి

మగవికి మగువ దాసోహం
మగడు మధువుకి దాసోహం!
"మనీ"కి మధువు దాసోహం
మంత్రి "మనీ"కి దాసోహం!
మంత్రి వాగ్దానాలకి దాసోహం
వాగ్దానాలు "ఓట్ల"కి దాసోహం!
ఓట్లు "సీట్ల"కు దాసోహం
సీట్లు "కోట్ల"కు దాసోహం!
వేదిక మీద నా ప్రజలు, నా ప్రజలు...
వేదిక వెనుక ఏ ప్రజలు? ఏ ప్రజలు?
ఇదే నేటి ప్రజాస్వామ్య ప్రగతి
రేపటి భావి భారతీయుల అధోగతి!

-జొన్నలగడ్డ శ్రీనివాస్

అజ్ఞానం-అద్వైతం

మన మధ్యని అంతస్థులు-ఆకారాలు
వేరువేరని తలిస్తే అది-అజ్ఞానం!
మనలోని రక్తాలు-ఆత్మలు
ఒక్కటేనని తలపోస్తే అది-అద్వైతం!

-భారతి "పాంచజన్య"

అంత మెరుగనిదా?

ఆకలి ఆకలి
అర్ధరాత్రి అందంగా
విలపిస్తుం దాకలి.
అన్యాయం చేయించ
ప్రయత్నిస్తుందాకలి.
పేదవాడి డొక్కలో
పెనుభూత మీ ఆకలి.
అబల అర్ధనగ్నాల
మాటుగాథ ఆకలి.
హంతకునావేశానికి
అలజడి ఈ ఆకలి.
ఎదఎదలో రగులుతూ
పెనుభూతంలా
ప్రభవిల్లిందాకలి.
అంతులేని జలంలా
అంచులేని ప్రవాహంలా
ప్రవహిస్తుంటావా
పారిపోక నీవేనాడు!

రత్నాకర్

యాచన !

నాగరికత ముసుగులోని
ఈ "సభ్య" సమాజంలో
ఓ మతి భ్రమించిన
మగువ, చేయి చాచి
యాచిస్తే....
మగాడి మహోపకారం
"గర్భాదానం" !!!

- 'విరజశ్రీ'



సమాంతర రేఖలు

నలిగిన తన శరీరంలో
ఒక....
రక్తపు బిందువు
తయారయ్యేందుకు
పట్టెడన్నం కోసం
కన్న కొడుక్కి
పాలిచ్చే తీరిక లేక
కొడవలెత్తుకొని కోత కెలుతోంది
నా చెల్లి "వడివడిగా"....!
కొవ్వెక్కిన శరీరాన్ని
తగ్గించుకోవాలని
కన్న కొడుకుని
పనిమనిషి కిచ్చి
మార్నింగ్ వాక్కెళ్తుంది
ఈ చెల్లి వయ్యారంగా– అదే బాటలో!
ఒకే బాటలో పయనించే
రెండు సమాంతర రేఖలు!!

కోటి. పి.

సంస్కృతి

'వందేమాతరం' నాటి సంస్కృతి
'వంద' ఏ మాత్రం నేటి సంస్కృతి!
'దేశభక్తి' నాటి సంస్కృతి
'స్వార్థభుక్తి' నేటి సంస్కృతి!

'జనగణమన' నాటి సంస్కృతి
'తన,మన,ధన' నేటి సంస్కృతి!
'భిన్నత్వంలో ఏకత్వం' నాటి సంస్కృతి
'ఏకత్వంలో భిన్నత్వం' నేటి సంస్కృతి!

-అప్పారావు ఆళ్ళ

జన్మ !

జననం
కర్మఫలం
జీవితం
సుఖదుఃఖాల
మయం
మరణం
పాపపుణ్యాల
ఫలితం
లలాట
లిఖితం!

-ఎస్.ఎ. రహమాన్.

త్రికసంధి

వ్యాకరణంలో వుంది త్రికసంధి
రణంలో వుంది
మాంత్రిక సంధి
తాంత్రిక సంధి
యాంత్రిక సంధి!

-బులుసు-జీ-ప్రకాష్


వారధి

మంచికి మనసు వారధి
పెళ్ళికి ప్రేమ వారధి
ఉద్యోగానికి విద్య వారధి
నీతికి నిర్భయం వారధి
వీటన్నిటికీ అంతరాత్మే, సారథి!

– యు. కృష్ణసాయిరాం

బాలకృష్ణతో యువచిత్ర వారి "నారీ నారీ నడుమ మురారి"

రసవత్తరమైన కథలను ఆబాలగోపాలాన్ని ఆకట్టుకునేలా ఉన్నతమైన ప్రమాణాలతో రూపొందించడం యువచిత్ర వారి ఆనవాయితీ. అందుకే ఈ సంస్థ కొత్త చిత్రం ఎప్పుడొస్తుందా అని సహృదయులైన ప్రేక్షకులు ఎదురు చూడడం రివాజు. "నారీ నారీ నడుమ మురారి" కూడా ఈ కోవలోకి చెందిందే. సంగీత ప్రధానంగా, శృంగారం అంతర్లీనంగా సకుటుంబ సమేతంగా చూసి తీరాల్సిన ఈ చిత్రానికి ఇటీవల ఎ. వి. ఎం. స్టూడియోలో శిల్ప దర్శకుడు రాజాచే కళాపిలసితంగా నాలుగు భారీ సెట్లు వేయించి, బాలకృష్ణ- నిరోషాల మీద ప్రేక్షకుల హృదయాలపై పన్నీటి జల్లును చల్లేలాంటి " ఏం వానో తడుపుతున్నది- ఏం గాలో తరుముతున్నది" అనే మనోహరమైన గీతాన్ని సిద్ధహస్తుడు విన్సెంట్ ఛాయాగ్రహణంతో అత్యద్భుతంగా చిత్రీకరించారు డైరెక్టర్ ఎ. కోదండరామిరెడ్డి. ఇందుకయిన అత్యధిక వ్యయంతో కాశ్మీర్‌లో నాలుగు పాటలు చిత్రీకరించవచ్చు. ఖర్చుకు వెనుకాడకుండా, ఎక్కడా రాజీ పడకుండా, రమ్యత చెడకుండా సెల్యులాయిడ్‌పై మలచడం యువ చిత్ర వారికే తగును అన్న విషయం అందరూ ఎరిగినదే. "జనవరి 1 నుంచి 13 వరకు జరిగిన షెడ్యూల్‌లో రెండు పాటలను, కొన్ని ప్రధాన సన్నివేశాలను చిత్రీకరించాం. జనవరి చివరలో 5, ఫిబ్రవరిలో 5, మార్చిలో 20 రోజుల పాటు తదుపరి షెడ్యూల్స్." అన్నారు నిర్మాత కె. నరసింహంనాయుడు. వి. ఇ. బాలకృష్ణ సరసన శోభన, నిరోషా నాయికలు కాగా ఇతర భూమికలను ఊర్వశి శారద, సత్యనారాయణ, తనికెళ్ళ భరణి, రమాప్రభ, చిట్టిబాబు, అనంత్ విశిష్టమైన రీతిలో పోషిస్తున్నారు. చక్కని చిత్రాల కోసం తహతహలాడే వారికి "నారీ నారీ నడుమ మురారి" యువ చిత్ర వారి మరో అపూర్వమైన కానుక.



'నారీ నారీ నడుమ మురారి'లో బాలకృష్ణ, శోభన



"యమధర్మరాజు"తో కృష్ణంరాజు, బి.సరోజాదేవి.

యండమూరి దర్శకత్వంలో "అగ్నిప్రవేశం"

"ఒక ప్రత్యేక పాత్రలో పురాణం సుబ్రహ్మణ్యశర్మ, దుష్ట పాత్రలో చందుసాంబాబు. సెన్సార్‌బోర్డు సభ్యుడు బాలసుబ్రహ్మణ్యం కాక ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం కూడా ఈ చిత్రంలో ఉన్నారు" అన్నారు కె. ఎస్. రామారావు. ఈయన సమర్పించే ప్రమోద ఆర్ట్ "అగ్నిప్రవేశం" చిత్రంలో యమున, రమ్యకృష్ణ, సుధాకర్, సుమిత్ర, చాట్ల శ్రీరాములు, కోట శంకరరావు, సుబ్బరాయశర్మ, శిల్ప, స్పందన, విజయలక్ష్మి, జక్కా సత్యనారాయణ, ఎ. ఎం. రాజా, సంపత్‌రాజా, రాంగోపాల్, అడబాల, రమణారెడ్డి, అనంత్, కిరణ్‌కుమార్, కృష్ణమూర్తి, జేబీ నీలిమతో పాటు హీరోగా భార్గవ్ పరిచయం గావింపబడుతున్నాడు. ఎం. వి. ఎస్. రఘునాథరావు మాటలు, వేటూరి పాటలు, నల్లూరి సుధీర్‌కుమార్ సంగీతం, శరత్ ఛాయ, అజయ్‌కుమార్ సంయుక్త దర్శకత్వం. జానకిరామ్ ప్రొడక్షన్, తార నృత్యాలతో కె. బెనర్జీ నిర్మించే ఈ చిత్రానికి యండమూరి వీరేంద్రనాథ్ దర్శకుడు.

కోడిరామకృష్ణ దర్శకత్వంలో వెంకటేశ్, విజయశాంతి


"యాక్షన్ చిత్రం. భారీ కమర్షియల్‌గా సినిమాస్కోప్‌లో తీస్తున్నాం. మొదటి షెడ్యూల్ డిసెంబరు 21 నుంచి 31 వరకు జరిగింది. అలాగే జనవరి నుంచి మార్చి వరకు ప్రతి నెలా 21 నుంచి చివరి తేదీ దాకా జరుగుతుంది. మార్చిలో పాటల చిత్రీకరణ. ఏప్రిల్‌లో పాచ్ వర్క్ వగైరా. మే విడుదల," అన్నారు సుమంత్ ప్రొడక్షన్స్ అధినేత ఎం. ఎస్. రాజా. ఈ చిత్రంలో వెంకటేశ్, విజయశాంతి, కొబ్బరి రాజా, నాగేష్, బ్రహ్మానందం, 'అంకుశం' బాబ్జీ, విజయకుమార్, సంగీత, మహర్షి రాఘవ, భాస్కర్, బాబూ మోహన్, కల్పనారాయ్, కోట శ్రీనివాసరావు, ఆంథోని, అనంతరాజ్ పాత్రధారులు. సత్యమూర్తి కథ, మాటలు రాశారు. రాజ్–కోటి సంగీతం, ఎస్. గోపాల్‌రెడ్డి ఛాయ, రాజు సాహసాలు, రామచంద్రసింగ్ శిల్పం, తారా సురేష్ కూర్పుతో డి. సుధాకర్‌రాజు సమర్పించే ఈ చిత్రానికి స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: కోడి రామకృష్ణ.

సినిమా స్కోప్, స్టీరియో ఫొనిక్‌లో "సి. బి. ఐ. ఆఫీసర్"

"ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు షూటింగ్," అన్నారు బత్తిని సత్యనారాయణరావు. ఈయన "యమపాశం, రక్తజ్వాల" అనంతరం సినిమా స్కోప్– స్టీరియో ఫొనిక్ శబ్ద విన్యాసంలో నిర్మించే "సి. బి. ఐ. ఆఫీసర్" చిత్రంలో ఊర్వశి శారద, భానుచందర్, నాగేంద్రబాబు, వినోద్‌కుమార్, ఒక కీలకమైన పాత్రలో శరత్‌బాబుతో పాటు నాయికగా ఓ నవనటి ఉంటుంది. రాజ్–కోటి సంగీత దర్శకులు. ఎం. వెంకటేశ్వర్లు, ఎం. కృష్ణ సహ నిర్మాతలు. వై. నాగేశ్వరరావు దర్శకుడు.


-జి.వి.జి.

అమెరికాలో "డికాబ్ ఫార్మర్స్ మార్కెట్" ఘనత !





ఒక్క వేదిమీద నిర్మింపబడ్డ కాయగూరల మార్కెట్ దాని విస్తీర్ణం 25 ఎకరాలు





మనకు మార్కెట్ అనగానే పూర్వపు సంతలు, ప్రస్తుతం కూరగాయల మార్కెట్లు గుర్తుకు వస్తాయి. అమెరికాలో 'ఫార్మర్స్ మార్కెట్' అనేమాట చాలా చోట్ల వినిపిస్తుంది. చిన్న చిన్న రైతులు తమ పొలాలలో, తోటలలో పండే కూరగాయలు, పండ్లు పట్టణంలో ఒకచోట పెట్టుకుని అమ్ముకునే ప్రాంతాన్ని 'ఫార్మర్స్ మార్కెట్' అంటారు. అయితే జార్జియా రాష్ట్రంలోని అట్లాంటా మహానగరంలోని 'యువర్ డికాబ్ ఫార్మర్స్ మార్కెట్' చాల విలక్షణమైనటువంటిది. ఒక వ్యక్తి సారథ్యంలో ఇంత పెద్ద ఆహార పదార్థాల మార్కెట్ అమెరికా మొత్తం మీద లేదు. అట్లాంటా మహానగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో 120 ఎకరాల స్థలం మధ్య 25 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఒకే షెడ్‌లో ఈ 'డికాబ్ ఫార్మర్స్ మార్కెట్' నిర్వహించబడుతున్నది.

ఈ మార్కెట్ యజమాని రాబర్ట్ బ్లేజర్ యువకుడుగా ఉన్నప్పుడు రోడే ఐలాండ్‌లోని తన తండ్రికి చెందిన జనరల్ స్టోర్సులో పనిచేస్తూవుండేవాడు. అయితే ప్రపంచములో కెల్లాప్రసిద్ధమైన ఇంత పెద్ద మార్కెట్‌కు యజమాని కాగలనని రాబర్ట్ ఆనాడు ఊహించలేదు. 1977వ సంవత్సరంలో రాబర్ట్ బ్లేజర్ స్వంత వ్యాపారం ప్రారంభించాలనే కోరికతో అట్లాంటా నగరంలో 7,500 చదరపు అడుగుల చిన్న చోటులో గుడారం వేసి తన కూరగాయల 'పండ్ల వ్యాపారం ప్రారంభించాడు. వినియోగదారులకు తాజా కూరగాయలు, పండ్లు నిజాయితీగా అందిస్తున్న కారణంగా అతికొద్ది సమయంలో రాబర్ట్ తన వ్యాపారాన్ని రెండింతలు చేయగలిగాడు. అయితే 1979 వ సంవత్సరంలో వచ్చిన మంచు తుఫాను కారణంగా భీమా చెయ్యని వ్యాపార గుడారాలు కూలిపోయి సర్వస్వం కోల్పోయాడు. అయితే వినియోగదారుల సహాయంతో 8 నెలలలోనే తన దుకాణాన్ని పునర్నిర్మించుకుని వ్యాపారం ప్రారంభించాడు. తనకు సహాయం చేసిన వినియోగదారులకు రాబర్ట్ ఉచిత ఆహారపదార్థాలసరఫరా పథకం ప్రారంభించాడు. ఆ తర్వాత రాబర్ట్‌కు తన వ్యాపారంలో

'మకాం' మారుస్తున్న శ్రీదేవి



శ్రీదేవి తన 'మకాం'ని మద్రాసు మార్చేయాలని నిర్ణయించుకుంది. జీవితంలో సెటిల్ కమ్మని తల్లీ దండ్రి అడుగుతున్నారట. ఒప్పుకున్న సినిమాలు పూర్తిచేసి బొంబాయి నుంచి వచ్చేస్తుందని, ప్రస్తుతానికి యింక సినిమాలేవీ ఒప్పుకోదని తండ్రి అంటున్నాడు.

ఇంతకీ అసలు విషయమేమంటే... శ్రీదేవికి వివాహ ప్రయత్నాలు చేస్తున్నారట? శ్రీదేవికి అయితే గాని చెల్లెలు పెళ్లి చెయ్యటానికి లేదని, అందుకోసం మదరాసు వచ్చి పెళ్లితంతు పూర్తిచేసి చెల్లెలికి లైన్‌క్లియర్ యిద్దామని తల్లిదండ్రుల తాపత్రయమట. ఏమైతేనేం బొంబాయి నగరాన్ని వీడి మళ్లీ మద్రాసుకు చేరుతోందన్న వార్త మిగిలిన హీరోయిన్లకి సంతోషంగానే వుంటుందేమో? వుండదా మరి!

డికాబ్ ఫార్మర్స్ మార్కెట్

వెనుకకు తిరిగి చూచుకొనే అవసరం కలగలేదు. దినదినాభివృద్ధి చెందుతూ 1985 లో ప్రస్తుతం ఉన్న మార్కెట్ కాంప్లెక్సును ప్రారంభించాడు.

ఈ మార్కెట్‌కు రోజూ సుమారు 15 వేల మంది వినియోగదారులు వస్తారు. ఈ మార్కెట్‌లో ప్రపంచములోని 40 దేశాలకు చెందిన వివిధరకాలైన ఆహారపదార్థాలు, కూరగాయలు, పండ్లు లభిస్తాయి. అందుకే రాబర్ట్ తన ఈ మార్కెట్‌ను ప్రపంచ మార్కెట్ అంటూ, మార్కెట్‌లో వివిధ దేశాల జాతీయ పతాకాలను అలంకరించాడు. ఈ మార్కెట్‌లో సముద్రం నుండి లభించే 450 రకాల చేపలు, రొయ్యలు, తదితర ఆహార పదార్థాలు, 400 రకాల ఛీజ్‌లు, వివిధ దేశాలలో ప్రసిద్ధి చెందిన పండ్లు, బియ్యం, పప్పు, కూరగాయలు, ఆకు కూరలు విరివిగా లభిస్తాయి.

వినియోగదారులకు కూరగాయలు తాజాగా అందించాలనే ఉద్దేశ్యంతో పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేయబడిన ఈ మార్కెట్‌లోని గోడౌన్ల నుండి కూరగాయలు పండ్లు తెచ్చి రోజుకు రెండుసార్లు మార్కెట్‌లోని బల్లలపైన మారుస్తారు. 25 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ మార్కెట్ షెడ్ మొత్తం పూర్తిగా ఎయిర్‌కండిషన్ చేయబడింది.

ఈ మార్కెట్‌లో ప్రపంచములోని 40 దేశాలకు చెందిన 500 మంది పనిచేస్తున్నారు. వీరిలో భారతీయులు 70 మంది వరకూ ఉన్నారు. అందులోనూ తెలుగువారు 20 మంది పని చేస్తున్నారు. యాజమాన్య స్థాయిలో విశాఖపట్నం నుండి ప్రవాసులైన తడికమళ్ల కృష్ణమూర్తి పనిచేస్తుండగా ఎకౌంటింగ్ విభాగంలో గుంటూరు నుండి అమెరికా వచ్చిన శ్రీమతి గింజుపల్లి సుజాత ప్రధానమైన స్థాయిలో ఉన్నారు.

ఈ మార్కెట్ యజమాని రాబర్ట్ బ్లేజర్ విలక్షణమైన వ్యక్తి. ఆయనను కలిసినప్పుడు కేవలం ధనార్జనే తన లక్ష్యం కాదని, వినియోగదారులకు ఆహారపదార్థాలు తాజాగా, తక్కువ ధరకు, నాణ్యతగా అందించాలన్నదే తన ఆశయమని అలా అందించి వినియోగదారులను సంతృప్తిపరచ కలిగితేనే తమకు మనుగడని చెపుతూ, వ్యాపారమే ప్రధాన లక్ష్యంగా కాకుండా ఆహార పదార్థాల అమ్మకం ద్వారా ప్రజల మధ్య పరస్పర అవగాహన, సహకారం, సద్భావన పెంపొందించటానికి కృషి చేస్తున్నానని చెప్పారు.

సందేశం

ప్రపంచం పనిచేయటానికే సృష్టించబడిందని, పనిచేయబడకుండా ఉండటానికి మనమే బాధ్యులమని, తేడాకు కారణభూతులమేని, సాంకేతికంగా మనం ఎంత ముందుకెళ్లినా ఆహారంతోనూ, తోటి ప్రజలతోనూ ఉన్న మన సంబంధాల నుండి తప్పించుకోలేమని, ఆ సంబంధాన్ని పటిష్టం చెయ్యటానికే ఈ మార్కెట్ ద్వారా తను కృషి చేస్తూ వున్నానని, భావితరాల వారికి ఈ సందేశాన్ని ఈ మార్కెట్ ద్వారా అందించటమే తన ధ్యేయమని ఆయన ఎంతో ఆత్మవిశ్వాసంతో చెప్పారు.

మార్కెట్‌లో పనిచేసేవారిలో నిర్లిప్తత, అలసటను పారద్రోలి ఉత్సాహంగా పనిచేయటానికి వీలుగా ఆయన పనిలో 'పార్టనర్‌షిప్' విధానాన్ని ప్రారంభించారు. ప్రతి పనివారు తమకు తోడుగా మరొకరిని ఎంపిక చేసుకొని కలిసి పనిచేయటం వలన ఎంతో గణనీయమైన మార్పును సాధించగలిగామని కొందరు పనివారు చెప్పారు. పరస్పర ప్రేమ, సదవగాహన ద్వారా ఎంతైనా మార్పును సాధించగలమన్న తమ సందేశాన్ని ప్రపంచానికి ఈ మార్కెట్ ద్వారా అందజేయుటమే తమ ధ్యేయమని రాబర్ట్ చెప్పారు.

అంతేకాకుండా బాధ్యతగల ఈ దేశ పౌరుడిగా, మానవుడిగా సాంస్కృతిక కార్యక్రమాలను దాన ధర్మాలను చెయ్యటం తనవిధి అని అంటూ రాబర్ట్ ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ఎన్నో దానధర్మాలను చేస్తూ వున్నారు.

- డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

పిరుదులు ఎత్తుగా వున్నాయి... తగ్గేదెలా!



సరి "కొత్త" శీర్షిక

హల్లో డాక్టర్! నేనేం చెయ్యాలి?

డా. కొత్త రవీంద్రబాబు

ఎ. సుజన- పులివెందుల

పిరుదులు ఎత్తుగా వున్నాయి. తగ్గేదెలా?

ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోండి. ఎక్కువఖర్చు పెట్టుకోలేకపోతే కర్నూలు మెడికల్ కాలేజీలోని ప్లాస్టిక్ సర్జరీ డిపార్ట్మెంట్ వారిని సంప్రదించండి.

సి.హెచ్. చిన్నారావు- కొమరాడ, విశాఖజిల్లా

ముఖం జిడ్డుగా నల్లగా వుంటుంది.

సబ్బుమాని సున్నిపిండితో ముఖం కడుక్కోండి. పళ్ళు పాలు తీసుకోండి. జెబెక్స్‌బిళ్ల రోజుకొకటి భోజనానంతరం వాడండి.

ఎ. శ్రీనివాస్- భవానీపురం

ఈ పినోఫీలియా వుంది. రోజు మాత్ర వేసుకుంటాను.

డాక్టరును సంప్రతించకుండా, రక్త పరీక్ష చేయించు కోకుండా మాత్రలు వేసుకోవద్దు. అందువలన అపకారం జరుగవచ్చు.

బి. సుధాకర్- పెద్దపల్లి

నా వయసు 20 సంవత్సరములు. చెంపలపై తెల్లవెంట్రుక లొస్తున్నాయి.

జీవిట్ రోజుకోగొట్టం రాత్రి భోజనానంతరం వేసుకోండి. న్యూనతగా బాధపడేబదులు రోజూ షేవ్ చేసుకోండి.

వై. అప్పారావు- ఆలమూరు

రతి సమయంలో వీర్యస్ఖలనం జరుగటంలేదు. మా ఆవిడకు తృప్తిగానే వుంటుంది. హస్తప్రయోగం అలవాటు వలన అలా జరుగుతున్నదా?

మీ శ్రీమతికి తృప్తి కల్గుతున్నది కాబట్టి మీరా విషయంలో న్యూనత పడవద్దు. అవసరం అనుకుంటే డాక్టరును సంప్రదించండి.

పి. రాధ

రజస్వల అవకముందు మామయ్య నాతో కలిసేవాడు. ఇప్పుడు మూత్ర ద్వారం కిరు వైపులా పొక్కులు వచ్చాయి. వివాహం కాలేదు. డాక్టరు దగ్గరకు వెళ్లాలంటే బిడియం.

తెలియని వయసులో జరిగిన దానికి సిగ్గు పడకుండా లేడీ డాక్టరుగారిని సంప్రదించండి. వివాహం చేసుకోండి.

డాక్టర్ మోడీకి రు. 33 లక్షల లయన్స్ అవార్డు

రికార్డు సంఖ్యలో కంటి అపరేషన్లు జరిపిన ఒక భారతీయ శస్త్రచికిత్సా నిపుణుడిని అమెరికాలోని మయామి (ఫ్లారిడా) లో అంతర్జాతీయ అవార్డుతో సత్కరించారు.

ఇండియాలో కంటికి సంబంధించిన శస్త్రచికిత్సల విషయంలో మార్గదర్శక కృషి జరిపిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎం. సి. మోడీ (73)కి ఇటీవల మయామిలోని లయన్స్ క్లబ్బుల అంతర్జాతీయ సమాఖ్య హ్యూమానిటేరియన్ (మానవతా) అవార్డును అందజేసింది. 20,000 మంది ప్రతినిధులు హాజరైన సమాఖ్య సదస్సులో డాక్టర్ మోడీకి ఈ అవార్డును అందజేశారు.

ఈ అవార్డు క్రింద 200,000 డాలర్లు (సుమారు 33 లక్షల రూపాయల) నగదును బహూకరించారు. కాగా ఈ బహుమతి మొత్తాన్ని అంధులు, బధిరుల పునరావాసానికై తాము విరాళంగా అందజేస్తామని డాక్టర్ మోడీ బహుమతిని స్వీకరించిన వెంటనే ప్రకటించారు.

కె. శ్రీను- విశాఖ

తరచు జలుబు చేస్తుంది.

ఎస్టిలాంగ్ బిళ్ళ రోజు ఒకటి పరగడుపున వేసికోండి.

ఎస్. ప్రసాద్- సూర్యాపేట

ఎక్కువసార్లు మూత్ర విసర్జన చేస్తాను. మధుమేహ వ్యాధిలేదు.

మూత్రంలో చీమున్నదేమో పరీక్ష చేయించుకోండి. అల్ట్రాసౌండ్ లేదా ఐవిపి ఎక్స్‌రేలు తీయించుకోండి.

జిలానీ బాషా- కదిరి

అంగం చిన్నదై పోతున్నది. కోర్కె కల్గినప్పుడు స్తంభిస్తుంది. భయంగా వుంది.

సహజమైన విషయానికి అనవసరంగా భయపడుతున్నారు. నిర్భయంగా పెళ్ళి చేసుకోవచ్చు. ఆ విషయమై అసలాలోచించవద్దు.

జి. రాంబాబు - మచిలీపట్నం

ఎగుడు దిగుడు పళ్ళు సరిచేసే చోటు చెప్పగలరా?

ఆర్థోడెంటిస్ట్‌కు చూపండి హైద్రాబాద్‌లో డెంటల్ కాలేజీలో చూపుకోండి.

మాధవ్ - గుంటూరు

వైద్యవృత్తి రచనా ప్రవృత్తి రెంటిలో ఏదంటే యిష్టం మీకు?

రెండు కళ్ళలో ఏదంటే యిష్టం అన్నట్లుంది మీ ప్రశ్న. వైద్య వృత్తిలో అంకిత భావంతో కొనసాగుతూనే తీరిక సమయంలో రచనలు చేస్తాను.

కె. రామారావు - వైరా

నా వయసు 18 సంవత్సరాలు. నిద్రలో మూత్ర విసర్జనచేస్తాను.

సాయంత్రం అయిదు తర్వాత మంచినీళ్ళు తీసుకోవద్దు. ట్రిప్టనాల్ 75 మిల్లీ గ్రాముల బిళ్ళ రాత్రి ఒకటి వేసికోండి.

పగటిపూట వీలున్నంత ఎక్కువసేపు మూత్రం విసర్జించకుండా మూత్ర కోశంలో మూత్రం నిల్వవుండేట్లు ప్రాక్టీసు చేసుకోండి. ○

సీరియల్

సూపర్ హీరో

మన్నెం శారద

(గత సంచిక తరువాయి)

> ఇంతవరకూ సాగిన కథ -2 : అనతికాలంలోనే బిజీ హీరో అయిన విజయేంద్ర కాల్‌షీట్ల కోసం నిర్మాతలు పడిగాపులు కాస్తుంటారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు అయిన తల్లి నిఖిలేశ్వరి కొడుకు విజయాలు చూసి మురిసిపోతుంటుంది. విజయేంద్ర కొత్త హీరోయిన్ జయలతను యింటికి తీసుకువచ్చి తల్లికి పరిచయం చేస్తాడు. పోలీసు కమీషనర్ కూతురు పీయూషను ప్రేమిస్తున్నానని విజయేంద్ర తల్లికి తెలియజేస్తాడు.

నిఖిలేశ్వరి స్వయంగా డ్రైవ్ చేస్తున్న ఫియట్ కారు అశోక్‌నగర్‌లోని విశాలమైన ఆ ఇంటి పోర్టికోలో ఆగింది.

ఆమె కారు దిగుతుండగానే గాంధీ బయటకొచ్చి "నమస్కారం రండి" అన్నాడు సాదరంగా.

నిఖిల ప్రతి నమస్కారంచేసి అతన్ని అనుసరించింది. అతను ఆమెను డ్రాయింగ్ రూమ్‌లోకి తీసుకెళ్లాడు.

వాల్ టు వాల్ కార్పెట్‌తో, అదే రంగు సోఫాసెట్‌తో అందమైన వాల్ సీనరీస్‌తో అందంగా దర్పంగా వుంది.

"కూర్చోండి" అన్నాడతను.

నిఖిల కూర్చుంది.

ఇంతలో పనివాడు చల్లని మంచినీళ్లు ట్రేలో పెట్టుకొని తీసుకొచ్చి ఆమెకు అందించేడు.

"బయట వాతావరణం చల్లగానే వుంది. దాహంగా లేదు" అంది నవ్వుతూ గ్లాసందుకొని.

అతను ఆమె వైపు నిశితంగా చూస్తూ "ప్రస్తుతం చల్లగానే ఉండొచ్చు, మనం సంభాషణ మొదలెట్టేక ఈ గదితో పాటు మనం కూడా వేడెక్కి పోవచ్చు. ఆ తర్వాత దాహం కూడా వేయొచ్చు."

నిఖిలకి అతని మాటల్లో ఏదో శ్లేష వుందని పించింది. మంచినీళ్లు తాగుతూ "మీరు చిత్రంగా మాట్లాడుతున్నారు. బహుశ పోలీసు డిపార్టుమెంటులో ఇన్వెస్టిగేషన్‌లో ఇలా పక్కదారుల్లో దాడచేయడానికి మీరలవాటు పడిపోయి ఉంటారు." అంది చిరునవ్వుతో.

ఆ మాటకి అతని మొహం చలికాలంలో చల్లని నీళ్లు మొహాన కొట్టినట్లయింది.

"మీరు కూడా ఇంజనీరుగా పని చేస్తున్నారు కదా! అనుభవం లేదా!" అన్నాడు.

"మాది చేతల డిపార్టుమెంటు, మాటలవసరం లేదు" అంది.

"అవును. సిమెంటు స్థానంలో ఇసుక...."

"మనం కలిసిన సందర్భం వేరు గాంధీగారూ! అనవసరంగా పక్కదారిన పడుతున్నాం. అవినీతి అన్న దానికి డిపార్టుమెంటుతో ఉద్యోగంతో పనిలేదు. అది మనిషి నైతిక వర్తనకి సంబంధించింది. మీ శ్రీమతి లేరా?" అంది వస్తోన్న కోపాన్ని దిగమ్రింగి సాధ్యమైనంత శాంతంగా.

"ఉంది. నేను రమ్మంటే గాని ఆవిడ రాదు. జవాబు తెలిసినా నేను అనుమతిస్తే గాని నోరు విప్పదు. ఆడవాళ్లు ఇప్పుడెవరలా ఉంటున్నారు! మీ దృష్టిలో ఆమె చాల పాతకాలపు మనిషిగా తోచవచ్చు" అన్నాడు గాంధీ నవ్వుతూ.

"అలాంటి నిర్ణయాలు తీసుకోవాల్సిన ఆగత్యం నాకు లేదు గాంధీగారూ! మనం పిల్లల గురించి మాట్లాడుకుందాం. టైమవుతోంది" అంది నిఖిల వాచి చూసుకొంటూ.

"ముందు కొద్దిగా కాఫీ తీసుకోండి" అన్నాడాయన నౌకరు తెచ్చిన కాఫీ ఆమెకందిస్తూ. నిఖిల కాఫీ తాగుతుంటే అతను ఒక ఆల్బమ్ తెచ్చి ముందు పెట్టేడు.

సందర్భం ఏమిటో తెలియక పోయినా ఆమె అనాలోచితంగా పేజీలు తిప్పసాగింది.

ఆ గుర్రం మీద కూర్చున్న వ్యక్తి మా తాతగారు. బ్రిటిష్ గవర్నమెంటు హయాంలో కలెక్టరుగా పని చేసి వైస్రాయ్ నుండి ఎవార్డు పొందేరు. ఆ సూట్ వేసుకొని కారు దగ్గర నిలబడ్డ వ్యక్తి మా నాన్నగారు. పోలీసు సూపర్నెంటుగా పనిచేసేరు.ఇక నేను మీకు తెలిసిందే! ఈ ఫోటోలో మా పెద్దమ్మాయి, అల్లుడు. ఇతను లండన్‌లో సైక్రియాట్రిస్టుగా పని చేస్తున్నాడు. అమ్మాయి కూడా డాక్టరే! ఇక ఆ ఫోటోలో రెండో అమ్మాయి ఎమ్. ఏ.పి.హెచ్.డి. చేసింది. అల్లుడు కూడ రీసెర్చి స్కాలరే. ఇద్దరూ స్టేట్స్‌లో వున్నారు. ఇక పీయూష పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. మాఇంట్లో ఇంజనీర్లు లేరు. ఆ కోరిక దానికి రాబోయే భర్తతో తీర్చుకోవాలనుకొన్నాను. కాని బేబి కొద్దిగా తొందరపడింది. భర్తకు బదులు ఇంజనీరు అత్తగారిని తెచ్చుకోవడానికి ప్రయత్నించింది." అన్నాడు.

అతని వైపు చూసింది నిఖిల.

అతను సాదాగానే మాట్లాడుతున్నట్లు కన్పిస్తున్నాడు గాని మాటల్లో ఎక్కడో కొద్దిపాటి ఎత్తిపొడుపు, అవహేళన మిశ్రితమై వున్నాయా అనే సందేహం కల్గుతోంది ఆమెకు.

"మేరేజస్ ఆర్ మేడ్ ఇన్ హెవెన్ అన్నారు" అంది కొద్దిగా తెచ్చుకోలు నవ్వుతో.

"బట్ విత్ ద ఏక్షన్ ఆఫ్ మెన్" అంటూ పూర్తి చేసేడతను.

నిఖిల ఈసారి అతని వైపు చివ్వున చూసి "మనం స్ట్రెయిట్‌గా మాట్లాడుకోవడం బాగుంటుంది. మీ ఉద్దేశ్యం చెబితే సంతోషిస్తాను. కాలయాపన దేనికి?" అంది.

"ఆ సంగతి చెప్పాలనే! అర్థం

చూసిన మీకు అర్థమయ్యే వుంటుంది. మా కుటుంబం మూడు తరాలుగా చదువులు, ఉద్యోగాలతో అలరారుతున్నది. ఇప్పటికి మా • బేబి తొందరపాటు వలన రంగు పూసుకొని పూటకొక అమ్మాయితో ఎగిరే సినిమా నటుణ్ణి అల్లుడిగా తెచ్చుకోవాలని అనుకుంటుంటేనే నా మనసు భగ్గుమంటోంది !"

"గాంధీ గారూ!" అంది నిఖిల గట్టిగా. వెంటనే ఉద్రేకాన్ని అణచుకుని లేచి నిలబడి "మీ సంస్కారం అర్థమయ్యింది. ఇంటికి పిలిచి మర్యాద ఇస్తున్నట్లు నటిస్తూనే మీరు వాతలు పెట్టడానికి ప్రయత్నిస్తున్నారు. మీకు మా అబ్బాయిని మీ అమ్మాయి పెళ్లి చేసుకోవడం ఇష్టం లేక పోతే ఆ సంగతి మీ అమ్మాయికి చెప్పి నచ్చచెప్పుకోండి. అంతేగాని నన్ను పిలిచి హెచ్చరించడం కాదు"అంది కోపంగా గుమ్మం వైపు అడుగేస్తూ.

"నిఖిలేశ్వరి గారూ!"

అతని కంఠస్వరం ఖంగుమని ఆ హాలంతా మార్మోగింది.

" చెప్పండి."

"నేను ఫిలాసఫీ సర్ని"

"ఆ విషయం మీరు పదే పదే గుర్తు చేసుకుంటున్నందుకు నాకు జాలేస్తుంది" అంది నిఖిల వ్యంగ్యంగా.

"జాలి లేని వృత్తి మాది."

"బెదిరిస్తున్నారా? "

"కాదు హెచ్చరిస్తున్నాను. మా పీయూష రెండు మూడు రోజుల్లో ఇండియా వస్తోంది. ఆమెని తిరిగి మీ అబ్బాయి కలవడానికి ప్రయత్నించకూడదు. మీరు కూడ వారి సంబంధాన్ని ఎంకరేజ్ చేయకూడదు. మా అమ్మాయికి పెళ్లి నిశ్చయమైంది."

అతని మాటలకి నిఖిలేశ్వరి హేళనగా నవ్వింది.

"ఇవన్నీ మీరు మీ కూతురుతో చెప్పుకోవాల్సిన విషయాలు. నాకు చెప్పడం చిత్రంగా వుంది. మా అబ్బాయి కళాకారుడు. ఎంతమందో వాణ్ణి కలవాలని, చూడాలని ఉత్సాహపడుతుంటారు. దాన్ని కాదవడానికి నేనెవర్ని?" అంది కోపంగా.

"ఇంతవరకూ మీ ఆటకి ఎదురు లేక పోవచ్చు. కాని ప్రస్తుతం మీరు పెట్టుకొం



టున్నది కరంచంద్ గాంధీతో. మైండ్ ఇట్!"

"మీ బెదిరింపులకు ఝడిసి పోదీ నిఖిలేశ్వరి. మీ కుటుంబంలోని మూడు తరాలుగా యూనివర్శిటీ లిచ్చిన డిగ్రీలుండవచ్చు కాని సంస్కారం మాత్రం కాదు; బహుశ మీకు నాటు నేరస్థుల్ని దండించి ఆ ఒరవడే అలవాటయివుండొచ్చు. కొంచెం మర్యాద కూడా నేర్చుకోవడం మంచిది, ఇది సలహా! " అంటూ రివ్వున కారులో వచ్చి కూర్చొని స్టార్ట్ చేసింది.

ఆమె కోపంలో బలంగా ఏక్సిలిరేటర్ నొక్కడంతో కారు జంప్ చేసినట్లు ఎగిరి ముందుకురికింది.

4

"హాండ్సప్"

షూటింగ్ విరామ సమయంలో సాటి నటీనటుల్తో కబుర్లు చెబుతున్న విజయేంద్ర నివ్వెర పోయినట్లు లేచి నిలబడి పోయి "మీరు?" అన్నాడు అయోమయంగా.

"కనబడ్డంలే. సిటీ సెకండ్ జోన్ ఏ.సి.పి.ని. సి.పి.గారు మిమ్మల్ని స్వయంగా నన్నే వెళ్ళి అరెస్టు చెయ్యమని చెప్పడంతో నేనే రంగంలోకి దిగాల్సి వచ్చింది."

"నేను చేసిన నేరం?" అన్నాడు విజయేంద్ర అపనమ్మకంగా ఆమె వైపు చూస్తూ.

"అవన్నీ ఇక్కడ డిస్కస్ చేయాల్సిన అవసరం మాకు లేదు. సి.పి.గారే మీతో స్వయంగా మాట్లాడుతారు. ఎంతో మంది నోటి దగ్గర కూడు మీరు పడగొడుతున్నారని రిపోర్ట్సు వచ్చేయి. స్వతంత్ర భారత దేశంలో అలా మరొకరి భృతిని, భుక్తిని పోగొట్టడాన్ని ప్రభుత్వం నిరసిస్తోంది. సెక్షన్ మూడువందల పధ్నాలుగు ప్రకారం....."

"మీరు ధనాధన్ దమయంతి కదూ!"

వెంటనే దమయంతి నెత్తిమీద హ్యాట్ తీసి "భలే గ్రహించేసేరే! ఇంకాస్సేపు ఏడిపిద్దా మనుకున్నాను" అంది చేతిలోని పిస్టల్ జేబులో పెట్టుకొంటూ.

"ఏడిపిస్తే ఏడ్వటానికి నేనేం అమ్మాయిని కాను" అన్నాడు విజయేంద్ర నవ్వుతూ.

"అమ్మాయిలంటే మీకు చాల చులకన దృష్టి వుందను కుంటాను. బహుశా మీరు చూసిన అమ్మాయిలంతా నీళ్ళకుండలను కుంటాను. ఈ ధనాధన్ ఏడవదు. ఏడిపిస్తుంది." అంది గర్వంగా కాలరెగరేస్తూ.

పక్కనే కూర్చొని వున్న సీత అక్కసుగా వాళ్ళ సంభాషణ వింటూ కూర్చొంది. మిగతా వారు సరదాగా నవ్వుతున్నారు.

"ఏమ్మా మగరాయుడూ ఇలా వచ్చేవేంటి?" అని పలుకరించేడు డైరెక్టర్ సుబ్రమణ్యం నవ్వుతూ.

"మీ సినిమాలో హీరో లేని లోటు తీరుద్దామని" అంది దమయంతి.

"అంటే మా హీరో మీ కంటికి ఆనడంలేదన్న మాట!" అంటూ ఎత్తి పొడిచింది సీతా.

"విజయేంద్రని అంత మాటనడానికి ధైర్యం ఎలా వచ్చింది నీకు!" అన్నాడు డైరక్టర్.

"ఏమో మరి, నా పక్కన ఏక్ట్ చేయడానికి ఆయనగారు బెదురుతున్నారని ఇప్పుడే అందిన వార్త!" అంది దమయంతి ఉడికిస్తున్నట్లుగా.

"ఇదిగో దమయంతి! నువ్వెంత ధనాధన్ వయినా మా హీరోని పట్టుకుని అంతలేసి మాటలంటే ఊరుకోం! మార్షల్ ఆర్ట్స్‌లో మా హీరోకి సాటి ఎవరూలేరు. ఎలాంటి ఫైటింగ్స్‌లో నయినా డూప్ లేకుండా ఏక్ట్ చేస్తాడు మా హీరో!" అన్నాడు డైరక్టర్.

"ఈ పబ్లిసిటీ స్టంట్స్‌కేం లెండి. మా

తండ్రి ఎవరో తెలియని మార్లిన్ మన్రో!

మహానటి మార్లిన్ మన్రో తండ్రి ఎవరో తెలియనందున మరణించే వరకూ 'నా తండ్రి ఎవరో తెలిస్తే ఎంత బావుండేది!' అంటూ బాధపడుతూ వుండేది. ఆమె ఇంట్లో ఎప్పుడూ అబ్రహాం లింకన్ ఫోటో వుండేది. "ఆయన నా తండ్రి లేదా నా తండ్రి అలా వుండే వారేమో! బహూశా" అని అందరికీ చెప్పేది.

తల్లి ప్రేమకు, తల్లి పెంపకానికి, తండ్రి ప్రేమకు నోచుకోని మార్లిన్ ప్రేమించే వ్యక్తుల కోసం పరితపించి పోయేది. మార్లిన్ అసలు పేరు నోర్మా జీన్.


నోర్మాజీన్ తల్లి స్నేహితులయిన బోలెండర్స్ ఇంట్లో పెరిగింది. తల్లి పని చేస్తూ వుండటం వల్ల వారానికోరోజు (శనివారం) మాత్రం వచ్చి నోర్మాను చూసి వెళ్ళేది. ఆమెకు అదివరకే వివాహమై ఇద్దరు పిల్లలున్నారు. భర్త వదిలేసిన తర్వాత పిల్లల్ని చుట్టాలింటి వద్ద వుంచి పెంచేది. సరిగ్గా ఆ సమయంలోనే ఆమె పనిచేసే స్టూడియోస్‌లోని ఒక ఎగ్జిక్యూటివ్ ఆమెను ప్రేమలో దించి గర్భవతిని చేసి మాయమయ్యేడు. ఫలితంగా నోర్మాజీన్ (మార్లిన్) జన్మించింది.

కొంతకాలానికి మార్లిన్ మన్రో తల్లికి పిచ్చి పట్టిన కారణంగా ఆమె స్నేహితుల ఇంటిలో ఉండవలసి వచ్చింది. 1935 ప్రాంతంలో మార్లిన్ లాస్ ఏంజెల్స్‌లోని అర్ఫన్ హోం సొసైటీలో కూడ వుండవలసొచ్చింది.

తెరపై కెక్కిన తర్వాత మార్లిన్ సెక్స్ గాడెస్‌గా కాకుండా మహానటిగా కూడ పేరు తెచ్చుకొంది.

ప్రేమ రాహిత్యం వలన మార్లిన్ ముగ్గురి భర్తల్ని మార్చవలసొచ్చింది.

సూపర్ హీరో



ఆమె మొదటి భర్త మార్లిన్ సౌందర్యాని అందరూ చూడటాన్ని భరించలేక విడాకులు తీసుకొన్నాడు. రెండవభర్త హైడ్ ఆమె అభివృద్ధికి అహోరాత్రాలు కష్టపడి పనిచేసేడు. హైడ్ హార్టటాక్‌తో మరణించ డాన్ని భరించలేక మార్లిన్ రోజూ నిద్రమాత్రలు మింగసాగింది. ఆమె ప్రాణం తీసిన నిద్రమాత్రల్ని మింగడం తొలిసారిగా హైడ్ మరణంతోనే అలవాటు పడింది మార్లిన్. ఆ తర్వాత ప్రపంచ ప్రఖ్యాత ఆటగాడు జోడిమాగియోని వివాహం చేసుకొంది. వారిద్దరూ హానీమూన్‌కి వెళ్తే మార్లిన్‌ని వేలాదిమంది అభిమానులు చుట్టుముట్టారు. 'పెళ్ళయిన తర్వాత నటించను' అని మార్లిన్ చెప్పిన వార్తలు పేపర్లో వచ్చినందువలన ఆమె అభిమానులు జోడి మాగియోపై ఆగ్రహం చెందేరు. వారిద్దరి సంసారం సంతృప్తికరంగా సాగలేదు. ఫలితంగా విడిపోయేరు.

నటిగా కొనసాగుతూనే వేలాది అనాధశరణాలయాలకి సహాయార్థం అనేక ప్రదర్శనలిచ్చింది మన్రో.

ప్రపంచ ప్రఖ్యాత రచయిత ఆర్థర్ మిల్లర్‌ని వివాహం చేసుకొంది.

30 చిత్రాల్లో నటించి 36వ ఏట నిద్రమాత్రలు మింగి మహానటి మార్లిన్ మరణించింది. అయితే ఆమెది హత్యా, ఆత్మహత్యా? అన్న విషయం ఈనాటికీ వివాదాస్పదంగానే మిగిలిపోయింది. ●



ఇంట్లోవున్న నాటు కోడిపెట్టల్ని చూసి ధనాధ న్‌కి లేబర్స్అంటే చాల ఇష్టం, వాటిని ఎంతో ప్రేమగా పెంచుతుంది అని రాశాడో జర్నలిస్టు. అదంతా నేపెట్టిన పెసరట్ల మహిమ అని నాకే తెలియదు. స్వయంగా చూస్తే కాని నేనేది నమ్మను" అంది వెటకారంగా దమయంతి.

ఆమె మాటలకి విజయేంద్రకి కోపం రాలేదు కాని, ఆమె చొరవకి, మాటకారితనానికి విస్తుపోతూ చూస్తున్నాడు.

"అయితే మీతో కరాటే చెయ్యాలంటారా?" అనడిగింది నీత.

"దమ్ముంటే రమ్మను" అంటూ లేచి నిలబడింది దమయంతి.

"కూర్చోండి, కూర్చోండి. ఆడవాళ్ళతో కలబడేంత దిగజారి పోలేదు నేను" అన్నాడు విజయేంద్ర.

"అదిగో మళ్ళీ ఆడవాళ్ళని హేళన చేస్తున్నారు మీరు!" అంది కోపంగా దమయంతి.

ఇంతలో షాట్ రెడీ అయ్యిందని దమయంతికి రమ్మని కబురు రావడంతో లేచి నిలబడి "వస్తాను విజయ్‌బాబూ, టేక్ ఓ.కె. చేసి మళ్ళీ వస్తాను. వదిలేసేననుకోకు" అంటూ గబగబా పరిగెత్తినట్లు వెళ్ళిపోయింది దమయంతి.

"మానర్‌లెస్" అంది నీత ఆమె వెళ్ళిన వైపు చూస్తూ.

విజయేంద్ర నీత వైపు ఆశ్చర్యంగా చూస్తూ "ఎందుకలా అంటున్నారు?"అన్నాడు.

"లేక పోతే మీరంటే ఏం చనువుందని అలా బిహేవ్ చేస్తున్నది. ఇప్పుడే కదా పరిచయం! అప్పుడే ఏకవచనం లోకి వచ్చేసింది!" అంది పళ్ళు కొరుకుతూ.

"అందువలనే పైకి రాలేక పోయింది" అన్నాడు అదే ఛాన్సుగా పి.ఏ. ప్రసాద్.

"అంతలా తీసిపారెయ్యకండి ఆవిడ్ని! ఆ పిల్ల చాలా భోళామనిషి. కడుపులో ఏమీ దాచుకోలేదు. ఈ హిపోక్రెటిక్ ఫిల్మ్ ఫీల్డ్‌లో అలాంటి ఫ్రాంక్‌పీపుల్ చెలామణి కావడం చాలకష్టం! అందుకే వేషాలు ఎక్కువ దొరకవు పాపం!" అన్నాడు డైరక్టర్ సుబ్రమణ్యం.

షాట్ రెడీ కావడంతో విజయేంద్ర మరేం మాట్లాడకుండా సెట్‌లోకి నడిచేడు.

ముందురోజు మిగిలి పోయిన పాట నీతాతో చిత్రీకరించేడు డైరక్టర్.

సాయింత్రం షూటింగ్ పూర్తికాగానే పరుగున తిరిగొచ్చింది దమయంతి.

దమయంతిని చూడగానే నీతా మొహం ముడుచుకు పోయింది.

"ఏంటీరోజు మా హీరోని పట్టించేరు?" అంది అసూయగా.

"ఈ వేంప్ బారి నుండి వదిలించాలని" అంది దమయంతి కొంటెగా.

ఆ జవాబుకి అందరూ గొల్లున నవ్వేసరికి నీతా మొహం మాడిపోయింది.

"మనం ఇంటికి బయల్దేరుదామా సర్!" అన్నాడు పి.ఏ. దమయంతితో విజయేంద్రని మాట్లాడనిచ్చే అవకాశం నుండి తప్పించాలని.

"ఉండవయ్యా నాయినా! ఈరోజు హీరోగారిని మా ఇంటికి తీసుకెళ్ళాలి!" అంది దమయంతి.

"ఏంటో విశేషం?" అన్నాడు డైరక్టర్.

"ఆయన ఎవరిళ్లకూ రారు" అంది నీత ఖచ్చితంగా.

"ఆయన బదులు మీరంతా మాట్లాడేస్తున్నారేంటి? మీ హీరోకి డబ్బింగ్ చెప్పేదెవరు?"

"ఎందుకు?" అన్నాడు విజయేంద్ర.

"వాళ్ళతోనే మాట్లాడుదామని!"

"ఆ అవసరం లేదు లెండి. నేనే నా డైలాగ్స్ చెప్పుకుంటాను" అన్నాడు విజయేంద్ర.

"బ్రతికించేవ్ తండ్రీ! అయితే ఇప్పుడు మీరు కాదనకుండా మా ఇంటి కొస్తున్నారు. పదండి. మీ కారెక్కడ?"

"ఆయన చస్తే ఎవరింటికీ రారు. బెట్!"

నీతా వైపు-సీరియస్‌గా చూసింది దమయంతి.

"ఏమిటంత ధీమాగా చెబుతున్నావు. ఆయన్ని తీసుకెళ్ళే బాధ్యత నాది!" అంది దమయంతి గట్టిగా.

"ఇప్పుడు కొదిలేయండి. ఇంకోసారి చూద్దాం" అన్నాడు విజయేంద్ర ఇబ్బందిగా.

"మీ ఇష్టం. అప్పుడు మీరు రావాల్సిన అవసరం ఉండక పోవచ్చు" అంది దమయంతి నీరసంగా.

"ఎందుకని?"

"మా అమ్మగారు మీ అభిమాని. ఉత్త అభిమాని కాదు వీరాభిమాని. చనిపోయేలోగా మిమ్మల్నోసారి చూడాలన్నది ఆమె కోరిక. అదే సినిమారంగంలో కాస్తో కూస్తో పేరున్న నటిగా మిమ్మల్ని కలిసి తీసుకు రాగలననే ధీమాతో ఆమెకు మిమ్మల్ని చూపిస్తానని ప్రామిస్ చేసేను. ఆ భరోసాతోనే మంచమెక్కిన ఆవిడకి ఈరోజు తప్పకుండా తీసుకొస్తానని చెప్పి వచ్చేను. మీ కభ్యంతరమైతే వద్దులెండి." ఆ మాట చెబుతుండగా దమయంతి కళ్ళలో లీలగా తడి మెరిసింది.

విజయేంద్ర మనసు చివుక్కుమంది.

ఆ కథ విన్న చుట్టూ వారు కూడ ఆర్ద్రంగా చూశారు.

"ఆవిడకేమిటి జబ్బు?" విజయేంద్ర ఆతృతగా ప్రశ్నించేడు.

"పక్షవాతం. ఇక రోజులనే చెప్పేరు."

"అయామ్ వెరీసారీ దమయంతిగారూ! ఇప్పుడే మీ వెంట వస్తున్నాను నేను" అన్నాడు విజయేంద్ర.

"చాల థాంక్సండీ" అంది దమయంతి ఆనందంగా.

నీతా వెంటనే అక్కణ్నుంచి అసూయగా వెళ్లి తన కారెక్కింది.

విజయేంద్ర వెంట వస్తుంటే ఆనందంగా ముందుకి నడిచింది దమయంతి.

*** ** ** ** ***

మాటకి మాటయితే చెప్పి రాగల్గింది గాని నిఖిలేశ్వరి ఇంటికి చేరేసరికి పడదెబ్బ తిన్నట్టుగా సోలి పోయింది.

'ఇంటికి పిలిచి ఎంతగా అవమానించేడు! రంగు పూసుకొని నటించే వాళ్ళు మనుషులు కారా! సాయంత్ర మయ్యేసరికి సినిమా సినిమా అంటూ తొక్కిసలాడుకొంటూ హాల్సు చుట్టూ మూగుతారే! టి.వి.ల ముందు రెప్ప వేయకుండా పిన్నా, పెద్దా కూర్చుని చూస్తారే! ఆ నటులే లేకపోతే వీరిని ఆనంద పరిచే దెవరు? రిక్రియేషన్ ఎక్కడనుండి లభిస్తుంది! వేసిన ప్రతి పాత్రలోనూ తాదాత్మ్యంతో మునిగి నటించే కళాకారులంటే చిన్నచూపా? హేళనా? సినిమా నటులకి డిగ్రీలు, చదువులూ అబ్బవని అతని ఉద్దేశ్యమా!'

ఆలోచనతో ఆమె మనసు అతలాకుతలమై పోతోంది. ఇంకా ఎక్కువగా ఆలోచిస్తే తల బద్దలై పోతుందని పిస్తోంది. వెంటనే తల విదిలించి ఫ్రిజ్‌లోని చల్లటి నీటిని తీసుకొని మొహం కడుక్కుని మంచి నీళ్ళు తాగింది.

విజయేంద్ర ఇంకా ఇల్లు చేరలేదు.

ఇల్లాంతా బోసిగా, నిర్మానుష్యంగా వున్నట్లు తాను ఒంటరినైనట్లు మొదటి సారిగా ఫీలయ్యింది నిఖిలేశ్వరి.

ఏకాగ్రత కోసం, మానసిక శాంతి కోసం దేవుడి గదిలో కెళ్ళి పద్మాసనం వేసుకొని కళ్ళు మూసుకొని కూర్చుంది కాస్సేపు.

కళ్ళు తెరచి చూడగానే ఎదురుగా, జాలిగా సానుభూతిగా తన అంతరాంతరాల్లోకి నిశితంగా చూస్తున్నట్లు శిరిడి సాయిబాబా పటం కనిపించింది. ఆమె ఎంతో తేలికగా ఫీలయింది. వెంటనే అతనికి నమస్కరించింది. పదిహేను నిముషాల్లో అల్లకల్లోలమైన ఆమె అంతరంగం ప్రశాంత నిలయంగా మారింది. తిరిగి మామూలు మనిషయి హాల్లోకి వచ్చింది. ఆమె హాల్లోకి రాగానే ఫోను గణగణమంటూ మోగింది. ఆమె స్వాంతన చిక్కిన మనసుతో రిసీవర్ అందుకొని "హలో" అంది.

"ఆంటీ!" ఆ గొంతు పీయూషది.

మనసు లయ తప్పుతుంటే అదుపులోకి తెచ్చుకొని "ఎస్!" అంది.

"ఆంటీ, విజయ్ లేడా? "

రైలు మార్గం కానున్న "గ్రేట్ సిల్క్ రూట్"

ఆసియా - యూరప్ ఖండాలను కలిపే "గ్రేట్ సిల్క్ రూట్" త్వరలోనే రైలు మార్గంగా రూపుదిద్దుకుంటోంది. ఈ మార్గం ద్వారా ఆగ్నేయాసియాలో నుంచి యూరప్ ఖండానికి సరకు రవాణా చేసేందుకు వీలు కలుగుతుంది.

1957లో చైనా అధినేత మావో సేటుంగ్ కజఖ్‌స్థాన్ పర్వత శ్రేణుల మీదుగా సోవియట్-చైనా భూభాగాల మధ్య రైలు మార్గం నిర్మించాలని ప్రతిపాదించగా అప్పటి సోవియట్ ప్రధాని నికిత కృశ్చేవ్ ఆ ప్రతిపాదనను ఆమోదించారు. తమ దేశాల సరిహద్దుల వరకూ ఆ యా ప్రభుత్వాలే ఈ రైలు మార్గాన్ని నిర్మించాలన్న కృశ్చేవ్ ప్రతిపాదనల మేరకు సోవియట్ కార్మికులు సరిహద్దుల దాకా రైలు మార్గం నిర్మించారు కాని చైనాలో మాత్రం నిర్మాణం జరగలేదు. ఆ తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు చెడిపోయి రైలు మార్గ నిర్మాణం ఆగిపోయింది. ఇప్పుడు మళ్ళీ చైనా-సోవియట్ సంబంధాలు మెరుగు పడిన ఫలితంగా ఈ రైలు మార్గం పునఃప్రారంభమైంది.

1992లో క్సిన్‌జియాంగ్ - కజఖ్‌స్థాన్ అంతర్జాతీయ రైల్వే పని చెయ్యటం ప్రారంభిస్తుందను కుంటున్నారు.

ఈ రైలు మార్గం ద్వారా జరిగే రవాణావల్ల మలేషియా, హిందూ మహా సముద్రం, సూయజ్ కాల్వ, మధ్యధరా సముద్ర ప్రాంతాల ద్వారా జరిగే రవాణా వ్యయంలో 20 శాతం ఆదా చేయవచ్చునట.

“లేదమ్మా, షూటింగ్‌కి వెళ్ళేడు.”

“సరే! ఆంటీ! నిన్న నువ్వు హెచ్చరించేక బాగా ఆలోచించేను. నీకు నిజం చెప్పేస్తున్నాను ఆంటీ! అయ్ లవ్ విజయేంద్ర! అయ్ వాంట్ టు మేరీ హిమ్! ఇక మీ ఆశీర్వాదం.... ”

“ఆగాగు. అంత స్పీడు పనికిరాదు. నా సంగతి సరే! మీ డాడీ ఆశీర్వాదం సంగతి ఎప్పుడైనా ఆలోచించేవా? ” అంటూ సూటిగా అడిగింది నిఖిల.

“వాట్ ఆంటీ! నీ ఆశీర్వాదం కష్టం, ఎందుకంటే విజయ్‌కి అభిమానులు విపరీతం. ఫాయిన్ ఎక్కువయ్యే కొలది ఎన్నుకోవడం కష్టమైపోతుంది. విజయ్ లాంటి అల్లుణ్ణి డాడీ ఎప్పటికీ వదలు కోరు. ”

“అక్కడే మీ పిల్లలు దెబ్బతినేది. ఎన్నడైనా ఈ విషయంలో మీ నాన్నగారిని కదిపి చూశావా?”

“లేదు. ”

“ఆ అవసరం లేదను కొన్నావా? ”

“లేదాంటీ, ఆ అవసరం గురించి ఆలోచించలేదు. ”

“అయితే ఇప్పుడాలోచించు. ఒకవేళ మీ డాడీ కాదంటే ఏం చేయాలో కూడ ఆలోచించు. ప్రేమ గొప్పదే! దానికి బానిసయితే మాత్రం వైఫల్యానికి తట్టుకోలేక ఏదైన సాధించడానికి శక్తి కల్గివున్న మీ యువరక్తం నిర్వీర్యమైపోతుంది. అలా కాకూడదన్నదే నా ప్రగాఢ వాంఛ!”

“నువ్వేం మాట్లాడుతున్నావో అర్థం కావడం లేదాంటీ!”

“ఖర్మ! ఈ ఇంగ్లీషు మీడియం తెలుగు పిల్లలు ఏడుపొస్తే కూడ ఇంగ్లీషులోనే ఏడుస్తారు కాబోలు! ”

“తిడుతున్నావా ఆంటీ!” ఏడుపు గొంతుతో అడిగింది పీయూష.

“లేదమ్మా, ఆశీర్వదిస్తున్నాను. ఇండియా తిరిగి రాగానే మీ నాన్నగారితో ఈ సంగతులు మాట్లాడు. నా ఆశీర్వాదం నీకెప్పుడూ వుంటుంది ” అంటూ రిసీవర్ పెట్టేసి అలసటగా సోఫాకిజేరబడింది నిఖిల.

వెంటనే ఫోను మళ్ళీ రింగయింది.

నిఖిలేశ్వరి కీసారి ఓర్పు నశించింది.

దుడుకుగా రిసీవర్ అందుకొని “ మాటిమాటికి ఫోను చేస్తే బిల్లు ఎంతవుతుందో ఆలోచించేవా? సంపాదనలోని కష్టం తెలియక పెద్దవాళ్ళు సంపాదించింది ఇలా వృధా చేయడం మంచి పనికాదు” అంది సీరియస్‌గా.

“నిఖిలా!”

ఆ గొంతు వినగానే ఆమె ఉలిక్కిపడింది.

“చాల రోజులు... రోజులేం ఖర్మ..... చాల సంవత్సరాలయింది కదూ, మనం మాట్లాడుకొని, బాగున్నావా?”

“ఎందుకు ఫోను చేసినట్లు? ” అరగంట క్రితం దిటవు పడిన మనసు గాలికి విడిపోయే మబ్బులా చెదరిపోతున్నది.

“భర్త భార్యకి ఫోను చెయ్యడానిక్కూడ కారణాలుండాలా?”

“ ఆ సంబంధం పోయి పదిహేనేళ్ళు దాటింది.”

“వివాహ బంధం అంత తేలిగ్గా విడిపోయేదంటావా? ”

అతని ప్రశ్నకి నిలువెల్లా భగ్గుమంది నిఖిలేశ్వరికి.

“ఇలాంటి పనికి మాలిన సెంటిమెంట్లని నమ్మి తిరిగి మిమ్మల్ని రానిస్తాననుకొంటున్నారేమో! నా దృష్టిలో మీరు ఎప్పుడో పరాయి వారయ్యేరు. మీకు ఎలాంటి విలువా నేను ఇవ్వదలచుకోలేదు ” అంది ఖచ్చితంగా.

బదులుగా అతను నవ్వేడు.

“ఎందుకు నవ్వు? ”

“విలువ ఇవ్వడం లేదని మరో ప్రక్క విలువ ఇచ్చి మన్నిస్తుంటే నవ్వురాదా? ”

“నేను మిమ్మల్ని గౌరవించడం అసంభవం! ”

“ఒక పక్క నేను నిన్ను ఏక వచనంలో సంబోధిస్తుంటే నువ్వు మీరని గౌరవిస్తూ మాట్లాడుతున్నావు. అది చాలదా నీవింకా నన్ను మన్నిస్తున్నావని, మగవాడి అధికారాన్ని ఒప్పుకుంటున్నావని చెప్పడానికి!”

ఆ మాటకి నిఖిలేశ్వరి దెబ్బ తిన్నట్లుగా చూసింది.

“పరాయి వారిని స్త్రీ పురుష భేదం లేకుండా గౌరవించి సంబోధించడం సంస్కారవంతుల లక్షణం! అది మీకు లేనందుకు విచారిస్తున్నాను.”

“నిఖిలేశ్వరీ! ”

“ఎందుకంత కోపం పాపం!” వెక్కిరించినట్లడిగింది.

“నీ స్వభావం నాకు తెలుసు! ఒకరి చెంత అణిగీ మణిగీ పడివుండే స్వభావంకాదు నీది. ఓటమిని కూడ గెలుపుగా భావించే అహంకారివి! పైకి వస్తున్న భర్తనే చూసి సహించలేక అతని ఎదుగుదలని అణచివేసిన దుర్మార్గురాలివి! ”

“షటప్! నా విలువైన కాలాన్ని మీ ఫోనులతో నీతులతో వృధా చేయవద్దు ” అంటూ రిసీవర్ని విసురుగా క్రెడిల్ చేసింది నిఖిలేశ్వరి.

ఫోను తిరిగి మోగింది.

నిఖిలేశ్వరి కాస్సేపు అలానే కూర్చుంది నిస్సత్తువగా.

ఫోను రింగింగ్ ఇల్లంతా మార్మోగుతోంది.

ఆమె వెళ్ళి విసురుగా రిసీవర్ అందుకొంది.

“నేను చెప్పవలసింది చెప్పకుండానే రిసీవర్ పెట్టేస్తావేంటి? కరంచంద్ గాంధీ గారింటికి వెళ్ళొస్తున్నావేంటి? ఏదైనా క్రిమినల్ కేసులో ఇరుక్కున్నావా? ”

ఆ మాటకి చెళ్ళున దెబ్బతిన్నట్లయింది నిఖిలకి.

“కాంట్రాక్టు పోయేక గూఢచారి వృత్తి చేపట్టినట్లున్నావు! ” అంది కోపంగా.

“ఓహో! మర్యాద మారిందన్నమాట! కరంచంద్ అంటే రాజుకొన్న నిప్పు! నిఖార్సయిన మనిషి. అతనికి కోపం వస్తే ఖాండవ దహనం చేస్తాడు. బికేర్‌ఫుల్!”

మరాఠీ తెరపై బప్పీలహరి



హిందీ చలన చిత్రరంగ సంగీత సామ్రాజ్యంలో తనకంటూ ఒక సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న బప్పీలహరి మరాఠీ చిత్ర రంగంలోకి ప్రవేశించాడట.

‘ధోకయ్‌లా తాప్ నహీ’ అనే మరాఠీ చిత్రానికి సంగీత సారథ్యం వహించటమే కాదు, నేపథ్య గానంతో పాటు నటిస్తున్నాడట కూడా. ఈ చిత్రం త్వరలో పూర్తి కావస్తోంది.

మరాఠీ చిత్ర రచయిత, నిర్మాత, దర్శకుడు-పురుషోత్తం బర్డే చిత్రం ‘హమాల్ దే ధమాల్’ 50 రోజులు పూర్తి చేసుకొని శతదినోత్సవానికి పురకలేస్తోందట. మరి బప్పీలహరి సంగీత సారథ్యం వహించిన చిత్రం కూడా ఆ అదృష్టానికి నోచుకోగలదని ఆశిద్దాం!



క్రీడారంగం క్విజ్



(1) ఒక దేశం ప్రముఖ "చెస్" క్రీడాకారుని చిత్రంతో స్టాంపులు ముద్రించింది? ఏ దేశం? ఆ ప్లేయర్ ఎవరు?

(2) గాబ్రియేలా సబటిని ఇప్పటి వరకు ఎన్నిసార్లు గ్రాండ్‌శ్లామ్ టైటిల్ టోర్నమెంట్ ఫైనల్స్‌కు వచ్చింది? (ఆగస్టు 1989 నాటికి)

(3) ఒకే టెస్ట్‌లో పది కన్నా ఎక్కువ వికెట్లు తీసుకొన్న మొట్టమొదటి బౌలర్ ఎవరు?

(4) ప్రపంచ విశ్వవిద్యాలయ క్రీడల (యూనివర్శియాడ్) గుర్తు ఏమిటి?

(5) 'ది కైజర్' అని పిలువబడే ఫుట్‌బాల్ క్రీడాకారుడు ఎవరు?

(6) 'వరల్డ్ కప్ హాకీ'ని భారత్ ఏ సంవత్సరం గెలుచుకొంది? అప్పుడు కెప్టెన్ ఎవరు?

(7) 'టుపోల్ విత్ హాకీ' అనే పుస్తకం వ్రాసింది ఎవరు?

(8) 'షెర్రీ' అని నిక్‌నేమ్ ఎవరి కుంది?

(9) జాతీయ స్త్రీల చెస్ ఛాంపియన్‌షిప్ గెలుచుకున్నదెవరు?

(10) 'వింబుల్డన్ హైలైట్స్' భారత టి.వి.కి అందించిన సంస్థ ఏది?

-జై.కి.

జవాబులు ఈ సంచికలోనే

సూపర్ హీరో

" నీ సలహా అవసరం లేదు. నాకుగా నేను మంచి చెడులు యోచించ గల శక్తి నాకుంది!"

"ఆ ఇగో యే నిన్ను భర్తకి దూరం చేసింది. చివరికి కొడుకుకి కూడ దూరమయ్యే దుస్థితి రాగలదని హెచ్చరిస్తున్నాను."

"నీ హెచ్చరికల అవసరం నాకు లేదు. అడ్డదారినే పైకి రాగలమనుకునే వారికి అధః పాతాళానికి వెళ్ళే దుస్థితి తప్పదు. నా విజ్ఞ నీతికి కట్టుబడే మనిషి! వాడెన్నడూ నాకు దూరం కాడు. కాలేడు. "

"చూద్దాం. "

"చూస్తుండడమే మీ పని! " అంటూ నిఖిల రిసీవర్ని క్రింద పెట్టేసి సోఫాకి జేరబడి కళ్ళు మూసుకొంది. తనకి ఇగో వుందా!

ఒక వ్యక్తిత్వంతో, ఆశయంతో బ్రతకడం ఇగో అయితే ఆ ఇగోలేని మనుషులు లెక్కకేగాని నిజానికి మనుషులు కాలేరు. తమ కోసమే తాముగా బ్రతికే వాళ్ళకి ఇతరుల కోసం బ్రతికే మనుషుల ఔన్నత్యం ఏ విధంగా అర్థమవుతుంది.

ఓటమికి సిగ్గు పడకుండా దాన్నే గెలుపుగా భావిస్తూ జీవించే మనుష్యులకి ఆత్మ గౌరవం గురించి ఏమర్థమవుతుంది!

పదిహేను సంవత్సరాల క్రితం నీతికి కట్టుబడి కోర్టు ద్వారా విడిపోయినా అతను తనని వేటాడటం మానలేదు. తన పతనం, కన్నీరు చూడాలనే ఆకాంక్షని చంపుకోలేదు.

తనని నీడలా వెంబడిస్తూనే వున్నాడు.

లా ప్రకారం విడిపోయి కూడ భర్త అధికారాన్ని ప్రదర్శించాలనే తపన, తన ఓటమిని చూసి ఆనందించాలనే శాడిజం అతనిలో పుష్కలంగా వున్నాయి.

ఆమె అనుకోకుండానే గతంలోకి జారిపోయింది.

5

నిఖిలకి ఇరవైయ్యేకటో సంవత్సరం.

జూనియర్ ఇంజనీరుగా ఇరిగేషన్ డిపార్టుమెంటులో జాయినయ్యింది. ఆమె టెక్నికల్ సైడ్ రావటం ఆ ఆఫీసులో క్రొత్త. బదులుగా మగవారి కనుబొమ్మలు అసూయతోనూ, ఈవిడేం చేయగలదులే అనే వెటకారం తోనూ పైకి లేచేయి. ఆమె బి.ఇ.లో యూనివర్శిటీ ఫస్టుగా గోల్డు మెడల్ సాధించడాన్ని కొందరు దుయ్యబట్టేరు.

'థియరీ బట్టీ పట్టి, లెక్చరర్స్‌ని కాకా పట్టి సెక్షనల్స్ సాధిస్తే యూనివర్శిటీ ఫస్టు రాకేం చేస్తుంది' అంటూ బాహాటంగానే అన్నాడొక జె.ఇ.

నిఖిల జవాబు చెప్పలేదు.

కారణం టెక్నికల్ సెక్షన్‌లో ఆమె ఒకే ఒక స్త్రీ! తానెంత బాగా చదివి వచ్చినా వర్క్ విషయంలో కొలీగ్స్ అవసరముంటుంది. తాను పని నేర్చుకొనే వరకు వారి సహకారం కావాలి. ఆ సెక్షన్‌లో హెడ్ డ్రాఫ్ట్స్‌మన్ ఐ.టి.ఐ. కాండిడేట్. సీనియారిటీమీద అతను ఫస్టు గ్రేడు సంపాదించేడు. అతనా సెక్షన్‌కి హెడ్. ఆ డ్రాయింగ్ బ్రాంచ్‌లో తనుగాక మరో ఇద్దరు బి.ఇ. చేసిన జూనియర్ ఇంజనీర్లు, ముగ్గురు డిప్లొమా హోల్డర్స్, నల్గురు ఐ.టి.ఐ. చేసిన డ్రాఫ్ట్స్ మాన్లు, ఇద్దరు ట్రేసర్లు, ఒక బి.పి.వో. వున్నారు. అదిగాక డిజైనింగ్ చేయడానికి మరో సెక్షన్ వుంది. అందులో అందరూ బి.ఇ.గాని, ఎమ్.ఇ.గాని చేసిన ఇంజనీర్లే వున్నారు. వారితో కలిసి పనిచేస్తే తనకి, తన చదువుకి కొంత సార్థకత చేకూరుతుందని ఆమెకి ఆశగా వుండేది. కాని అందుకు పి.ఏ. ఒప్పుకోలేదు.

"నువ్వు ఆడపిల్లవి. కాలేజి నుండి ఎకాయెకి వచ్చిన దానివి. ఆఫీసు వర్కు నేర్చుకోవాలంటే కొంతకాలం డ్రాయింగ్ బ్రాంచ్‌లో పని చేయక తప్పదు. తర్వాత నీ పని సంతృప్తికరంగా వుంటే డిజైన్ వింగ్‌కి పంపుతాము" అని చెప్పేడు.


నిఖిల గత్యంతరం లేక జాయినయ్యింది.

(ఇంకా ఉంది)

లేదండి...!

"కీర్తనాయిలుందా?"
"లేదు"
"వంచటూరుందా?"
"లేదు."
"సిగరెట్లున్నాయా?"
"లేవు."
"బుద్ధుందా?" అరిచాడు అప్పారావ్.
"లేదండి" అన్నాడు కొట్టువాడు ఏదో ఆలోచిస్తూ!

-ప్రసాద్


ఏమిటో? ఈ వూళ్ళో స్థలం కొందామనుకుంటున్నావా,.. నిధి ఏమైనా దొరికిందా?.
సింహాచలం చూడడానికి మీ చెల్లెలు వాళ్ళు భువనేశ్వర్ నుంచి వస్తున్నారా.. ఇంతవరకూ మనమే చూడలేదు..
భలే విశాఖ
రఘు
ఓ వారం రోజులు మా ఇంటికి చుట్టాలొచ్చారు.. వాళ్ళని. బీచ్.కి ఉడా పార్కుకి, హార్బర్ కి, జూకి, ఆటోమీద తీసుకెళ్ళి చూపించాలే..
మీ వూళ్ళో బీచ్ నాకు చాలా నచ్చింది.. ఓ నెలరోజులు ఇక్కడే వుంటా అల్లుడూ....
రఘు
ఆయనకి ఉద్యోగమెందుకు గురూ! ఈ విశాఖపట్నంలొ సొంత ఇల్లు వుంది.. అద్దెలొస్తాయిగా...
రఘు

అమ్మాయి పెళ్ళి

కృష్ణ రూమ్‌కి చేరుకునేసరికి రాత్రి ఏడు గంటలయింది. ఆ సంవత్సరమే కృష్ణకు ఆ కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. ఉద్యోగంలో చేరే వేళకే మొదటి టెరమ్ సగంపైచిలుకు గడిచిపోయింది. అప్పటికి ఆఖరు టెరమ్ పూర్తవవస్తోంది.

పందెపు గుర్రం వేగంతో పాఠాలు చెప్పుకుంటూపోయినా అప్పటికింకా తను పూర్తిచేయవలసిన కోర్సు ఇంకా మిగిలే వుంది. ఏదోరకంగా సిలబసు పూర్తయిందనిపించి స్టూడెంట్సుచేత బల్లలు గుద్దించే టెక్నిక్ కృష్ణకు ఇంకా తెలియదు. ఏదీ! ఇంకా సర్వీసులో చేరి ఒక్క విద్యా సంవత్సరమన్నా గడవలేదుకదా! తాను చెప్పింది విద్యార్థులకు పూర్తిగా అర్థం కావాలనే చాదస్తం చాలావుంది కృష్ణలో.

అందుకే ఎక్‌స్ట్రా క్లాసులుపెట్టి పాఠాలు చెప్పుకుంటూ పోతున్నాడు కృష్ణ. రూమ్‌కు చేరడంలో ఆలస్యానికి అదే కారణం.

రూమ్ తాళం తీసి తలుపు తెరిచాడు. తలుపు తెరిచేటప్పటికి తలుపు సందునుండి కవరు వంటిది ఒకటి జారి కిందపడింది.

తనకు వచ్చిన ఉత్తరాలను పోస్ట్‌మన్ అలా తలుపుసందులో దూర్చి వెళ్ళడం మామూలే!

చేతిలో కవరుతో గదిలో అడుగుపెట్టి స్విచ్చి నొక్కాడు కృష్ణ. లైటు వెలుగులో కవరువైపు చూచాడు.

అది తల్లి వ్రాసిన ఉత్తరం.

కవరు తెరిచాడు కృష్ణ.

"శ్రీరస్తు, చిరంజీవి కృష్ణను మీ అమ్మ నిత్యమూ దీవించి వ్రాయునది. ఇక్కడ అందరం కులాసా. అన్నయ్యగారి శ్రీదేవి, మన శ్రీలక్ష్మి కూడా కులాసా.

శ్రీలక్ష్మి పెళ్లి విషయంలో నువ్వుగాని, మీ అన్నయ్యగాని ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదు. మీ అన్నయ్యకు ఎన్నిసార్లో చెప్పాను. చెల్లాయి శ్రీలక్ష్మికి తగిన సంబంధం చూడరా, తరువాత యింకా నీ కూతురు శ్రీదేవి కూడా ఉందిరా అని. 'అలాగేలేవే!' అంటాడు తప్ప ఏ ప్రయత్నమూ చెయ్యడు.

నాయనా కృష్ణా! మీ నాన్నగారే వుంటే చెల్లాయి పెళ్ళికి ఇన్నాళ్ళు ఆలస్యం చేసేవారా? ఇప్పటికే దీనియీడువాళ్ళు పెళ్ళిళ్ళయి పండంటి బిడ్డల్ని కూడా ఎత్తుకున్నారు. ఆడపిల్లకు పెళ్ళి చెయ్యకుండా ఇన్నాళ్ళు అట్టేపెట్టడం మన ఇంటావంటా ఎప్పుడూ లేదు.

అమ్మ ఏదో చాదస్తంగా రాస్తోందని కొట్టిపారెయ్యకుసుమా! నువ్వయినా పూనుకుని ఈ ఏడాదిలో శ్రీలక్ష్మి పెళ్లి అయిందనిపించాలి. ఇరుగుపొరుగులు 'ఏం పిన్నిగారూ! ఈ ఏడాదయినా బూరె ముక్క పెట్టించరా?' అని కొందరూ, 'ఏం వదినా! అమ్మాయిని విడిచిపెట్టి ఉండలేని మమకారంతో ఏకంగా అమ్మాయి పెళ్ళే వాయిదా వేస్తున్నావా?' అని కొందరూ వేళాకోళంకూడా చేస్తున్నారురా కృష్ణా!

అందుచేత నువ్వు ఏలాగో ఓలా వీలు చేసుకుని ఇంటికి రావాలి. ఏవో రెండు మూడు సంబంధాలు నా చెవినపడ్డాయి. ప్రయత్నం అంటూ చేస్తే ఏదో ఒకటి కుదరకపోదు.

ఈ తల్లి ఆవేదనను అర్థంచేసుకో!

ఆలస్యంచెయ్యకుసుమా!

ఇట్లు మీ అమ్మ,
రామలక్ష్మమ్మ

అని వుంది ఉత్తరంలో.

కూతురి పెళ్ళికోసం పరితపించే తల్లి హృదయాన్ని అర్థంచేసుకున్నాడు కృష్ణ. కళ్ళు కూడా కాస్త చెమర్చకపోలేదు. తల్లి చెప్పిన మాట నిజమే! తమ అన్నదమ్ము లిద్దరూ పూనుకొని చెల్లెలి పెళ్ళి జరిపించాలి. మరి అన్నయ్య ఎందుకు పట్టించుకోవడంలేదో!

భమిడిపాటి భాస్కర రామారావు

అతడి బాధలు అతడికీ ఉంటాయని మనసు సరిపెట్టుకుందుకు ప్రయత్నించాడు కృష్ణ.

కాని నిలుచున్నపాళాన తాను బయలుదేరడానికి వీలులేని పరిస్థితి. తానా కొత్తగా సర్వీసులో చేరాడు. చెప్పవలసిన పాఠ్యాంశాలా ఇంకా పూర్తికాలేదు. ఇలాటి సమయంలో ప్రిన్స్‌పాల్‌గారు సెలవు ఇస్తారో యివ్వరో? అయినా మరోసారి అన్నయ్యకు ఉత్తరం వ్రాసి చూద్దాం అనుకున్నాడు.

వారం గడిచింది. పదిరోజులు గడిచాయి. అన్న నుండి మాత్రం ఏ ఉత్తరమూ రాలేదు.

పదిహేనురోజులు గడిచాయి. సాయంత్రం గది తాళం తీసేసరికి కవరొకటి జారి కిందపడింది.

కృష్ణకు ఏనుగెక్కినంత సంబరమైంది. 'చివరకు అన్నయ్య ఉత్తరం వ్రాశాడన్నమాట' అని నవ్వుకుంటూ స్విచ్చి నొక్కాడు.

లైటు కాంతిలో కవరు చూడగానే కృష్ణ నవనాడులూ క్రుంగిపోయాయి. అది అన్నగారు వ్రాసిన ఉత్తరం కాదు. ఆ ఉత్తరమూ తల్లి వ్రాసినదే!

ఉత్తరం తెరిచాడు కృష్ణ. తాను ఉత్తరం రాసిన పక్షం రోజులు గడిచిపోయినా, కనీసం జవాబుకూడా రాయలేదని నిష్ఠూరంగా రాసింది తల్లి.

'అంటే? అన్నయ్య కనీసం తాను రాసిన ఉత్తరం సంగతి కూడా అమ్మకు చెప్పలేదన్నమాట' మనసులో బాధపడ్డాడు కృష్ణ.

కృష్ణ తిరిగి ఉత్తరంలోకి దృష్టి మళ్లించాడు.

వచ్చేమాసంలో మూఢమి వస్తుందనీ, ఆ తరువాత నెల శూన్యమాసం కనుక వెంటనే చెల్లెలి పెళ్ళి వ్యవహారం చూడాలని వ్రాసింది రామలక్ష్మమ్మ. రాయడం మాత్రం కాస్త ఘాటుగానే రాసిందావిడ.

ఇక తాను ఏదో చేస్తేకాని లాభం లేదనుకున్నాడు కృష్ణ. కేలండరువైపు చూచాడు. ఆ రోజు గురువారం. వచ్చే శనివారం రెండవ శనివారం. కాలేజీకి సెలవు. మరునాడు ఎలాగూ ఆదివారం. సోమ, మంగళవారాలు రెండు రోజులూ ఏవో ప్రభుత్వ సెలవుదినాలు. ఇదీ మన మంచికే అనుకున్నాడు కృష్ణ. శనివారంనాడు అరు

నూరయినా నూరు ఆరయినా బయలుదేరి తీరాలనుకున్నాడు.

ముందుగా అనుకున్నవిధంగా శనివారం తెల్లవారుఝామున బయలుదేరాడు కృష్ణ. ఆ పగలంతా రైలులోనూ, బస్సులోనూ ప్రయాణంచేసి సాయంత్రం ఆరుగంటల వేళకు సొంతవూరు చేరుకున్నాడు.

కొడుకును చూచి తల్లి మొహం చాటంతయింది.

"లేరా కృష్ణా! స్నానం చెయ్యి. ఈలోగా నేను భోజనం వడ్డిస్తాను" అంది రామలక్ష్మమ్మ.

"ఏమయ్యా మరిదీ! కులాసాయేనా?" అంటూ ఎదురు వచ్చింది వదినగారు.

"చిన్నన్నయ్యా!" అంటూ శ్రీలక్ష్మి, "బాబాయ్!" అంటూ శ్రీదేవి ఎదురు వచ్చి పలకరించారు.

అందరికీ సమాధానాలు చెబుతూ, "మా అన్నయ్య ఏడమ్మా వదినా?" అని అడిగాడు.

"ఊరెళ్ళారయ్యా ఆఫీసుపనిమీద. మరో వారానికిగాని రారు" చెప్పింది వదినగారు.

"అమ్మా! ఏవో సంబంధాలు నీ చెవినిపడ్డాయన్నావు. వాటి వివరాలు చెప్పమ్మా!" అడిగాడు కృష్ణ.

"ఒరేయ్ కృష్ణా! ఎప్పుడో పొద్దు పొడవకుండా రైలెక్కావు. ఇల్లు చేరేసరికి పొద్దుగూకింది. ముందు స్నానంచేసి భోజనం కానియ్యి. కిక్కిరిసిన ప్రయాణంలో ఒళ్ళంతా ముద్దయివచ్చావు. రాత్రి హాయిగా విశ్రాంతి తీసుకో. తెల్లవారాక అన్నీ చెబుతాను" మాతృవాత్సల్యం తొణికిసలాడింది రామలక్ష్మమ్మ కంఠంలో.

తెల్లవారింది. స్నానంచేసి కూర్చున్నాడు కృష్ణ.

చెల్లెలు శ్రీలక్ష్మి పొగలుకక్కుతున్న కాఫీగ్లాసందించింది.

కృష్ణ కాఫీ త్రాగాడు.

తల్లి తన చెవినిపడ్డ సంబంధాల వివరాలు చెప్పింది. మౌనంగా విన్నాడు కృష్ణ. ఆనాడే సంబంధాలవేటలో పడ్డాడు.

ఒకరు తమ తాహతుకుమించి కట్నకానుకలు అడిగితే, మరొకరు యిప్పట్లో తమ కుమారుడికి పెళ్ళి చేసే ఉద్దేశ్యం లేదన్నారు. మరొకరు తమ కూతురు పెళ్ళయితేకాని కొడుకు పెళ్ళిచెయ్యం అన్నారు. ఇంకొకరు "మా అమ్మాయిని నువ్వు చేసుకుంటావా? అప్పుడు మీ చెల్లాయిని మావాడికి చేసుకుంటాం?" అన్నారు.

కృష్ణకు అలాటి కుండమార్పిడి పెళ్ళి యిష్టంలేక నీరసంగా ఇంటికి తిరిగివచ్చాడు. ఇక ఆ మరునాడు తాను బయలుదేరి వెళ్ళాలి.

అనుభవంలేని కృష్ణకు ఎదురైన సంఘటనలతో ఏం చెయ్యడానికీ తోచకుండాపోయింది.

మరునాడు తిరుగుప్రయాణం కట్టాడు.

"ఒరే కృష్ణా! బాధపడకు. అన్నీ మనం అనుకున్నట్టు జరుగుతాయా? అనుకున్నవి అనుకున్నట్టే జరిగితే మనిషికి యిక పట్ట పగ్గాలుంటాయా? ఇంకేం బాధపడకు" అని, "ఇక వీరవరం వెంకట్రామయ్యగారి సంబంధం ఒకటే మిగిలిపోయిందిరా!" అంది రామలక్ష్మమ్మ.

"ఎలాగే అమ్మా! ఇవాళ బయలుదేరితేనేగాని నేను రేపటికి కాలేజీకి చేరుకోలేనుగదా?" అన్నాడు.

"పోనీ ఓ పని చెయ్యరాదూ?" అడిగింది రామలక్ష్మమ్మ.

"ఏమిటది?" అడిగాడు కృష్ణ.

"వీరవరం ఎలాగూ దారిలో ఊరే కదా?" అడిగింది రామలక్ష్మమ్మ.


"అయితే?" కృష్ణ జవాబు.

"వీరవరంలో ఓసారి దిగు. వెంకట్రామయ్యగారింటికి వెళ్లి సంబంధం మాట చెవినివెయ్యి. తరువాత రైల్లో నువ్వు వెళ్ళవచ్చు. మిగిలిన విషయాలు తరువాత చూచుకోవచ్చు" సందేహిస్తూనే చెప్పింది రామలక్ష్మమ్మ.

అది తల్లి చెప్పినంత సులువుకాదని కృష్ణకు తెలుసు. అయినా ఆమె చెప్పిన మాట కాదని మనసుకు కష్టం కలిగించడం యిష్టంలేక 'సరే' అన్నాడు.

దారిలో వీరవరంలో దిగాడు కృష్ణ. వెంకట్రామయ్యగారి యిల్లు సులువుగానే దొరికింది. వెంకట్రామయ్యగారికి వివరాలన్నీ చెప్పి వీలువెంబడి ఒకసారి పిల్లను చూచుకుందుకు రమ్మని చెప్పాడు.

"చూడబ్బాయీ! ప్రత్యేకంగా మేం బయలుదేరివచ్చి పిల్లను చూడనక్కరలేదు. ఫోటో చూపిస్తేచాలు. ఫోటో ఏమైనా



అమ్మాయి పెళ్ళి

తెచ్చావా?" అని అడిగారు వెంకట్రామయ్యగారు.

కృష్ణ తేలేదని చెప్పాడు.

"ఫరవాలేదులే! మీ సాంప్రదాయం నాకు నచ్చింది. తిరిగి వెళ్ళాక మీ పిల్ల ఫోటో పంపించు. తరువాత ఏ సంగతీ మేం తెలియజేస్తాం" అన్నారు వెంకట్రామయ్యగారు.

కృష్ణ సరేనని చెప్పి తిరుగు రైల్లో విశాఖపట్నం చేరుకున్నాడు. కాలేజీలో లంచ్ అవర్లో కూచుని వీరవరం సంబంధం వివరాలతో సహా అన్నగారికి ఉత్తరం రాశాడు. వీలైనంత త్వరలో వెంకట్రామయ్యగారికి ఫోటో అందజేయమని వ్రాశాడు.

పదిహేను రోజులు గడవకుండానే అన్నగారి దగ్గరనుండి ఉత్తరం వచ్చింది కృష్ణకు.

వెంకట్రామయ్యగారి అబ్బాయికి స్టేట్స్‌లో ఫెలోషిప్పు వచ్చినకారణంగా వెంటనే పెళ్ళిచేసి కోడలితోసహా కొడుకును పంపించాలని తొందరచేశారనీ, అందుచేత వచ్చే శుద్ధ ఏకాదశినాడే పెళ్ళి ముహూర్తం నిశ్చయించవలసి వచ్చిందనీ రాస్తూ, వీలయినంత తొందరగా రమ్మని రాశాడు కృష్ణకు అన్నగారు. ముహూర్త సమయం వగైరా వివరాలు కూడా రాశాడు.

అన్నగారి ఉత్తరం చూచి కృష్ణ బ్రహ్మానందపడ్డాడు. ఉత్తరానికి నాలుగుమూలలా అంటించిన పసుపులో, పసుపు పారాణి కాళ్ళతో, ముఖాన కల్యాణ తిలకంతో, బుగ్గన చాదు చుక్కతో పెళ్ళికూతురు వేషంలోవున్న ముగ్ధమనోహరమయిన చెల్లి ముఖం కనిపించింది. మరికొద్దిసేపటిలో ఆ పారవశ్యంనుండి బయటపడి సెలవు దరఖాస్తుతోబాటు ప్రిన్సిపాల్‌గారి ముందు నుంచున్నాడు కృష్ణ.

సెలవు దరఖాస్తు ఆయనముందు పెట్టాడు కృష్ణ.

ఆయన ముక్కుదూలాలగుండా కృష్ణ అందించిన కాగితంవైపు తీక్షణంగా చూచి, ముఖభంగిమలో ఏ మార్పూలేకుండా తల పైకెత్తి, జారిపోతున్న అద్దాలను పైకెగదోసుకుంటూ కృష్ణవైపు చూచారు.

కృష్ణ మంచిబాలుడిలా వినయంగా నిలబడివున్నాడు.

"చూడండి మిష్టర్ కృష్ణా!" ప్రిన్స్‌పాల్‌గారే అందుకున్నారు "మీ కుర్ర లెక్చరర్స్‌తో వచ్చిన చిక్కే యిది. చీటికీమాటికీ సెలవులంటారు. కాదంటే కోపం! కాస్త సెన్స్ ఆఫ్ డ్యూటీ ఉండాలయ్యా!" అన్నారు.

కృష్ణ సవినయంగా విషయం అంతా వివరించాడు. మూలల పసుపు గుర్తులతో వున్న అన్నగారి ఉత్తరం కూడా చూపించాడు.

ఇన్నిచేసినా ఆయన "చూడండి మిష్టర్ కృష్ణా! మీ సబ్జక్టు తాలూకు కోర్సు యింకా పూర్తయినట్టులేదు. పరీక్షలలోగా కోర్సు పూర్తికాకపోతే స్టూడెంట్స్ నా కొంపపీకి పందిరివేస్తారు. అయాం సారీ!" అన్నారు.

కృష్ణ ప్రాధేయపడ్డాడు.

"మీ హెడ్ ఆఫ్‌ది డిపార్ట్‌మెంట్‌చేత రికమెండు చేయించుకురండి. అప్పుడు మీ సెలవు శాంక్షన్‌చెయ్యడానికి నాకేం అభ్యంతరంలేదు." బట్టతల నిమురుకుంటూ అన్నారు ప్రిన్స్‌పాల్.

ఆ తంతులన్నీ ముగించుకుని సెలవు సంపాదించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది కృష్ణకు. ఆ మరునాటి రాత్రికే పెళ్ళి. తెల్లవారితే కాని రైళ్ళేమీ లేవు.

తెల్లవారుఝామున చచ్చిచెడి ఆటోవాలా అడిగినంతా ముట్టచెప్పి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు కృష్ణ. హడావిడిగా టిక్కట్టు కొనుక్కుని ఫ్లాట్‌ఫాం మీదకు చేరుకునేసరికి చావుకబురు చల్లగా తెలిసింది.


తనెక్కవలసిన రైలు మూడుగంటలు లేటు!

ఎలాగైతేనేం రైలుప్రయాణం పూర్తయ్యేసరికి చీకటిపడింది. వాచీ చూచుకున్నాడు. తమ ఊరికి చేర్చే ఆఖరుబస్సు టైము అవవస్తోంది. ఆఘమేఘాలమీద ప్రయాణించి బస్సుస్టేషన్‌కు చేరుకున్నాడు.

'ప్రజాసేవయే మా కర్తవ్యం' అన్న నినాదానికి సజీవ ఉదాహరణంలా ఉంది బస్సు. చీమ దూరడానికి కూడా సందులేనంతగా కిక్కిరిసి ఉన్నారు బస్సులో జనం. అభిమన్యుడు పద్మవ్యూహాన్ని ఛేదించుకుని ముందుకు పోయిన చందంగా జనం మధ్యగా దూసుకుంటూ పోయి తనూ బస్సెక్కాడు కృష్ణ.

ఒకటే ఉక్కపోత! నాసికాపుటాల్ని బద్దలుచేస్తూ కడుపులో ఉండేపేగులు బయటపడేంత ఘోరంగా చెమట కంపు. ఈలోగా ఆపద్బాంధవుడిలా చేతిలోని పంచర్‌తో బస్సు ఊచమీద కొడుతూ రైట్ రైట్! అన్నాడు కండక్టరు. అంతవరకూ ఎందరు ప్యాసింజర్లు బస్సు రేకులమీద దబదబా బాదినా ఖాతరుచేయ్యని డ్రయివరు మహాశయుడు ఒక్క జర్క్‌తో బస్సును బయలుదేరదీశాడు.

బస్సు కదలికతో లోపలకు చొచ్చుకువచ్చిన గాలితో పోతున్న ప్రాణం లేచివచ్చినట్లయింది కృష్ణకు. 'టికెట్ టికెట్'



అంటూ దగ్గరకు వచ్చిన కండక్టరుకు సరియయిన చిల్లర యిచ్చి టికెట్ తీసుకున్నాడు కృష్ణ.

కండక్టరు ఖాళీచేసిన స్థలంలో ఊచను అనుకుని మరోచేత్తో పై ఊచను పట్టుకుని నిలబడి ఉన్నాడు కృష్ణ. బస్సులోవున్న జనం మధ్య రాజకీయాల చర్చ జరుగుతోంది. అదికూడా ఆంధ్రరాష్ట్రం మొదలుకొని అంతర్జాతీయ రాజకీయాలవరకూ సాగుతోంది. బస్సు మరోమూలనుండి కొందరు ఈమధ్యనే రాష్ట్ర హైకోర్టు తీర్పు ననుసరించి ముఖ్యమంత్రి రాజీనామా చెయ్యాలా వద్దా అన్న విషయంమీద ఘాటుగా చర్చించుకుంటున్నారు.

ఆ సంభాషణ నుండి కృష్ణ తన మనస్సు యింటివైపు మరల్చాడు. జరగబోయే చెల్లెలిపెళ్లి ఘట్టాలు సినిమారీలులా కళ్ళముందు కదలాడసాగాయి.

అలా ఆనంద పారవశ్యంలో కలలుకంటున్న కృష్ణను ఓ కంఠం ఈలోకంలో పడేసింది. ఆ కంఠం తాలూకు శాల్తీ గురించి చూచాడుగాని జనంలో కనిపించలేదు. కాని ఆ స్వరం యిలా వినిపించింది.

"చూశావా సుబ్బారాయుడూ! కలికాలం ఎలా మండిపోతోందో?" అన్నాడు ఓ ఆసామీ.

"సర్వారాయుడు బావా! విషయం ఏమిటో చెప్పందే ఎలా తెలుస్తుందయ్యా?" అన్నాడు సుబ్బారాయుడు.

"అయితే ఈ విషయం నీదాకా రాలేదన్నమాట?" సర్వారాయుడు కంఠం.

"ఏ విషయం?" సుబ్బారాయుడు ప్రశ్న.

"అదేనయ్యా! మన ఆనందరావు ఈమధ్య వెలగపెట్టిన ఘనకార్యం."

"ఏం చేశాడేమిటి?"

"అదేనయ్యా! అమధ్య వాళ్లన్నయ్య అచ్యుతాపురంలో ఓ వరుడున్నాడనీ అతడి విషయం కాస్త వాకబుచెయ్యమనీ వ్రాశాడు మద్రాసు నుంచి." చెబుతున్నాడు సర్వారాయుడు.

"అయితే?" అడిగాడు సుబ్బారాయుడు.

"అయితే ఏమిటిగియితే! ఆనందరావు చక్కగా ఆ వరుణ్ణి తన కుమార్తెకు కుదుర్చుకున్నాడు" చెప్పాడు సర్వారాయుడు.

సుబ్బారాయుడి కంఠం నుండి ఏ శబ్దమూ వినిపించలేదు. బహుశ ఆ వార్త విని నిర్విణ్ణుడయివుంటాడు.

"ఇలాటివారు కూడా వుంటారా ప్రపంచంలో?" అనుకున్నాడు కృష్ణ.

ఈలోగా తమ ఊరు రావడంతో బస్సుదిగాడు కృష్ణ.

ఇంటికి చేరేసరికి రాత్రి తొమ్మిది దాటింది. ఇంటి బయట పందిరి. పందిట్లో ఓ మూల సన్నాయిమేళం సుమధురంగా మ్రోగుతోంది. కొందరు పెద్దలు సన్నాయి స్వరాలకు అనుగుణంగా తల లూపుతున్నారు పారవశ్యంగా.

పిల్లలు కేరింతలు కొడుతూ ఆడుకుంటున్నారు.

పట్టుచీరలు గరగర శబ్దాలు చేస్తుండగా పువ్వులూ సుగంధ ద్రవ్యాలూ కలిసి వాతావరణంలో మత్తును రేకెత్తిస్తుండగా రతీదేవిలాగ లక్ష్మీదేవిలాగా సింగారించుకున్న అంగనలు హడావిడిపడిపోతున్నారు.

పందిట్లో ఓ వారగా జిల్పారాయుళ్ళు కొందరు చతుర్ముఖ పారాయణం సాగిస్తున్నారు. ఎలక్ట్రిక్ దీపాలు దేదీవ్యమానంగా వెలుగుతున్నా పక్కనే ఎత్తయిన పీటమీద ఓ పెట్రొమాక్స్‌లైట్ కూడా పెట్టుకున్నారు.

ఔనుమరి! వారిజాగ్రత్త వారిది! ప్రాణంపోకడయినా చెప్పవచ్చునేమోగాని దీపాల పోకడ ఎవరూ చెప్పలేనిది.

"ఏమయ్యా ఇప్పుడా రావడం?" అని వదిన పలకరించింది. తల్లి దూరంనుంచే తనని చూసి చూడనట్లు తప్పుకెళ్లింది.

"రావయ్యా పెళ్ళికూతురిని చూద్దువూ అది ప్రొద్దున నుంచి నిన్నే కలవరిస్తోంది" మరిదిని వెంటపెట్టుకు పెళ్ళికూతురు ఉన్న గదిలోకి తీసుకువెళ్లింది వదిన. పెళ్ళికూతురు స్థానంలో చెల్లెల్ని ఊహిస్తున్న కృష్ణ శ్రీదేవిని ఆ స్థానంలో చూసి స్థాణువే అయ్యాడు. కృష్ణ మెదడులో బస్సులోని సర్వారాయుడి కంఠం గింగురుమంటోంది.

సీరియల్

వజ్రసంకల్పం

సాతవాహన

ప్రభు హుషారుగా ఈల వేసుకుంటూ కారు డ్రైవ్ చేస్తున్నాడు.

క్రితం రోజు సుందర్‌దాస్ వజ్రాల షాపుకు వెళ్లేందుకు వుపయోగించిన ఫారిన్ కారు కాదది. ఆ కారు క్రితం రోజే అతని స్నేహితుడొచ్చి పట్టుకెళ్ళిపోయాడు. తాను మామూలుగా వాడే పద్మినీ ప్రీమియర్ కారిది.

తన కారు వెనకే మరో కారు విడవకుండా వెంబడిస్తూందన్న అనుమానం కూడా అతనికి లేదు.

చాలా సాఫీగా డ్రైవ్ చేసుకుంటూ పావు గంటకల్లా ఓ సన్నని వీధిలోకి తన కారు మలుపు తిప్పాడు.

అది పాన్‌బ్రోకర్ల వీధి.

ఆ సన్నని వీధిలో ప్రభు పార్కింగ్ స్పేస్ వెతుక్కుని తన కారక్కడాపేసి లాక్ చేసి బయల్దేరాడు.

కారు దిగాక అతని ధోరణి పూర్తిగా మారిపోయింది.

ఇప్పుడతను హుషారుగా కనిపించడం లేదు.

జీవితంలో అనుకోనిదేదో క్రూరమైన దెబ్బతిన్న వాడిలా విషాదంగా మొహం పెట్టాడు. అతని కళ్ళు జాలిగా చూస్తున్నాయి.

నీరసంగా అడుగులు వేసుకుంటూ వెళ్ళి ఓ పాన్‌బ్రోకర్ షాపులో అడుగుపెట్టాడు.

(గత సంచిక తరువాయి)

సున్నితపు త్రాసు పక్కనే పెట్టుకుని జర్దాపాన్ నములుతూ పరుపుల మీద కూర్చొని వున్నాడు రంగనాదం చెట్టియార్.

"రండా రండా! కూకోండ! యామి కావాలె?" అడిగాడు చెట్టియార్.

ప్రభు అతని ముందు నీరసంగా కూలబడి జేబులోంచి వజ్రపుటుంగరం తీసి చెట్టియార్ ఎదురుగాపెట్టాడు.

"ఈ వుంగరాన్ని తాకట్టు పెట్టుకొని నాకు డబ్బివ్వండి!"

చెట్టియార్ వుంగరం తీసుకుని పరీక్షగా చూశాడు.

తళతళా మెరిసిపోతున్న వజ్రం చూసి అతని కళ్ళు పెద్దవయ్యాయి.

"అసల్దితానా?" అనుమానంగా అడిగాడు.

ప్రభు విసుగ్గా చూశాడు.

"అసల్ది కాకుంటే నకిలీదెందుకు తెస్తాను చెట్టియార్?"

"ఒరు నిమిడం!" అంటూ చెట్టియార్ కొడుకుని కేకేసి పిలిచాడు. "సుబ్రమణీ! ఓ సుబ్రమణీ- వా యింగె!"

కొడుకు రాగానే అతన్ని తన సీట్లో కూర్చోబెట్టి తానే స్వయంగా వుంగరం తీసుకుని పరీక్షించడానికి లోనికెళ్లాడు.

ఇంతవరకూ సాగిన కథ - *20* : విశ్వధరవర్మకు తండ్రి అనంతరం మిగిలిన బీడు భూమిలో బావి త్రవ్వుతుండగా దొరికిన అపురూప వజ్రాన్ని అతని దాయాది అయిన వజ్రపాణి చేజిక్కించుకుంటాడు. నగ్నదేవత మైలమ్మ చేతిలో కీలుబొమ్మ అయిన వజ్రపాణి తన హవేలీలో బందీ అయిన మల్లిని అనుభవించి చంపేస్తాడు. చిన్నోడి ద్వారా వృద్ధుడు వజ్రపాణి వజ్రపు గనుల రహస్యాన్ని తెలుసుకుని అతనిపై వజ్రకాయుణ్ణే యుద్ధానికి పురికొల్పుతాడు. తన వ్యవహారాలు బయటపడకుండా ఉపయోగించిన మేసీటర్‌ని పులిరాజొకడు చంపాడని తెలుసుకొని వజ్రపాణి మండిపడతాడు.

చెట్టియార్ తిరిగిరావడానికి పావు గంటకు పైగా పట్టింది.

తిరిగొచ్చిన చెట్టియార్ కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

"ఎంతదా సొమ్ము కావాలె సార్‌వాడె?" గౌరవంగా అడిగాడు.

"ఎంతివ్వగలరు?" ఎదురు ప్రశ్న వేశాడు ప్రభు.

"మీకెంతదా కావాల్నో మీరుదా చెప్పుమీ!" జాగ్రత్తగా అన్నాడు చెట్టియార్.

ప్రభు నిట్టూర్చాడు.

"అయిదు వందలు!" అన్నాడు.

చెట్టియార్ వులిక్కిపడి ప్రభుని నమ్మశక్యం కానట్టుగా చూశాడు.

"యామిదా అంటిరి?"

"అయిదు వందల రూపాయలు!" చిరాకు ప్రదర్శిస్తూ అన్నాడు ప్రభు. "మళ్ళీ చెప్ప మంటారా? ఫైవ్ హండ్రెడ్ రుపీస్!"

చెట్టియార్ ప్రభుని ఎగాదిగా చూశాడు.

కనీసం యాభై వేలకు తక్కువ చెయ్యని అసలు సిసలయిన వజ్రపుటుంగరాన్ని కేవలం అయిదు వందల రూపాయలకు కుదవపెట్ట జూపుతున్నాడు- ఎవరితగాడు?

వడ్డీ వ్యాపారం చేసే వాడైనప్పటికీ చెట్టియార్ నిఖార్సయిన మనిషి. ఎంత లాభం వస్తుందన్నా దొంగ సొమ్ముకు ఆశపడే రకం కాదు.

"ఒక మాటదా అడగవచ్చునా సార్‌వాడె?"

"అడగండి!" నిర్లక్ష్యంగా అన్నాడు ప్రభు.

"మీరుదా యీ వుంగరందా కొంటిరా?"

"ఆహా! నిస్సందేహంగా!"

"యేడదా కొంటిరి?"

"సుందర్‌దాస్ అంగట్లో!"

చెట్టియార్ మరోసారి ఉంగరాన్ని పరీక్షగా చూశాడు. అది సుందరదాస్ అంగట్లో ఉంగరమే- అందులో అనుమానంలేదు. మకుటం వెనక వైపున సుందర్‌దాస్ షాపు ట్రేడ్‌మార్క్ స్పష్టంగా చెక్కబడి వుంది. తన షాపులో వస్తువులేమైనా దొంగిలించ బడిన పక్షంలో ఆ వస్తువుల్ని గుర్తుపట్టడానికి వీలుగా తన ట్రేడ్‌మార్క్ చెక్కిస్తాడు సుందర్‌దాస్. అది బిజినెస్‌లో వుండే ప్రతి ఒక్కరికీ తెలుసు.

ఆ ట్రేడ్ మార్కు చూశాక కొంతవరకు తృప్తిపడ్డాడు చెట్టియార్- కానీ, పూర్తిగా మాత్రం కాదు.

"ఎంతకుదా కొంటిరి?" మరో ప్రశ్న వేశాడు.

"ఏమిటీ క్రాస్‌ఎగ్జామినేషన్?" కోపంగా చూశాడు ప్రభు.

"కోపం వేండ సార్‌వాడె! ఎంతకుదా కొంటిరి?" ఓపిగ్గా అడిగాడు చెట్టియార్.

"ఆ సంగతి మీకెందుకు?" దురుసుగా అన్నాడు ప్రభు.

చెట్టియార్ అనుమానం బలపడింది.

"ఎప్పుడుదా కొంటిరి?" మళ్ళీ అడిగాడు.

"నిన్న! అయినా ఈ ప్రశ్నలన్నీ ఎందుకు?

ఇష్టమైతే కుదవబెట్టుకోండి- లేదంటే మరో అంగడికి పోతాను", డిగ్నిటీ ప్రదర్శిస్తూ అన్నాడు ప్రభు.

చెట్టియార్ అదో విధంగా చూశాడు.

ప్రభు ధోరణికి అతని అనుమానం పూర్తిగా ధృవపడింది.

"ఒరు నిమిడం!"

చెట్టియార్ లేచి మరో సారి లో పలికెళ్లాడు.

సేట్ సుందర్‌దాస్ చెట్టియార్‌కు బాగా తెలుసు.

లో పలికెళ్తూనే చెట్టియార్ టెలిఫోన్ దగ్గరికి లాక్కొని ఒక నెంబర్ డయల్ చేశాడు.

సుందర్‌దాస్ కొద్ది క్షణాల్లోనే లైన్లోకొచ్చాడు.

"హలో! సుందర్‌దాస్ స్పీకింగ్!"

"వణక్కం సుందరదాసుజీ! నేనుదా రంగనాదం చెట్టియార్!"

"హలో చెట్టియార్! బావున్నారా? ఏమిటిలా ఫోన్ చేశారు?"

"ఒరు తంబి నాకాడికిదా వచ్చినాడు. ఒరు వజ్రంపు వుంగరముదా చూపి కుదువపెట్టుదుమీ అనిదా సొల్లుతా వుండాడు. వుంగరంపు రేటు యాభై వేలుదా వుండును. మీ షాపులోదా కొంటిని అనిదా సొల్లుతా వుండాడు".

సుందరదాస్ వులిక్కిపడ్డాడు.

"మా షాపులోనా?! ఎప్పుడు?"

"నిన్న!"

"అలాగా! ఎంతకు కుదువపెడతానంటున్నాడు?"

"అయిదు వందలు!"

"హే భగవాన్! చెట్టియార్, అతనెలా వున్నాడు?"

చెట్టియార్ ప్రభుని వర్ణించి చెప్పాడు.

"బస్ బస్! చాలు చెట్టియార్! వాడు ఫ్రాడ్ సందేహంలేదు. నిన్న కోటీశ్వరుడ్నని ఫోజు కొట్టి చెక్కిచ్చి ఆ వుంగరం పట్టుకెళ్లాడు. వాడిచ్చిన చెక్కు చెల్లనిదై వుంటుంది. మీరతన్ని పోనివ్వకండి. ఈలోపున నేను పోలీసుల్ని పట్టుకొస్తాను".

సుందర్‌దాస్ లైన్ డిస్కనెక్ట్ చేసి చక చకా మరో నెంబర్ డయల్ చేయసాగాడు.

★ ★ ★ ★

"ముక్కూ మొహం తెలియనివాడికి చెక్కు మీద అంత ఖరీదైన వస్తువెలా యిచ్చారు?" చెట్టియార్ షాపుకు పోలీస్ జీపులో వెళ్తుండగా అడిగాడు ఇన్‌స్పెక్టర్.

సుందర్‌లాల్ వేదాంతిలానవ్వేడు.

"మా బిజినెస్‌లో తప్పదు ఇన్‌స్పెక్టర్ సాబ్! ఎంతోమంది కస్టమర్లు చెక్కులిచ్చి విలువైన వస్తువులు కొనుక్కుపోతూ వుంటారు. ఆ చెక్కు చెల్లుతుందని హామీ ఒకటి రాయించుకొని వస్తువులు అమ్మేస్తూ వుంటాను. వాళ్ల కారు నెంబర్ కూడా నోట్ చేసుకుంటాను. చెక్కు లిచ్చిన ప్రతి ఒక్కర్నీ అనుమానిస్తూ కూర్చుంటే బిజినెస్ జరగదు. పెట్టుబడి మీద వడ్డీ వేలకు వేలు పెరిగిపోతుంది".

"అలాగా! చెక్కె బోగస్‌దైనప్పుడు హామీ పత్రం రాయించుకొని మాత్రం యేం ప్రయోజనం?"

"ప్రయోజనం వుంది ఇన్స్‌పెక్టర్ సాబ్! బ్యాంకులో చెక్కు డిసానర్ అయితే పొరపాటున బ్యాంక్ బ్యాలెన్స్ విత్‌డ్రా చేసుకున్నానని కస్టమర్ అనకుండా వుండేందుకు అది పనికొస్తుంది. ఆ కస్టమర్ నన్ను మోసం చెయ్యజూశాడని కోర్టులో రుజువు చేసేందుకు కూడా అది పనికొస్తుంది. కారు నెంబర్ మన దగ్గరుంటుంది కాబట్టి కస్టమర్ తప్పించుకొని ఎక్కడికి పోతాడు?"




వజ్రసంకల్పం నేపథ్యంలో...



సీతమ్మవారిశాపం హోప్ డైమండ్

ఈ 44.50 కారెట్ల నీలంరంగు వజ్రానికున్నంత విషాదకరమైన చరిత్ర ప్రపంచంలో మరే వజ్రానికీ లేదు. కోహినూర్‌లాగా ఇది కూడా భారతీయ వజ్రమే. పూర్వం ఎప్పుడో ఒక దేవాలయంలో సీతమ్మవారికి ఒక కన్నుగా ఈ వజ్రం అమర్చబడి వుండేదట. ఎవరో దొంగ దీన్ని దొంగిలించగానే ఇది నీలం రంగులోకి మారిపోయిందట. దీన్ని పొందగలిగిన వాళ్ళందరూ సర్వనాశనమై పోవాలని సీతమ్మవారి శాపమట! నిజంగానే ఈ వజ్రాన్ని పొందిన వాళ్ళందరి జీవితాలూ ఏదో ఒక విషాదానికి గురౌతూనే వచ్చాయి. ఆ విషాద గాథలన్నీ ఇక్కడ రాయడానికి చోటులేదు. నవలలో చదవండి.



గోదారమ్మ గారాల పట్టి కోహినూర్ ది గ్రేట్

108.93 కారెట్ల ఈ మహావజ్రం అచ్చమైన భారతీయవజ్రం, అందులోనూ మన గోదారమ్మ వరప్రసాదం. నాలుగువేల ఏళ్ళక్రితం గోదావరీ తీరంలో దొరికిన ఈ వజ్రం మొదట మాళ్వారాజుల అధీనంలో వుండి తర్వాత మొగలాయి చక్రవర్తుల దర్బారును అలంకరించింది. 1739లో ఢిల్లీమీద దండెత్తిన దురాక్రమణదారుడు నాదిర్షా ఈ వజ్రాన్ని పర్షియాకు దోచుకుపోయాడు. పర్షియాలో అనేక విషాద పరిణామాలకు కారణమైన కోహినూర్ మళ్ళీ భారతదేశానికి తిరిగి వచ్చేసింది. సిక్కువీరుడు మహరాజా 'రంజిత్‌సింగ్' ఆ స్థానంలో వుండిన ఈ వజ్రం 1849లో ఈస్టిండియా కంపెనీవాళ్ళ చేతుల్లో పడింది. ఈస్టిండియా కంపెనీ దీన్ని విక్టోరియా మహారాణికి కానుకగా సమర్పించింది. ప్రస్తుతం లండన్‌లో బ్రిటిష్ మహారాణి కిరీటంలో వున్న కోహినూర్ని న్యాయంగా భారతదేశానికి తిరిగి ఇచ్చేయవలసిందిగా స్వాతంత్ర్యం తర్వాత భారత ప్రభుత్వం ఎన్ని విజ్ఞప్తులు చేసినా లాభం లేక పోయింది. భారతీయుల అభిమాన వజ్రం స్వాతంత్ర్యానంతరం కూడా బ్రిటిష్ రాచరికం చేతుల్లోనే వుండిపోయింది. ఈ వజ్రాన్ని ధరించిన వాళ్ళు ప్రపంచానికి చక్రవర్తులౌతారట! స్త్రీలు తప్ప మగవాళ్ళు దీన్ని ధరిస్తే ప్రమాదమట!

"బావుంది. కానీ, కారు నెంబర్ ప్లేటే బోగస్‌దైతే ఏం చేస్తారు?"

"ఏం చేస్తాను- కంప్లెయింటిచ్చి భారం మీ మీదుంచి వూరుకుంటాను. అయినా ఇంతవరకూ అలాంటిది జరగలేదు". అన్నాడు సుందర్‌దాస్.

ఇన్స్‌పెక్టర్ మెచ్చుకోలుగా నవ్వాడు.

ఇంతలో చెట్టియార్ అంగడి రావడంతో జీపు ఆపేసి దర్పంగా కిందికి దిగాడు. సుందర్‌దాస్ అతన్ని అనుసరించాడు. చెట్టియార్ వాళ్ళకెదురొచ్చి షాపులోకి తీసుకెళ్లాడు.

ఇన్స్‌పెక్టర్‌ని చూస్తూనే ప్రభు బెదిరిపోయిన వాడిలా చూశాడు.

"ఇదేమిటి! పోలీసుల్నెందుకు పిల్చుకొచ్చారు?" కీచుగా అడిగాడు. ఎవరూ ఆ ప్రశ్న పట్టించుకోలేదు.

ఇన్స్‌పెక్టర్ బూట్లు టకటక లాడించుకుంటూ ప్రభు దగ్గరి కెళ్ళి జబ్బ పట్టుకుని జబర్దస్తీగా లేపి నిలబెట్టాడు.

"మిస్టర్ నీ పేరేమిటి?"

"ఎందుకు?"

"నీ పేరేమిటి?" కటువుగా తన ప్రశ్న రెట్టించాడు ఇన్స్‌పెక్టర్.

"ప్రభు!"

"ఐసీ! పద పోలీస్ స్టేషన్‌కి!"

"దేనికి?"

"పద తెలుస్తుంది!"

"వారెంటుందా?" మొండిగా అన్నాడు ప్రభు.

ఇన్స్‌పెక్టర్ వెక్కిరింపుగా నవ్వేడు.

"చౌకబారు తెలుగు సినిమాలూ, చౌకబారు డిటెక్టివ్ నవలలూ బాగా వంటబట్టించుకున్నట్టున్నావ్. పోలీసులు అనుమానం మీద వారెంటు లేకుండానే అరెస్టు చెయ్యొచ్చు. ఇకపద!"

"నేను చేసిన నేరమేమిటో చెబితే గానీ నేను కదల్ను!"

"అలాగేం? మక్కెలిరగదంతే గానీ నువ్వు కదలవు!"

ఆ మాట వినగానే పూర్తిగా బెదిరిపోయిన వాడిలా చూశాడు ప్రభు.

"అంత పనొద్దు లెండి! పదండి వస్తాను!" నీరసంగా అన్నాడు.

"గుడ్! అలా దారికి!" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

* * * *

"అబద్ధం! నేనెవర్నీ మోసం చెయ్యలేదు!" అరిచాడు ప్రభు. అతన్ని స్టేషన్లో నిలబెట్టి ప్రశ్నిస్తున్నాడు ఇన్స్‌పెక్టర్.

"హుష్ అరవక! ఇది నీ యిల్లు కాదు- పోలీస్ స్టేషన్!" దర్పంగా అన్నాడు.

ప్రభు దీనంగా చూశాడు.

"నిజం ఇన్స్‌పెక్టర్‌గారూ! నేనెవ్వర్నీ మోసం చెయ్యలేదు."

"మళ్ళీ అదే మాట! సుందరదాస్ అంగట్లో వజ్రపుటుంగరం కొన్నావా లేదా?"

"కొన్నాను."

"చెల్లని చెక్కిచ్చి మోసం చేశావా లేదా?"

"చెక్కిచ్చింది నిజమే! కానీ, చెల్లన్ది కాదు!"

"చెల్లని చెక్ అంటున్నాడే సేట్!"

"అబద్ధం! సేట్ సుందర్‌దాస్ అబద్ధం చెబుతున్నాడు!"

"అలాగా! అయితే నువ్వేనన్న మాట నిజం చెబుతోంది!"

"అవును!"

"షటప్! యాభై వేలు పెట్టి కొన్న వుంగరాన్ని ఒకరోజు వ్యవధిలో అయిదు వందలకు తాకట్టు పెట్టజూస్తావా!"

"యాభై వేలు కాదు- యాభై ఆరువేలు! కావలిస్తే నా దగ్గర రసీదు కూడా వుంది!"

"ఆల్‌రైట్ ఆల్‌రైట్! యాభై ఆరు వేలు! అంత డబ్బు పోసి కొన్న వస్తువుని అయిదు వందలకు కుదువ బెట్టాల్సిన అవసరం యేమొచ్చింది. అంత డబ్బు ఖర్చు పెట్టగల మొనగాడివి అయిదు వందలు నీకు తక్కువయ్యాయా?" చెప్పు- వుంగరం కుదవ బెట్టాల్సిన అవసరం నీకేమిటి?"

"అది నా యిష్టం. నా వుంగరం. కుదవే పెట్టుకుంటానో దిబ్బలో నే పారేస్తానో అడగడానికి సుందర్‌దాసెవరు?"

"హుంష్! అడుగుతున్నది మేము మిస్టర్!"

"ఆల్‌రైట్! అయితే వినండి. నేనా వుంగరం నేను ప్రేమించిన అమ్మాయి కోసం కొన్నాను. మా పెళ్ళి రేపు జరగాల్సింది. కానీ, ఆ అమ్మాయి నన్ను మోసం చేసింది. మా పెళ్ళి కాన్సిలయ్యింది. ఆ వుంగరంతో పాటే శని నన్ను చుట్టుకుంది. ఆ శని వదిలించుకోవడానికి కుదవబెడతానన్నాను. అయిదు వందలకు తాకట్టు పెట్టుకోమంటే చెట్టియార్ త్వరగా అది తీసేసుకుంటాడనుకున్నాను. నేరమంటారా?"

"వారెవ్వా! ఏం కథ అల్లావు బ్రదరూ!"

"మీరు నమ్మకపోతే నేనేం చెయ్యనూ?"

"అంతేకానీ నేరం మాత్రం ఒప్పుకోనంటావ్!"

"చెయ్యని నేరం ఒప్పుకోమని బలవంత పెట్టడం అన్యాయం!"

"పెద్ద మాటలు వద్దు. నేరం ఒప్పుకుంటావా లేదా?"

"ఒప్పుకోను!"

"సరే, అయితే లాకప్‌లో పడుండు. సోమవారం నీ సంగతి తేలుస్తాం!" అన్నాడు ఇన్స్‌పెక్టర్.

* * * *

ప్రభు ఆ రాత్రంతా లాకప్‌లో వున్నాడు.

మర్నాడు ఆదివారమంతా కూడా లాకప్‌లో నే వున్నాడు.

సోమవారం నాడు మధ్యానానికల్లా సేట్

వజ్రసంకల్పం

సుందర్‌దాస్ పరిగెత్తుకుంటూ పోలీస్ స్టేషన్ కొచ్చాడు.

అతని ఆదుర్దా చూసి ఇన్స్‌పెక్టర్ నవ్వుకున్నాడు.

"ఏం సేట్‌జీ! అయితే మీ చెక్కు చెల్లనట్టుంది!"

సుందర్‌దాస్ తల విదిలించాడు.

"లేదు ఇన్స్‌పెక్టర్ సాబ్! చెక్కు బంగారంలా చెల్లింది!"

ఇన్స్‌పెక్టర్ మొహంలో రంగులు చకచకా మారాయి.

"నిజంగానా! అదెట్లా జరిగింది?" నమ్మశక్యం కానట్టుగా అడిగాడు.

"పొరపాటు ఇన్స్‌పెక్టర్ సాబ్! ఘోరమైన పొరపాటు. పాపం ఆ కుర్రాడు రెండు రోజుల్నించీ నిజమే చెబుతున్నాడు. నిన్నా మొన్నా బ్యాంక్ హాలిడేస్ కావడంతో నిజం తెలుసుకోవడం ఆలస్యమైంది. కంప్లైయింటు వాపసు తీసుకుంటున్నాను– అతన్ని వదిలెయ్యండి!"

ఇన్స్‌పెక్టర్ మొహం చిట్లించాడు.

"సేట్‌జీ! ముందూ వెనకా ఆలోచించకుండా తొందరపడి కంప్లైయింటిస్తే ఇలాగే వుంటుంది." అన్నాడు ఆ తొందరపాటులో తనకు భాగం లేనట్టు.

"పొరపాటు జరిగిపోయిందని ఒప్పుకుంటున్నాను గదా! పాపం అతన్ని వదిలెయ్యండి."

"సరే! ఏయ్ త్రీనైన్టీఫోర్! లాకప్‌లో వున్న ఆ కుర్రాడ్ని పట్రా!" ఆజ్ఞాపించాడు ఇన్స్‌పెక్టర్.

మాసిన గడ్డంతో వున్న ప్రభు లాకప్‌లోంచి బయటికి రాగానే సుందర్‌దాస్ అతని రెండు చేతులూ పట్టుకున్నాడు.

"ప్రభూ భాయ్! నన్ను క్షమించండి! నా వల్ల ఘోరమైన పొరపాటు జరిగిపోయింది. క్షమించాననండి– లేకపోతే నాకు మనశ్శాంతి లేదు!"

ప్రభు విషాద సన్నివేశంలో అక్కినేని నాగేశ్వర్రావులా నవ్వేడు.

"బాధపడకండి సేట్‌జీ! నన్ను ప్రేమించిన ప్రియురాలే మోసం చేసింది. దాంతో పోలిస్తే ఈ రెండు రోజుల లాకప్ నాకో లెక్కలోది కాదు." సినిమా ఫక్కీలో డైలాగ్ ఒకటి విసిరాడు.

ఆ మాత్రానికే సుందర్‌దాస్ ఆనందపడిపోయాడు.

ఏదో పెద్ద ఇరకాటం నుంచి బయటపడినవాడిలా తేలిగ్గా ఫీలయ్యాడు.

"మీది పెద్దమనసు ప్రభూ భాయ్! పెద్దమనసు!" తన వంతు డైలాగ్ తనూ వదిలాడు సుందర్‌దాస్.

ప్రభు భారంగా కదిలి అక్కడ్నించి పోబోయాడు.

"మిస్టర్ ప్రభూ! వన్ మినిట్!" వెనకనుంచి పిలిచాడు ఇన్స్‌పెక్టర్.

ప్రభు ఆగి వెనక్కి తిరిగాడు.

"మీ వుంగరం! మర్చిపోయారా?"

ప్రభు మరింత విషాదంగా నవ్వి వుంగరాన్నందుకుని జేబులో వేసుకున్నాడు.

"ఈ వుంగరం మూలంగానే నాకిన్ని కష్టాలు వచ్చాయి. వస్తాను ఇన్స్‌పెక్టర్ సాబ్! వస్తాను సుందర్‌దాసు గారూ! మరో జన్మ అంటూ వుంటే అందులో అందమైన ఆడపిల్లను చూసి మోసపోను."

ఆ మాట అంటూ స్టేషన్ నుంచి బయటికొచ్చాడు ప్రభు.

ఆ సమయంలో అతని పెదవుల మీద వెలిగిన వ్యంగ్యంతో కూడుకున్న చిరునవ్వు ఆ యిద్దరూ గమనించలేదు.

(ఇంకా వుంది)

ఈవారం లో మీ యోగం

2-2-1990 శుక్రవారం మొదలు 8-2-1990 గురువారం వరకు

మేషం : ముద్రణా యంత్రాంగాన పని చేయు వారికి అనుకూలం. పత్రికాధిపతులకు మేలు. గనులందు, కార్ఖానాలందు శ్రమించువారికి మేలని గ్రహించండి. అపూర్వ వస్తు సేకరణకు ఆస్కారం. స్త్రీలకు : పాత అప్పులు వసూలు. పదిమందిలో ప్రసిద్ధి, గ్రహించండి.

వృషభం : గురుని ఆశీర్బలం వలన ధన లబ్ధి, వ్యాపారానుకూలం. యత్న కార్యసిద్ధి. ఉద్యోగ ప్రయత్నం సానుకూలం కావటం, ప్రజా రంగాన ప్రసిద్ధి, నూతన మిత్ర సమాగమం, నగలు నాణ్యాలు సాధించుకొనుటకు ఆస్కారం. స్త్రీలకు : ఆదాయవృద్ధి, అధికార పక్షాన మేలు. అప్రయత్న ధనలబ్ధి కూడ లేకపోలేదు.

మిధునం : గురుని రాశి స్థితి పెద్దగా ఈ వారం యోగించదు. బంధు మిత్ర సహాయం లేకపోలేదు గాని అధిక వ్యయం కూడ లేకపోలేదు. దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అగత్యం కూడ రాకపోదు. స్త్రీలకు : అభివృద్ధికరమైన మార్పులు ఉద్యోగ రంగాన లభ్యం కానున్నవి. గ్రహించండి.

కర్కాటకం : అధికాదరణ యున్నది. అధిక ఖర్చులు కూడ జరుగకపోవు. సభారంగ ప్రసిద్ధి లేకపోలేదు. విద్యావేత్తల సహాయం లేకపోలేదు. బంధు సమాజం నిశ్చయింపబడుటలో ఆక్షేపణ లేదు.ధనాఢ్యుల సహాయం లేకపోలేదు. స్త్రీలకు : కొందరకు వాహనానుకూలత, కొందరకు ధనలబ్ధి.

సింహం : 'శని' క్రమంగా అభివృద్ధి చేయనున్నాడు. నల్లని వస్తు విక్రేతలకు మేలే. బంధు మిత్ర సమాగమం. వ్యాపార నిమిత్తమో, వ్యవహార నిమిత్తమో దూర ప్రాంతాలకు వెళ్లవచ్చు. అయినవారి సంబంధం నిశ్చయింపబడుతుందని గ్రహించాలి. స్త్రీలకు : అపూర్వ వస్తు సేకరణకు ఆస్కారం. ఉద్యోగ పెంపు కూడ చెప్పనైన వారం.

కన్య : 'రవి, బుధ' గ్రహానుకూలత. అభివృద్ధి కరమైన మార్పు ఉద్యోగ రంగాన, కళా రంగాన వృత్తి రీత్యా రావచ్చు. వ్యవహారరీత్యా మేలైన సమయంగా గ్రహించాలి. విద్యావేత్త సహాయము న్నది. సభా మర్యాదకు ఆస్కారం. స్త్రీలకు : యధావిధి గా అన్ని రంగాలందు మేలే. విద్యా రంగాన ప్రసిద్ధి యున్నది, గ్రహించండి.

తుల : రాశి నుండి మూట నున్న 'శని' లాభదాయకుడు. రాజకీయరంగాన ప్రసిద్ధి ఏర్పడుతుంది. ముఖ్యులవలన ఏదో మేలు చేకూరుట నిశ్చయం. శుభదాయకవారం. సభా రంగాన ప్రసిద్ధి యున్నది. స్త్రీలకు : అవివాహితులకు, ఉద్యోగం లేని వారికి గాని అనుకూల వారం.

వృశ్చికం : వారం వారం అనుకూలమే గాని యింకా శని బాధ వీడ యున్నది. నూతన మిత్ర సమాగమం. యత్న కార్యసిద్ధి, సభా మర్యాద. సుఖ శాంతులు, ఆదాయమందు అభివృద్ధి చెప్పనైన సమయం. గమనించాలి. స్త్రీలకు : ఉద్యోగవృద్ధి, నూతన మిత్ర సమాగమం, సుఖ శాంతులు, ధనలబ్ధి.

ధనుస్సు : ధనలోపం లేని వారం. దాయాది వర్గంతో యిబ్బంది ఏర్పడవచ్చు. పదిమందిలో ప్రసిద్ధి. వృత్తి రీత్యా పెంపు. అయినవారి సంబంధం నిశ్చయింపబడటం, కళా రంగాన ప్రసిద్ధి. చిత్ర రంగానుకూలత. రచనా రంగాన ఏదో మేలు చేకూరుట వార విశేషం. స్త్రీలకు : దూర ప్రాంతాలకు వెళ్లవలసిన అగత్యం గల వారం.

మకరం : శని, రాహు గ్రహాలు అనుకూలుర్థు గారు. కేతువు అంతే. అయినవార్థు పరాయివారుగా మారుతారు. అలా యిలా తిరిగేటపుడు, జాగ్రత్తగా సంచరించాలి. అపూర్వ వస్తు సేకరణకు ఆస్కారం. బంధు మిత్ర సమాగమం. స్త్రీలకు : వాహన సేకరణానుకూలం. బంధు సమాగమం. గమనించాలి.

కుంభం : రాజకీయ నాయకులవలన ఏదో మేలు చేకూరనున్నది. ఒకానొక వ్యవహారం మీకు ఆనందదాయకం. శుభ కార్యానుకూలం, అనుకొన్న విధంగా చిత్ర రంగ నిర్మాణం, వస్తు సేకరణ యందు అనుకూలత. స్త్రీలకు : సభా రంగానుకూలత, యత్న కార్యసిద్ధి.

మీనం : ఏది ఏమయినా మీ పద్ధతి మానకండి. ఎవరేమనుకున్నా వెనుక ముందు చూడకండి. 'గురు' గ్రహానుకూలతవలన సర్వము అనుకూలమే. సభా రంగాన ప్రసిద్ధి ఏర్పడనున్నది. రాజకీయాన మేలే జరిగిందిగా! సాహితీ రంగాన చక్కని అవకాశం. స్త్రీలకు : యత్న కార్యసిద్ధి. ధనలబ్ధి, సుఖ శాంతులు, మిత్రాగమం.

విద్వాన్ కోట సత్య రంగయ్య శాస్త్రి

యువతీ యువకుల కోసం
"జాగృతీ కిరణ్" కొత్త శీర్షిక

కూపన్

ఆంధ్రసచిత్ర వారపత్రిక

నేనేం చదవాలి?

ప్రశ్న: ____________________


____

పేరు: ____________________

చిరునామా: ____________________

____

నేనేం చదవాలి?



మీరు ఇప్పుడు పరీక్ష ప్యాసై పోయాక ఏం చెయ్యాలన్న అనుమానం రావొచ్చును. 10 తర్వాత 12 తర్వాత, డిగ్రీ తర్వాత మీరేం చేయాలో సలహాలు ఇచ్చే ప్రత్యేక కొత్త ప్రశ్నలు-జవాబులు శీర్షిక సచిత్ర వారపత్రికలో ప్రారంభిస్తున్నాము. కూపన్ కూడా ఇచ్చాము.

-ఎడిటర్

"సావిత్రి కోరిక"

పాలగిరి వేణు

బ్రహ్మానందానికి రెండు రోజుల్లో బోనస్ వస్తోంది...ఆ రాత్రి బోనస్ యిస్తున్న సంగతి సావిత్రికి చెప్తూ పొదుపు గురించి ఓ అరగంట సేపు ఉపన్యాసమిచ్చి...వచ్చే బోనస్ డబ్బును ఎన్.ఎస్.సి. సర్టిఫికెట్లు కొనేద్దామనుకున్నాడు. సావిత్రి ఆ ఉపన్యాసాన్ని ఊకదంపుడుగా తీసుకుని, బోనస్‌తో ఏ ఫ్రిడ్జియో, టి.వి.యో, సోఫా సెట్టో...కనీసం ఓ చిన్న గాద్రెజ్ బీరువానైనా కొనాలనే తన ఉద్దేశ్యాన్ని బ్రహ్మానందానికి తెలియబరిచింది.

పెళ్లయి పట్టుమని పదేళ్లయినా యింట్లో చెప్పుకోదగ్గ వస్తువు అంటూ ఏమీ లేవు...

పొదుపు...పొదుపు అంటూ వచ్చిన జీతాన్ని ఏ 'ఫిక్స్‌డ్ డిపాజిట్ల'లోనో, పోస్టాఫీసు సేవింగ్స్‌లోనో వేసేస్తూ బొటాబొటిగా తిండికి ఏ మాత్రం ఢోకా లేకుండా, ముగ్గురు పిల్లలతో సంసార చక్రాన్ని తిప్పేస్తున్నాడు బ్రహ్మానందం.

ఇక శ్రీవారి పిసినారితనాన్ని ఎలాగూ మార్చలేం...మనమే యీయనకు దాసోహమవటం మంచిదని పెళ్లయిన సంవత్సరానికల్లా మారిపోయింది సావిత్రి...

సావిత్రి ఉద్దేశ్యం వింటూనే బ్రహ్మానందానికి బ్రహ్మాండం బద్దలయింది. బ్రహ్మానందం కెవ్వుమన్నాడు...

సావిత్రి యిలా ఫ్రిడ్జి. టి.వి. వగైరాల గురించి మాట్లాడుతుందనుకోలేదు... ఆమె వూహలో కూడ కోరకూడదు. ఇక మొదలెట్టాడు బ్రహ్మానందం...

"మనలాంటోళ్లకు 'ఫ్రిడ్జ్' ఎందుకే? దాంట్లో ఏం పెడదామని? ఆనపకాయ పులుసు వండిపెడతావా? చూడు! ఏ బీరో, బ్రాందో తాగేవాళ్లకు అవసరం కాని మన బోటి వాళ్ల కెందుకే? యికపోతే తినగా మిగిలిన వంటల్ని 'ఫ్రిడ్జి'లో పెట్టొచ్చుగా అంటావా? మనింట్లో తినగా మిగిలేందుకు ఏమంత వండి పడేస్తున్నావని? పోనీ మిగిలాయే అనుకో! ఎదురింటి ఏకాంబరంగారి 'ఫ్రిడ్జి' ఎలాగూ వుందిగా! వాళ్ల అవసరాల కన్నా మనమే ఎక్కువ వాడుతుంటామాయె!


చల్లటి మంచి నీళ్లంటావా? ఏ అర్ధరాత్రి ఒంటి గంటకు వెళ్లి తలుపుకొట్టి మంచినీళ్లడిగితే విసుక్కోకుండా ఐస్ నీళ్లిస్తున్నారు గదా?...ఇక ఎందుకే ఫ్రిడ్జి...?"


ఇక టి. వి. అంటావూ! ఆ టి.వి. మాటెత్తితేనే నాకు డోకు వస్తుంది... ఆవు పేడ ఎలా పెడ్తుంది? పందుల్ని ఎలా పెంచాలి? బట్ట మేక పిట్టను ఎలా రక్షించాలి...యివ్వేగా! ఇక మిగిలేవి హిందీ ప్రోగాములు...పచ్చీస్‌కు పచ్చాసుకు వ్యత్యాసం తెలియని మనకు హిందీ ముక్క ఒక్కటైనా అర్థమయి ఛస్తోందా? ఎలాగూ ప్రక్కింటి పరమేశం గారింట్లో టి. వి. వుందిగా!

శనాదివారాలు తిండితిప్పల్లేకుండా వాళ్లింట్లోనే గడిపేస్తున్నారు మన పిల్లలు...ఇక మనిద్దరం...టి.వి.లో వచ్చే సినిమాలు, సీరియల్సూ పరమేశం గారింట్లోనే కూచుని చూస్తుంటామాయె! ఇక ఎందుకే టి. వి.?

ఇక సోఫా లంటావా? మనింటికి రోజూ ప్రధాని రాజీవ్ గాంధీ, ప్రెసిడెంట్ వెంకట్రామన్ లాంటి గొప్పోళ్లు వస్తున్నారనా? లేకపోతే చిరంజీవి, శ్రీదేవిలాంటి వాళ్లు వస్తున్నారనా? పాపం రోజూ వస్తున్నారు...వాళ్లు ఎలాగూ రోజూ కింద కూచోపెట్టలేం...కనీసం సోఫాలుంటే పైన కూచునేవాళ్లు అని బాధపడుతున్నామా? మన పిల్లలు ఎగిరి గంతేసి, చింపి పోగులు పెట్టరటే! ఒక్కసారి పాడయిపోతే అవెందుకూపనికి రావు ? కుప్ప తొట్లో వేయాల్సిందే? ఇక ఎందుకే సోఫాలు...?

ఇక బీరువాలంటావా? బంగారు నగలేమైనా...లేకపోతే పట్టుచీరలు గాని వున్నాయటే? డబ్బు, దస్కం నాకు తెలియకుండా ఏమైనా దాచిపెడ్తున్నావా? చూడు...మనింట్లో విలువైన వస్తువులున్నాయని మనమేం





బాధ పడనక్కర్లేదు మన పెళ్లిలో నీతో బాటు మీ నాన్నగారిచ్చిన ట్రంకుపెట్టే నిండటం లేదు? అదిగాక దొంగోళ్ల చూపంతా బీరువాల మీదేనే పిచ్చిదానా? పోనీ అన్నీ వున్నాయి - మనింట్లో యిక లేనిదీ బీరువా ఒక్కటేనంటావా? అదే తక్కువయిందా? చెప్పు!...అందుకని నేను చెప్పేదేమిటంటే..." అంటూ తన హార్మోనియాన్ని వివిధ రాగాలలో వాయించి, కొంత అలసి... మంచినీళ్ల కోసం చెంబువైపు సావిత్రికి సైగ చేశాడు బ్రహ్మానందం...

"ఇక ఆపండి! మీ సొద...! మీరేం చెప్పినా వినను...వినను... వినను. పెళ్లయినప్పటి నుంచి మిమ్మల్ని ఏవైనా అడిగానా! పోనీ ఎదురుచెప్పానా? మీకు వచ్చే బోనస్ డబ్బుతో ఏదైనా కొనాల్సిందే! లేకపోతే ఏంటండీ ! ప్రక్కింటి పంకజాక్షి నిన్న మన పిల్లలు వాళ్లింటికి టి.వి. చూడటానికి వెళ్తే... ఎంత అవమానం! వాళ్ల పిల్లల్ని, యింటికొచ్చిన చుట్టాల పిల్లల్ని తమ సోఫాలమీద కెక్కించేసి, మన వెధవలకు 'చాప' వేసి కింద కూచోబెట్టిందట... వాళ్లకేనా టి.వి. వుండేది...ఎంత పొగరు...ఇక ఎదురింటి ఎంకటలక్ష్మి... దాన్ని చూస్తేనే నా గుండె మండిపోతుందండీ! మొన్నరాత్రి మన నాని గాడు మిగిలిన చేపల పులుసును వాళ్ల ఫ్రిడ్జిలో పెట్టటానికి తీసుకెళ్తే...! ఏం ! యీ గెరిటెడు పులుసు మింగలేకపోయారూ ! ఇంత చిన్న గిన్నెను కూడా ఫ్రిడ్జిలో దాచాలా ! ఏమిటి ? అని విసుక్కుందట...
ఈ అవమానాల్ని భరించలేనండి...." అంటూ ఆపి, మండి పొగలు గక్కుతున్న తన శరీరాన్ని చల్లబర్చేందుకు, ఆ చెంబులో మిగిలిన రెండు గుక్కల నీళ్లను తాగేసింది. ఆవేశంతో సావిత్రి.....

"అబ్బ! ఎంత వేడిగా వున్నాయండి నీళ్లు...ఎలా తాగాలో ఏంటో? ఒరేయ్! నానీ! ఎంకటలక్ష్మి ఆంటీ యింటికెళ్లి ఓ సీసాడు చల్లటి నీళ్లు తెచ్చిపెడ్దూ.. .."అంటూ నానీని బతిమలాడి, ఎంకటలక్ష్మి యింటికి పంపింది. సావిత్రి.... అప్పుడురాత్రి పదిగంటలు.....

"అందుకని...నేను చెప్పేదేమిటంటే..." అంటూ మొదలెట్టింది సావిత్రి... కళ్లల్లోంచి జలపాతాలు....ముక్కు బుర్రున ఓసారిచీదింది..... అదిరిపోయాడు బ్రహ్మానందం....పదేళ్లలో మొట్టమొదటిసారిగా'లావా' పొంగింది. పెనుతుఫాను వీచే హెచ్చరికలు... ఇక లాభం లేదు. ఏ నాడు ఏ మాటకూ ఎదురు చెప్పని సావిత్రి యిలా బాధపడుతుంటే తన సంసారనౌకకి సరిగ్గా తెడ్డువేయలేదు...సుఖసంసారానికి దూరం కాలేదు. ఒకోసారి పరిస్థితులకు తల వొగ్గాల్సిందే!...

"ఏదో ఒకటి కొందాం సావిత్రి! ఫ్రిడ్జి, టి.వి. మనకొచ్చే బోనస్‌కు ఏ రెండింతలో వుంటాయి. కాబట్టి అవి ప్రక్కన వుంచు....అదీగాక వాళ్లింట్లో వున్నవి మనం కొనుక్కోవటం గొప్ప కాదు...వాళ్లింట్లో లేనివి కొంటేనే మనకు డాబుగా వుంటుంది.... ఏమంటావ్?" నంగి నంగిగా అన్నాడు బ్రహ్మానందం.

సావిత్రికి తలదిమ్మదిరిగింది...లేకపోతే ఏంటి తన శ్రీవారి నుండి యిలా... యిలా వింటం మొదటిసారి. సంతోషంతో వుక్కిరిబిక్కిరయింది.....

"నిజమేనండోయ్!" అంటూ పెద్ద కేకే పెట్టేసింది. ఎంత ఆలోచించినా తనకు లేనిది వాళ్లకున్నవి ఏమిటి? వాళ్ల కుండి తనకు లేనివి ఏమిటి?.....

వాళ్లకు అన్నీ వున్నాయి....మనకే ఏ ఒక్కటి లేవు.... ఏ మయితేనేం? బోనస్‌కు సరిపడేలా ఏదో ఒకటి... అదే చుట్టుప్రక్కల యింట్లో లేనిది రేపు కొనేయాలని నిర్ణయించుకున్నారు బ్రహ్మానందం, సావిత్రీను....

"ఇక మీరు పడుకోండి....రేపు వుదయం పెసరట్టు చేస్తా... పెసలు నాన బోయాలి... ఏంటో రుబ్బుడురాయి మరేచిన్నదయిపోయింది...రుబ్బాలంటే ప్రాణం పోతోంది అని విసుక్కుంటూ వంటగదిలోనికి వెళ్లిపోయింది సావిత్రి....

పెసరట్టంటే ప్రాణం బ్రహ్మానందానికి?

అతడి బుర్రలో ఓ పెద్ద మెరుపు మెరిసింది తను రేపు కొనబోయే వస్తువు ఏంటో?

* *

సాయంకాలం ఐదు గంటలయింది....

తలుపుచప్పుడయితే వెళ్లి తీసింది....ఎదురుగ్గా ఎదురింటి ఏకాంబరం భార్య ఎంకటలక్ష్మి... దిగ్రేట్ ఫ్రిడ్జ్ ఓనర్...ఆమె చేతిలో ఏదో గిన్నె...దాంట్లో ఏముందో సరిగా ఆనటం లేదు....

"రాండి! వదినగారూ!!" అని సావిత్రి ఆహ్వానిస్తున్నా చూపంతా ఆ గిన్నెమీదే వుంది... ఏదైనా అప్పుకోసం వచ్చిందాంటే, తను వెళ్లే ఆనవాయితేగాని తమింటికి ఎవరూ రారు... వచ్చినా పట్టుకెళ్లేందుకు తనింట్లో సరిగా ఏముంటున్నాయి గనుక. ఎంకటలక్ష్మి ఏదైనా కొత్తరకం వంట ఏదైనా చేసి రుచి చూపించేందుకు తీసుకొచ్చిందా?

"చాలా సంతోషం వదినగారూ! మీరు

'గ్రైండర్'కొంటున్నారంటగా! మాట వరుసకైనా చెప్పలేదేమిటమ్మా! ఇందాక అన్నయ్యగారు 'గ్రైండర్'కొనాలని ఆఫీసులో పర్మిషన్ పెట్టిబయటకెళ్లారట....మా వారు చెప్పారు...అన్నయ్యగారు వచ్చేశారా? గ్రైండర్ తెచ్చేశారా! నీవు చాలా అదృష్ట వంతురాలివి వదినా! 'గ్రైండర్' కొనమని మా శ్రీవార్ని ఎంత గీచి పోరుతున్నావున్న 'మిక్సీ'తోటే నీ రుబ్బుళ్లు సర్దుకో అంటారు గానీ గ్రైండర్ కొనరు.... మా వారి దంతా ఛాదస్తం వదినా! పోనీద్దూ...! అయినా అన్నయ్యగారింకా రాలేదా? వచ్చేశారా? గ్రైండర్ తెచ్చేశారుగా... కోయంబత్తూరు గ్రైండర్లయితే చాలా మంచివట... " అంటూ ఆగింది ఎంకటలక్ష్మి...

"ఏంటో వదినా! మావారు ఫ్రిడ్జి కొందామన్నారు. చన్నీళ్లు తాగితే గొంతుపాడవుతుందని, నిలవ వస్తువులు తింటే గుండె దెబ్బతింటుందని నేనే వద్దన్నాను. అదీగాక ఒక్క వేసవి మాత్రమే ఫ్రిడ్జి కావాల్సి వచ్చేది. అందుకని ఫ్రిడ్జి వద్దని, గ్రైండర్ కొనమన్నాను..." అంటూ సావిత్రి మెడలోని పుస్తెలతాడును అదో 'స్టైల్'గా సవరించుకుంది. నిజంగా సావిత్రికే తెలియదు శ్రీవారు బ్రహ్మానందం గ్రైండర్ కొంటున్నారని. "చూడు! ఎదినా!! నాకో చిన్న సాయంచేయాలి.. ఈ గిన్నెలో నాన బోసిన బియ్యం, మిన పప్పు వున్నాయి....మీ 'గ్రైండర్'లో రెండు వాయలు రుబ్బి పెట్టరూ! ఆఫీసు నుండి వస్తూ వస్తూ 'ఫస్ట్‌షో' కని టికెట్లు తీసుకొచ్చేశారు మీ అన్నయ్యగారు..." అంటూ తను తెచ్చిన గిన్నెను సావిత్రి చేతుల్లో అదాటుగా పెట్టేసి పారిపోయింది ఎంకటలక్ష్మి.....

సావిత్రి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది.... ఎంకటలక్ష్మి తన మీద కసి తీర్చుకుంటుందేమిటి? గిన్నెను వళ్లో పెట్టుకుని తలపట్టుకు కూర్చుంది సావిత్రి.

తలుపు దగ్గర ఏదో చప్పుడు... తలెత్తి చూసింది. ప్రక్కింటి పరమేశం గారి భార్య పంకజాక్షి...ది ప్రిస్టేజియస్ కలర్ టి.వి. ఓనర్...పంకజాక్షి చేతిలో ...ఏ గిన్నెలేదు... కొంత సంతోషించింది సావిత్రి...

"రాండి! పంకజాక్షి గారూ"

"రాక ఛస్తానేమిటి? పనున్నాక రావాల్సిందేగా? 'గ్రైండర్' కొనవయ్యా మగడా అంటే నీ ఒంట్లో కొవ్వు, బరువు తగ్గాలంటే గ్రైండర్లు, మిక్సీలు జాంతానై అంటారు మీ అన్నయ్యగారు....చెప్పు...ఎక్కడ కూలబడాలో?" పంకజాక్షిది భారీ శరీరం.. కొంత సేపు నిలబడాలంటేనే అలిసిపోతుంది. ఎక్కడో ఒక చోట కూలబడాల్సిందే!

ఇంట్లో వున్నది ఒకే ఒక చెక్క కుర్చీ... పంకజాక్షి దానిపై కూలబడితే ఆ కుర్చీ సాయంకాలానికి పొయ్యిలోనికి పనికొస్తుంది. ఆ సంగతి పంకజాక్షికి కూడా తెలుసు... నేల మీదే కూలబడింది....

"గ్రైండర్ చూపించరేం?"

"ఇంకా మీ అన్నయ్యగారు యింటికి తీసుకురాందే! గ్రైండర్ వద్దు... కలర్ టి.వి. తెస్తానన్నారు....నేను ఒప్పుకోలేదు.... కలర్ టి.వి.రోజూ చూస్తే 'క్యాన్సర్' వస్తుందట. ..." అంటూ మరోసారి పుస్తెలత్రాడు సవరించుకొంది సావిత్రి యింకో స్టైల్లో...

ఇంతలో పంకజాక్షి కూతురు వనజాక్షి వచ్చింది.... అమ్మాయి చేతిలో గిన్నె లేదు... కాని పెద్ద స్టీలు డబ్బా వుంది.

"ఇదిగో! ఈ స్టీలు డబ్బాలో నానపోసిన సెనగపప్పు వుంది. ఆవడలు చేయాలి... గ్రైండర్ వస్తూనే రుబ్బి పంపించు... బాగా మెత్తగా వుండాలి... మరినే వస్తా!...." అంటూ లేవబోయిన పంకజాక్షి లేవలేక తసికిలపడింది.

"అలా చూస్తారేం?" గుర్రుగా అంది పంకజాక్షి.... పంజాక్షిని ఎలాగైతేనేం సావిత్రి లేవనెత్తి, నిలబెట్టింది.

"వస్తా! పిండి కాటుకలా వుండాలి."

పంకజాక్షి నడక చిన్న గున్న ఏనుగు నడకలా వుంటుంది... మాట కటువు అయినా మనసు మెత్తనిది.

సావిత్రి ఆలోచనలతో మునిగిపోయింది... శ్రీవారు గ్రైండర్ కొంటారని ఆఘమేఘాల మీద అందరికి తెల్సిపోయింది... అయినా ఇంటికి గ్రైండర్ రాకపోయినా ప్రక్కింటి, చుట్టుప్రక్కల వాళ్ళ డబ్బాలు.. గిన్నెలు రుబ్బటానికి వచ్చేస్తున్నాయి. తనకు గ్రైండర్ కొంటున్నానని శ్రీవారు చెప్పి యుంటే తను వద్దనేది.... వాళ్ళ టి.వి.లు చూస్తున్నామని, వాళ్ళ ఫ్రిడ్జ్‌లు వాడుతున్నామని యిప్పట్నించే 'అథారిటీ' చూపిస్తున్నారు వీళ్ళందరూ!.....

మళ్ళీ తలుపు దగ్గర చప్పుడు.... రిక్షా దిగుతున్నారు శ్రీవారు... అంటే 'గ్రైండర్' కొనే వుంటారన్నమాట.....

"ఏంటే అలా కూరుచున్నావ్ అశోకవనంలో సీతమ్మలా... ఏంటే! నీ చుట్టూ ఈ డబ్బాలు గిన్నెలూ...."

"గ్రైండర్ కొన్నారా లేదా ముందు చెప్పండి..."

"నేనెక్కడ కొంటానే, నిజంగా కొందామనే వెళ్ళాను... ఏంలాభం... మార్కెట్లో గ్రైండర్లేలేవు... స్టాకు పూర్తిగా అయిపోయిందట.... మూణ్ణెల్ల వరకు స్టాకురాదట... అంతవరకు డబ్బు మన దగ్గర వుంచుకోవటం ఎందుకని పోస్టాఫీసులో కట్టేశాను. స్టాకు వచ్చినప్పుడు కొనుక్కోవచ్చని... అయినా నీకెలా తెలుసూ! నేను గ్రైండర్ కొంటున్నానని..."

సావిత్రి మౌనంగా వుంది... కాని ఆమె చూపంతా శ్రీవారిపైనా... అటు స్టీలు గిన్నెలు... ఇటు స్టీలుడబ్బాలు... మార్చి మార్చి చూస్తూంటే బ్రహ్మానందం అర్థం గాక తనూ మౌనంగా నిలబడిపోయాడు... ●

రాజేష్‌ఖన్నా పునరాగమనం



చాలా రోజులు చిత్ర రంగానికి దూరమైపోయిన రాజేష్‌ఖన్నా తిరిగి మళ్ళీ తెర మీదకు రాబోతున్నాడు.

'ఘర్ కా చిరాగ్', 'స్వర్గ్' చిత్రాల్లో నటిస్తున్నాడట రాజేష్. గతంలో సూపర్ స్టార్‌గా వున్న రోజుల్లో షూటింగ్‌కు ఆలస్యంగా వెళ్ళే అలవాటున్న రాజేష్‌ఖన్నా ఇప్పుడు సకాలంలో షూటింగ్‌కు రావటం, షాట్స్ అయిపోయే వరకు వుండటం చేస్తున్నాడట. మరి యిదివరకటిలా చేస్తే యింతే సంగతులని గ్రహించాడనుకుందామా?



న్యాయచట్టం ప్రశ్నలు-జవాబులు

అడ్వొకేట్: బి.భాస్కరరావు ఎం.ఎ., ఎల్.ఎల్.బి.

వి. సూర్యారావు, విశాఖపట్నం

ప్రశ్న : మా పెద్దల ఆస్తి రోడ్‌కు అనుకొని రెండు ప్రక్క ప్రక్క పోర్షన్‌లు కలవు. వెనుక భాగమునకు వెళ్లుటకు 5 అ. వెడల్పుగల సందు కలదు. పెద్దల తదనంతరం ఆ ఆస్తికి వారసులైన మా పెద్ద నాన్నగారి పిల్లలకు, మాకు సమాన వాటాలు లభించినవి. ఇప్పుడు ఆ సందును అనుకొని వున్న పోర్షన్ సందుతో కలిపి 15 అ. వెడల్పు, 60 అ. పొడవు కలిగిన స్థలముపై మేడమీద లాడ్జింగ్ కట్టుటకు నిశ్చయించారు. క్రింది పోర్షన్ షాపునకు, అద్దెకు ఇచ్చారు. లాడ్జింగ్ కట్టుటవలన మాకు కలుగు న్యూసెన్స్ గురించి వివరించినా వినటంలేదు. ఆ ఏరియా కమర్షియల్ ఏరియా కాబట్టి మా ఇష్టం వచ్చినది కట్టుకోవచ్చని అంటున్నారు. ఈ విషయంలో మాకు గల హక్కులను తెలియపర్చవలెను.

జవాబు : మీ స్థలంలో మేడ కట్టలేదు. వాళ్ల స్థలంలో మేడ కట్టుకుంటున్నారు. వారు లాడ్జింగ్ క్రింద చేసుకున్నప్పుడు మీకు న్యూసెన్స్‌గా ఉన్నచో, పోలీస్‌వారికి, మునిసిపల్ కార్పొరేషన్ వారికి తెలియపర్చండి. వారు చర్య తీసుకొనని ప్పుడు మీరు కోర్టులో కేసు పెట్టండి.

గొట్టాపు దుర్గారావు, గోపాలపురం (పశ్చిమ గోదావరి జిల్లా)

ప్రశ్న ఆడపిల్లకు అన్యాయం జరిగితే ఆమె కోర్టుకు ఏ విదంగా తెలియ జేసుకోవాలి?

జవాబు :భార్యను భర్త నిర్లక్ష్యం చేసి పోషించనట్లయితే క్రిమినల్ ప్రొసిజర్ కోడ్‌లోని 125 సెక్షన్ క్రింద జీవనభృతి కోసం మేజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ పెట్టవచ్చును. ఆడపిల్లను కిడ్నాప్ చేసినా, ఎత్తుకొని పోయినా పోలీసులకు కంప్లయింట్ ఇవ్వవలెను. ఆడపిల్లపై అత్యాచారం జరిపినప్పుడు పోలీసులకు తెలియ పర్చవలెను. నేరమునుబట్టి భారతీయ శిక్షాస్మృతిలోని 375, 376, 376 ఎ, బి, సి, డి సెక్షన్ల క్రింద మేజిస్ట్రేట్ కోర్టులో కంప్లయింట్ దాఖలు చెయ్యవలెను. భార్య బ్రతికి వుండగా రెండవ వివాహము చెసుకున్నప్పుడు 494 సెక్షన్ క్రింద మేజిస్ట్రేట్‌కు కంప్లయింట్ దాఖలు చెయ్యవలెను. వివాహమైన స్త్రీని తీసుకొని పోయినప్పుడు 498 సెక్షన్ క్రింద కంప్లయింట్ పెట్టవచ్చును. ఇక భర్తగాని, భర్త బంధువులు గాని వివాహమైన స్త్రీని క్రూరముగా బాధించినప్పుడు 498–ఎ సెక్షన్ క్రింద మేజిస్ట్రేట్ కోర్టులో కంప్లయింట్ దాఖలు చెయ్యవలెను. వరకట్నం చావులు కారణంగా ఈ సెక్షన్ 1983లో ప్రవేశపెట్టారు.

ఎస్.వి. రమణ, మచిలీపట్నం.

ప్రశ్న : నన్ను పని నుండి 1981లో తొలగించగా నేను అసిస్టెంట్ లేబర్ కమీషనర్‌గారి దగ్గిర దుకాణముల చట్టముక్రింద కేసు వేయగా నాకు తిరిగి పనిని ఇచ్చి, పాత జీతాలు ఇవ్వవలసినదని యాజమాన్యమును ఆదేశించారు. మేనేజ్‌మెంట్ వారు లేబర్ కోర్టుకు అప్పీలు చేయగా అప్పీలు కొట్టివేశారు. ఆ తర్వాత మేనేజ్‌మెంట్ వారు ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ పెట్టుకున్నారు. హైకోర్టు రిట్ పిటిషన్‌ను డిస్‌మిస్ చేసినది. ఇప్పుడు నేను ఏ విధంగా చర్య తీసుకొనాలి. నాయొక్క పాత జీతాలు కొరకు ఏమి చెయ్యాలి?

జవాబు : హైకోర్టులో రిట్‌పిటీషన్ డిస్‌మిస్ చేసినప్పుడు మీకు ఉద్యోగం ఇవ్వాలి. పాత జీతాలు కూడా ఇవ్వాలి. కనుక మీరు లాయరు నోటీసు పంపించండి. 15 రోజులలో సమాధానం రానట్లయితే కోర్టులో దావా వెయ్యండి. హైకోర్టులో కూడా కంటెంప్ట్ ఆఫ్ కోర్టు క్రింద పిటిషన్ పెట్టవచ్చును.

కనుమూరి గణపతిరాజు, విస్సాకోడేరు (పశ్చిమగోదావరిజిల్లా).

ప్రశ్న: నేను జన్మించిన తేదీ 1-6-1964, కాని నేను మెట్రిక్ పరీక్ష వ్రాయడానికి అనుకూలంగా ఉండుటకు నేను పుట్టిన తేదీ 16-3-1960 అని మా స్కూలు ప్రిన్సిపాల్‌గారు రాశారు. హాస్పిటల్ రికార్డు ప్రకారం మరియు జనన రిజిష్టరు ప్రకారం నేను కోర్టులో కేసు వేయుటకు అవకాశం వున్నచో తెలియజేయ ప్రార్థన.

జవాబు: మీరు తగిన సాక్ష్యాధారాల పత్రాలు జతచేసి పుట్టిన తేదీ మార్చవలెనని యూనివర్సిటీకి లాయరు నోటీసు పంపండి. యూనివర్సిటి వారు అంగీకరించనిచో కోర్టులో పిటిషన్ వెయ్యండి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పుట్టిన తేదీ గురించి ప్రభుత్వోద్యోగులకు 1984లో నిబంధనలు జారీ చేసింది. అందులోని రూలు 5 రాజ్యాంగ విరుద్ధమని ఆంధ్రప్రదేశ్ ఎడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ 1987లో తీర్పు ఇచ్చింది. స్కూల్ రికార్డు లేదా కాలేజీ రికార్డు నమ్మదగినవి కావు అని తీర్పులు వున్నవి. కనుక సాక్ష్యాధారాలు, పత్రాలు పరిశీలించి పుట్టిన తేదీ నిర్ణయించాలని ట్రిబ్యునల్ పేర్కొన్నది. మీరు ప్రభుత్వ ఉద్యోగులు కానప్పటికి పై తీర్పు ఆధారంగా పుట్టిన తేదీ మార్చమని కోర్టులో పిటిషన్ దాఖలు చేయండి. ○

ఆంధ్రసచిత్ర వారపత్రిక

న్యాయ చట్టం-ప్రశ్నలు జవాబులు


ప్రశ్న: ....

పేరు: ....

పూర్తి చిరునామా: ....

....

పవిత్ర పుణ్యక్షేత్రం 'కుశీనగరం'



మహాపరి నిర్వాణ స్తూపం-బౌద్ధాలయం.

ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌కు 50 కి.మీ. దూరంలో దేవరియా జిల్లాలో కుశీనగరం ఉంది. బుద్ధుని జీవితకాలంలో కుశీనగరం ఒక ప్రసిద్ధ పట్టణం. అది క్రీస్తు పూర్వం 6వ శతాబ్దం అప్పుడు మల్లుల గణరాజ్యానికి అది రాజధానిగా ఉండేది. తథాగతుని జీవన లీల ఇక్కడే సమాప్తమయింది.

కుశీనగరానికి రాకమునుపే బుద్ధుని ఆరోగ్యం బాగా దెబ్బతిన్నది. వైశాలి నుంచి కుశీ నగరానికి వస్తూ, దారిలో 'పావా' గ్రామాన్ని చేరారు. అక్కడ మామిడి తోపులో బస చేయగా చుందుడనే లోహకారుడు ఆయనకు పుట్టగొడుగులతో తయారు చేసిన ఆహారంతో అతిథ్యం ఇచ్చాడు. ఈ ఆహారం తినడం వల్ల బుద్ధుని ఆరోగ్యం చెడి, రక్త విరేచనాలతో బాధపడుతూ, భరించరాని నొప్పితో బుద్ధుడు బాధపడ్డారు. ఈ విషయం ఎవరితోను చెప్పక, తన ముఖ్య శిష్యుడైన అనందునితో కుశీనగరానికి బయలుదేరారు. అలాంటి అనారోగ్య పరిస్థితులలో కూడా ఆయన ఎలాగో కుశీ నగరం చేరుకున్నారు. అక్కడ రెండు సాలవృక్షాల నీడలో ఆనందుణ్ణే ఒక పరిశుభ్రమైన వస్త్రం పరవమన్నారు. దాని మీద ఆయన తల ఉత్తర దిశగా పెట్టుకొని పడుకున్నారు. మరణశయ్య మీద కూడా భగవానుడు తన ఉపదేశం కోరివచ్చిన వారిని కాదనలేదు. ఆ చివరి క్షణంలో కూడా ఆయన బోధనలు విని సంఘంలో చాలా మంది చేరారు. ఆ విధంగా బుద్ధుడికి సుభద్రుడు అంతిమ శిష్యుడయ్యాడు.

సాలవృక్షం నుంచి పూలు బుద్ధభగవాన్ శరీరంపై రాలి శరీరం పూర్తిగా కప్పివేయబడింది. దేవలోకం నుంచి వచ్చిన మందార పుష్పాలు, శ్రీగంధ చూర్ణం ఆయన శరీరంపై చల్లబడింది. ఈ స్థితిలో గౌతమ బుద్ధుడు మహాపరి నిర్వాణం (80వ ఏట, వైశాఖ పూర్ణిమ, క్రీ.పూ. 483) చెందారు.

మల్లులు బుద్ధుని మహాపరి నిర్వాణం సంగతి తెలుసుకుని సుగంధ ద్రవ్యాలు, పుష్పాలు, వస్త్రాలు తెచ్చి శవానికి అలంకరించి ఏడవ దినాన ఊరేగింపుగా తీసుకెళ్ళి అంతిమ సంస్కారం చేసినట్లు తెలుస్తున్నది.

ఇక్కడ మౌర్య అశోక చక్రవర్తి మూడు స్తూపాలను నిర్మించడమేగాక రెండు స్తంభ శాసనాలను కూడా ప్రతిష్ఠింపజేసినట్లు చైనా యాత్రికుడైన హుయాన్‌త్సాంగ్ రచనల వల్ల తెలుస్తున్నది. క్రీస్తు శకం 1-10 శతాబ్దాల మధ్య కాలం నాటి చిన్న స్తూపాలు, విహారాలు, విగ్రహాలు మొదలైన బౌద్ధ కట్టడాలు శిథిలాలు అనేకం ఇటీవల జరిపిన త్రవ్వకాలలో ఇక్కడ వెలుగులోకి వచ్చాయి.

బుద్ధుడు నిర్వాణాన్ని పొందిన సాల వృక్షాల స్థానంలో మహాపరి నిర్వాణ స్తూపం, బౌద్ధాలయం ఒకే వేదిక మీద నిర్మించబడ్డాయి. గుప్తుల కాలంలో ఇవి నిర్మించబడినట్లు ఇక్కడ లభించిన కొన్ని పురావస్తు ఆధారాల వలన తెలుస్తోంది. బౌద్ధాలయంలో 21 అడుగుల పొడవు కలిగిన మహాపరి నిర్వాణాన్ని చూపే బుద్ధ విగ్రహం ఎంతో గంభీరంగా ఉంది. ఇసుక రాయితో చేసిన శయన బుద్ధ విగ్రహం ఇటుకలతో నిర్మించిన వేదికపై మహోన్నతంగా గోచరిస్తుంది. విగ్రహానికి బంగారపు పూత పూయబడింది. బుద్ధుడు మహాపరి నిర్వాణం పొందడానికి ఎడమ చెయ్యి శరీరం క్రింద పెట్టుకొని, కుడి చెయ్యి శరీరం మీద పెట్టుకుని పడుకున్న అపురూప విగ్రహం ఇది. పెద్ద చెవులు, తలపైన ఉంగరాలు తిరిగిన జుట్టు, వాటి మీద చుట్టగా చుట్టిన సిగముడి బుద్ధుడు కలిగి ఉన్నాడు. ఈ విగ్రహాన్ని మలిపించి దానం చేసింది 'హరిబాల' అని ఒక శాసనం వల్ల తెలుస్తుంది. మహాపరి నిర్వాణ స్తూపం, ఆలయం రెండు సార్లు అంటే 1876లో ఒకసారి, 1956లో మరోసారి పునర్నిర్మించబడ్డాయి.

బుద్ధుని దహనక్రియలు జరిగిన ప్రదేశం మహాపరి నిర్వాణ స్తూపానికి 1.5 కి.మీ.ల దూరంలో ఉంది. ఇక్కడే మకుట బంధన స్తూపం. విహారం నిర్మించబడినట్లు లభ్యమైన కొన్ని ముద్రికల వల్ల తెలుస్తున్నది. ప్రస్తుతమిక్కడ ఒక స్తూపం ఇటుకల దిబ్బ, విహార శిథిలాలు కనిపిస్తున్నాయి. స్థానికులు దీనిని 'రామ్‌భార్ స్తూపం' అని పిలుస్తారు.

మహాపరి నిర్వాణ స్తూప పరిసర ప్రాంతాలలో విభిన్న సాంప్రదాయాల బౌద్ధులు తమ స్తూపాలను, విహారాలను కట్టించుకున్నారు. ఇటీవల కాలంలో జపనీయులు, టిబెట్ దేశీయులు స్తూపాలను వసతి గృహాలను నిర్మించుకున్నారు. పురావస్తు శాఖ వారు ఈ ప్రాంతంలో ఉద్యానవనాన్ని అభివృద్ధిపరిచారు.

-డా॥ వి.వి.సుబ్బారెడ్డి

సీరియల్

శత్రుసంహారం

లల్లాదేవి

(గత సంచిక తరువాయి)

ఇంతవరకూ సాగిన కథ - *21* : వైమానిక దళ పైలట్ రాహుల్ తల్లి, భార్య కారుప్రమాదంలో మరణించటానికి సంబంధించిన వివరాలు సేకరిస్తున్న తరుణంలో కారవెల్లీ విమాన ప్రమాదానికి సంబంధించిన క్రూబాక్స్‌లోని ఇండికేటర్‌ను దొంగిలించిన దుండగుల కోసం పోలీసులు దర్యాప్తు జరుపుతుంటారు. దుండగుల విషవలయం నుంచి బయటపడిన పీయూష రాహుల్ సెక్రటరీగా చేరిందని తెలిసి మండిపడతాడు అలయన్స్ సంస్థ అధినేత దేవిప్రసాద్. అల్లర్లు జరిపి అరెస్టయిన సైతాన్ దళం నాయకుడు ఇబ్రహీం జైలునుంచి విడుదలై తన ముఠాతో రాహుల్ యింటిపై దాడి చేస్తాడు. కూతురు సుషుమ్న ప్రాణాలకు ముప్పు వాటిల్లటంతో అనాధాశ్రమంలో చేరుస్తాడు రాహుల్.

సైతాను దళాలకు వరుసగా పరాజయాలు ఎదురు అవుతున్నాయి. ఇబ్రహీం శక్తి రోజు రోజుకి క్షీణించిపోతూందనుకోవాలి. జైలునించి అతన్ని విడుదల చేయించేందుకు స్వయంగా హోం మినిష్టరు కపిలి రావలసి వచ్చింది.

విడుదల అయాక అతను సాధించింది ఏమీ లేదు. రాహుల్ ఇంటిమీద దాడి చేసి ఉత్త చేతులతో తిరిగి వచ్చాడు అంటూ రిపోర్టు చదివి వినిపించాడు కైలాష్ ఛద్దా!

చేతులు విరిచి కట్టుకుని అతనీ మాటలు వింటున్న దేవిప్రసాద్ పచార్లు చేయటం ఆగిపోయింది. కనుబొమ్మలు ప్రశ్నార్థకంగా వొంపు తిరిగినాయి. ముఖం జేవురించింది.

"రాహుల్ గురించి విన్నాను. కాని ఆ ఒక్క మనిషి దగ్గర మనవాళ్ళు ప్రతిసారి విఫలమవుతున్నారు. కారణం ఏమిటో బోధ పడకుండా ఉంది. ఎవరి చేత కాకపోయినా నాకు విడిచి పెట్టండి. నేను స్వయంగా చూచుకుంటాను" అన్నాడు దేవిప్రసాద్.

కైలాష్‌ఛద్దా ఈ మాటలు అవమానకరంగా భావించాడు.

"జూ బిలిహిల్స్‌లో భవన నిర్మాణం పూర్తి అయింది. కెమికల్ వెపన్స్ తయారవుతున్నాయి. వాటిని మరింత అధునాతనంగా మార్చేందుకు ప్రయత్నాలు కూడ జరుగుతున్నాయి. రోజుకో రకం రసాయన ఆయుధం తయారవుతోంది.

వాటిని ఉపయోగించటంలో మన సైతాన్ దళం సభ్యులకి ట్రైనింగ్ కూడ యిస్తున్నారు శాస్త్రవేత్తలు. ఇకనించి మొరటు ఆయుధాలతో జనంమీద దాడులు పోలీసు కేసులు ఇలాంటివి ఏవీ ఉండవు. రసాయన ఆయుధాల సాయంతో అంతా నిశ్శబ్దంగా జరిగిపోతుంది. రాహుల్ కాదు.

అతని తలలో జేజెమ్మ అయినా మనముందు పాదాక్రాంతులు కాకతప్పదు" అన్నాడు కైలాష్ ఛద్దా.

"అవును. నేనూ అదే ఆలోచిస్తున్నాను. ఇకనించి మన కార్యక్రమాలు అధునాతనమయిన పద్ధతుల్లో జరగాలి. ఎదురులేని యిబ్రహీం ప్రతిసారి ఓటమి పాలవుతున్నాడంటే అందుకు కారణం అతని పద్ధతులు పాతబడి పోవటమే!" అన్నాడు దేవిప్రసాద్.

"మీరు ఒకసారి జూ బిలిహిల్స్‌కు రావాలి. మొదటి కెమికల్ వెపన్ ఈ రోజు విడుదల చేస్తున్నాం. దాన్ని ప్రయోగించటంలో ఒక సైతాన్ దళ సభ్యుడికి ట్రైనింగ్ యివ్వటం కూడ పూర్తి అయింది."

"ష్యూర్" అంటూ తన అంగీకారాన్ని తెలియపరిచాడు దేవిప్రసాద్.

వెంటనే ప్రయాణానికి అంతా సిద్ధమయింది.

ముందు పైలట్ కారులు జూ బిలీహిల్స్‌కి బయలుదేరాయి. వెనుక గార్డులు వస్తున్నారు. మధ్యలో ఒక స్పేర్ కార్ అనుసరించగా క్షేమంగా ప్రయాణం చేస్తున్నాడు దేవిప్రసాద్.

జూ బిలీహిల్స్‌లో ఎవరి దృష్టిని ఆకర్షించని చోటున ఒక యిల్లు కన్పించింది. దాని చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేయబడింది. గార్డులు ఆయుధాలతో సిద్ధంగా నిలబడి ఉన్నారు.

ఆ యింటి ముందు కారు దిగి పరిసరాలను పరిశీలించాడు దేవిప్రసాద్. అలాంటి చోటుని ఎంపిక చేసినందుకు ఛద్దాని అభినందించాడు.

మల్టీ నేషనల్ వ్యాపార సంస్థ అయిన శ్రమతో దేవి అలయన్స్‌కి అనుబంధ సంస్థ అని తెలిపే బోర్డు కూడ ఉంది.

ఆ రూపేణ అభ్యంతరకరమయిన కొన్ని రసాయనాలను అక్కడ స్టాక్ చేసేందుకు అనుమతి సంపాదించారు. వాటితో పాటుగా మరికొన్ని అనుమతి లభించని రసాయనాలు దొంగతనంగా ఆ యింటిలోకి చేరుకున్నాయి.

శ్రీ మహాదేవికి అనుబంధంగా లైసెన్సు అంటూ ఒకటి సంపాదించి బోర్డు తగిలించారు కాబట్టి ఇంక నిఘా విభాగం అధికారులు అయినా ఆ యింటిమీదికి దాడి చేయటం జరగదు.

తగిన కారణం లేకుండా పలుకుబడి పాపులారిటి కలిగిన సంస్థల జోలికి ఎవరు మాత్రం రాగలుగుతారు?

ఛద్దా ముందుకి దారి తీశాడు. తలుపులు అన్నీ మూసి ఉన్నాయి. లోపలి గాలి విషపూరితమవుతూ ఉంటూంది. కెమికల్స్ కారణంగా, సైంటిస్టులు మాస్కులు ధరించారు.

విష వాయువు వెలుపలకు పోయేందుకు ఎబ్జార్బర్స్ నిర్విరామంగా పని చేస్తున్నాయి. వారిద్దరికి ఆక్సిజన్ ఏర్పాటున్న మాస్కులు యిచ్చారు. వాటికి బయర్ ఫోన్‌లు అమర్చి ఉన్నాయి.

ఓ ప్రక్కగా ఉన్న అద్దాల గదిలోంచి ఒక సైంటిస్టు చెబుతున్న వ్యాఖ్యానం వినిపిస్తోంది. ఒక్కొక్క టేబిల్ దగ్గరకు పోగానే ఆ వ్యవస్థ గురించిపరిచయ వ్యాక్యాలు చెబుతున్నాడు.

మొదటి టేబిల్‌మీద కొద్ది మీటర్ల దూరం ఉన్న వ్యక్తి శరీరంలోకి గురి చూచి విషపు సూదులు గ్రుచ్చే ఆయుధాలు ఉన్నాయి.

అది రైల్వే స్టేషన్‌లు, బస్‌స్టాపులు. సినిమా హాల్స్‌లో హత్య చేసింది ఎవరో గుర్తించటానికి వీలు కాకుండా హత్యలు చేయవచ్చు.

ఆ రెండో టేబిల్‌మీద ఉన్నవి పాయిజన్ టాబ్లెట్స్!

వాటిని కుటుంబ హత్యలకు ఉపయోగించవచ్చు. తలుపులు మూసి ఉన్న గదిలో ఆ టబ్లెట్స్ ఉంచి నీటితో తడపాలి. నీరు తగలగానే వాటినించి భయంకరమయిన మృత్యు వాయువు రిలీజ్ అవుతుంది.

ఆ కుటుంబానికి ఇంక ఆ రాత్రి తెల్లవారదు. చప్పుడు కాదు. పోరాటం ఉండదు. రక్తపాతం లేదు.

వారు చనిపోయిన విషయం మరొకరు గ్రహించేలోగా ఆ టాబ్లెట్స్ ఉంచిన వ్యక్తి కనీసం అయిదు వందల కిలో మీటర్లు దూరం వెళ్ళిపోవచ్చు..

లేదా ఆ ప్రక్క గదిలో ఉండి వార్తలు వింటూ ఆనందించవచ్చు.

ఎవరికీ అనుమానం కూడరాదు.

నంబర్ త్రీ అయిటమ్ ఇంకా భయంకరమయినది.

కేవలం అంగళం పొడవు మాత్రమే ఉండే చిన్న సిరంజితో ఆ రసాయనాన్ని చంపదలుచుకున్న వ్యక్తి శరీరం మీదికి పిచికారి చేయాలి. అది శరీరాన్ని తాకినప్పుడు ఆ వ్యక్తికి చల్లని స్పర్శలా సోకుతుంది. అంతే!

ఆ తరువాత అది చర్మంమీది స్వేద రంధ్రాల ద్వారా లోపలకు చేరుకుని రక్తంలో కలుస్తుంది.

ముందు స్వరపేటిక పగిలిపోయి మాట పడిపోతుంది.

ఆ రసాయనాన్ని శరీరానికి ఎవరు తాకించారో, ఏ ప్రదేశంలో తాకించారో చెప్పలేని స్థితిలో కోమాలో ఉండి రెండు రోజులు తరువాత మరణిస్తారు.

అతనిమీద ఎలాంటి డ్రగ్స్ పని చేయవు. మరణం అనివార్యం.

ఇలా చెప్పుకు పోతున్నాడు వ్యాఖ్యాత.

దేవిప్రసాద్ కళ్ళు ఆనందంతో మెరిసాయి. ఒకవిధంగా అక్కడ ఉండి అవన్నీ పరిశీలించేందుకు కూడ భయమనిపించింది.

ఇంకా చూడవలసిన టేబిల్స్ ఉన్నాయి.

వాటిని వొదిలేసి ప్రక్క గదిలోకి వెళ్ళిపోయాడు. ఒక అటెండర్ వచ్చి ఆయనకు అమర్చిన మాస్క్ తొలగించాడు. ఆ గదిలో ఉన్న ఒకేఒక్క పెద్ద ఆసనంమీద కూర్చున్నాడు దేవిప్రసాద్. ఛద్దా ఎ. సి. ఆన్ చేసి తిరిగి వచ్చి తలుపులు మూసాడు.



క్రీడారంగంక్విజ్ జవాబులు!

(1) 1951లో 'క్యూబా' "కపబ్లాంకా" అనే ఛెస్ క్రీడాకారుని చిత్రంతో రెండు, ఇంకొక ప్రముఖ క్రీడాకారుడు 'ఇమా న్యువల్ లస్కర్'తో ఆడుతున్నట్టు రెండూ విడుదల చేసింది. (2) ఒకే ఒకసారి (1988 యు.ఎస్. ఓపెన్) (3) ఫ్రెడరిక్ రోబర్ట్ స్పొఫోర్త్ 1878-79లో మెల్ బోర్న్ టెస్ట్ లో 110 పరుగులిచ్చి '13 వికెట్లు' తీసుకున్నాడు. (4) 'యు' అంగ్ల అక్షరం చు ట్టూ అయిదు రంగుల (నీలం, పసుపు, నలుపు, ఆకుపచ్చ, ఎరుపు) నక్షత్రాలు (5) ఫ్రాంజ్ బెకన్ బార్ (6) 1975లో కౌలాలంపూర్ లో, అజిత్ పాల్ సింగ్ (7) అస్లం షేర్ ఖాన్ (ఎం.పి) (8) నవజ్యోత్ సిద్దూ (9) అనుపమ అభయంకర్ (10) కపిల్ దేవ్ కి చెందిన "దేవ్ ఫీచర్స్".

శత్రుసంహారం

"చద్దాబాయ్! నువ్వు చాల గొప్ప ఏర్పాట్లు చేశావు ఒక చిన్న గదిలో టేబిల్స్ మీద అతి తక్కువ ఖర్చుతో నువ్వు తయారు చేయించిన ఆయుదాలు అపురూపం!

ఇటువంటి ఐడియాలు నీకుతప్ప మరెవ్వరికీ రావు రక్తపాతంలో వెపన్స్ మోసుకుపోయి పోలీసుల దృష్టిలో పడే అవసరం రాదు చప్పుడ కాదు చనిపోయే వాడికి బాదలేదు ఎంత అద్భుతమయిన ఆలోచన చేశావు నిన్ను అబినందించక తప్పదు అన్నాడు దేవిప్రసాద్

"సాబ్! వీటివల్ల మన సైతాన్ దళం సిబ్బందిని సగానికి పైగా తగ్గించుకోవచ్చు మనకి చాల ఆదా అవుతుంది వారికి ఆయుదాలిచ్చి డబ్బిచ్చి పని అప్పగించటం

అతను సరిగా ఆ పనిలో ముందుకు పోతున్నాడో లేదో పరిశీలించేందుకు మరికొందరిని నియమించటం ఇవన్నీ ఉండవు ఖర్చు తక్కువ శ్రమ లేదు

ప్రస్తుతం మన దగ్గర మూడు కోట్ల రూపాయల విలువ చేసే ఆయుద వ్యవస్థ ఉంది వేల మంది సైతానుదళం ఉంది ఈ వ్యవస్థ అంతటిని నమ్మ చేసి కొన్ని వందల మందితో నిశ్శబ్దంగా ఆడంబరం లేకుండా అనుమానం రాకుండా మన పనులు చేసుకు పోయేందుకు ఈ ఏర్పాటు చేశాను

ఈ పద్దతిలో మనకి ప్రతి సంవత్సరం కనీసం పది కోట్ల రూపాయలు, ఆదా అవుతుంది అంటూ తాను రూపొందించిన క్రొత్త పథకం వల్ల చేకూరే లాభాలను వివరించాడు చద్దా" దేవీప్రసాద్ తృప్తిగా నవ్వాడు

' ఒకసారి వీటి శక్తిని పరిశీలించాలి అన్నాడు

"అలాగే అంటూ లేచాడు చద్దా ఇద్దరూ కారులో కూర్చుని తిరిగి వచ్చేశారు అతనికి పాదపీట అమర్చేందుకు ఇద్దరు అమ్మాయిలు దేవిప్రసాద్ గదిలోకి వచ్చారు

బరువయిన వెండి పాద పీటని అతని కాళ్ళ క్రింద అమర్చి తాటి ఆకుల మీద వ్రాసి ఉంచిన అవెస్తా పవిత్ర గ్రంథాన్ని అతని చేతులకి అందించారు

"నీ జీవితంలో ఉన్న దుఃఖమంతా దూరం అయేందుకు దేవి ప్రసాద్ గారు యిప్పుడు నీకు పూజాద్రవ్యం యిస్తారు అన్నాడు చద్దా' ఆ అమ్మాయి నవ్వి నిలిచి పోయింది రెండో అమ్మాయి వెళ్ళి పోయింది

"ఇలారా! నాకు దగ్గరగా కూర్చో అన్నాడు దేవిప్రసాద్

ఆ అమ్మాయి తన జీవితం దన్యమయి పోతున్నట్లు ఎంతో వినయ విదేయతలతో వచ్చి ఎదురుగా కూర్చుంది

ఒక పేటిక లోంచి ఒక పూజా ద్రవ్యాన్ని వెండి పుల్లతో బయటకు తీశాడు దేవిప్రసాద్! దాన్ని ఆమె స్లీవ్ లెస్ జబ్బ మీద అంటించాడు గది అంతా సెంట్ వాసన గుప్పుమంది

ఆ అమ్మాయి కళ్ళు అరమోడ్చి ఆ వాసనని గుండెలు నిండా పీల్చుకుంది అలాగే సొమ్మసిల్లి పడిపోయింది

దేవిప్రసాద్ ఛద్దా చూపులు కలుపుకున్నారు అర్థవంతంగా అయిదు నిముషాల అనంతరం కళ్ళు తెరిచిందామె!

నోరు తెరిచి ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది కాని నోటి నించి మాట పెగిలి రాలేదు రక్తపు పీనందుబ్బులాగ ఉరికి వచ్చి, నేలమీద పడింది

ఆ వెనుక ఫ్లడ్ లా రక్తం ఉరికింది

అలాగే ముందుకి వాలి నుదురు నేలను తాకించి పడిపోయిం దామె నేల తల్లిని కావిలించుకుని ప్రాణాలు విడిచింది క్షణాల మీద శరీరం నీలివర్ణంగా మారి పోయింది

గదిలో ఇంకాసెంటు వాసన వస్తూనే ఉంది

ఛద్దా తయారు చేయించిన కెమికల్ వెపన్స్ ఎంత భయంకర మయినవో దేవిప్రసాద్ ప్రాక్టికల్ గా చూడగలిగాడు తాను రూపొందించిన క్రొత్త వ్యవస్థ తన అవసరాలు తీర్చ గలుగుతుందనే విశ్వాసం కలిగింది

అతడు గంట కొట్టగానే యిద్దరు బలిష్ఠులయిన యువకులు లోనికి వచ్చారు చేతులు కట్టుకుని నిలబడ్డారు

"అనాయాస మరణంతో శాంతి సముద్రంలో శయనించిన ఈ అమాయకురాలి శరీరాన్ని తీసుకుపొండి బాగా లోతుగా గొయ్యితీసి పాతిపెట్టండి లేకపోతే ఈ శరీరాన్ని పీక్కుని తినే కుక్కలు నక్కలు కూడ చనిపోతాయి అంటూ ఆదేశించాడు దేవిప్రసాద్!

యువకులు ఆ యువతి శరీరాన్ని ఈడ్చుకు పోతున్నారు

కైలాష్ చద్దా విజయగర్వంతో దేవిప్రసాద్ వంక చూశాడు

"నీవు చేసిన ఈ మనకార్యం నాకు చాల ఆనందాన్ని కలిగిస్తోంది నీకు ఏదైనా మంచి బహుమానం యివ్వాలని పిస్తోంది అన్నారు దేవిప్రసాద్ సంతోషంగా

"నా శ్రమను గుర్తించటమే నాకు గొప్ప బహుమానం అన్నాడు కైలాష్ ముక్తసరిగా! అతని మనసులో ఎటువంటి ఆలోచనలున్నాయో యజమానికి అర్థం కాలేదు తీక్షణంగా చూచాడు

"ఈ సరిక్రొత్త ఆయుదాలు కూలిపోయిన కారవెల్లి విమానంలోంచి అదృశ్యమయిన ఇండికేటర్ ని సంపాదించేందుకు ఉపయోగించాలి ఈ రాహుల్ ఎవరో అతని పేరు ప్రతి రోజూ వినిపిస్తోంది నాకు ఇక ముందు ఆ పేరు వినిపించ కూడదు

ఇండికేటర్ అదృశ్యమయినది మొదలుగా యిలా పరాజయాలు ఎదురు అవుతున్నాయి ఇది చాల సీరియస్!

ఇకముందు వ్యాపారం చేయలేమని శ్రీ మహాదేవి అలయన్స్ సంస్థని నిలబెట్టుకోలేమని అనుమానం కలుగుతోంది నాకు క్రొత్త ఆయుదాలు వచ్చాయి కాబట్టి ఇబ్రహీంకి సైతాన్ దళంలో ప్రాదాన్యత కూడ తగ్గించాలి

సామర్థ్యం తగ్గిపోయిన కారణంగా తనే ప్రతిసారి ఊబిలో కూరుకు పోతున్నాడు అతన్ని మనం ఎంత కాలమని రక్షించగలం? అన్నాడు దేవిప్రసాద్

"ఇంక మీరు నిశ్చింతగా ఉండండి ఆ విషయాలన్నీ నేను చూసుకుంటాను అన్నాడు కైలాష్ ఛద్దా!

"ఆ పసిపాప వరకూ వెళ్ళి అదృశ్యమయిన ఆ యిండికేటర్ ని నువ్వు సంపాదించి తీసుకు రాగలవా?

"ఆ కుటుంబం అంతటిని అంతంచేసి అయినాసరే తీసుకు వస్తాను

"దట్స్ గుడ్! ఈ పని చేయటానికి ఎంత సమయం కావాలి నీకు?

"ఎంతో ఎందుకు? కొద్ది రోజులు చాలు

"ఒకే ప్రొసీడ్ అని చెప్పేసి లేచి వెళ్ళిపోయాడు దేవిప్రసాద్ కైలాష్ చద్దా అక్కడేకూర్చుని ఆలోచిస్తున్నాడు

అతని మెదడులో క్రూరమయిన పథకాలు

రూపుదిద్దుకుంటున్నాయి

* * * * * * * *

"ఈ కార్నర్‌లో పాపని తీసుకుని వారు ఇద్దరూ దిగిపోయారు ఆ తరువాత అరగంటకు ఇద్దరే తిరిగి వచ్చారు వారితో పా.. లాజేస. కళు ఒగి వెడుతూ నన్ను కారులో కూర్చోమన్నాడు రాహుల్

అందువల్ల వారు ఎక్కడకు పోయారో ఏం చేశారో నాకు తెలియదు అని చెప్పేసి వెళ్ళిపోయాడు మఫ్టీలో ఉన్న పి సి

సైతాన్‌దళం సభ్యులు అక్కడే నిలబడి పోయారు ఆ పాపని తీసుకోకుండా తిరిగి రావద్దు అని ఆదేశించాడు యిబ్రహీం అతను రాహుల్‌ని తెలివిగా దారి తప్పించాడు కాని అంతకన్నా మరింత తెలివిగా పథకం వేసి పాపని రక్షించుకున్నాడు తండ్రి

ఇబ్రహీంకి తల తీసివేసినట్లుగా అయింది అతని ప్రపంచం తలక్రిందులు అయింది తను ఎంత దుర్మార్గుడయినా తనకన్నా శక్తిశాలి మరొకడు ఉన్నాడు అని రుజువు అయింది

సైనికుడితో పోరాటం సివిలియన్స్‌ని భయ పెట్టినంత సులభం కాదని పూర్తిగా అర్థమయింది అందుకే తన దళం వారిని గట్టిగా హెచ్చరించి పాపకోసం పంపించాడు

వారు అయోమయంలో పడిపోయారు

అక్కడ నించి రెండు దారులు చీలు తున్నాయి అక్కడ దిగిన రాహుల్ పీయూషలు ఏ వీదికి పోయారో ఆ వైపుగా బయలు దేరారు సైతానుదళం వీధి చివరి వరకూ వెళ్ళి తిరిగి రావటానికి అరగంట పైగా సమయం పట్టింది అన్నీ మధ్యతరగతి యిళ్ళు

కొన్ని పూరిపాక లున్నాయి కొద్ది మేడలు ఉన్నాయి ఎక్కువగా పెంకె ఓళ్ళు మధ్య తరగతి డాబా యిళ్ళు

ఒకరిద్దరు ఎదురయి కారణం అడిగారు

"మా పాప తప్పిపోయింది వెదుకుతున్నాం అని, చెప్పారు సైతానుదళం సభ్యులు ఆ వీధిలోకి క్రొత్త పాప ఎవరూ రాలేదని చాల మంది చెప్పారు మరి కొందరు వారి వాలకం చూచి బయపడి మాటాడకుండా వెళ్ళి పోయారు

పాపని తెలుసుకోకుండా వెళ్ళిపోయేందుకు వీలుకాదు కాబట్టి ఇంకా వెదుకుతున్నారు చీకటి కూడా పడింది

వీధిలోని వారంతా ఇది గమనించారు వెదుకుతున్న వారి వాలకం అనుమానాస్పదంగా ఉంది ఒకపాప తప్పిపోతే వెతికే పేరెంట్స్‌లాగానో, వారి బందువుల్లాగానో అన్పించలేదు తిరుగుతున్నవారు నగరంలో కొద్ది రోజుల క్రితం చాల అల్లర్లు జరిగాయి ఎన్నో భయంకర మయిన వార్తలు విన్నారు జనం

అందువల్ల ఆ వీధిలో పెద్దలందరూ ఒక చోట గుమిగూడారు సమావేశంలో పరిస్థితిని సమీక్షించుకున్నారు చీకటి పడింతరువాత కూడ పాప అంటూ ఇల్లిల్లూ తిరుగుతున్నవారిని ఆ వీధినించి పంపివేసేందుకు తీర్మానించారు ఏకగ్రీవంగా

ఆ వీధినించి వారు వెళ్ళిపోయిం దాకా ఎవరూ నిద్రపోకుండా జాగ్రత్తగా ఉండాలని-కూడ నిశ్చయించారు

వీదుల వెంట పడి ఇల్లిల్లూ శోధిస్తున్న వారి దగ్గరకు వెళ్ళి మాటాడి వారిని అవతలకు పంపివేసేందుకు పెద్దమనుషులతో ఒక కమిటీని కూడ వేశారు ఆ కమిటీ సభ్యులుబయల్దేరారు

ఒక యింటిలోకి వెళ్ళి వివరాలు అడిగివస్తున్న సైతానుదళం వారికి ఎదురు అయింది చాల నిర్లక్ష్య వైఖరితో ఉన్నారు

బాబూ! ఏమిటి వీది అంతా గాలిస్తున్నారు? కమిటీ పెద్ద అడిగాడు

'మా పాప కన్పించ లేదు వెదుకుతున్నాం' కేర్‌లెస్‌గా బదులు చెప్పాడు ఒక సైతాన్ దళం తాలూకు మనిషి!


మీరు యిలా యిల్లిల్లు వెదికి ప్రయోజనం ఏమిటి?

పాప కన్పించకపోతే వెతకవద్దంటారా?

తప్పి పోయిన పాప కన్పించితే అందరికీ తెలుస్తుంది కదా! ఎవరిని అడిగినా చెప్తారు ఎందుకు యిళ్ళలోకి వెళ్ళటం'

పోనీ మా పాపని మాకు అప్పగించండి వెళ్ళిపోతాం

ఎక్కడుందని అప్పగించాలి బాబూ?



శత్రుసంహారం

ఈ వీధిలోకి వచ్చిందని యిక్కడే ఉందని మాకు సమాచారం వచ్చింది

అలాంటిది జరిగితే ఈ వీధిలో పెద్దలకు తెలుస్తుంది కదా!

పెద్దలా? అంటే ఎలా ఉంటారు? సైతాన్‌దళం అంతా నవ్వారు వారి వైఖరి ఏమిటో పెద్ద మనుష్యులకు అర్థం అయింది

పోనీ ఒక పని చేయండి మీ పాప తప్పిపోయిందని పోలీసు రిపోర్టు 'యివ్వండి పోలీసులని తీసుకురండి మేము పెద్దమనుషులం దగ్గరుండి అన్ని యిళ్ళూ వెతికిస్తాం మీ అనుమానం తీరుతుంది మాకు అనుమానం రాకుండా ఉంటుంది అంటూ ఓ పెద్దమనిషి తరహా రాజీ మార్గాన్ని ప్రతిపాదించాడు ఒక ప్రతినిధి!

పోలీసుల ప్రస్తావన రాగానే సైతాను దళం సభ్యులు చలించారు

అంటే మేం మాపాపని మీరు చెప్పినట్లే వెతుక్కోవాలా?

మీరిలా యింటింటిలోకి బలవంతంగా దూరితే కొందరు భయపడుతున్నారు బాబూ! మీరు పెద్ద మనుషులే కావచ్చు మీలో ఎవరి బాధ వారికి ఉండవచ్చు కాని మావాళ్ల బయం మా వారికి ఉంటుంది కదా! ఆలోచించండి

అలా వీలుకాదు మేం యిల్లిల్లూ వెదుకుతాం కావాలంటే మీ వీది పెద్దలు కూడ మాతో ఉండవచ్చు అన్నాడు ఒక సైతాన్ అంటూ ఆగలేదు అందరూ మరొక యింటిలో దూరారు వారు తిరిగి వచ్చేలోగా వీది పెద్దలు మరొక ఆలోచన చేశారు

"బాబూ! మీరు యిళ్ళ మీదికి దాడి చేయటం ఆపేస్తే ఒకచిన్న సమాచారం అందించగలుగుతాం

ఏమిటది చెప్పండి సజావుగా ఉంటే ఆలోచిస్తాం

ఈ వీది చివర యశోద అనాధాశ్రమం అని ఒక సంస్థ ఉంది ఈ వీదిలోనే కాదు ఈ నగరంలోనే తప్పిపోయిన వారు, అనాధలు అక్కడకు చేరుకుంటారు మీరు అక్కడకు వెళ్ళి విచారించండి

ఈ లోగా మేమే ప్రతి యిల్లూ తిరిగి ఎవరైనా క్రొత్త వారు ఉంటే సమాచారం తెచ్చి మీకు అందిస్తాం అన్నారు పెద్దలు

ఈ రాజీ ఒక విదంగా మంచిదే అనిపించింది సైతాను దళం వారికి అందరూ గుంపు కట్టి యశోద అనాద ఆశ్రమం వైపుకు పరుగు తీశారు వీది పెద్దలు అందరూ హాయిగా ఊపిరి పీల్చుకున్నారు

అప్పటికి బాగా చీకటి పడింది ఆ యింటిలో బలహీన మయిన విద్యుద్దీపాలు వెలుగుతున్నాయి ముందు గదిలో కూర్చుని ఉందో ముసలి వగ్గు

'అవ్వా' యశోదమ్మ గారంటే ఎవరూ? ఒకడు దూకుడుగా అడిగాడు

"నేనే బాబూ! ఏం పనిమీద వచ్చారు?

కొద్ది రోజుల క్రితం యిద్దరు వ్యక్తులు నీ దగ్గరకు వచ్చారు ఒక యువకుడు ఒక యువతి! వారు నీదగ్గరకు ఒక పాపను తీసుకు వచ్చి ఇక్కడే ఉంచి వెళ్ళిపోయారు అవునా? అని గద్దించి అడిగాడు ఓ సైతాన్

వృద్ధురాలయిన యశోద లావు కళ్ళద్దాలు సవరించుకుని అతని ముఖంలోకి చూడాలని ప్రయత్నించింది చాలీ చాలని వెలుతురులో ఆమెకేమీ కన్పించలేదు తల దించుకుంది

అవును బాబూ! వారు వచ్చిన మాట యధార్థం ఒక పాపను నాకు అప్పగించి వెళ్ళిన మాట కూడ యదార్థమే! అందామె స్థయిర్యంగా

'ఆ పాప ఎక్కడుంది? మాకు అప్పగించు

మీ కెందుకు బాబూ పాప విషయం ఏదో ఆదుర్దాలో ఉన్నారు పాపం కూర్చోండి అందరూ కూర్చోండి మంచినీరేమయినా తీసుకుంటారా? అసలు ఈ అనాదాశ్ర మానికి ఎవరు వచ్చినా ఆదుర్దా గానే వస్తారు కూర్చోండి బాబూ! నాకు అర్థమయేలా చెప్పండి అందామె నింపాదిగా!

నీ మర్యాదలు చాలు కాని ఆ పాపని మాకు అప్పగించు వెంటనే! లేకపోతే ఈ గదిలోనే ఖతం అయిపోతావు

ఒక మాట చెప్తాను వినుబాబూ! చనిపోవాల్సిన వయసు నాకు వచ్చింది కాబట్టి చనిపోవటంలో నాకు బయం లేదు చనిపోయి నందు వల్ల నా బాధలకు ఒక ముగింపు దొరుకుతుంది కాబట్టి చావుని నేను ఇష్టపడతాను కాని వొద్దనుకోను

సుఖపడేవాళ్ళు ఎక్కువ కాలం బ్రతకాలనుకుంటారు నేను ఎప్పుడు పోయినా నాకు ఆనందమే! ఈ ముసిల్దాని ప్రాణాలు లాగెయ్య టానికి నీలాంటి వీరులతో కాని, మరో శక్తి వంతులతో కాని పనిలేదు ఎదిరించను కాబట్టి ఎవరయినా, చంపవచ్చు కాని నన్ను చంపాలని నువ్వెందుకు అనుకుంటున్నావు?

'ఆ పాపని మేం తీసుకు పోవాలి

ఎక్కడుందని తీసుకు పోతావురా వెర్రి సన్యాసీ!

"నీకు అప్పగించారంటున్నావు కదా?

"అప్పగించిన మాట నిజమే! కాని నా దగ్గర ఉంచుకునేందుకు కాదు


మరేం చేశావు? ఎక్కడ దాచావు?'

దూకుడు తగ్గించ వోయ్ పిచ్చి కుంకా! అనాదాశ్రమానికి అనాధ పిల్లలు వస్తారు దయగలిగిన వారు తీసుకు పోయి పెంచుకుంటారు ఆ పాపని ఒక అమెరికా జంట పెంచుకునేందుకు దేశం దాటించి తీసుకు పోయారు అంది యశోద! సైతాన్ దళం కుప్పకూలి పోయింది!

(ఇంకా ఉంది)

డొక్కు సైకిల్

ఎ. ఎస్. రాజశేఖర్



మోహన్ బాధపడుతున్నాడు. అవమానంతో మనసు కుతకుతలాడుతోంది. విసుగ్గా అటూ, ఇటూ పచార్లు చేస్తున్నాడు.

"అబ్బ...ఎప్పుడమ్మా నాన్న వచ్చేది?" విసురుగా ప్రశ్నించాడు.

"ఆఫీసు నుండి రావాలి కదరా! అయినా అంత అర్జెంట్ పనేమిటి?" వంటింట్లోంచి అడిగింది మీరాబాయి.

ఏం బదులు చెప్పకుండా అలానే పచార్లు చేయసాగాడు.

మోహన్‌కు పదిహేడేళ్లు. ఇంటర్ సెకండియర్. టీనేజర్స్‌లో ఉండే ఉత్సాహం పాలు కొద్దిగా ఎక్కువ. పైగా కొద్దిగా అందగాడు, తెలివైనవాడవటంతో గర్ల్‌ఫ్రెండ్స్ కూడా వున్నారు.

ఇపుడా ఫ్రెండ్స్‌లోని ఓ అమ్మాయే మోహన్‌ను అవమానపర్చింది. అవమానమంటే పెద్ద ఇన్సల్టేమీ కాదు.

మోహన్ కాలేజీకి పాత సైకిల్ మీద వెళతాడు. ఆ సైకిల్‌ను "డొక్కు సైకిల్" అని నలుగురిముందూ రమ కామెంట్ చేసింది. ఆ కామెంట్‌కు మిగతా వాళ్లందరూ నవ్వారు. అదిగో అప్పట్నించీ ఎగిరెగిరిపడుతున్నాడు.



వెనుపువచ్చ రంగు ధోవతులు ఒకటి కొంటే రెండు ఉచితం

ఇద ఓ వాగ్బాణం అనుకోండి దీన్ని మరో వాగ్బాణంతో మీరు ఉపసంహరించాలి– ఆ "రిపార్టీ" గుచ్చుకోవాలే గాని బాదించకూడదు. రసభరితంగా వుండాలే గాని అశ్లీలం కొట్టవచ్చి నట్లుండరాదు. కార్డు మీద మాత్రం రాయాలి. ఈ వాక్యం పైన రాసి మీ ప్రతి వాక్యం దాని క్రింద రాయండి. మీ పూర్తి చిరునామా ముఖ్యం. ప్రచురించిన రెంటికి రు. 25, రు. 15 చొప్పున బహుమతి వుంటుంది!- ఈ విషయంలో సంపాదకునిదేతుది నిర్ణయం

12-2-'90 లోగా అందేలాగా రిపార్టీలు పంపించాలి

చాలా మంది వెంటనే "రిపార్టీ"ల వర్షం కురిపించారు. కొన్ని మాత్రం ఎంపిక చేసి వేస్తున్నాం. బహుమతులు పొందిన రెండూకాక– మరికొన్ని యిక్కడ వేశాము. తతిమ్మా వారి "వాగ్బాణాలు" స్థలాభావం చేత వేయలేక పోయాం లాటరీ తీసి కొందరి పేర్లు మాత్రం వేస్తున్నాం! ఒకసారి బహుమతి రాలేదని నిరుత్సాహపడక మళ్ళీ ప్రయత్నించండి

– ఎడిటర్

ఓయ్! సి. ఐ.ఎ. ఏజెంటూ! నువ్వు దిగిపోయి నీ కుర్చీ నాకిచ్చు!

★ రు. 25 బహుమతి పొందిన రిపార్టీ!

"ఇంకెక్కడి కుర్చీ బాబూ! మొన్న ఎన్నికల్లో కర్సయ్ పోయిందిగా?"

– కె. ఎన్నార్ నమ్మి (పెనుగొండ)

★ రు. 15 బహుమతి పొందిన రిపార్టీ!

"సారీ బ్రదర్! నా కుర్చీకి కాళ్ళు తీసేశారు!"

– బోలెం సత్యనారాయణ (చిన ఓగిరాల)

మరికొన్ని వాగ్బాణాలు

"ఓటరు మహాశయుల తీర్పు మరోలా వుంది మరి!"

– ఎస్ శ్రీనివాసమూర్తి (నెల్లూరు)

కుర్చీకి 'అమెరికన్' నల్లులున్నాయి జాగ్రత్త!

– జి వి ఎస్ పద్మావతి (తణుకు)

లక్కీ పేర్లు:

కె వి లక్ష్మణరావు (మానేపల్లి), కె మురళి (ఏటూరు నాగారం), ఎన్ శ్రీనివాస కళ్యాణి (హుబ్లి), ఎన్ శ్రీనివాసరావు (పొదిలి), దేవులపల్లి రము (కాజీపేట), సాహితి (మద్రాసు), కె జనార్ధన్ (వికారాబాద్), కాశీ (తణుకు), ఎం ఎస్ నాయుడు (బందరు కోట), దలసరి వెంకటరత్నం (విశాఖపట్నం)

"అలా వూర్కే తిరిగేబదులు కూర్చుని చదవొచ్చుకదా!" అక్కడే కూర్చొని లెక్కలు చేస్కొంటున్న తమ్ముడు ఫణి అన్నాడు.

"నోరు మూసుకొని నీ పనేదో నువ్వు చేస్కోవోయ్." అంటుండగా ఉస్సురు మంటూ లోనికి వచ్చాడు రామారావ్.

రామారావ్ ఓ సాధారణ ప్రభుత్వోద్యోగి. బ్రతుకు బండిని కొద్దిగా తక్కువ స్పీడ్‌లో నడుపుతున్నాడు. కొడుకు కాలేజీ చదువులకొచ్చాడని తను ఖరీదైన ప్యాంట్, షర్ట్సు తగ్గించి కొడుకుకు మంచి బట్టలు కొనిచ్చి, వాటిలో దర్జాగా మెరిసిపోయే కొడుకునుచూసి పొంగిపోయే అల్పసంతోషి.

అలాంటివాడి కడుపున చిరంజీవిలా షూస్, బాలకృష్ణలా కాస్ట్యూమ్స్, శోభన్‌లా రేమాన్ కళ్లద్దాలు ధరించాలని తహతహలాడే సుపుత్రుడు మోహన్. అఫ్‌కోర్స్ వయసు ప్రభావం

"నాన్నా! రేపట్నించి నేను కాలేజికెళ్లను" విసురుగా చెప్పాడు మోహన్.

"అదేమిట్రా! ఏదన్నా సైకిలా?" తెల్ల చొక్కాను జాగ్రత్తగా స్టాండ్‌కు తగిలిస్తూ అడిగాడు రామారావ్.

"కాదు. ఆ డొక్కు సైకిల్‌మీద నేను కాలేజీకెళ్లను" కోపంగా జవాబిచ్చాడు.

అయితే క్రొత్త సైకిల్ కావాలన్న మాట. అప్పట్నుంచీ "నాన్న ఎపుడు వస్తారమ్మా!" అని అదేపనిగా అడుగుతుంటే వీడికి హఠాత్తుగా ఇంతప్రేమ పుట్టుకొచ్చిందేమిటా! అనుకొన్నాను.

ఇదన్నమాట సంగతి, కోపంగా వంటింట్లోంచి వస్తూ అంది మీరాబాయి.

"ఆ - ఆ సైకిల్ త్రొక్కితే తెల్లుస్తుంది...." ఇంకా ఏదో చెప్పబోతున్న మోహన్‌ను ఆపాడు రామారావ్.

"నువ్వు కాఫీ తెచ్చేదేవన్నా వుందా!" అని భార్యను లోపలికి పంపాడు.

"ఇపుడుండే సైకిల్‌కేమొచ్చిందిరా! బానే వుందిగా!" నిదానంగా వాలుకుర్చీలో కూర్చొంటూ అడిగాడు.

"సవాలక్ష రోగాలు దానికి. ముందు టైర్ పంచర్ బాగుచేయిస్తే వెంటనే వెనుక టైర్‌కు. బ్రేకులు సరిచేయిస్తే బెల్ పోతుంది. తొక్కుతుంటే రైలింజన్‌లా చప్పళ్లు.

క్రొత్త బి.ఎస్.ఏ. కావాలి" ఉక్రోషంగా చెప్పాడు.

మోహన్ వుక్రోషం చూసి నవ్వొచ్చింది రామారావ్‌కు. అసలు ఈ కాలం పిల్లలే అంత. చెప్పేది పూర్తిగా అర్థం చేసుకోరు. తాము చెప్పేదే 'రైట్' అంటూ, తల్లిదండ్రుల్ని సతాయిస్తుంటారు.

కొద్దిగా తిడితేచాలు. "నామీద మానాన్నకు శతృత్వం" అనో "మా అమ్మ రాక్షసి" అనో భావిస్తూ అనుక్షణం ఘర్షణలకు దిగుతుంటారు. వీళ్లను మంచి మాటలతోనే దారికి తేవాలి.

"సరేరా కన్నా! క్రొత్తదే కొందాం. నెల మధ్యలో ఎలా చెప్పు. ఫస్టుకు జీతం రాగానే కొందాం. సరేనా!" పసిపిల్లాడు తాయిలం కోసం ఏడిస్తే వాడిని బుజ్జగిస్తున్నట్లుగా చెప్పాడు.

"ఊ" అనేవాడే కానీ ఓ ఆడపిల్ల. అందునా కమల్‌హాసన్‌లాంటి స్టిక్కరున్న తనను తన ఫ్రెండ్స్, వాళ్ల ఫ్రెండ్స్ ముందు 'డొక్కు సైకిల్' అని హేళన చేస్తుందా!

"ఉహు. రేపే కావాలి. లేకపోతే కాలేజీకెళ్లను"

"వెళ్లకపోతే ఏట్లో దూకు. చదువుకోకపోతే భ్రష్టుపట్టేది నువ్వుకానీ మేం కాదు.

మీరు వాడు అడిగిన ప్రతిదానికీ తలాడించబట్టే ఇలా తయారయ్యాడు. ఆ సైకిల్‌కేమైందట? గీతకు పెళ్లిచూపులకు ఓ పట్టుచీరైనా కొనాలని నాలుగు నెలల నుండీ అనుకొంటున్నాను. కుదరట్లేదు. వీడికి షోకులు కావల్సొచ్చాయి." అంది మీరాబాయి.

"ఔను. గీత ఎక్కడికెళ్లింది?" కాఫీ తాగుతూ అడిగాడు రామారావ్.

"వాళ్ల స్నేహితురాలొచ్చి, గుడికి పిల్చికెళ్లింది. ఈపాటికి వస్తూ వుంటుంది" చెప్పింది.

"ఎందుకు కుదరదు? నాకు క్రొత్త బి.ఎస్.ఏ. కావల్సిందే! అందరూ డొక్కు సైకిల్ అని నవ్వుతున్నారు" కోపం, బాధ మిళితమైన స్వరంతో అన్నాడు మోహన్.

తన బాల్యం గుర్తొచ్చింది రామారావ్‌కు. తను ఇంటర్‌లో వున్నప్పుడు తను ఎప్పుడూ హవాయి చెప్పులే వేస్తాడని "హలో హవాయి" అని క్లాస్‌మేట్ మాధవి నిక్‌నేమ్ పెడితే రాత్రి తండ్రి దగ్గర వాదించి మరీ షూస్‌కొన్న సంగతి వైనం గుర్తొచ్చింది.

ఈ టీనేజ్ అనేది అటు పూర్తిగా పరిపక్వంకాని, మరీ బాల్యంకాని వయసు. పెద్దవారైతే వివరాలు చెపితే అర్థం చేస్కొంటారు. చిన్నవారైతే కొద్దిగా భయపెట్టి చెప్పవచ్చు. ఎటూకానీ ఈ టీనేజ్ వారితోనే గొడవ.

"నేను కొనివ్వనని అనడంలేదు కదరా! నువ్వడగక మునుపే నేనే క్రొత్త సైకిల్ కొందామనుకొంటున్నాను.

నువ్వు చెప్పింది నిజమే! మొన్న ఓసారి వేసుకెళ్లా! బాగాలేదు. క్రొత్త సైకిల్ కొందాం. ఫస్ట్ తారీఖు సాయంత్రమే కొందాం" అన్నాడు రామారావ్.

"అయితే నేను ఫస్టునుండే కాలేజీకెళ

డొక్కు సైకిల్

తాను" మొండిగా చెప్పాడు మోహన్.

"అలాగంటే ఎలారా బుజ్జీ! నీ తర్వాత ఇంకా ఇద్దరున్నారు. పెళ్లిచేయాల్సిన అక్కయ్యుంది. పెద్దాడివవుతున్నావ్. కొంచెం అర్థం చేసుకో!" బుజ్జగిస్తూ అన్నాడు.

మరో తండ్రి అయితే ఈ పరిస్థితుల్లో కొడుకును తిట్టడమో, తన్నడమో చేసి తనకూ, కొడుకుకూ పెద్ద కమ్యూనికేషన్ గ్యాప్ సృష్టించుకొనేవాడు. కానీ రామారావ్ చిన్నతనం నుండీ వివిధ రకాల మనస్తత్వాలు పరిశీలిస్తున్నందువల్ల ఏ విధంగా చెబితే కొడుకును సముదాయించవచ్చో బాగా తెల్సు.

"మీరేమిటండీ వాడిని మరీ అందలమెక్కిస్తున్నారు. ఆ సంజాయిషీ చెప్పినట్లు వాడికి భయపడటం ఏమిటి? సైకిల్ కొనిచ్చేది లేదు. అంతే." ఖరాఖండిగా తెగేసి చెప్పింది మీరాబాయి.

ఆ సంసార రథం దొర్లేందుకు ఆమె కూడా ఓ చక్రమే మరి. ఇపుడు సైకిల్‌కొని తగలేస్తే రేపు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కోవాలో బాగా తెల్సు. అందుకే అంత తెగేసి చెప్పింది.

"అయితే నేను కూడా సైకిల్ వచ్చాకే కాలేజీకెళ్లేది" తనూ గట్టిగా అన్నాడు మోహన్. అతనికింకా "డొక్కు సైకిల్" అన్న రమ మాటలు, నవ్వులూ వినబడుతూనే వున్నాయి మరి.

"అబ్బ ఇద్దరూ తగ్గరు. నువ్వూర్కో మీరా! ఆ సైకిల్ మార్చాల్సిందే. వాడన్నది కూడా నిజమే! నేనేదో తిప్పలు పడతాగా!" అంటూ లేచి షర్ట్ అందుకున్నాడు రామారావ్.

"ఎక్కడికి? సైకిల్ కొనిచ్చేందుకా ముద్దులకొడుకుకు" ఎకసెక్కంగా ప్రశ్నించింది మీరాబాయి.


"తప్పదు. బిడ్డలను కన్నంత మాత్రాన సరిపోదు. వారి అవసరాలు కూడా తీర్చాలి తల్లిదండ్రులు నాకు తెల్సిన ఓ సైకిల్ షాప్ వుంది. అప్పుగా సైకిల్ ఇస్తాడేమో కనుక్కొంటా!" బరువుగా అంటూ షర్ట్ వేస్కొన్నాడు రామారావ్.

"నువ్వు తెల్లబట్టలు మానేయి నాన్నా! మా ఫ్రెండ్సందరూ "మీ నాన్న ఎందుకు రంగుల షర్ట్స్ వెయ్యకుండా ఎప్పుడూ దిష్టిబొమ్మలా తెల్లబట్టలేస్తారు?" అని నన్ను అడుగుతున్నారు.

మొన్న ఆ రవిగాడు నువ్వెళుతుంటే "దిష్టిబొమ్మ" అని వెనుకనుండి అరిచాడు. నాకు సిగ్గేస్తుంది" పసితనం అమాయకతతో చెప్పాడు ఫణి.

"చంపుతా వెధవా! నాన్నకే సలహాలా, మీ ఫ్రెండ్స్‌కు చర్మం వలుస్తానని చెప్పు" కోపంగా అన్నాడు మోహన్.

"వాడినేం అనకురా మోహన్. పసితనం. అర్థంకాదు" అని ఫణికేసి తిరిగి "చూడు బంగారూ!" ఎవరో ఏదో అన్నారని మనం మన పద్ధతులను, వ్యక్తిత్వాన్ని మార్చుకోకూడదు. చిన్నప్పట్నించీ నాకు తెల్లబట్టలే అలవాటు. ఇపుడు మీ ఫ్రెండ్స్ ఏదో అన్నారని తెల్లబట్టలు వేయడం మానేసానుకో! రేపు ఇంకో వ్యక్తి ఇంకేదో అంటాడు. మీ ఇల్లు చిన్నదే! నువ్వు నల్లగా వున్నావే! అంటాడు. మనం ఇల్లు పెద్దది కొనలేం కదా! నేను



నల్లగా వున్నవాడిని తెల్లగా కాలేముకదా!

కాబట్టి ఎవరో ఏదో అన్నారని మనం బాధ పడకూడదు, షర్ట్ బటన్స్ పెట్టుకొని చెప్పాడు రామారావ్.

"సరే నాన్నా!" బుద్ధిగా తలూపాడు ఫణి.

"నీకు చిన్న కథ చెబుతా విను. మహాత్మాగాంధీ ఎంత గొప్పవాడో నీకు తెల్సుకదా! ఆయన నూలుతో వడికిన బట్టలే వేస్కొనే వాడు. అది కూడా పంచె, పైన ఓ నూలు టవల్ మాత్రమే."

ఓసారి లండన్‌కు చర్చలకు వెడితే ఆయనను చూసి "పీడా మీకు స్వాతంత్ర్యం తెచ్చి పెట్టేది. అర్ధనగ్నసన్యాసి" అని బ్రిటిష్ నాయకుడెవడో హేళన చేశాడట. కానీ అదే నిరాడంబరజీవే బ్రిటిష్‌వారి గుండెల్లో నిద్రపోయాడు. మనకు స్వాతంత్ర్యాన్ని తెచ్చాడు.

ఇపుడు చెప్పు. ఎవరో ఏదో అన్నారని గాంధీ తను నమ్మిన ఖాదీ బట్టలను వదిలి ప్యాంట్, షర్ట్ వేసుకొన్నాడా! గాంధీనే కాదు. గొప్ప గొప్ప మహానుభావులంతా విమర్శలను లెక్క చేయలేదు, కళ్లు విప్పార్చుకొని వింటున్న కొడుకు ఫణి బుగ్గలు నిమురుతూ కథ ముగించాడు రామారావ్.

డొక్కు సైకిల్

"నేను వెళ్లొస్తాను మీరా!" అని భార్యకు చెప్పి కదిలాడు.

"నేను సైకిల్ రేపటికల్లా తెస్తా కానీ - కాస్త శ్రద్ధగా చదువుకోరా మోహనా! పరీక్షలు వస్తున్నాయి. శ్రద్ధగా చదివితే కానీ ఫస్ట్‌క్లాస్ రాదు" మృదువుగా చెప్పి బైటకు నడిచాడు.

ప్రతివ్యక్తి జీవితంలో తనను తాను పరిశీలించుకోవడం ఎప్పుడో ఓసారి మొదలెడతాడు. అది కొందరి వ్యక్తుల్లో చిన్నతనంలో ప్రారంభమైతే, మరికొందరికి ఏ నడివయసులోనో ప్రారంభమౌతుంది. అఫ్‌కోర్స్. కొందరు ఆ 'పరిశీలన' అనేదే లేకుండా బ్రతికేస్తారు. అది వేరే సంగతి.

కానీ ఆ ప్రారంభం ఓ చిన్న సంఘటన ద్వారా మొదలవ్వచ్చు. పెద్ద ఉపన్యాసంవల్ల కావచ్చు. ఓ సినిమా చూసైనా కావచ్చు. ఆఖరుకు ఓ మంచి కథ చదివైనా కావచ్చు.

ఇపుడు మోహన్‌కూడా తనను తాను పరిశీలించుకోవడం మొదలెట్టాడు.

'తాను తనేం చేస్తున్నాడు. ఆఫ్టరాల్ ఓ అమ్మాయి ఏదో తమాషాగా 'డొక్కు సైకిల్' అనిందని మరునటిరోజుకల్లా క్రొత్త సైకిల్ కావాలని తండ్రిని బాధపెడుతున్నాడు. అసలు తన సైకిల్ బాగానే వుంది. ఓవర్-హాల్ చేయిస్తే చాలు. అసలు తనకు సైకిల్ లేకపోయినా ఫర్లేదు. కాలేజీకి నడిచెళ్లొచ్చు. అసలు కాలేజీ చదువేలేని వాళ్లతో తనను పోల్చుకుంటే తనే నయం.

నాన్న చెప్పినట్లు ఎవరో ఓ కామెంట్ చేశారని మనం మన పద్దతులు మార్చుకోవడం మొదలుపెడితే ఈ లోకంలో బ్రతకలేం.

తను ఈరోజు నాన్నను సాధించి సైకిల్ కొంటాడు. రేపు అదే సైకిల్‌ను మరో మనోరమ "ఇది కూడా బాలేదు. ఓ లూనా తెచ్చుకోకూడదు హోయిగా!" అని అంటే? ఆలోచనల్లోంచి తలెత్తుతూ తనూ షర్ట్ వేసుకొని బైటకు నడవబోయాడు మోహన్.

"మళ్లీ ఎక్కడికి? సైకిల్ కొనిస్తానన్నారుగా! కూర్చొని చదువుకో!" పిల్చింది మీరాబాయి.


"ఇపుడే వస్తానమ్మా! నాన్న దగ్గరికే వెళ్లేది. నాకు క్రొత్త సైకిల్ అఖ్ఖర్లేదు. ఆ విషయమే నాన్నకు చెప్పి వస్తాను." ఆత్మ విశ్వాసంతో చెప్పి కదిలాడు. ○

బ్యాంక్ ఆఫ్ బరోడా విజయవాడ బ్రాంచి సీనియర్ మేనేజర్ శ్రీ కాజ జగన్మోహనరావు ఇటీవల పదవీ విరమణ చేసిన సందర్భంగా తీసిన వీడ్కోలు సభ చిత్రం.



సాహితీ పజిల్

గెల్చుకోండి రు. 200



గళ్లనుడికట్టు 23

ఆధారాలు

నిలువు

1. పురుషార్థాలలో చివరిదాన్ని ఇలా అంటారు.
2. శబరి భక్తి అపూర్వము - దీంట్లో వెదకండి పసుపు దొరుకుతుంది.
3. సంక్రాంతి పండుగకు ప్రత్యేకం.
4. కైబరు బోలను ఇలా అంటారు.
5. వ్యాసునివ్రాత గొప్ప గీత.
7. ముత్యం కడిగిన మురికి మీకు పనికొస్తుందేమో చూడండి.
9. పద్మావతీచరణ చారణ చక్ర వర్తి.
12. చెట్టు బాగా పెరగాలంటే ఇది బాగుండాలి.
14. కర్పూరవసంతరాయలు నాయిక
15. ....సొమ్ము బరువు ఒక మంచి సామెత.
16. మీదే మీదే గుమ్మడిపండు మీరు వ్రాసేదేంటి?
17. చిలకలా మాట్లాడితే కీరవాణి

అడ్డం

1. దిశలు చూడకండి మధ్య చూడండి
3. వరదలువస్తే పల్లపు ప్రాంతాలకు ఇది తప్పదు.
5. 2, నిలువులో ఇదికూడా వుంది.
6. శత్రువులు.
8. ఇప్పుడు పత్రిక బలే మజాగా ఉన్నది.
10. తిరుపతి క్షేత్రపాలకుడీ నరసింహస్వామి.
11. వెనుక నుండి దేవాలయ ప్రవేశం.
13. మొండెమునకు లేనిది.
15. ఇంటికి ముందు ఇది అలంకారం.
17. ఇది ఎంచి మేలెంచటం సామెత.
18. ఇతడొక ధర్మశాస్త్ర కర్త.
19. డిండిమములో ఒక రూపకం.

ఆధారాలున్నాయి. నుడికట్టు గళ్లు నింపండి! ఈ కూపన్ కత్తిరించి మీ చిరునామా రాసి పంపండి. ఆల్ కరెక్టు సొల్యూషన్ పంపిన వారికి రు.200/-లు బహుమతి లభిస్తుంది-ఒకరికన్నా ఎక్కువమంది కరెక్టు ఆన్సర్లు పంపితే వారికి బహుమతి మొత్తం పంచడం జరుగుతుంది. తుది నిర్ణయం సంపాదకునిదే. -ఎడిటర్

ముగింపు తేదీ: 12-2-'90

—కూర్పు : పింగళి వి. కృష్ణారావు

ఆంధ్రసచిత్రవారపత్రిక

పంపినవారి పేరు...

పూర్తి చిరునామా...


....పిన్ కోడ్..........

గళ్లనుడికట్టు 21

ఫలితాలు : బహుమతులు

వందలాది పాఠకులు అత్యంత ఉత్సాహంతో ఈ పోటీలో పాల్గొన్నారు. వారందరికీ మా అభినందనలు. ఐతే సరైన సమాధానం ముగ్గురు మాత్రం పంపగలిగారు. బహుమతి మొత్తం రు. 200/-లను ఈ ముగ్గురికి పంచివేశాము.రు.67/-లు చొప్పున వీరికి త్వరలో నగదు రూపంలో వారికి పంపే ఏర్పాట్లు జరుగుతున్నాయి. పజిల్ ఒకరు ఎన్ని కూపన్లైనా పంపవచ్చు. కాని ఒక్క బహుమతికే అర్హులు. తెల్లకాగితం మీద వ్రాసిన కూపన్లు చెల్లవు. పత్రికలో కూపన్నే తీసి నింపి పంపాలి. మీరు పంపిన జవాబులు మా వద్ద గల సీలుచేసిన జవాబుకు సరిపోవాలి. ఒకే పజిల్ లో ఒకరికి ఒక బహుమతి కంటే ఎక్కువరాదు అని ప్రకటించినా ఒకే ఆన్సరుతో 2, 3 కూపన్లు పంపుతున్నవారున్నారు.

- ఎడిటర్



సరైన జవాబులు పంపినవారి పేర్లు

విద్వాన్ శర్మ (పెద్ద పసుపుల), అలపర్తి వెంకటేశ్వరరావు (నందివెలుగు), రావి రమేష్‌బాబు (వట్టిచెరుకూరు).

అనవరత సేవలో...

కొంత కాలంగా ఈ పత్రిక అదృశ్యమైపోయింది అజ్ఞాతవాసమే చేసింది ఆ కాలంలో బజారులో ఎన్ని పత్రికలు సాక్షాత్కరించినా ఈ పుస్తకం లేని లోటు స్పష్టంగా కనుపిస్తుండేది మరే పత్రికగానీ, మ్యాగజైన్‌గానీ ఆ కొరతను పూరించలేకపోయాయి ఇది ముఖప్రీతి మాటలు గావు సుమా' కారణం ఎనిమిది దశాబ్దాల పైచిలుకు సేవలో తెలుగునాట వటవృక్షంలా ఊడలు దించి, కూకటి వ్రేళ్ళూని, సటిష్టమైన పునాదులతో పరిడవిల్లిన మహా సంస్థ ఇది ఈ పత్రిక నిరాఘాటంగా తన పయనాన్ని సాగిస్తున్నది ఇటీవల తాత్కాలిక ఎడబాటు తెరను తొలగించుకుని పండుగకు అత్తవారింటికి వచ్చు నూతన అల్లుడి ముస్తాబును తలపిస్తూ తిరిగి ప్రత్యక్షమై తన అబిమాన కోటిని వూరడించింది ఇంకెప్పుడూ ఇలాంటి వియోగ గ్రహణం పట్టకుండు గాక'

- మోడెంరెడ్డి కృష్ణవేణమ్మ, లేబూరు

థాంక్స్

సంక్రాంతి లక్ష్మితో పాటు ఆంధ్ర సచిత్ర వారపత్రిక సాలంకృతగా మా చేతికి రావడం మహదానందంగా వున్నది "తెలుగువారి నిరంతర సేవలో మాకిది 82వ సంవత్సరము అనే వాక్యం చూడగానే తెలుగువారు కాకపోయినా తెలుగువారి నిరంతర సేవకు తమనంకితం చేసుకున్న ఆంధ్రపత్రిక వారికి థాంక్స్ చెప్పకుండా ఉండలేము

- విజన, మదరాసు

మార్పు...

మేము ఆంధ్రపత్రిక వీక్లీని 88 వరకూ తీసుకొనే వాళ్ళం తరువాత మానేసాము 12-1-90 సంచిక చూసి చాలా ఆనందపడ్డాము మీ పత్రికలో చాలా మార్పులు చేసారు "టిట్ ఫర్ టాట్" శీర్షిక నన్ను ఎంతగానో ఆకట్టుకున్నది మీ (మా) పత్రికలో

ఈవారం సలహా!

పోలీసు ఒక్కడే అయితే బోరుగా వుంటుందని ట్రాఫిక్ ఐలండ్స్‌లో తోడుగా హోమ్ గార్డుని కూడా వేస్తున్నారు - అలాగే సైకిల్‌మీద, స్కూటర్‌మీద కబుర్లు చెప్పేటందుకి మీరు కూడా తోడు ఎక్కించుకొని పోతూ వుండండి! ప్రయాణం సుఖంగా వుంటుంది!

వీక్లీ పోస్ట్

కార్టూన్లు తక్కువగా ఉండటం చూసి నేను చాలా నిరాశ చెందాను మీరు యువ కార్టూనిస్టులను ప్రోత్సహించి కార్టూన్ల పోటీని పెట్టి, ఎక్కువ కార్టూన్లు (మీ) మా పత్రికలో వెయ్యాలని నా మనవి

- కోటిపల్లి మధు, మల్లేశ్వరం

కథలకొండ

కథలకొండ శ్రీ దనికొండ హనుమంతరావు గారిని గురించి అవీ- ఇవీ- అన్నీలో ప్రచురించారు ఆయన కథలు ఏవైనా శీర్షిక కథల కాణాచిలో ప్రచురిస్తే కొత్తగా రచనలు చేసేవారికి మంచి కథ చదివామనే తృప్తి కలుగుతుంది

- అవసరాల శంకర నారాయణరావు, విశాఖపట్నం

సంపాదకీయాలు

సంపాదకీయాలు కేవలం రాజకీయాలకే అనుకున్న మాకు, ఈ వారం పత్రికలో క్రికెట్‌పై సంపాదకీయం చూసి అచ్చెరువొందాము ఏమైనా పత్రికలో వస్తున్న మార్పులపై కె రా గారు వెలిబుచ్చిన అభిప్రాయం అక్షరాలా నిజం ఈ వారం మీ "జి కె ఎంత శీర్షిక"లో "రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా" స్థాపించింది 1953లో అని ఉంది కాని అది స్థాపించబడింది 1935వ సంవత్సరంలో అని గమనించ ప్రార్ధన

- కె ప్రభాకరరావు, భద్రాచలం

మంచివారు

19-1-90 తేది సంచికలో దొందు దొందే అనే శీర్షికతో వీక్లీ పోస్ట్‌లో కోటీశ్వరమ్మగారు వెలిబుచ్చిన అభిప్రాయం సరికాదు "మంచి" 'చెడు" ప్రతి రంగంలో ఉంటుంది ఒక "చెడు' ఉదాహరణ తీసుకొని పూర్తి ఉపాధ్యాయలోకానికి అపవాదు అంటకట్టడం సరికాదు ఈనాటికి ఎంతో మంది ఆదర్శ ఉపాధ్యాయులు ఉన్నారు

- కె రామారావ్, హైదరాబాద్

చిత్రం!

12-1-1990 సంచికలో 8వ పేజీలో గల "సంక్రాంతి వేళలో" రేఖా చిత్రం చాల బాగుంది చిత్రకారునికి అభినందనలు

- నేరెళ్ళ విరజానంద్ అండ్ ప్రజ్ఞాదేవి. (పార్వతీపురం)

సందేహం

ఆషాడ పట్టిని ఆదరించిన 'పత్రిక పా కానికి అబినందనలు' జనవరి 19 సంచికలో వి వి జె ప్రసాద్ గారు ఓ సందేహాన్ని వె ఆషాడ పట్టి లో రాజేంద్ర అసలు కం లేక ప్రబుత్వ ఉద్యోగా? అని అడిగా ప్రభుత్వ ఉద్యోగి అని గమనించ గ జరిగిన చిన్న తప్పును ఎత్తి రచనలకు గట్టి పునాది వేసినందుకు కృ

క్రోక్విల్ నరసింహ, ఖమ్మ

Editorial Adviser: *S RADHAKRISHNA*, Editor *VEERAJI*,

Printed and Published by *S NAGESWARARAO* for Nageswara Rao Estates Ltd.,

at the Andhra Patrika Press, Gandhi Nagar, Vijayawada-520003

Phones Editorial 75667 Business 61247, 61248